సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 13

శనివారం 5-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



ఇంట గెలిచిన లక్నో

ముంబై ఇండియన్స్‌పై 12 పరుగులతో సూపర్ జెయింట్స్ విజయం - 15లో



బేర్ విశ్వరూపం!

టారిఫ్ టెర్రర్‌కు మాంద్యం ఆందోళనల ఆజ్యం.. సెన్సెక్స్ 931 పాయింట్లు డౌన్ - 15లో



మైనార్టీలకు భద్రత కల్పించండి

బంగ్లాదేశ్‌లో మైనార్టీలందరికీ భద్రత కల్పించాలని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్‌ను మోదీ కోరారు.

- వివరాలు 6లో



బిమ్స్‌టెక్ బలోపేతానికి ప్రణాళిక

భారత యూపీఐ చెల్లింపుల వ్యవస్థను బిమ్స్‌టెక్ దేశాల చెల్లింపుల వ్యవస్థలతో అనుసంధానించేందుకు సిద్ధమని మోదీ అన్నారు.


- వివరాలు 6లో



వక్ఫ్ బిల్లుపై సుప్రీంకు..

వక్ఫ్ సవరణ బిల్లు చట్టబద్ధతను ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.

- వివరాలు 6లో



అనంత్ అంబానీ పాదయాత్ర

ముఖేశ్ అంబానీ చిన్నకుమారుడు అనంత్ అంబానీ జామ్‌నగర్ నుంచి ద్వారకకు 170 కి.మీ. పాదయాత్రగా వెళ్తున్నారు.

- వివరాలు 6లో

గ్రూప్-1 నియామకాలకు తొలగిన అడ్డంకి..

జీవో 29 చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో గ్రూప్-1 నియామకాలకు అడ్డంకులు తొలగాయి. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో తెలంగాణ ప్రభు త్వం జారీ చేసిన జీవో 55ను సవరిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29 చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 చెల్లుబాటును సవాల్ చేస్తూ గ్రూప్ 1 అభ్యర్థి సూరేపల్లి శ్రీనివాస్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం విచారణ చేపట్టిన జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ ధర్మాసనం ఆ పిటిషన్‌ను కొట్టివేసింది.

వీసీలతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఆకునూరి మురళి, కె. కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి తదితరులు



ప్రొఫెసర్లకు పునరావాస కేంద్రాలుగా మార్చొద్దు

వైస్ చాన్స్‌లర్లతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

- వర్సిటీలు విద్యార్థుల కేంద్రంగానే ఉండాలి
- కాలం చెల్లిన వారికి పునరావాసం కల్పించేందుకు కాదు.. డిమాండ్ ఉన్న కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలి
- అలాంటి కోర్సులు బోధించని ప్రొఫెసర్లను పరిపాలన బాధ్యతలకు పంపండి
- గ్రామీణ విద్యార్థులకు సరైన భవిష్యత్తు కల్పించేలా బోధన ఉండాలన్న సీఎం
- అవసరమైన నిధులు, నియామకాలపై నివేదిక అందజేయాలని సూచన
- విద్యాశాఖపై కూడా సీఎం సమీక్ష
- విద్యా ప్రమాణాలు క్షీణిస్తున్నాయంటూ ఆందోళన!

సాక్షి, హైదరాబాద్: విశ్వవిద్యాలయాలు కొందరు ప్రొఫెసర్లకు పునరావాస కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్‌రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. వర్సిటీలను అలా చేయొద్దని సూచించారు. యూనివర్సిటీలన్నీ విద్యార్థులు కేంద్రంగా పని చేయాలే తప్ప.. కాలం చెల్లిన వారికి పునరావాసం కల్పించేందుకు కాదని స్పష్టం చేశారు. గతంలో నియమించిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఇంకా ఉన్నారనే భావనతో పలు విశ్వ విద్యాలయాల్లో పెద్దగా ప్రాధాన్యం లేని కోర్సులను ఇప్పటికీ బోధిస్తున్నారని, వాటిని రద్దు చేసి నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కోర్సులు ఉండాలని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. శుక్రవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నత విద్యపై రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాల వైస్‌చాన్స్‌లర్లతో సమీక్ష అనంతరం ఆయన మాట్లాడారు.

కేకేతో చర్చించండి: ప్రస్తుతం వర్సిటీలకు గ్రామీణ ప్రాంతాల నుంచి, ఆర్థిక స్తోమత లేని కుటుంబాల నుంచే విద్యార్థులు వస్తున్నారని.. వారికి సరైన భవిష్యత్తు కల్పించేలా బోధన ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆర్థిక స్తోమత ఉన్న కుటుంబాల నుంచి వచ్చిన వారు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకుని ప్రైవేటు విశ్వ విద్యాలయాల వైపు వెళ్లిపోతున్నారని..వారితో ఎదురయ్యే పోటీని ప్రభుత్వ విశ్వ విద్యాలయాల విద్యార్థులు ఎదుర్కోవాలంటే డిమాండ్ ఉన్న కోర్సులనే బోధించాల్సి ఉందని చెప్పారు. గతంలో నియమితులైన ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అధునాతన, డిమాండ్ ఉన్న బోధనను అందివ్వని పక్షంలో వారికి పాలనపరమైన బాధ్యతలు అప్పగించాలని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు వీసీలు తమ విశ్వ విద్యాలయాల్లో ప్రొఫెసర్ల కొరత, భవనాలు, ఇతర వసతుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో యూనివర్సిటీలకు అవసరమైన

మిగతా 12వ పేజీలో ▶

ఇదిగో 'ట్రంప్' కార్డు



6లో

కొత్త లుక్కుతో గోల్డ్‌కార్డు

- పేరుకు తగ్గట్టే బంగారు రంగులో తయారీ.. ఎడమవైపు దాదాపు సగం వరకు ట్రంప్ ఫొటో ముద్రణ
- ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాకు ప్రదర్శించిన అధ్యక్షుడు ట్రంప్
- కొత్త కార్డును రెండు వారాల్లో విడుదల చేయనున్నట్లు వెల్లడి

టారిఫ్‌పై మళ్లీ తూచ్

- భారత్‌పై 27 కాదు, 26 శాతమే
- మరోసారి సవరించిన అమెరికా
- తాజాప్రకటనలో వైట్‌హౌస్ వెల్లడి

అంతకు మించి..!

- అమెరికాపై చైనా 34% సుంకాలు
- దెబ్బకు దెబ్బ తీసిన డ్రాగన్ దేశం
- అరుదైన ఖనిజాల ఎగుమతులు బంద్

- వివరాలు 6లో

మనోజ్‌కుమార్ కన్నుమూత

సుప్రసిద్ధ సినీనటుడు, దర్శకుడు మనోజ్ కుమార్ (87) శుక్రవారం తెల్లవారుజామున ముంబైలోని కోకిలా బెన్ ఆస్పత్రిలో కన్నుమూశారు.



13లో

వెండితెరకు మిస్టర్ భారత్

'ఈ దేశం నీకేమిచ్చిందనేది కాదు... ఈ దేశానికి నువ్వేమిచ్చావ్ అనేది చూడాలి' అన్నారు నెహ్రూ. 'జై జవాన్ జై కిసాన్' అన్నారు లాల్‌బహదూర్ శాస్త్రి. ఈ దేశానికి ప్రధానులైన వారు ప్రజలను దేశం వైపు చూసేలా చేయగలిగారు. ఈ స్ఫూర్తిని సినిమా రంగంలో మొదటగా అందుకున్న హీరో మనోజ్ కుమార్. సినిమాల్లో తన పాత్రకు 'భరత్' అని పేరు పెట్టుకుని అందరి చేత 'మిస్టర్ భారత్' అనిపించుకున్నాడు.

క్లుప్తంగా...

సఫాయి కార్మికులు, రైల్వే సమస్యలు పరిష్కరించండి

బీజేపీ ఎంపీ ఈటల..



రాజ్‌నాథ్‌సింగ్‌ను సన్మానిస్తున్న గొడెం నగేశ్. చిత్రంలో ఎంపీ ఈటల

సాక్షి, న్యూఢిల్లీ: మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని సఫాయి కార్మికులు, రైల్వేకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీ గొడెం నగేశ్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో ఆయన రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లను కలిసి వినతిపత్రాలను అందజేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో ఈటల విలేకరులతో మాట్లాడారు. కరోనా సమయంలో చనిపోయిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో పనిచేసే సఫాయి కర్మచారీల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని రాజ్‌నాథ్ సింగ్‌ను కోరానన్నారు. వారి సేవలను గుర్తిస్తూ.. నరేంద్ర మోదీ కాళ్లు కడిగి సత్కరించారని ఈటల గుర్తుచేశారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో అండర్ పాస్‌లు, రైల్వే ఓవర్ బ్రిడ్జీలు లేకపోవడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అశ్వినీ వైష్ణవ్‌కు వివరించానని చెప్పారు. ఏ సీఎం భూమి అమ్మినా తప్పేనని, దీన్ని వ్యతిరేకించాల్సిందేనన్నారు.

'ఆయుష్మాన్'కు రూ.675.82 కోట్లు

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్



సాక్షి, న్యూఢిల్లీ: ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకం అమలు కోసం తెలంగాణకు రూ.675.82 కోట్లు విడుదలయ్యాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ తెలిపారు. ప్రధాన్ మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ రూ.64,180 కోట్లతో ఉప-ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లు, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు, ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీస్ సహా తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పాటు అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా 2021-22 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు తెలంగాణ రాష్ట్రానికి మొత్తం రూ.1,369 కోట్ల మొత్తాన్ని ఆమోదించినట్లు కాంగ్రెస్ ఎంపీ కుందూరు రఘువీర్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి శుక్రవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

వీడియోలు, ఇతర పత్రాలు సమర్పించండి

వామనరావు దంపతుల హత్య కేసులో సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు చెందిన న్యాయవాద దంపతులు గట్టు వామనరావు, నాగమణి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ అయ్యాయి. వామనరావు దంపతుల హత్య కేసును సీబీఐకి అప్పగించాలని మృతుడి తండ్రి గట్టు కిషన్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ కేసుకు సంబంధించిన వీడియోలు సహా అన్ని పత్రాలను మూడు వారాల్లోగా తమ ముందుంచాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. రికార్డులను పూర్తిగా పరిశీలించిన తర్వాత సీబీఐ విచారణ విషయంలో నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.



మానసిక ఆరోగ్యమస్తు



మెంటల్ హెల్త్‌కు భారతీయుల ప్రాధాన్యం

- సమస్యలపై వెల్‌నెస్ సెంటర్లలో కౌన్సెలింగ్‌కు మొగ్గు
- మానసిక ఆరోగ్య రంగంలో పెరుగుతున్న పెట్టుబడులు
- 2020లోనే 'ఫైండ్ హోప్' పేరిట మొదటి మెంటల్ హెల్త్ స్టార్టప్
- కౌన్సెలింగ్‌కు వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది
- మానసిక వైద్య నిపుణులు సి.వీరేందర్

సాక్షి, హైదరాబాద్: మనిషి జీవనవిధానంలో చోటుచేసుకుంటున్న మార్పులు నిత్య జీవితంలో అనేక సమస్యలకు కారణమవుతున్నాయి. శారీరక సమస్యలతోపాటు మానసిక రుగ్మతలు కూడా పెరుగుతున్నాయి. ఐదేళ్ల క్రితం వచ్చిన కోవిడ్ మహమ్మారి తర్వాత అందరూ మానసిక ప్రశాంతత అవసరాన్ని గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్యం, వెల్‌నెస్ రంగంలో కూడా వేగంగా మార్పులు వస్తున్నాయి. భారతీయుల్లో ముఖ్యంగా యువత, విద్యార్థులు 'మెంటల్ హెల్త్ అండ్ వెల్‌నెస్'పై దృష్టిపెడుతూ మానసిన వైద్య నిపుణుల వద్ద 'కౌన్సెలింగ్' తీసుకునేందుకు సిద్ధపడుతున్నారు. డిమాండ్ పెరుగుతుండటంతో మనదేశంలో 'మెంటల్ హెల్త్ సెక్టార్'లో పెట్టుబడులు కూడా పెరుగుతున్నాయి. బెయిన్ ఇండియా ప్రైవేట్ ఈక్విటీ రిపోర్ట్-2024 ఇదే విషయాన్ని వెల్లడించింది. మెంటల్ హెల్త్ వెల్‌నెస్ రంగంలో అవకాశాలు భారీగా పెరుగుతున్నట్టు పేర్కొంది. 2023లో 372 బిలియన్ డాలర్లుగా ఉన్న ఇండియా హెల్త్‌కేర్ మార్కెట్ విలువ.. 2025 చివరికల్లా 638 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ నివేదిక అంచనా వేసింది.

మనదగ్గరా పెరిగిన డిమాండ్

తెలంగాణలో కూడా మెంటల్ హెల్త్ నిపుణులకు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. దీంతో మెంటల్ హెల్త్ ఎకోసిస్టమ్ ఏర్పడేందుకు దోహపడేలా మెంటల్ హెల్త్ స్టార్టప్‌ల స్థాపన మొదలైంది. అగర్తలా ఎన్‌ఐటీలో బీటెక్ పూర్తిచేసిన హైదరాబాద్‌కు చెందిన తరుణ్‌సాయి 2020లోనే మెంటల్ వెల్‌బీయింగ్ ఫైండ్‌హోప్ స్టార్టప్‌ను ప్రారంభించాడు. ఇది భారత్‌లోనే మొట్టమొదటి మెంటల్ హెల్త్ స్టార్టప్‌గా గుర్తింపు పొందడంతోపాటు కేంద్ర ప్రభుత్వ 'స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్' నుంచి నిధులు కూడా సాధించింది. నగరంలో లాభాపేక్ష లేని స్మార్ట్ మైండ్స్ కౌన్సెలింగ్ అండ్ ట్రెనింగ్ సెంటర్ కూడా అందుబాటులోకి వచ్చింది. 'లైఫ్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్'పై శిక్షణా తరగతులను కూడా ఈ సంస్థ నిర్వహిస్తోంది. అదేవిధంగా యూ అండ్ మీ కౌన్సిలింగ్ సెంటర్ విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, దంపతులు వంటి వారికి కౌన్సెలింగ్ సేవలు అందిస్తోంది. 'పాజ్ ఫర్ పర్‌స్పెక్టివ్-మెంటల్ హెల్త్ సర్వీసెస్', ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ విభాగం, అన్ని ప్రధాన ఆసుపత్రుల్లోనూ మెంటల్ హెల్త్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాయి.



> **కౌన్సెలింగ్‌కు వచ్చేవారి సంఖ్య పెరిగింది**
>
> మెంటల్ హెల్త్ రంగంలో కౌన్సెలింగ్‌కు సంబంధించిన స్టార్టప్‌లతో పాటు యాప్‌లు కూడా విరివిగా వస్తున్నాయి. అవి ఇంకా విస్తృతంగా జనబాహుళ్యంలోకి రాలేదు. మానసిక ఆరోగ్యం మెరుగుపరుచుకునేందుకు అన్నివర్గాల వారు మా కౌన్సెలింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. గతంతో పోల్చితే వైవాహిక బంధంలో సమస్యలు, రిలేషన్‌షిప్స్ విషయంలో కౌన్సెలింగ్ కోసం వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది.
>
> – సి.వీరేందర్, సీనియర్ సైకాలజిస్ట్, యూ అండ్ మీ కౌన్సెలింగ్ సెంటర్

కంచ గచ్చిబౌలిలో నిషేధాజ్ఞలు

ఈ నెల 16 వరకు అమలు

- మరోపక్క క్యాంపస్‌లో విద్యార్థి సంఘాల భారీ ర్యాలీ
- వర్సిటీ హాస్టళ్ల వద్ద కుక్కల దాడిలో దుప్పి మృతి
- గోపన్‌పల్లిలో పరుగులు తీసిన మరో జింక



హెచ్‌సీయూ ప్రధాన ద్వారం వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్న దృశ్యం



ఎన్టీఆర్‌నగర్‌లో ఓ ఇంట్లోకి చేరిన జింక

సాక్షి, సిటీబ్యూరో/గచ్చిబౌలి/రాయదుర్గం: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో కేంద్రీయ విశ్వవిద్యాలయంలో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ఆ పరిసర ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు విధించారు. సుప్రీంకోర్టు, కేంద్ర సాధికార కమిటీ ఆదేశాల మేరకు ప్రశాంతతకు భంగం కలగకుండా, అల్లర్లు జరగకుండా నిరోధించేందుకు మాదాపూర్ డీసీపీ వినీత్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రాంతంలో సంబంధం లేని వ్యక్తుల ప్రవేశానికి అనుమతులు లేవని తెలిపారు. నిషేధాజ్ఞలు శుక్రవారం నుంచి ఈనెల 16 వరకూ అమలులో ఉంటాయని తెలిపారు. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, సెంట్రల్ వర్సిటీతో పాటు కంచ గచ్చిబౌలి సర్వే నంబర్ 25లో పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. గురువారం నాటి సుప్రీంకోర్టు స్టేతో ధర్నాలు, ఆందోళనలు ఆగిపోయాయి. సదరు 400 ఎకరాల్లో పనులను నిలిపివేశారు. క్యాంపస్‌తో పాటు వివాదాస్పద భూముల్లో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. క్యాంపస్ ప్రధాన ద్వారం వద్ద వాహనాలను తనిఖీలు చేసి, ఐడీ కార్డులున్న సిబ్బంది, విద్యార్థులను మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు.

విద్యార్థుల భారీ ర్యాలీ

శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు హెచ్‌సీయూలో వివిధ విద్యార్థి సంఘాలు భారీ ర్యాలీని నిర్వహించాయి. 'ప్రతిఘటన, విజయోత్సవ ర్యాలీ' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీచర్స్ అసోసియేషన్, వర్కర్స్ అసోసియేషన్ సహా పలు విద్యార్థి సంఘాలు పాల్గొన్నాయి. విద్యార్థులు, ఫ్యాకల్టీ, నాన్‌టీచింగ్, వర్కర్స్ ఐక్యత వర్ధిల్లాలి, హెచ్‌సీయూ భూములను కాపాడుతాం అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అరెస్టయిన, కస్టడీలో ఉన్న విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులు, సివిల్ సొసైటీ గ్రూప్‌లు, ఇతరులపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని, క్యాంపస్ నుంచి పోలీస్ క్యాంప్‌లను ఎత్తివేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

కుక్కల దాడిలో గాయపడి.. దుప్పి మృతి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో శుక్రవారం కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన దుప్పి (మచ్చల జింక).. మృగవనికి తరలిస్తుండగా మృతిచెందింది. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల హెచ్‌సీయూ క్యాంపస్‌లో చెట్లు, పొదలను తొలగించడంతో స్థావరాలను కోల్పోయిన వన్య ప్రాణులు క్యాంపస్‌లోని హాస్టళ్ల వైపు వస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్న సమయంలో ఒక దుప్పి రాగా కుక్కలు వెంటపడి గాయపరిచాయి. విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది కుక్కలను తరిమివేసి గాయపడిన దుప్పికి ప్రాథమిక చికిత్స అందించి, అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. వారు దానిని మృగవనికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. దీంతో మృగవనిలో పోస్టుమార్టమ్ నిర్వహించి అక్కడే ఖననం చేశారు.

గోపన్‌పల్లిలో ఇళ్ల మధ్య జింక పరుగులు..

శుక్రవారం హెచ్‌సీయూ అటవీ ప్రాంతం సమీపంలోని గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్‌లో ఓ జింక రోడ్లపై పరుగులు తీసింది. అటూఇటూ తిరుగుతూ ఓ ఇంట్లోకి వెళ్లగా, స్థానికులు గమనించి తలుపులు మూసివేశారు. అనంతరం సమాచారం అందుకున్న పోలీసులు. అటవీ శాఖ అధికారులు అక్కడకు వచ్చి జింకను పట్టుకుని జూపార్కుకు తరలించారు.

అవన్నీ ఏఐ చిత్రాలే

సాక్షి, హైదరాబాద్: హెచ్‌సీయూ పరిధిలో చెట్ల తొలగింపుతో వన్యప్రాణులకు తీవ్ర నష్టం కలుగుతోందన్న రీతిలో.. సామాజిక మాధ్యమాల్లో చేసిన ప్రచారమంతా కల్పితమని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. కొన్ని జేసీబీలతో చెట్లను నరికివేయడం వల్ల అక్కడున్న నెమళ్లు, జింకలు పరుగెత్తుకుంటూ పారిపోతున్న రీతిలో రూపొందించిన చిత్రం పూర్తిగా ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారితమని తేల్చిచెప్పింది. బీఆర్‌ఎస్ సోషల్ మీడియాలో క్రిశాంక్ ఎక్స్ ఖాతాలో జింక కాళ్లు కట్టేసి చంపినట్లు చూపిన చిత్రం కూడా తప్పుడు చిత్రమని తేల్చింది. ఈ చిత్రం ఓ సోషల్ మీడియా జర్నలిస్టు పారపాటున పోస్టు చేశారని, ఆ తర్వాత సదరు రిపోర్టర్ తన తప్పిదాన్ని ఒప్పుకుని తొలగించినట్లు ఎక్స్ వేదికగా తెలిపారని వివరించింది.

మీ అనుమతితోనే ఈ విధ్వంసమా?

రేవంత్ బుల్డోజర్ పాలనపై మౌనం ఎందుకు?

- మీరు చెప్పే నీతి సూత్రాలు మీ సీఎం తుంగలో తొక్కుతున్నారు
- రాహుల్‌గాంధీకి బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బోధిస్తున్న నీతి సూత్రాలను తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తుంగలో తొక్కుతున్నారని బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఓ వైపు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుతుండగా, రేవంత్ తన అనాలోచిత చర్యలతో రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని మండిపడ్డారు. రాహుల్‌గాంధీని ఉద్దేశిస్తూ హరీశ్‌రావు శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. రేవంత్ నాయకత్వంలో రాష్ట్రంలో వికృత పాలన సాగుతోందని ఆరోపించారు. 'పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడేలా చట్టం చేస్తామని మీరు అంటున్నా, రేవంత్‌రెడ్డి మాత్రం బీఆర్‌ఎస్ నుంచి ఫిరాయింపులను ప్రోత్సహించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట బుల్డోజర్లతో పేదల ఇండ్లు కూలుస్తున్నా, మీరు మౌనంగా ఎందుకు ఉంటున్నారు? రేవంత్ విధ్వంసపూరిత వైఖరితో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జంతుజాలం ఆవాసాన్ని కోల్పోయింది. వర్సిటీ అంశంలో మీ పార్టీ అనుబంధ విభాగం ఎన్‌ఎస్‌యూఐ సహా అన్ని వర్గాలు రేవంత్ ప్రభుత్వ తీరును ఖండించాయి' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఈ విధ్వంసం మీ అనుమతితోనే సాగుతోందా?

'రోహిత్ వేముల ఆత్మహత్య సమయంలో హెచ్‌సీయూ సందర్శన వచ్చిన మీకు.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోలీసు ఎస్కార్ట్‌తో పంపి నిరసన తెలిపే అవకాశం కల్పించింది. ఆపదలో అండగా ఉంటానని హెచ్‌సీయూ విద్యార్థులకు మీరు హామీ ఇచ్చినా.. రేవంత్ దుర్మార్గాలపై మౌనం వహించడం ఆశ్చర్యకరం. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చేంతరవరకు వర్సిటీలో కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసకాండ కొనసాగించింది. క్రోనీ కాపిటలిజం, అదానీ వ్యాపార విస్తరణపై దేశవ్యాప్తంగా మీరు పోరాటం చేస్తున్నారు. కానీ మీ సీఎం రేవంత్ తెలంగాణలో అదానీకి ఎర్ర తివాచీ పరిచారు. నల్లగొండలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ, లగచర్లలో ఫార్మా విలేజ్ మూలంగా భూములు కోల్పోతున్న రైతులపై దాడులు జరుగుతున్నా మీరు మౌనంగానే ఉన్నారు. తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం కొనసాగిస్తున్న దమనకాండ, విధ్వంస పాలన మీ అనుమతితో కొనసాగుతోందా?' అని రాహుల్‌గాంధీని హరీశ్‌రావు ప్రశ్నించారు.

రాహుల్ చేతులకు రక్తం మరకలు

ఎక్స్‌లో కేటీఆర్.. చిట్టడవి విధ్వంసంతో జీవ జాలానికి తీవ్ర హాని



సాక్షి, హైదరాబాద్: 'కంచ గచ్చిబౌలి భూముల్లోని చిట్టడవి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మతిలేని పనుల కారణంగా విధ్వంసానికి గురైంది. అందులోని విలువైన జంతు, జీవ జాలానికి తీరని నష్టం వాటిల్లింది. కాంగ్రెస్ సర్కార్ అత్యాశకు గూడు చెదిరిన జింకపిల్ల, కుక్కల దాడికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉంది. రాహుల్ గాంధీ గారూ మీ చేతులకు రక్తం మరకలు అంటుకున్నాయి' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'పర్యావరణాన్ని క్రూరంగా హత్య చేసిన వైనాన్ని సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నా' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

ఆర్టీఐ ప్రధాన కమిషనర్ నియామకంపై ప్రభుత్వం దృష్టి

ఎస్‌హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త చైర్మన్ల నియామకం కూడా..

- నేడు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన వేర్వేరుగా సమావేశాలు
- శాసనసభ ప్రతిపక్ష నేత కేసీఆర్, మండలిలో ప్రతిపక్షనేతకు సమాచారం

సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్‌సీ) చైర్మన్‌తో పాటు లోకాయుక్త చైర్మన్ పదవుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా శనివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేకంగా సమావేశం జరగనుంది. ఆర్టీఐ ప్రధాన కమిషనర్ నియామకానికి సంబంధించి అంశంపై నిర్వహించే సమావేశానికి శాసనసభలో ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్‌రావుకు అధికారులు సమాచారం అందించారు. ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా హాజరుకానున్నారు. అలాగే ఎస్‌హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త చైర్మన్ పదవులకు సంబంధించి శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారికి కూడా సమాచారం ఇచ్చారు. ఈ సమావేశాల్లో చర్చించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఆర్టీఐ ప్రధాన కమిషనర్ రేసులో ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నట్లు తెలుస్తోంది. నేటి సమావేశంలో ప్రభుత్వం ఆమె పేరును ఖరారు చేస్తే తన పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అదేసమయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుత ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ప్రభుత్వం నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

దళితులు, గిరిజనుల కోసం సబ్ ప్లాన్ తెచ్చాం

- తెలంగాణ, కర్ణాటకలో వారికి లబ్ధి చేకూరుతోంది
- ఎక్స్‌లో గుర్తుచేసుకున్న రాహుల్



సాక్షి, న్యూఢిల్లీ: దళితులు, గిరిజనుల కోసం గత యూపీఏ ప్రభుత్వం సబ్ ప్లాన్ తీసుకొచ్చిందని, దీని వల్ల తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఆయా వర్గాలకు తగిన ప్రయోజనాలు లభిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం దళిత, గిరిజనుల శ్రేయస్సు కోసం పాటుపడుతున్న ప్రముఖులను కలిసిన సందర్భాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ (సీడీఎస్) చైర్‌పర్సన్ మల్లేపల్లి లక్ష్మయ్య కూడా రాహుల్‌ను కలిసిన వారిలో ఉన్నారు. వారితో కలిసిన చిత్రాన్ని రాహుల్ శుక్రవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఇటీవల నేను దళిత, గిరిజన వర్గాలకు చెందిన పరిశోధకులు, సామాజిక కార్యకర్తలను కలిశాను. కేంద్ర బడ్జెట్‌లో కొంత భాగాన్ని దళితులు, గిరిజనులకు అందించేలా జాతీయ చట్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి చట్టం ఇప్పటికే కర్ణాటక, తెలంగాణలో అమలులో ఉంది. ఈ వర్గాలకు అక్కడ నిర్దిష్ట ప్రయోజనాలు లభించాయి. యూపీఏ ప్రభుత్వం జాతీయ స్థాయిలో దళితులు, ఆదివాసీల కోసం 'సబ్ ప్లాన్' తీసుకొచ్చింది. కానీ మోదీ ప్రభుత్వ హయాంలో ఇది బలహీనపడింది. బడ్జెట్‌లో చాలా తక్కువ భాగం ఈ వర్గాలకు చేరుతోంది. వారికి అధికారంలో భాగస్వామ్యం కల్పించడానికి ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోవచ్చో అనే అంశంపై ఇప్పుడు మనం ఆలోచించాలి. దళితులు, ఆదివాసీలను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన పథకాలకు బడ్జెట్‌లో న్యాయమైన వాటాను నిర్ధారించే జాతీయ చట్టం మనకు అవసరం' అని రాహుల్ పేర్కొన్నారు.

జాతీయ పసుపు బోర్డు పనితీరు భేష్

అభినందించిన కేంద్రమంత్రి పీయూష్ గోయల్



పల్లె గంగారెడ్డి, భవానీశ్రీతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పీయూష్ గోయల్

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న భారతదేశపు అతిపెద్ద స్టార్టప్ కాన్‌క్లేవ్, స్టార్టప్ మహాకుంభ్-2025లో జాతీయ పసుపు బోర్డు పనితీరును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ అభినందించారు. రైతులకు మద్దతు ఇవ్వడం, పసుపు వ్యవస్థాపకతను ప్రోత్సహించే లక్ష్యంలో భాగంగా, జాతీయ పసుపు బోర్డు స్టార్టప్ మహాకుంభ్ కార్యక్రమంలో 10 ఆశాజనక పసుపు ఆధారిత స్టార్టప్‌లను పరిచయం చేసింది. ఈ స్టార్టప్‌లు అత్యాధునిక ఆలోచనలు, ఉత్పత్తులను ప్రదర్శించాయి. జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బోర్డు కార్యదర్శి భవానీశ్రీల నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. భారతీయ పసుపును ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన బ్రాండ్‌గా ఎదిగేలా చేసేందుకు ఇలాంటి సహకార వేదికలు అవసరమని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

కేటీఆర్‌వి కొవ్వు మాటలు

కాంగ్రెస్ ఎంపీలు చామల, మల్లు, రఘురాం రెడ్డి, షెట్కార్



మీడియాతో మాట్లాడుతున్న సురేశ్ షెట్కార్. చిత్రంలో చామల, మల్లు రవి, రఘురాంరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: 'ఆ భూముల్లో గజం భూమి కొన్నా.. మేం అధికారంలోకి వచ్చాక గుంజుకుంటాం' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు ఫైర్ అయ్యారు. పదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా అటవీ భూముల కబ్జాకు కేరాఫ్ అడ్రస్‌గా బీఆర్‌ఎస్ మారిందని దుయ్యబట్టారు. కేటీఆర్‌వి కొవ్వు మాటలు అంటూ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎంపీలు మల్లు రవి, రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్‌లతో కలిసి చామల మీడియాతో మాట్లాడారు. కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి తప్పుడు ఫొటోలను 'ఎక్స్'లో ఎలా పోస్ట్ చేస్తారు? అని నిలదీశారు. బీజేపీ వాళ్లు దేశంలో ఏదైనా చేయాలి అనుకుంటే ఎంతకైనా తెగిస్తారని మండిపడ్డారు. బిల్లీరావు కబంధ హస్తాల్లోంచి భూమిని రక్షించామన్నారు. ఇదే భూమి బిల్లీరావు చేతిలో ఉన్నట్లయితే ఇటు బీఆర్‌ఎస్, అటు బీజేపీలు ఇంత రాద్ధాంతం చేసేవి కాదన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 177 ఎకరాలను అమ్మిందని, గత పదేళ్ల పాలనలో 4.28 లక్షల అటవీ భూమి మాయమైందని చామల ఆరోపించారు. ప్రభుత్వంపై బీజేపీ అన్ని తప్పుడు సంకేతాలు, వక్రభాష్యాలు చేస్తోందని మల్లు రవి మండిపడ్డారు.

ముస్లింలు ఎప్పుడూ బీఆర్‌ఎస్‌తోనే..

బీఆర్‌ఎస్ ఎంపీలు సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర



ఢిల్లీ తెలంగాణ భవన్‌లో బీసీ మహాసభ దీక్షలో పాల్గొన్న ఎంపీలు సురేశ్‌రెడ్డి, వద్దిరాజు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని ముస్లింలంతా బీఆర్‌ఎస్‌తోనే ఉన్నారని, భవిష్యత్‌లోనూ ఉంటారని ఆ పార్టీ రాజ్యసభ ఎంపీలు సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ముస్లింల కోసం అధినేత కేసీఆర్ పదేళ్లలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. రాజ్యసభలో వక్ఫ్ సవరణ బిల్లును తాము వ్యతిరేకించామని, బీఆర్‌ఎస్ ఎంపీలంతా వ్యతిరేకంగా ఓటు వేసినట్లు చెప్పారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎంపీలు మీడియాతో మాట్లాడారు. సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలన్నింటినీ బీఆర్‌ఎస్ ఎదుర్కొంటోందన్నారు. వద్దిరాజు మాట్లాడుతూ అన్ని వర్గాల వారిని ఇబ్బందులకు గురి చేసే బీజేపీని తాము అడుగడుగునా అడ్డుకుంటున్నామని చెప్పారు. కాగా, చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలంటూ హిందూ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పర్వతం సతీశ్, ఓబీసీ స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్ జక్కని సంజయ్ తదితరులు రెండ్రోజులుగా ఢిల్లీ తెలంగాణ భవన్ ఆవరణలో ఆమరణ దీక్ష చేస్తున్నారు. ఈ దీక్షకు ఎంపీలు మద్దతు తెలిపారు. ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ఏర్పాటు జరిగిన తొలినాళ్లలోనే మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానించారని గుర్తు చేశారు.

ఇంత జరుగుతుంటే ఇంకా మిత్రపక్షమా?

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్‌సీయూ భూములు అమ్ముతుంటే, విద్యార్థులను కొడుతుంటే ఇంకా మిత్రపక్షమేమిటని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు వేరు.. ప్రజా, విద్యా సమస్యలు వేరని స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. విద్యా వ్యవస్థ జోలికి వెళ్లమని ప్రభుత్వం ప్రకటించాలని, విద్యార్థులపై నమోదు చేసిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్‌ఎస్ భూములు అమ్మిందని.. ఇప్పుడు మీరు అమ్మితే ఎలా? అని ప్రశ్నించారు. హెచ్‌సీయూ సమస్య సుప్రీంకోర్టు వరకు రావాల్సిన అవసరమే లేదని, సుప్రీం కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని నారాయణ సూచించారు.

‘ఇందిరమ్మ’కు ప్రైవేట్ ఇంజనీర్లు

- 390 మంది నియామకానికి నోటిఫికేషన్ జారీ
- ఔట్‌సోర్సింగ్ ఇంజనీర్లతోనే నిర్మాణాలను తనిఖీ చేయించనున్న ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల తనిఖీ బాధ్యతను ప్రభుత్వం ప్రైవేట్ ఇంజనీర్లకు అప్పగించబోతోంది. తొలుత 390 మందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించుకునేందుకు మేన్‌పవర్ సప్లయర్స్‌కు బాధ్యత అప్పగించింది. అందుకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఈనెల 11 వరకు దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ఇందులో ఎంపికైనవారు అసిస్టెంట్ ఇంజనీర్ హోదాలో పనిచేయాల్సి ఉంటుంది. మొదటగా ఒక సంవత్సరం కోసం వీరితో గృహనిర్మాణ శాఖ ఒప్పందం కుదుర్చుకోనుంది. మరో రెండుమూడు వారాల్లో ఈ ప్రైవేట్ ఇంజనీర్లు విధుల్లోకి రానున్నారు. వీరికి నెలకు రూ.33,800 చొప్పున చెల్లించనున్నట్టు తెలిసింది.

ప్రభుత్వం నియామకాలు వద్దనే ?

గతంలో గృహనిర్మాణ శాఖలో చాలినంతమంది ప్రభుత్వ ఇంజనీర్లు ఉండేవారు. డాక్టర్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, భారీ ఎత్తున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో సొంత సిబ్బంది సరిపోకపోవటంతో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కొందరి సేవలు తీసుకున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం వీరిని తొలగించింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని కూడా రద్దు చేసింది. ఆ తర్వాత గృహనిర్మాణ శాఖ నిర్వీర్యమైంది. దాన్ని రోడ్లు భవనాల శాఖలో కలిపేశారు. గృహనిర్మాణ సంస్థలోని ఇంజనీర్లను వివిధ శాఖల ఇంజనీరింగ్ విభాగాలకు బదిలీ చేశారు. ఇప్పుడు మళ్లీ పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రారంభించటంతో, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కొందరు ఇంజనీర్లను తిరిగి గృహనిర్మాణ సంస్థకు రప్పించారు. అలా ప్రస్తుతం 125 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారు. గృహనిర్మాణ సంస్థలో 505 మంది అసిస్టెంట్ ఇంజనీర్లను వినియోగించుకునేలా పోస్టులకు అనుమతి ఉంది. ప్రస్తుతం 125 మందే ఉన్నందున, మిగతావారిని పబ్లిక్‌సర్వీస్ కమిషన్ ద్వారా నియమించుకోవాల్సి ఉంది. కానీ, ఇటీవలి పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియామక ప్రక్రియలో గృహనిర్మాణ శాఖ ఎంత మంది ఉద్యోగుల అవసరం ఉందో, ఆ వివరాలు ఇవ్వలేదు. దీంతో ఇటీవలి గ్రూప్ పరీక్షల్లో వీటిని చేర్చలేదు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకునే వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ నియామకాల్లో చూపలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతానికి ఔట్‌సోర్సింగ్ ఇంజనీర్ల సేవలు వినియోగించుకొని తదుపరి నియామక ప్రక్రియలో తీసుకునే అవకాశం ఉందని అధికారులంటున్నారు.

తనిఖీ చేసేది వీరే..

తొలివిడతలో ప్రభుత్వం 72 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. వారిలో 12 వేల మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. అందులో 500 మంది బేస్‌మెంట్ స్థాయి వరకు పనులు పూర్తి చేశారు. బేస్‌మెంట్ స్థాయి ముగిసిన వెంటనే తొలి విడత రూ.లక్ష నిధులు వారి ఖాతాల్లో డిపాజిట్ కావాల్సి ఉంటుంది. అది జరగాలంటే అసిస్టెంట్ ఇంజనీర్లు తనిఖీ చేసి సర్టిఫై చేయాలి. ఇప్పుడు ఈ పనిని ఉన్న 125 మంది ఇంజనీర్లు సహా కొత్తగా తీసుకోబోయే ఔట్‌సోర్సింగ్ ఇంజనీర్లు చేయనున్నారు.

క్లుప్తంగా...

కొత్తగూడెంలో యూనివర్సిటీకి సీఎం అంగీకారం

- విమానాశ్రయానికి త్వరలోనే అనుమతులు: మంత్రి తుమ్మల



భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖనిజ నిక్షేపాలకు గని వంటిదని, ఈ జిల్లాలో మైనింగ్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేలా కొత్తగూడెంలో యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి సమ్మతించారని వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. భద్రాచలం పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ ఏర్పాటు గిరిజన యువతతో పాటు అందరికీ ఉపయోగకరమన్నారు. భద్రాచలం దేవస్థానానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు అనువుగా ఉండేలా కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా, త్వరలోనే అనుమతులు వస్తాయని తెలిపారు. సమ్మక్క–సారక్క బ్యారేజీ, కాళేశ్వరం బ్యారేజీ పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగాక రాజమహేంద్రవరం వరకు నౌకల రాకపోకలకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తుమ్మల చెప్పారు.

ప్రాణం పోసిన డాక్టర్ ఎమ్మెల్యే

- కాంగ్రెస్ నేతకు సీపీఆర్ చేసిన భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు



భద్రాచలం అర్బన్: గుండెపోటుతో అచేతనస్థితిలో పడిపోయిన కాంగ్రెస్ నాయకుడికి.. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సకాలంలో సీపీఆర్ చేయడంతో నిండుప్రాణం నిలబడింది. వివరాలివి. శుక్రవారం మంత్రి తుమ్మల పర్యటనలో పాల్గొన్న దుమ్ముగూడెం మండలం లచ్చిగూడేనికి చెందిన తోటమళ్ల సుధాకర్.. ఇంకో నాయకుడి ఇంట విందుకు హాజరై తిరుగు పయనానికి సిద్ధమవుతున్నారు. ఈక్రమంలో మధ్యాహ్నం ఒంటి గంటకు సుధాకర్ గుండెపోటుతో కింద పడిపోయారు. అక్కడే ఉన్న వెంకట్రావు.. ఆయన ఛాతీపై సీపీఆర్ చేయడంతో శ్వాస తీసుకోవడం ఆరంభించారు. అనంతరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. సుధాకర్‌కు వైద్యులు రెండు స్టెంట్లు వేసి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం సుధాకర్ ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

పేదలతో కలసి సన్నబియ్యం భోజనం చేయండి

- ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులకు మంత్రి ఉత్తమ్ సూచన



కుడకుడ గ్రామంలో సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు పేదలతో కలసి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యంతో భోజనం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. రేషన్‌షాపులకు సన్నబియ్యం రవాణాతో పాటు పంపిణీని వేగవంతం చేయాలని, కొత్త రేషన్‌కార్డుల అంశాన్ని త్వరితగతిన పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. శుక్రవారం మంత్రి ఉత్తమ్ సచివాయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలసి జిల్లాల కలెక్టర్లతో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ కారణంగా రాష్ట్రంలోని 84 శాతం మంది జనాభాకు ఆహార భద్రత ఏర్పడిందని చెప్పారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం అమలుపై జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని, రూ.13 వేల కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోని పేదలకు 30 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ఇచ్చే కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా పనిచేయాలని ఉత్తమ్ సూచించారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీతో రేషన్‌షాపుల వద్ద డిమాండ్ ఒక్కసారిగా పెరిగిందని, అవసరం మేరకు బియ్యం అందుబాటులో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని కోరారు.

లబ్ధిదారుడి ఇంట్లో మంత్రి ఉత్తమ్ భోజనం

చివ్వెంల(సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కుడకుడ గ్రామంలోని 2వ వార్డుకు చెందిన సన్నబియ్యం లబ్ధిదారుడు పాలడుగు వెంకన్న ఇంట్లో వారి కుటుంబసభ్యులతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం రాత్రి భోజనం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో పేదలకు సన్నబియ్యం అందిస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణ అని అన్నారు.

సామాన్యుడి ఇంట్లో సీఎం భోజనం!

సన్నబియ్యం లబ్ధిదారుడి గుర్తింపుపై అధికారుల దృష్టి

భద్రాచలం అర్బన్: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో ఆదివారం జరగనున్న శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి రావడం దాదాపు ఖరారైంది. ఈ మేరకు పోలీసులు బందోబస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కల్యాణ వేడుకల్లో పాల్గొన్న అనంతరం భద్రాచలానికి చెందిన సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో సీఎం రేవంత్‌రెడ్డి భోజనం చేయాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం ఈ విషయాన్ని వెల్లడించారు. లబ్ధిదారుడిని గుర్తించాలని సీఎంఓ ద్వారా జిల్లా అధికారులకు సమాచారం కూడా అందింది. భద్రాచలం ఐటీడీఏ రోడ్డులోని ఓ వ్యక్తిని ఇప్పటికే ఖరారు చేసినా, భద్రతా కారణాల రీత్యా అధికారులు గోప్యత పాటిస్తున్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది ఫెవికాల్ బంధం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య ఫెవికాల్ బంధం బట్టబయలైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. జీహెచ్ఎంసీ లోకల్‌బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్ అభ్యర్థిని గెలిపించేందుకు ఈ రెండు పార్టీలు పోటీకి దూరమయ్యాయని ఒక ప్రకటనలో తెలిపారు. ‘మొన్న డీలిమిటేషన్ పేరుతో ఒక్కటయ్యారు. నిన్న వక్ఫ్ బోర్డు బిల్లుపై కాంగ్రెస్‌తో కలిసి కేంద్రానికి వ్యతిరేకంగా ఓటేశారు. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయడం లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?’అని ప్రశ్నించారు. ‘త్వరలో తెలంగాణలో ఈ పార్టీలు కలిసే బహిరంగ సభను నిర్వహించబోతున్నాయి. ఎవరిని పిలవాలో కలిసే డిసైడ్ చేస్తున్నాయి. జీహెచ్ఎంసీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు పార్టీల అభ్యర్థులను నిలపకుండా మజ్లిస్ విజయానికి కృషి చేస్తున్నాయి. అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపుతామన్న కాంగ్రెస్ నేతలు.. ఆ తర్వాత డబ్బు సంచులకు అమ్ముడుపోయి బీఆర్ఎస్ అవినీతి కేసులన్నీ నీరుగారుస్తున్నారు’అని సంజయ్ ఆరోపించారు. బీసీ జాబితా ముసుగులో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల విద్య, ఉద్యోగాల్లో బీసీలకు తీరని అన్యాయం జరగబోతోందన్నారు.

చాకలి ఐలమ్మ వర్సిటీ లోగోను ఆవిష్కరించిన సీఎం



లోగో ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి, వీసీలు సూర్య ధనంజయ్, గంటా చక్రపాణి, కేశవరావు, తదితరులు

సాక్షి, హైదరాబాద్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం లోగోను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్, అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ గంటా చక్రపాణి, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ గంగాధర్, విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాటలు కాదు.. మహిళలకు రక్షణ కల్పించండి

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, వారం రోజుల్లోనే నలుగురు మహిళలపై అత్యాచార ఘటనలు జరిగాయని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ముఖ్యమంత్రి చేతిలోనే హోంమంత్రిత్వ శాఖ ఉన్నా వరుస అత్యాచార ఘటనలపై కనీసం సమీక్షలు నిర్వహించడం లేదన్నారు. పార్టీ నాయకులు చిరుమల్ల రాకేశ్ కుమార్, అభిలాష్ రంగినేని, తుంగబాలు, అరుణతో కలిసి శుక్రవారం తెలంగాణ భవన్‌లో ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. రేవంత్ పాలనలో పోలీసు యంత్రాంగంపై సామాన్యులకు క్రమంగా నమ్మకం పోతోందని, డయల్ 100కు ఫోన్ చేసినా పోలీసులు స్పందించడం లేదని తెలిపారు. అత్యాచార ఘటనలపై మహిళా కమిషన్ ఎందుకు నోటీసులివ్వడం లేదని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు.

సాక్షి

శనివారం, 5 ఏప్రిల్ 2025

బంగ్లా తీరు మారాల్సిందే!

ఏదైనా మోతాదు మించితే వికటిస్తుంది. ఆశించిన ఫలితం రాకపోగా అనవసర ప్రయాస మిగులుతుంది. బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్‌కు ఆలస్యంగానైనా ఇది అర్థమైందో లేదో సందేహమే. గతవారం ఆయన చైనా పర్యటనకు వెళ్లారు. ఆ పర్యటన విజయవంతమైందని బంగ్లా ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంది. కానీ అక్కడ తెలిసీ తెలియకుండా యూనస్ మాట్లాడిన మాటలవల్ల బంగ్లాకు ఒరిగిందేమీ లేకపోగా, ప్రధాని నరేంద్ర మోదీతో చెప్పించుకోవాల్సి వచ్చింది. నిరుడు ఆగస్టులో ప్రజా ఉద్యమం పర్యవసానంగా అప్పటి బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా పదవి కోల్పోయి మన దేశంలో ఆశ్రయం పొందినప్పటినుంచీ ఇరు దేశాల సంబంధాలూ దెబ్బతిన్నాయి. అక్కడ మైనారిటీ హిందువులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయి. హత్యలు, అత్యాచారాలు అధికమయ్యాయి. మత ఛాందసవాదుల ప్రాబల్యం ఎక్కువైంది. ఈ పరిణామాల అనంతరం ఇరు దేశాలమధ్యా ఉన్నతస్థాయి భేటీ జరగటం ఇదే ప్రథమం. శుక్రవారం థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన ఏడు దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాల కూటమి బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా యూనస్‌తో విడిగా భేటీ అయినప్పుడు ఉద్రిక్తతలు పెంచే ప్రకటనలు చేయటం మానుకోవాలని మోదీ సూచించినట్టు చెబుతున్నారు. ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాలంటే నిర్మాణాత్మక, ఆచరణీయ వైఖరితో ఉండాలని కూడా సలహా ఇచ్చారట. తమ దేశంపై తప్పుడు ప్రచారం సాగుతోందని బంగ్లా దబాయించినా సామాజిక మాధ్యమాల్లోని వీడియోలు నిజమేమిటో వెల్లడిస్తూ వచ్చాయి. వీటిపై విచారణ జరిపించి బాధ్యులైన వారిని అరెస్టు చేయాలని, ఇవి పునరావృతం కానీయరాదని గతంలోనే మన దేశం డిమాండ్ చేసింది. ప్రస్తుత భేటీలో కూడా మోదీ దీన్ని లేవనెత్తారు. మాజీ ప్రధాని హసీనాను అప్పగించాలన్న యూనస్‌కు... అలా అడగటానికి ఇది వేదిక కాదని మన విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ చెప్పాల్సి వచ్చింది.

యూనస్ పూర్వాశ్రమంలో ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు. గ్రామీణ బ్యాంకు వ్యవస్థ రూపశిల్పిగా, మైక్రో ఫైనాన్స్ విధాన నిర్ణేతగా బంగ్లా గ్రామీణ ప్రజల జీవనాన్ని మెరుగుపరిచేందుకు చేసిన కృషికి 2006లో ఆయనకు నోబెల్ శాంతి పురస్కారం లభించింది. పలు ఐక్యరాజ్యసమితి అనుబంధ సంఘాలకు సారథ్యం వహించారు. ఇదంతా బాగున్నా షేక్ హసీనాతో వచ్చిన విభేదాల కారణంగా ఆయనకు కష్టాలు మొదలయ్యాయి. కేసులు వచ్చి పడ్డాయి. మైక్రో ఫైనాన్స్ వ్యవస్థ వల్ల గ్రామీణులకు మేలు కలగకపోగా అప్పుల్లో కూరుకుపోయారన్న ఆరోపణలూ వచ్చాయి. తనకు ససేమిరా పడని హసీనాకు మన దేశం మద్దతుగా నిలిచిందన్న ఆక్రోశం యూనస్‌కు ఉండొచ్చు. ఇరుగు పొరుగు సత్సంబంధాలతో మెలగటం, ఇచ్చిపుచ్చుకోవటం, అభివృద్ధి సాధించటం అత్యవసరమని ఆయన ఇప్పటికీ గ్రహించలేదని చైనాలో ఆయన చేసిన వ్యాఖ్యలు చెబుతున్నాయి.

ఈశాన్య భారత్‌లోని ఏడు రాష్ట్రాలూ సముద్రతీరం లేనివని, కనుక ఈ ప్రాంతంలో అందరూ తమపై ఆధారపడక తప్పదని యూనస్ చైనాలో వ్యాఖ్యానించారు. అక్కడితో ఆగలేదు. మౌలిక సదుపాయాలూ, కనెక్టివిటీ సరిగాలేని ఈ ప్రాంతంలో పెట్టుబడులకు భారీ అవకాశాలున్నాయని చైనాకు గుర్తుచేశారు. అది తెలివితక్కువతనమో, మతిమరుపోగానీ... భారత్‌కు రెండువైపులా 6,500 కిలోమీటర్ల పొడవైన విస్తృత తీరప్రాంతం ఉందన్న సంగతి ఆయనకు తట్టలేదు. ఈశాన్యంలో రహదారులు, రైల్వే నిర్మాణం మరింత మెరుగుపరిస్తే... జలరవాణాను పెంచితే దేశంలోని ఏ తీరప్రాంతంనుంచి అయినా విదేశాలకు ఎగుమతులు చేయటం ఎంత పని! యూనస్ వ్యాఖ్యల్ని అపార్థం చేసుకున్నారని బంగ్లా విదేశాంగ శాఖ ముక్తాయిస్తోంది. కానీ సమయమూ, సందర్భమూ గమనిస్తే అది నిజం కాదనిపిస్తుంది. తాము పాకిస్తాన్‌తోపాటు చైనాకు దగ్గర కాబోతున్నామని మన దేశాన్ని నేరుగా హెచ్చరించటమే ఇది.

బంగ్లాదేశ్‌కు ఆర్థిక కష్టాలు దండిగానే ఉన్నాయి. అందులో కొన్ని స్వయంకృతం. బంగ్లాకు ఇచ్చే ఆర్థిక సాయాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిలిపేశారు. హసీనా పదవీచ్యుతి తర్వాత అక్కడ మతఛాందసుల వీరంగంతో మన దేశం కూడా బంగ్లాను దూరం పెట్టింది. దాంతో నిధుల లేమితో అది సతమతమవుతోంది. ఇటీవల బియ్యం కొరత ఏర్పడి అది పాకిస్తాన్‌ను ఆశ్రయించినా అక్కడినుంచి చాలినంత అందలేదు. పైగా భారత్‌నుంచి వచ్చే బియ్యంతో పోలిస్తే వ్యయం తడిసి మోపెడవుతోంది. ప్రధాన సలహాదారయ్యాక యూనస్‌ను మన ప్రభుత్వం అభినందించినా, భారత్‌లో పర్యటించాలని ఆహ్వానం పంపలేదు. అందుకే తొలి పర్యటనకు యూనస్ కావాలని చైనాను ఎంచుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే చైనాను ఆకాశానికెత్తి మనల్ని చిన్నబుచ్చే యత్నం చేశారు. ఇంతచేసినా 210 కోట్ల డాలర్ల పెట్టుబడికి చైనా సమ్మతించింది. దాదాపు వంద కంపెనీలు 100 కోట్ల డాలర్లమేర మదుపు చేయటానికి అంగీకరించాయి. ఈ రెండు ప్రతిపాదనలకూ నిర్దిష్ట గడువు లేదు. ఎప్పుడొస్తాయో తెలియదు. కానీ బంగ్లాకు తక్షణసాయం కావాలి. అది అధిక ధరలతో, నిత్యావసరాల కొరతతో సతమతమవుతోంది. మత ఛాందసులు ఈ స్థితిని తమకు అనుకూలంగా మలుచుకునే పనిలో ఉన్నారు. మోదీ అన్నట్టు సుస్థిర, ప్రజాతంత్ర, శాంతియుత దేశమన్న అభిప్రాయం కలిగించినప్పుడే బంగ్లాకు అన్నివైపులనుంచీ సాయం అందుతుంది. అరాచక శక్తులకు ఆటపట్టయితే, భారత్ వ్యతిరేకతే ఊపిరిగా బతుకుతానంటే ప్రయోజనం శూన్యం. యూనస్ ఈ సంగతిని ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

ఈ సుంకాలతో లాభనష్టాలు

విశ్లేషణ



డా॥ తమ్మా కోటిరెడ్డి

భారత్ ఎగుమతులపై అమెరికా 26 శాతం దిగుమతి సుంకాన్ని విధించడం ఆర్థిక ఆందోళనలకు దారి తీసింది. భారత్‌తో పోల్చినప్పుడు అధికంగా చైనాపై 40–60 శాతం (కొన్ని ఉత్పత్తులపై 100 శాతం వరకు), వియత్నాంపై 30–45 శాతం, థాయ్‌లాండ్‌పై 35–50 శాతం దిగుమతి సుంకాలను అమెరికా విధించింది. భారత్‌కన్నా తక్కువగా యూరోపియన్ యూనియన్‌పై 20 శాతం, జపాన్‌పై 24 శాతం, దక్షిణ కొరియాపై 25 శాతం దిగుమతి సుంకాలను అమెరికా విధించింది.

అమెరికా వాదన

2024లో అమెరికాకు సంబంధించి భారత్ ఎగుమతుల విలువ 91.23 బిలియన్ డాలర్లు. భారత్ మొత్తం ఎగుమతుల విలువలో అమెరికా వాటా 18 శాతం. ఇదే సంవత్సరం అమెరికా ఉత్పత్తుల దిగుమతులలో భారత్ వాటా 2.6 శాతం. మొత్తంగా భారత్‌తో వాణిజ్యానికి సంబంధించి అమెరికా వాణిజ్య లోటు 2023–24లో 45.7 బిలియన్ డాలర్లు కాగా, 2024–25 (జనవరి వరకు) 22.9 బిలియన్ డాలర్లుగా నమోదయింది. అమెరికాకు సంబంధించిన పాసింజర్ వాహనాలపై 70 శాతం, యాపిల్స్‌పై 50 శాతం, ఆల్కహాల్‌పై 100–150 శాతం దిగుమతి సుంకాలను భారత్ విధిస్తున్నప్పుడు, ప్రస్తుతం భారత్‌పై అమెరికా విధించిన 26 శాతం దిగుమతి సుంకం సమంజసమేనని అమెరికా వాదిస్తున్నది. ప్రపంచ స్వేచ్ఛా వాణిజ్య నియమావళికి విరుద్ధంగా భారత్ వ్యవహరిస్తున్నదని అమెరికా భావిస్తున్నది.

దిగుమతి సుంకాల పెంపు కారణంగా బీఎస్ఈ సెన్సెక్స్, నిఫ్టీ 50తో పాటు చైనా, థాయ్‌లాండ్‌కు సంబంధించిన ముఖ్య సూచీలలోనూ క్షీణత ఏర్పడింది. 2023–24లో అమెరికాతో వాణిజ్యంలో చైనా మార్కెట్ వాటా 21.6 శాతం కాగా, వియత్నాం వాటా 19.3 శాతంగా, భారత్ వాటా 6 శాతంగా నిలిచింది. వివిధ దేశాలపై అమెరికా దిగుమతి సుంకాల పెంపు కారణంగా చైనా, వియత్నాంలతో పోల్చినప్పుడు భారత్ ఎగుమతులలో పోటీతత్వం పెరుగుతుందని భావించవచ్చు.

సగటు అమెరికా దిగుమతి సుంకాల కారణంగా– భారత్‌లో రొయ్యలు, వస్త్రాలు, స్టీల్ రంగాలపై; చైనాలో సోలార్ ప్యానల్స్, సెమీ కండక్టర్, స్టీల్, ఎలక్ట్రిక్ వాహనాలపై; వియత్నాంలో ఫుట్‌వేర్, ఎలక్ట్రానిక్స్, ఫర్నీచర్‌పై; థాయ్‌లాండ్‌లో ఆటో పరికరాలు, రబ్బరు ఉత్పత్తులపై ప్రభావం ఉంటుందని అంచనా.

భారత్‌పై ప్రభావం

ప్రాథమిక కేటగిరీకి సంబంధించిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫార్మా ఉత్పత్తులు, విలువైన రాళ్ళు భారత్ నుండి అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. మార్చి 2025లో ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మెరుగుపరచుకొనే చర్యలో భాగంగా అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై భారత్ దిగుమతి సుంకాన్ని తగ్గించడం వలన రెండు దేశాలకు పరస్పర ప్రయోజనం చేకూరుతుంది. ఆసియా ఖండంలోని ఇతర దేశాలతో పోల్చినప్పుడు సౌర విద్యుత్, ఫార్మాసూటికల్స్, టెక్స్‌టైల్స్ – అప్పారెల్ రంగాలలో భారత్‌కు అధిక ప్రయోజనం ఉంటుందని అంచనా.



సుంకాల పట్టిక చూపుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ప్రపంచవ్యాప్తంగా టెక్స్‌టైల్ – అప్పారెల్ రంగాలకు సంబంధించి పోటీ వాతావరణం నెలకొన్నది. ఈ నేపథ్యంలో ప్రస్తుత దిగుమతి సుంకాల నిర్ణయం కారణంగా అమెరికా మార్కెట్‌లో ఆ యా ఉత్పత్తులకు సంబంధించి భారత్‌కు పోటీ తగ్గుతుంది. చైనాకు సంబంధించిన సౌర ఉత్పత్తులపై అధిక దిగుమతి సుంకం కారణంగా చైనా సౌర ఉత్పత్తుల ధరలు పెరగడం వలన భారత్‌కు ప్రయోజనం చేకూరుతుంది. చైనాపై అమెరికా అధికంగా ఆధార పడటం తగ్గి భారత్ – అమెరికా వాణిజ్య సంబంధాలు మరింత పటిష్ఠమయ్యే అవకాశం ఉంది.

భారత్ నుండి రొయ్యల ఎగుమతుల విలువ రూ. 22,000 కోట్లు కాగా, ఈ మొత్తంలో అమెరికా వాటా 44 శాతంగా ఉంది. ప్రస్తుతం అధిక సుంకాల కారణంగా భారత్ నుండి అమెరికా రొయ్యల ఎగుమతుల విలువలో తగ్గుదల ఏర్పడవచ్చు. భారత్ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులకు సంబంధించి అమెరికాలో భారత్ మార్కెట్ వాటా తగ్గుతుంది. వజ్రాలు, ఆభరణాల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం ఉంటుంది. భారత్‌లో అనేక సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా సంస్థలు హ్యాండిక్రాఫ్ట్ గార్మెంట్స్ ఎగుమతులపై అధికంగా ఆధారపడ్డాయి. అధిక సుంకాల నేపథ్యంలో ఎం.ఎస్.ఎం.ఇ. సంస్థల ఉత్పత్తులకు డిమాండ్ తగ్గుతుంది. తద్వారా ఆ యా సంస్థలలో లే ఆఫ్ కారణంగా ఉత్పత్తి సామర్థ్యం కూడా తగ్గుతుంది.

సిద్ధించే ప్రయోజనాలు

అమెరికా దిగుమతి సుంకాలను ముఖ్యంగా వస్తువులపై విధించినందువలన భారత్‌లో పటిష్ఠంగా ఉన్న ఐటీ, సేవల రంగంపై ఈ ప్రభావం ధనాత్మకంగా ఉంటుంది. భారత్ నుండి సాఫ్ట్‌వేర్ సర్వీసులు, ఫైనాన్షియల్ టెక్నాలజీ, బిజినెస్ అవుట్ సోర్సింగ్‌కు సంబంధించి ఎగుమతులు పెరిగే అవకాశం ఉంది. ఇంజినీరింగ్ వస్తువులకు సంబంధించి భారత్‌తో పోల్చినప్పుడు చైనా, యూరప్‌లపై అధిక సుంకాలు విధించిన కారణంగా అమెరికా కొనుగోలుదారులు భారత్ ఇంజినీరింగ్ ఉత్పత్తులపై దృష్టి సారించే వీలుంది. దానివల్ల భారత్ ఎగుమతులలో పెరుగుదల ఏర్పడుతుంది.

చైనా ఉత్పత్తులపై అధిక దిగుమతి సుంకాల కారణంగా బహుళ జాతి సంస్థలు తమ ఉత్పత్తిని భారత్‌లో చేపట్టే అవకాశం ఉంది. తద్వారా భారత్ అధిక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉంటుంది. భారత్‌లో ఇప్పటికే అమలులో ఉన్న 'ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్' (ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం) కారణంగా ఎలక్ట్రానిక్స్, బ్యాటరీలు, సెమీ కండక్టర్‌లకు సంబంధించిన సంస్థలు భారత్‌లో అధికంగా ఏర్పాటవుతాయి. తద్వారా భారత్‌లో పెట్టుబడులు, ఉపాధి, ఉత్పత్తి, ఎగుమతుల విలువలో పెరుగుదల కనబడుతుంది. అది స్థూల దేశీయోత్పత్తిలో కూడా పెరుగుదలగా ప్రతిఫలిస్తుంది.

అమెరికా దిగుమతి సుంకాల కారణంగా ఇతర దేశాల వ్యవసాయ ఉత్పత్తుల ధరలలో పెరుగుదల ఏర్పడుతుంది. తద్వారా భారత్ నుండి బియ్యం, సుగంధ ద్రవ్యాలు, ప్రాసెస్డ్ ఫుడ్‌కు అమెరికా మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతోపాటు భారత్ ఎగుమతుల విలువలో పెరుగుదల ఏర్పడుతుంది. ఎగుమతుల పరంగా ఇబ్బంది ఎదుర్కొనే నేపథ్యంలో (కొన్ని ఉత్పత్తులకు సంబంధించి) భారత్‌లోని ఉత్పత్తి స్వదేశీ డిమాండ్‌ను తీర్చడానికి ఉపకరిస్తుంది. ఈ స్థితి దేశంలో కొన్ని ఉత్పత్తుల కొరతను నివారించడం ద్వారా సాధారణ ధరల స్థాయి తగ్గుదలకు దారితీస్తుంది.

చేయాల్సింది

అయితే, అమెరికా ఆటో పరికరాలపై దిగుమతి సుంకాన్ని తగ్గించాలనే ఒత్తిడిని భారత్ సమీప భవిష్యత్తులో ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అందుకే అమెరికాపై అధికంగా ఆధారపడటాన్ని తగ్గించుకోవాలి. ఆఫ్రికా, మధ్య ప్రాచ్యం, ఆగ్నేయాసియా దేశాలతో భారత్ నూతన వాణిజ్య భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలి.

వ్యాసకర్త ప్రొఫెసర్ అండ్ డీన్, ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఐ.ఎఫ్.హెచ్.ఇ., హైదరాబాద్

- అధిక సుంకాల కారణంగా అమెరికాకు ఇండియా రొయ్యలు, వజ్రాలు, ఆభరణాల ఎగుమతులు తగ్గుతాయి. సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా సంస్థల హ్యాండిక్రాఫ్ట్ గార్మెంట్స్‌కు డిమాండ్ పడిపోతుంది.
- చైనాకు సంబంధించిన సౌర ఉత్పత్తులపై అధిక దిగుమతి సుంకం కారణంగా ఆ ఉత్పత్తుల ధరలు పెరగడం వలన భారత్‌కు ప్రయోజనం చేకూరుతుంది.
- ఇంజినీరింగ్ వస్తువులకు సంబంధించి భారత్‌తో పోల్చినప్పుడు చైనా, యూరప్‌లపై అధిక సుంకాలు విధించిన కారణంగా అమెరికా కొనుగోలుదారులు భారత్ ఇంజినీరింగ్ ఉత్పత్తులపై దృష్టి సారించే వీలుంది.

సోషల్ మీడియా

లెజెండ్



మనోజ్‌కుమార్‌జీ మీరు ఒక నిజమైన లెజెండ్. మీరు ఇచ్చిన మరిచిపోలేని సినిమాలు, జ్ఞాపకాలకు ధన్యవాదాలు.
– సల్మాన్ ఖాన్, నటుడు

పరిస్థితుల ప్రభావం



నియమాల ఆధారిత అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ సంరక్షకురాలిగా చైనా దుడ్డుకర్ర తీసుకుని నిలబడే రోజు వస్తుందని ఎవరు అనుకున్నారు?
– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

ఇస్లాం వారసత్వం



భారత ప్రభుత్వానికి 2023 - 24 ఆర్థిక సంవత్సరానికిగానూ టికెట్ రసీట్ల ద్వారా 'టాప్ 3' ఆదాయ వనరులుగా నిలిచిన కట్టడాలు:
1. తాజ్ మహల్, ఆగ్రా.
2. కుతుబ్ మినార్, ఢిల్లీ. 3. ఎర్ర కోట, ఢిల్లీ.
– యూసుఫ్ ఎ అహ్మద్ అన్సారీ, ఇండో ఇస్లామిక్ హిస్టారియన్

నిజమైన స్థాయి



ఒకప్పుడు రాజ్ థాక్రే తనను తాను నిజమైన నాయకుడిగా, బాల్ థాక్రేకు నిజమైన వారసుడిగా చెప్పుకొనేవారు. కానీ ఇప్పుడు కేవలం నిస్సహాయ జనాల మీద దాడిచేసే ఒక గూండా స్థాయికి తనను తగ్గించుకున్నారు.
– స్వాతి చతుర్వేది, జర్నలిస్ట్

దేనికి గర్వం?



ఐదేళ్లలో దారుణమైన స్టాక్ మార్కెట్ అనుభవం. సాధారణంగా ఏ మహమ్మారి వల్లో, ఏ బ్యాంకో కుప్పకూలడం వల్లో, తుఫానుల వల్లో, ఏ దేశమైనా ఇంకేదో చేయడం వల్లో దారుణమైన స్టాక్ మార్కెట్ అనుభవాన్ని ఎదుర్కొంటాం. కానీ గర్వపడే నిర్ణయాలు తీసుకుంటున్నాను అనుకుంటున్న అమెరికా అధ్యక్షుడి విధానాలకు స్పందనగా ఇలా జరగడం ఇదే చూడటం. ఇది చాలా ప్రమాదకరం.
– లారెన్స్ హెచ్ సమ్మర్స్, ఆర్థికవేత్త

ఏకరూపత ప్రయత్నాలతో అసలుకు చేటు!

అభిప్రాయం



సల్మాన్ ఖుర్షీద్

ప్రతిపక్షాల విమర్శలు, అభ్యంతరాలన్నింటినీ తోసిరాజంటూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్టాలను సమూలంగా మార్చేసింది. వక్ఫ్ న్యాయశాస్త్రంపై దీర్ఘకాలిక ప్రభావం చూపేలా మార్పులు చేసింది. 1995 నాటి వక్ఫ్ యాక్ట్ పేరును కూడా 'యూనిఫైడ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్'గా కూడా మార్చింది.

వాస్తవానికి భారతదేశానికి వక్ఫ్ చట్టం కొత్తదేమీ కాదు. ఇస్లామిక్ ప్రపంచంలోనూ మహమ్మద్ ప్రవక్త కాలం నుంచి ఈ వక్ఫ్ చట్టం ఉంది. భారత్‌లో న్యాయనిపుణులు, మేధావులు దశాబ్దాల పాటు ఈ చట్టానికి రూపకల్పన చేయడంలో ఎంతో శ్రమకోర్చారు. మారుతున్న ఆర్థిక, సామాజిక పరిస్థితులకు, వక్ఫ్ మౌలిక సూత్రాలకు మధ్య సమన్వయం సాధించడంలో కృతకృత్యులయ్యారు. 2013లో మాజీ ప్రధాని, దివంగత మన్మోహన్‌సింగ్ నేతృత్వంలో మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేసిన నేను 1995 నాటి వక్ఫ్ చట్టానికి కొన్ని మెరుగులు దిద్దే ప్రయత్నం చేశా. అయితే... సంప్రదాయ వర్గాల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది. మార్పుల ఉద్దేశాన్ని ప్రశ్నించారు. ముస్లింలు నమాజ్ కోసం ఇంట్లో లేని సమయంలో చట్టాన్ని పాస్ చేయడం ద్వారా దురుసుగా ప్రవర్తించానన్న ఆరోపణలూ వచ్చాయి. వక్ఫ్ ట్రిబ్యునళ్లకు పరిధులు నిర్ణయించేందుకు ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయడంపై పెద్ద రచ్చే చేశారు. బాబ్రీ మసీదు న్యాయ వివాదంలోకి చొరబడే దురుద్దేశంతోనే ఈ మార్పు చేశారని ఒకరు సూచించారు కూడా. ఈ విమర్శలన్నింటినీ ఒక్కసారి నెమరేసుకుంటే... ముస్లిం వర్గాల నేతల హ్రస్వదృష్టి మాత్రమే కనిపిస్తుంది. 'నాన్నా పులి... నాన్నా పులి...' అని పదే పదే అరవడం ద్వారా అసలు పులి వచ్చినప్పుడు ప్రమాదం తప్పదన్న విషయాన్ని గ్రహించలేకపోయారు వీరు. ఇప్పుడు జరిగింది కూడా ఇదే.

సామాజిక పరిస్థితులకు అనుగుణమైన స్పందనతో పాటు... ఇస్లాంలోని చాలా విషయాల మాదిరిగానే వక్ఫ్ నిర్వచనానికీ మత సౌరభం ఉంది. వక్ఫ్ అనేది అల్లాకు బదిలీ అయ్యే ఆస్తి. ఆ ఆస్తిని పర్యవేక్షించే వ్యక్తి ముతావలి. ఇది మౌలికంగా ట్రస్ట్‌కు భిన్నమైనది. ట్రస్ట్‌కు సంబంధించి చూస్తే యాజమాన్యం అనుభవదారుకు – చట్టప్రకారం యజమానియైన ట్రస్టీకి మధ్య విభజితమై ఉంటుంది. కాబట్టే భారత రాజ్యాంగంలోని 25, 26వ నిబంధనల ప్రకారం వీటికి రక్షణ కల్పించారు. మార్పులు చేయక ముందు నాటి చట్టం... ఖరారు చేయడం (డిక్లరేషన్), దీర్ఘకాల వాడకం (వక్ఫ్ బై యూజర్) లేదా సంతానం, వారసులకు ధర్మాదాయం (వక్ఫ్– అలాల్–ఔలాద్) కింద వక్ఫ్ ఏర్పడడానికి అనుమతిస్తున్నది.



తాజా చట్టంలో వక్ఫ్‌ను ప్రకటించాలంటే ఐదేళ్లపాటు ముస్లిం మతాన్ని ఆచరిస్తూ ఉండాలన్న నిబంధన పెట్టారు. ఈ విషయాన్ని నిర్ధారించేదెవరు? 'అల్లా తప్ప ఇంకో దేవుడు లేడు, ఆయన సందేశాన్ని వినిపించే వ్యక్తి మహమ్మద్ ప్రవక్త' అని కల్మా చదివే ప్రతి వ్యక్తీ ముస్లిం అవుతాడు. ఇలా దేవుడి పట్ల విశ్వాసం ప్రకటించడం ఒక్కటే ముస్లిం అయ్యేందుకు ఉన్న నిబంధన. క్రైస్తవం విషయంలో ఇలా విశ్వాసం ప్రకటించాల్సిన అవసరం లేదు. ముందు ముందు పరిస్థితులను బట్టి 'వక్ఫ్ బై యూజర్' అన్న అంశాన్ని తొలగించ వచ్చని కొత్త చట్టం చెబుతోంది. ఇదే జరిగితే ప్రార్థనా స్థలాలు, ధార్మిక కార్యక్రమాలకు ఉద్దేశించిన అసంఖ్యాక వక్ఫ్ ఆస్తులు తీవ్ర పమాదంలో పడే అవకాశం ఉంది. అంతేకాదు.. దానం చేసిన వారి వారసుల (మహిళలైనా సరే) హక్కులను నిరాకరించిన ఫలితంగా సమకూరే వక్ఫ్– అలాల్–ఔలాద్ సరికాదనీ ఇది చెబుతోంది. నిజానికి వక్ఫ్–అలాల్–ఔలాద్ నిర్వచనంలోనే వారసులూ ఇందులో భాగం. ఇది గమనార్హం.

వక్ఫ్ ఆస్తుల జాబితా తయారీని సులువు చేసే ఉద్దేశంతోనే ప్రభుత్వం నియమించిన సర్వేయర్ ద్వారా వక్ఫ్ ఆస్తుల సర్వే చేయాలని చట్టంలో పొందుపరిచారు. ఆక్రమణల నుంచి వక్ఫ్ ఆస్తులను రక్షించేందుకు జిల్లా కలెక్టర్ ప్రమేయాన్ని చేర్చారు. తాజా చట్టంలో సర్వే కమిషనర్ పనులను కలెక్టర్‌కు లేదా డిప్యూటీ కలెక్టర్ హోదా ఉన్న అధికారికి బదలాయించారు. ఫలితంగా అధికారం కలెక్టర్ చుట్టూ కేంద్రీకృతమైనట్లు అయ్యింది. అంతేకాకుండా వక్ఫ్ – ప్రభుత్వ ఆస్తుల మధ్య వివాదాలపై నిర్ణయం తీసుకునే అధికారం కూడా కలెక్టర్‌కే కట్టబెట్టారు. ఇది చాలా కీలకమైన విషయం. దశాబ్దాలుగా వక్ఫ్ ఆస్తులు చాలావాటిని ప్రభుత్వాలు తమవిగా ప్రకటించి స్వాధీనం చేసుకున్నాయి. ఢిల్లీలో రాజధాని నగరం ఏర్పాటు కోసం 123 ఆస్తుల (ముస్లిం శ్మశాన వాటికలు, మసీదు)లను స్వాధీనం చేసుకున్న విషయం ఇక్కడ ప్రస్తావించాలి.

కొత్త చట్టంలో రాష్ట్రాల వక్ఫ్‌బోర్డులను కలుపుకొని వాటిల్లో మహిళలకూ ప్రాతినిధ్యం కల్పిస్తూ సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉపయోగకరమైందే. అయితే కౌన్సిల్‌లో ఇద్దరు ముస్లిమేతరులను చేర్చడం మాత్రం రాజ్యాంగ స్ఫూర్తికి, ఇతర మతాలకు సంబంధించిన సంస్థల్లోని ఏర్పాట్లకు విరుద్ధం.

సున్నీ, షియాలకు సంబంధించి వేర్వేరు వక్ఫ్‌బోర్డులు ఏర్పాటు చేసుకునేందుకు మునుపు కూడా ఏర్పాట్లు ఉన్నాయి. అయినప్పటికీ బోహ్రా, ఆగాఖానీయులకు ఇంకో బోర్డు ఏర్పాటు చేయాలని చెప్పడం ముస్లింలను మరింత విడదీసే ప్రయత్నం. వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ ఒక పోర్టల్ ద్వారా జరగడంపై ఎవరికీ పెద్దగా అభ్యంతరాలు ఉండాల్సిన అవసరం లేదు. కానీ రెవెన్యూ చట్టాల ప్రకారం మ్యూటేషన్ కోసం పొడవాటి పద్ధతి ఒకటి ప్రతిపాదించారు. వక్ఫ్ ఆస్తిగా రిజిస్టర్ చేసే ముందు సంబంధితులకు ముందస్తు నోటీసు ఇవ్వాలని చెప్పడం అల్పాదాయ, చిన్న చిన్న వక్ఫ్‌లకు ఇబ్బందికరంగా పరిణమించవచ్చు.

కొత్త చట్టంలో ట్రిబ్యునళ్ల నిర్మాణాన్ని మార్చే ప్రతిపాదన కూడా చేశారు. ఇద్దరు సభ్యులు, ట్రిబ్యునల్ తీర్పులను 90 రోజుల్లోగా హైకోర్టులో సవాలు చేసే అవకాశం కల్పించారు. ఇది ట్రిబ్యునళ్ల ఏర్పాటు ఆలోచనకు విరుద్ధమైంది. ఇస్లామిక్ చట్టాలపై అవగాహన ఉన్న టెక్నికల్ ఎక్స్‌పర్ట్‌ను ట్రిబ్యునల్ నుంచి తొలగించడం సబబు కాదు. అలాగే ఇన్నేళ్లలో వక్ఫ్ చట్టాల్లోకి చేరిన ప్రయోజనకర అంశాలు 107 నిబంధన తొలగింపుతో నిష్ప్రయోజనకరంగా మారనున్నాయి. అలాగే కొత్త చట్టంలోని ఏ అంశాన్ని అమలు చేయాలన్నా 1963 నాటి లిమిటేషన్ చట్టాన్ని అనుసరించాలని చెప్పడం కూడా అంత సరైన విషయం కాదు. సెక్షన్ 108, 108ఏలను తొలగించడం కూడా ఇబ్బందికరమైనదే.

దేశంలోని వక్ఫ్‌ల చేతుల్లో భూకమతాలు పెద్ద ఎత్తున ఉన్నాయన్నది వాస్తవం. అయితే కొత్త చట్టం ద్వారా వీటిని ముస్లిం సమాజం మేలు కోసం ఉపయోగించే అవకాశాలు మాత్రం లేవు. గతంలో ఇలాంటి ప్రయత్నాలు జరిగాయి. జకాత్, ఖుర్బానీ, వక్ఫ్ వంటివి దాన ధర్మాలకు, మానవ సంక్షేమానికి ముస్లింలు ఇచ్చే ప్రాధాన్యానికి సూచికలు. వారి జీవన విధానానికి ప్రతీకలు. ఒక దేశంగా భిన్నత్వంలోనూ ఏకత్వాన్ని చవి చూశాము కానీ ప్రస్తుతం ఏకరూపత పేరుతో సాగుతున్న దుందుడుకు చర్యలు బాధాకరమైనవి.

వ్యాసకర్త కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి

విధి చేతలు

జ్యోతిర్మయం

కురుక్షేత్ర సంగ్రామంలో గెలిచినప్పటికీ, బంధువర్గ వినాశానికి కారణమయ్యాననే ఆలోచనతో వికలచిత్తుడైన ధర్మరాజు, వ్యాసమహర్షి సలహాతో అశ్వమేధయాగం చేయడానికి పూనుకున్నాడు. అర్జునుడికి చిత్రాంగదయందు కలిగిన బభ్రువాహనుడు యాగాశ్వాన్ని ఆపాడు. ఫలితంగా తండ్రి కొడుకుల మధ్య యుద్ధం మొదలైంది. ఆ యుద్ధంలో కర్ణుడి కొడుకైన వృషకేతనుడు కూడా పాల్గొన్నాడు. ఒక స్థితిలో బభ్రువాహనుడికి వృషకేతనుడికి మధ్య భీకరమైన పోరు సాగింది. విధివశాన చివరికి బభ్రువాహనుడి చేతిలో వృషకేతనుడు హతుడైనాడు. వృషకేతనుడి మరణం అర్జునుడి చిత్తాన్ని కలచివేసింది. 'రణరంగంలో ప్రతిపక్షుల శిరస్సులనే అరుణవర్ణపు మౌక్తికాలను దోసిలిలో నింపుకుని ప్రతిరోజూ సూర్యభగవానుడికి అర్ఘ్యం ఇవ్వగలిగేటంతటి వీరుడవైన నిన్ను, తొందరపాటుతో వ్యర్థంగా పోగొట్టుకున్నాను. అలా సూర్యభగవానుడి కొడుకు, మనుమడు... ఇరువురి మరణానికి నేనే కారణమై, ఆయనతో ఆజన్మాంత విరోధాన్ని తెచ్చుకున్న వాడనయ్యాను. అభిమన్యుడి తరువాత అంతటి వాడివి నీవు ఉన్నావు కదా అని నమ్మి కొంత ఊరడిల్లాను. నీ మరణంతో ఇప్పుడు శ్రీకృష్ణుడికి, ధర్మరాజుకు నాపై ఉన్న నమ్మకాన్ని పోగొట్టుకున్నాను. యాగాశ్వాన్ని సాధించుకు తెచ్చే సందర్భంలో జరిగిన పోరులో భీముడికి ఎంతో సహాయం చేశావు. ఇప్పుడు నాకు తోడుగా వచ్చి పోరాడుతూ ప్రతిపక్షుల పాలపడ్డావా కుమారా!' అని ఎంతగానో రోదించాడు అర్జునుడు. అర్జునుడి హృదయంలో మానని గాయం అభిమన్యుడి మరణం. కురుక్షేత్ర సంగ్రామానంతరం కర్ణుడు తనకు అన్న అని తెలియడంతో, కర్ణుడి కొడుకైన వృషకేతనుడిలో అభిమన్యుడిని చూసుకుని ఆ గాయాన్ని మాన్పుకునే ప్రయత్నం చేశాడు అర్జునుడు. అయితే, విధివశాత్తూ, తన కుమారుడే అయిన బభ్రువాహనుడి చేతిలో వృషకేతనుడి మరణం, తన చేతిలో కర్ణుడి మరణాన్ని తలపుకు తెచ్చి చెప్పలేని శోకానికి గురిచేసింది.

తే. అంబుజాప్తుడు లేని నభంబు దివియ
లేని గేహంబు లింగంబు లేని పీఠ
మప్రయోజన మైనయట్లనఘ నాకు
నీవు లేనిజయం బది నిష్ఫలంబు.

'సూర్యుడు లేని ఆకాశం, దీపం లేని ఇల్లు, శివలింగం ప్రతిష్ఠితం కాని పీఠం వ్యర్థాలైనట్లుగా... నీవు లేని విజయం కూడా నాకు నిష్ఫలమైనదే కుమారా!' అంటూ వృషకేతనుడి తలను చేతులలోకి తీసుకుని ఆప్యాయంగా నిమురుతూ, అతడి వ్యక్తిత్వాన్ని, శౌర్యాన్ని తలుచుకుని రోదించాడు అర్జునుడు అని పిల్లలమర్రి పినవీరభద్రుడి 'జైమినిభారతం' చెప్పింది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: శు.అష్టమి రా.12.30 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: ఆరుద్ర ఉ.10.28 వరకు, తదుపరి పునర్వసు, వర్జ్యం: రా.10.13 నుండి 11.47 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.55 నుండి 7.34 వరకు, అమృతఘడియలు: లేవు ; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 5.56, సూర్యాస్తమయం: 6.10.



నియామక పత్రం అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

యువతకు ఉద్యోగాలు కల్పిస్తేనే తెచ్చుకున్న రాష్ట్రానికి అర్థం..పరమార్థం: భట్టి విక్రమార్క

మాదాపూర్: యువతకు ఉద్యోగాలు కల్పిస్తేనే..తెచ్చుకున్న రాష్ట్రానికి అర్థం..పరమార్థం ఉంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మాదాపూర్‌లోని సైబర్‌గార్డెన్‌లో శుక్రవారం తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థలో పలువురికి ఉద్యోగ నియామక పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో భూనిర్వాసితుల కోటాలో ఉద్యోగాలు పొందిన జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ప్లాంట్ అటెండెన్స్, ఆఫీస్ సబార్డినేట్, హౌస్ కీపర్స్‌తోపాటు టీజీపీఎస్సీ ద్వారా ఆర్థికశాఖలో నూతనంగా నియామకమైన డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్స్‌కు నియమాక పత్రాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగ అవకాశాలు పొందలేని నిరుద్యోగ యువత కోసం రూ. 9 వేల కోట్ల స్వయం ఉపాధి పథకాలు అందించడానికి రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో ప్రొడక్షన్ ప్రారంభించడానికి ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాగానే అనుమతులు తీసుకొచ్చి పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. భూములు, ఇళ్ల కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకొని.. ఇచ్చిన మాట ప్రకారం 112 మందికి నియామక పత్రాలు అందజేసినట్టు భట్టి తెలిపారు.

ప్రీ వెడ్డింగ్ షూట్.. | 'గిరిజన పల్లె' ముస్తాబు..

భద్రాచలంలోని గిరిజన మ్యూజియం ప్రాంగణంలో ఆదివాసీ జీవితాన్ని ప్రతిబింబించే థీమ్‌తో సెట్

ఆదివాసీ సంప్రదాయ దుస్తులు, కొమ్ముకోయ తలపాగ, వాయిద్యాలు.. ఇలా గిరిజన పల్లెను ప్రతిబింబించే థీమ్‌తో భద్రా చలంలోని గిరిజన మ్యూజియం ప్రాంగణంలో ఓ సెట్ రూపుదిద్దుకుంటోంది. హంగూ ఆర్భాటాలకు దూరంగా పూర్తిగా ఆదివాసీల జీవితాన్ని పరిచయం చేయబోతున్నారు. నిర్మాణ దశలో ఉండగానే ఈ పల్లెకు ఆదరణ వస్తున్న నేపథ్యంలో మరిన్ని సదుపాయాల కల్పనకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గిరిజన సంస్కృతికి ప్రాచుర్యం కల్పించడమే ప్రధాన లక్ష్యం కావడంతో నామమాత్రపు రుసుముతోనే పర్యాటకులు, ఫొటో, ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు వచ్చే వారికి ప్రవేశం కల్పించనున్నారు. భద్రాచలంలో సీతారాముల దర్శనానికి వచ్చే భక్తులకు గోదావరి తీర ప్రాంత గిరిజన సంప్రదాయాలను పరిచయం చేయాలనే ఆలోచనతోనే శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం వచ్చే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ మ్యూజియం, గిరిజన పల్లెను ప్రారంభించేలా ఐటీడీఏ పీఓ రాహుల్ నేతృత్వాన ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



ఐటీడీఏ గిరిజన మ్యూజియం ఆవరణలో పల్లె సెట్

ముక్కోటితో మొదలు

జనవరిలో భద్రాచలంలో జరిగిన ముక్కోటి సందర్భంగా 'ఏరు'పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా గడ్డి గుడిసెలు, మంచె, మట్టి ఇళ్ల నమూనాలను ఐటీడీఏ క్యాంపస్‌లో ఉన్న ట్రైబల్ మ్యూజియం ఆవరణలో నిర్మించారు. భద్రాచలం వచ్చిన భక్తులను ఈ గడ్డి గుడిసెలు ఆకట్టుకున్నాయి. వీటి ఫొటోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యాయి. దీంతో ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న గిరిజన మ్యూజియాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు.

గిరిజన మ్యూజియం ఆవరణలో పిల్లల కోసం ప్రత్యేకంగా బోటింగ్, ప్లే ఏరియా, యువకుల కోసం బాక్స్ క్రికెట్, శాండ్ వాలీబాల్, ఆర్చరీ గేమ్, ఓపెన్ జిమ్‌లు నిర్మించారు. ఆదివాసీ రుచుల నుంచి చైనీస్ వంటకాలతో కూడిన ఫుడ్ కోర్టు కూడా రెడీ చేశారు. మరోవైపు మ్యూజియాన్ని గిరిజనుల పండుగలు, వేటలో ఉపయోగించే ఆయుధాలు, ఇళ్లలో వినియోగించే పనిముట్లు, కళాకృతులు, వాయిద్యాల థీమ్‌లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వెరసి మూడు నెలల్లోనే గిరిజన మ్యూజియం 'మినీ స్టూడియో'గా మారిపోయింది.

ఆబాల గోపాలం

ఓవైపు నిర్మాణ పనులు జరుగుతుండగానే.. ప్రీ వెడ్డింగ్ షూట్ కోసం కాబోయే వధూవరులు, బర్త్‌డే పార్టీల కోసం గ్రూపులు గ్రూపులుగా స్థానికులు ఇక్కడికి రావడం మొదలైంది. ఈ నేపథ్యంలోనే వెడ్డింగ్ షూట్ నిర్వహించుకునేలా మరిన్ని సదుపాయాలు జత చేయాలని నిర్ణయించారు. ఇక గిరిజన మ్యూజియం చూడాలనుకునే విద్యార్థుల కోసం స్కూలు మొత్తానికి కేవలం రూ.500 ఎంట్రీ ఫీజుగా నిర్ణయించారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో పల్లె సెట్

వరంగల్ నుంచి పుష్-పుల్ రైలు నడపండి

కేంద్రమంత్రికి ఎంపీ కావ్య విజ్ఞప్తి



కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కావ్య

సాక్షి, న్యూఢిల్లీ: వరంగల్ నుంచి హైదరాబాద్ వరకు పుష్-పుల్ రైలు సర్వీసును ప్రారంభించాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రికి.. వరంగల్ ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. పుష్-పుల్ రైలు అందుబాటులోకి వస్తే.. వేలాదిమంది ప్రయాణికులకు లబ్ధి చేకూరుతుందని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో రైల్వే మంత్రిని ఆయన కార్యాలయంలో ఎంపీ కావ్య కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం రైలు బోగీల సంఖ్యను కూడా పెంచాలని కోరారు. కాజీపేట లోకో రన్నింగ్ డిపో ఉద్యోగుల తరలింపు, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ తదితర అంశాలను పరిష్కరించాలని కోరారు. అందుకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు కావ్య తెలిపారు.

అధికారం కోసం అడ్డదారులొద్దు

- మోదీ సర్కారు ఎన్ని ప్రభుత్వాలను కూల్చిందో తెలుసు
- బీజేపీ అసలు స్వరూపాన్ని జనం అర్థం చేసుకుంటున్నారు
- ఎర్రవల్లిలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలతో మాజీ సీఎం కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో కేటీఆర్, సబిత, మాగంటి గోపీనాథ్

సాక్షి, హైదరాబాద్: ప్రజలు మెచ్చి అధికారం ఇవ్వాల్సిందే తప్ప..దాని కోసం అడ్డదారులు తొక్కాల్సిన అవసరం తమకు లేదని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. రాజకీయంగా నైతిక విలువలు పాటిస్తూ ప్రజలతో మమేకమైతే మరో మూడేళ్లలో అధికారం మళ్లీ బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ మహాసభ ఏర్పాట్లకు సంబంధించి శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ ముఖ్యనేతలతో జరిగిన ఈ భేటీలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాల్గొన్నారు. 'బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో పాటు కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను సంప్రదిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. కానీ ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం లేదు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అడ్డదారిలో ఎన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చి అధికారంలోకి వచ్చారో చాట్ జీపీటీ, గూగుల్‌లో వెతికినా తెలుస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైంది. కొందరు అవగాహన రాహిత్యంతో బీజేపీ మెరుగవుతుందని అనుకుంటున్నారు. కానీ ఆ పార్టీ క్రమంగా బలహీనమవుతోంది. అబద్ధాలను ప్రచారం చేసి ఎక్కువ కాలం అధికారంలో కొనసాగుతానని బీజేపీ భ్రమపడింది. వాపును చూసి బలుపు అనుకున్న బీజేపీ అసలు స్వరూపాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు' అని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

ప్రతిష్టాత్మకంగా జన సమీకరణ

ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగే బహిరంగ సభకు దూరాభారాన్ని దృష్టిలో పెట్టుకుంటూ జన సమీకరణపై దృష్టి పెట్టాలని పార్టీ నేతలను కేసీఆర్ ఆదేశించారు. సమావేశంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌రావు, వాణిదేవి, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ముఠా గోపాల్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్‌లతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. మాజీ ఎంపీ జోగినపల్లి సంతోశ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, పార్టీ నేత కల్వకుంట్ల వంశీధర్‌రావు ఎర్రవల్లిలో జరుగుతున్న సమావేశాలను సమన్వయం చేస్తున్నారు.

ధారూరులో రేషన్ దుకాణాల తనిఖీ



ధారూరులో రేషన్ షాపు వద్ద మహిళతో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్స్ జిల్లా అధికారి మోహన్‌బాబు

సాక్షి ఎఫెక్ట్

ధారూరు: 'సన్నబియ్యం డీలర్లకు శఠగోపం'శీర్షికతో శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. పౌర సరఫరాల కార్పొరేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ సూర్యనారాయణ వికారాబాద్ జిల్లా ధారూరు మండల కేంద్రంలోని రేషన్ దుకాణం-1లో తనిఖీలు నిర్వహించారు. పలు బియ్యం సంచులను తూకం వేయించగా.. అందులో ఒక్కటి మినహా ప్రతీ సంచిలోనూ బియ్యం తక్కువగా ఉండటాన్ని గమనించారు. కేవలం ఒక్క సంచిలో మాత్రమే 50 కిలోల 25 గ్రాములు వచ్చాయి. కొత్తగా వచ్చిన సన్నబియ్యం స్టాక్‌లో ఎన్ని కిలోలు తక్కువగా వచ్చాయని డీలర్ జ్ఞానేశ్వర్‌ను ఎస్పీ ప్రశ్నించగా.. క్వింటాల్ వరకు తరుగు ఉంటుందని చెప్పారు. ఇదిలా ఉండగా సివిల్ సప్లయ్స్ జిల్లా అధికారి మోహన్‌బాబు ధారూరు రేషన్ షాపులో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బియ్యం తరుగు వస్తోందని డీలర్లు ఆయనతో చెప్పారు.

సమూల మార్పుతోనే 'హరిత విప్లవం' సాధ్యం

- పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి
- ప్రారంభమైన తెలంగాణ తొలి విత్తన పండుగ



మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి

కడ్తాల్: స్థానిక విత్తనమే కేంద్రంగా..రైతే లక్ష్యంగా వ్యవసాయంలో సమూల మార్పులతోనే నిజమైన హరితవిప్లవం సాధ్యమని ప్రముఖ పర్యావరణవేత్త, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లిలోని ఎర్త్ సెంటర్‌లో శుక్రవారం తెలంగాణ తొలి విత్తన పండుగ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, ఎన్ఐఆర్‌డీ మాజీ డైరెక్టర్ జనరల్ రాంపుల్లారెడ్డి, ప్రముఖ సీడ్ కన్జర్వేటర్, పద్మశ్రీ రైమటి గురియా, కొండాలక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ రాజిరెడ్డి, పబ్లిక్ పాలసీ నిపుణులు దొంతి నర్సింహారెడ్డి, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ నిర్వాహకులు జాకబ్ నెల్లితనమ్, సమాచారహక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కౌన్సిల్ ఫర్ గ్రీన్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, సీజీఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డి అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ ఇకపై హరిత విప్లవమే అందరికీ రక్ష అన్నారు. అన్వేశ్‌రెడ్డి మాట్లాడుతూ రసాయనాలు వాడిన పంటలతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. విత్తన పండుగలో 52 స్టాల్స్ ఏర్పాటు చేసి, వివిధ రకాల దేశీ విత్తన ఉత్పత్తులను ప్రదర్శించారు.

ఈఏపీ సెట్‌కు తగ్గిన దరఖాస్తులు

- ముగిసిన ఆన్‌లైన్ దరఖాస్తు గడువు
- 2.91 లక్షల మంది నుంచి వచ్చిన దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈఏపీ సెట్)కు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు శుక్రవారంతో ముగిసింది. అపరాధ రుసుముతో ఈ నెల 24 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇప్పటివరకూ 2,91,965 దరఖాస్తులు వచ్చినట్టు సెట్ కో-కన్వీనర్, జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ ప్రొఫెసర్ విజయకుమార్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. ఇంజనీరింగ్‌లో 2,10,567, అగ్రి, ఫార్మా విభాగానికి 81,172, అలాగే ఇంజనీరింగ్, అగ్రి.. ఈరెండు విభాగాలకు 226 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఈసారి స్థానిక కోటాను ఎత్తివేయడంతో సెట్‌కు దరఖాస్తులు తగ్గాయి. గత ఏడాదితో పోలిస్తే 62,838 దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగంలో గత ఏడాది 2,54,543 దరఖాస్తులు వస్తే, ఈసారి మాత్రం 2,10,567 వచ్చాయి. ఏపీ స్థానికత గల విద్యార్థులు 15 శాతం స్థానికేతర కోటా కింద దరఖాస్తు చేసే వెసులుబాటును ఈ సంవత్సరం నుంచి ఎత్తివేశారు.

పెరిగిన 'సీతారామ' అంచనా వ్యయం

రూ.19,400 కోట్లకు ఆమోదం

సాక్షి, హైదరాబాద్: సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన అంచనాలకు ఆమోద ముద్ర పడింది. మొదట్లో రూ.13,057.98 కోట్లకు సవరించగా, ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో మళ్లీ సవరణ అంచనాల ప్రతిపాదనలు రాగా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో ప్యాకేజీల వారీగా ప్రతీ కాంపోనెంట్‌ను పరిశీలించి, నిర్ణయం తీసుకునే బాధ్యతను ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు మంత్రివర్గం అప్పగించిన విషయం తెలిసిందే. ఆయన పలుదఫాలుగా దీనిపై అధికారులతో సమావేశమై... రూ.19,400 కోట్ల సవరణ అంచనాలకు ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు అంచనాలను సవరిస్తూ త్వరలోనే ప్రభుత్వం పరిపాలనాపరమైన అనుమతి ఇవ్వనుంది. ఇక కేంద్ర జలశక్తి శాఖకు చెందిన టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) కూడా త్వరలోనే ఈ ప్రాజెక్టు డీపీఆర్‌పై సమావేశం కానుంది. ఇప్పటికే డిజైన్ల పరిశీలన పూర్తయింది. ఐఐటీ ఖరగ్‌పూర్ నిపుణులతో భూకంపాల ప్రభావంపైనా అధ్యయనం పూర్తి చేశారు. ఇరిగేషన్ ప్లానింగ్‌పై కూడా కసరత్తును త్వరలోనే ముగించి... సీడబ్ల్యూసీకి నివేదించనున్నారు. దీంతో ఏకకాలంలో టీఏసీతోపాటు సవరణ అంచనాలకు పరిపాలనపరమైన అనుమతులు వెలువడే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు.

ఆ చట్టాల్లో మార్పులు చేయాల్సిందే!

విత్తన చట్టం, వ్యవసాయ మార్కెట్ చట్టాల్లో లోపాలపై ప్రభుత్వానికి రైతు కమిషన్ నివేదిక

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం అమలులో ఉన్న విత్తన చట్టం, వ్యవసాయ మార్కెట్ల చట్టాల్లో లోపాలున్నాయని రైతు సంక్షేమ కమిషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఆ చట్టాల్లో తక్షణమే మార్పులు చేయాలని, రైతాంగానికి నష్టం కలిగించే విధంగా ఉన్న అంశాలను తొలగించాలని సూచించింది. ఈ మేరకు పలు సిఫారసులు చేస్తూ రైతు కమిషన్ తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ములుగు జిల్లాలో మొక్కజొన్న విత్తనాలతో గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలపై రైతు సంక్షేమ కమిషన్ నివేదిక రూపొందించింది. శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలసిన రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భవానీరెడ్డి, భూమి సునీల్, వ్యవసాయ శాస్త్రవేత్త రామాంజనేయులు.. ఈ మేరకు నివేదికను సమర్పించారు. ఏటూరు నాగారం ఏజెన్సీ ప్రాంతంలో మొక్కజొన్న సాగుచేస్తున్న రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొన్న ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే రైతు కమిషన్ నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనా వేసింది. ఈ క్రమంలో తీసుకోవాల్సిన చర్యల గురించి సంబంధిత అధికారులకు కమిషన్ సూచనలు చేసింది. కాగా, వ్యవసాయ మార్కెట్ల చట్టంలోని కాంట్రాక్టు వ్యవసాయానికి సంబంధించిన సెక్షన్ 11ఏలో గత ప్రభుత్వం మార్పు చేసిందని, ఈ మార్పుతో కంపెనీలకు ఎలాంటి బాధ్యత లేకుండా పోయిందని కమిషన్ పేర్కొంది. ఈ సెక్షన్‌ను సవరించి 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన నిబంధనను కొనసాగించాలని సూచించింది. అలాగే మహారాష్ట్ర ప్రభుత్వం చేసినట్లుగా విత్తన చట్టం సవరించి, నకిలీ విత్తనాల అమ్మకాలపై కఠినచర్యలు తీసుకోవాలని పేర్కొంది.

టారిఫ్‌పై మళ్లీ తూచ్



- భారత్‌పై 27 కాదు, 26 శాతమే
- మరోసారి సవరించిన అమెరికా

న్యూఢిల్లీ: 26 శాతం. కాదు 27. కాదు, కాదు... 26 శాతమే! భారత్‌పై విధించిన ప్రతీకార సుంకాల టారిఫ్ విషయంలో అమెరికా వరుస పిల్లిమొగ్గలివి. జనమే ఉండని అంటార్కిటికాతో పాటు ప్రపంచ దేశాలన్నింటినీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఎడాపెడా టారిఫ్‌లతో బాదేయడం తెలిసిందే. వైట్‌హౌస్ రూపొందించిన టారిఫ్‌ల చార్టును చేతిలో పట్టుకుని మరీ ఒక్కో దేశంపై టారిఫ్‌లను ప్రకటించారాయన. అమెరికాలోకి ప్రవేశించే ప్రతి ఉత్పత్తిపైనా 10 శాతం సుంకాలు విధిస్తున్నట్టు పేర్కొన్నారు. భారత్‌పై 26 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ఆ సందర్భంగా ట్రంప్ వెల్లడించారు. ''భారత్ మాపై ఏకంగా 52 శాతం సుంకాలు విధిస్తోంది. అందులో సగం మాత్రమే మేం వసూలు చేయబోతున్నాం. ఆ లెక్కన చూస్తే మేమిప్పటికీ ఉదారంగానే వ్యవహరిస్తున్నట్టే'' అని చెప్పుకున్నారు. కానీ మర్నాటికల్లా వాటిని 27 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. భారత్‌తో పాటు మొత్తం 14 దేశాలపై ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌లను వైట్‌హౌస్ గురువారం సవరించింది. ఆ మేరకు అనుబంధ ప్రకటన విడుదల చేసింది. అయితే శుక్రవారానికల్లా మళ్లీ కథ మొదటికి వచ్చింది. భారత్‌పై టారిఫ్‌ను అమెరికా తిరిగి 26 శాతానికి తగ్గించేసింది. తాజాగా విడుదల చేసిన ప్రకటనలో వైట్‌హౌస్ ఈ మేరకు పేర్కొంది. ఈ సుంకాలు ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి రానున్నాయి. భారత్ విషయంలో ఈ 'ఒక్క శాతం' తడబాటుపై ఆర్థిక నిపుణులు ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. టారిఫ్‌ల విధింపు విషయంలో బహుశా ట్రంప్, ఆయన యంత్రాంగంలో నెలకొన్న తీవ్ర అయోమయానికి ఇది నిదర్శనమని వారంటున్నారు. ఈ దుందుడుకు టారిఫ్‌లు అంతిమంగా అమెరికా పుట్టినే ముంచుతాయని ఇంటా బయటా జోరుగా విశ్లేషణలు వెల్లువెత్తుతుండటం తెలిసిందే. బయటికి బెదిరింపు స్వరం వినిపిస్తున్నా, ఆ విశ్లేషణల ప్రభావం ట్రంప్ టీమ్‌పై బాగానే పడుతున్నట్టు కనిపిస్తోంది.

ఇదిగో 'ట్రంప్'కార్డు



- కొత్త లుక్కుతో గోల్డ్‌కార్డు
- మీడియాకు చూపిన ట్రంప్
- వేదికైన ఎయిర్‌ఫోర్స్‌వన్

వాషింగ్టన్: అమెరికా అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గోల్డ్ కార్డు తాలూకు కొత్త లుక్కును అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విడుదల చేశారు. గురువారం ఎయిర్‌ఫోర్స్‌వన్ విమానంలో ప్రయాణిస్తూ దాన్ని మీడియాతో పంచుకున్నారు. ''ఇదేమిటో తెలుసా? గోల్డ్ కార్డు. ట్రంప్ కార్డు. ఐదు మిలియన్ డాలర్లకే దీన్ని సొంతం చేసుకోవచ్చు'' అని చెప్పుకొచ్చారు. ట్రంప్‌కార్డు తొలి కొనుగోలుదారు ఎవరని మీడియా ప్రశ్నించగా, 'నేనే'నంటూ అధ్యక్షుడు బదులిచ్చారు. కొత్త కార్డును రెండు వారాల్లో విడుదల చేయనున్నట్టు వెల్లడించారు. ట్రంప్‌కార్డును పేరుకు తగ్గట్టే బంగారు రంగులో రూపొందించారు. కార్డులో ఎడమవైపు దాదాపుగా సగం మేరకు ట్రంప్ ఫొటో ఆక్రమించింది. ఆ పక్కనే చుట్టూ చుక్కల నడుమ 'ద ట్రంప్ కార్డ్' అని రాసుంది. కింద ట్రంప్ సంతకం, 5,000,000 సంఖ్య ఉన్నాయి. కార్డు విలువ 50 లక్షల డాలర్లని చెప్పేలా ఎడమవైపున పైన, కింద 5ఎం అని రాసుంది. విదేశీ సంపన్నులకు అమెరికాలో శాశ్వత నివాసానికి, అంతిమంగా పౌరసత్వానికి వీలు కల్పించేలా ఈ గోల్డ్‌కార్డును రూపొందించడం తెలిసిందే. ఈబీ-5 వీసా స్థానంలో కొద్దివారాల క్రితమే దాన్ని తీసుకొచ్చారు. ఇటీవల ఒక్క రోజులోనే ఏకంగా వెయ్యి గోల్డ్ కార్డులు అమ్ముడైనట్టు అమెరికా ప్రకటించింది కూడా. తర్వాత దాని పేరును ట్రంప్ కార్డుగా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. అమెరికన్ల కోరిక మేరకే ఈ మార్పు చేసినట్టు ట్రంప్ చెప్పుకున్నారు.

బిమ్స్‌టెక్ బలోపేతానికి 21 సూత్రాలు

బ్యాంకాక్ సదస్సులో మోదీ
- సభ్యదేశాలతో యూపీఐ అనుసంధానం
- స్థానిక కరెన్సీల్లోనే వ్యాపారాలు
- ఏటా 300 మందికి భారత్‌లో శిక్షణ
- బ్యాంకాక్ విజన్–2030కు ఆమోదం

బ్యాంకాక్: భారత యూపీఐ చెల్లింపుల వ్యవస్థను బిమ్స్‌టెక్ సభ్యదేశాల చెల్లింపుల వ్యవస్థలతో అనుసంధానిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. తద్వారా వ్యాపారం, వాణిజ్యంతో పాటు పర్యాటక రంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా 'బిమ్స్‌టెక్ చాంబర్ ఆఫ్ కామర్స్' ఏర్పాటును ప్రతిపాదించారు. ఈ మేరకు 21 సూత్రాల కార్యాచరణ ప్రణాళికను ఆయన తెరపైకి తెచ్చారు. శుక్రవారం థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో బహుళ రంగాల సాంకేతిక, ఆర్థిక సహకార కార్యక్రమం(బిమ్స్‌టెక్) సదస్సులో మోదీ ప్రసంగించారు. ప్రపంచ శాంతి, సౌభాగ్యానికి కూటమి ముఖ్యమైన వేదిక అన్నారు. ''భాగస్వామ్య దేశాల మధ్య సహకారం, అనుబంధం బలపడాలి. ఇందుకు 21 సూత్రాల ప్రణాళికను అమలు చేద్దాం. అందులో భాగంగా బిమ్స్‌టెక్ ఫర్ ఆర్గనైజ్డ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇనిషియేటివ్ (బోధి) ఏర్పాటు చేద్దాం. దీనికింద ఏటా సభ్యదేశాలకు చెందిన 300 మంది యువతకు భారత్‌లో శిక్షణ ఇస్తాం. సామర్థ్య నిర్మాణంలో ప్రపంచ దేశాలకు ఆదర్శ నమూనాగా నిలిచే సత్తా మన కూటమికి ఉంది. ఒకరి అనుభవాల నుంచి మరొకరు నేర్చుకుంటూ ఎదుగుదాం. డిజిటల్ ప్రజా సదుపాయాల (డీపీఐ) విషయంలో అనుభవాలు పంచుకుందాం. ఐటీ రంగ శక్తిసామర్థ్యాల సాయంతో బిమ్స్‌టెక్‌ను సాంకేతికంగా బలోపేతం చేసుకుందాం. బిమ్స్‌టెక్ చాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా ఏటా వ్యాపార సదస్సులు నిర్వహిద్దాం. స్థానిక కరెన్సీల్లోనే వ్యాపారాలు చేద్దాం'' అని పిలుపునిచ్చారు. సదస్సులో థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్, శ్రీలంక, భూటాన్ దేశాల అధినేతలు పాల్గొన్నారు. మారిటైమ్ ట్రాన్స్‌పోర్టు అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారు. బంగాళాఖాతంలో శాంతి, సౌభాగ్యం, భద్రత, సుస్థిరతే లక్ష్యంగా 'బ్యాంకాక్ విజన్–2030'ను ఆమోదించారు.

బిమ్స్‌టెక్ దేశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ఇటీవలి భూకంపంలో మయన్మార్, థాయ్‌లాండ్‌ల్లో వేలాది మంది మరణించడం పట్ల మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ''విపత్తుల నిర్వహణ విషయంలో అంతా కలిసి పనిచేయాల్సిన అవసరముంది. ఇందుకు భారత్‌లో బిమ్స్‌టెక్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఫర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సస్టెయినబుల్ మారిటైమ్ ట్రాన్స్‌పోర్టు సెంటర్ నెలకొల్పుదాం. బిమ్స్‌టెక్ దేశాలకు మానవ వనరుల శిక్షణ నిమిత్తం గ్రౌండ్ స్టేషన్లు ఏర్పాటు చేద్దాం. ఫారెస్టు రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాతో పాటు నలందా యూనివర్సిటీలో బిమ్స్‌టెక్ దేశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తాం. కూటమి దేశాల మధ్య ఎలక్ట్రిక్ గ్రిడ్ ఇంటర్‌కనెక్షన్ పనులను వేగవంతం చేద్దాం. ఈ ఏడాది బిమ్స్‌టెక్ యూత్ లీడర్ల సదస్సు నిర్వహించనున్నాం. 2027లో తొలి బిమ్స్‌టెక్ క్రీడలు నిర్వహిద్దాం'' అని సూచించారు.



వాట్ ఫో ఆలయాన్ని దర్శించుకున్న మోదీ

ప్రధాని మోదీ బ్యాంకాక్‌లో వాట్ ఫో బౌద్ధ ఆలయాన్ని దర్శించుకున్నారు. 46 మీటర్ల పొడవైన బుద్ధుడి విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట థాయ్‌లాండ్ ప్రధానమంత్రి షినవత్ర సైతం ఉన్నారు. అశోక స్తంభం నమూనాను మోదీ వాట్ ఫో ఆలయానికి బహూకరించారు. భారత్, థాయ్‌లాండ్ మధ్య ప్రాచీన కాలం నుంచి సంబంధాలు ఉన్నాయని మోదీ గుర్తుచేశారు.

నేపాల్‌తో సంబంధాలకు ప్రాధాన్యం

నేపాల్ ప్రధాని కె.పి.శర్మ ఓలీతో మోదీ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక బంధాలను బలోపేతం చేసుకోవాలని నిర్ణయానికొచ్చారు. ఓలీతో ఫలవంతమైన చర్చ జరిగిందని మోదీ వెల్లడించారు. నేపాల్‌తో సంబంధాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. మయన్మార్ సైనిక ప్రభుత్వాధినేత జనరల్ మిన్ ఆంగ్ లైంగ్‌తో మోదీ భేటీ అయ్యారు. భూకంపం నుంచి కోలుకోవడానికి సాయమందిస్తామని చెప్పారు. మయన్మార్‌లో సంఘర్షణలకు తెరపడాలంటే ప్రజాస్వామిక విధానంలో సజావుగా ఎన్నికలు జరగాలని స్పష్టం చేశారు. థాయ్‌లాండ్ రాజు మహా వాజిరాలాంగ్‌కాన్ దంపతులతో మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ద్వైపాక్షిక బంధాన్ని పటిష్టం చేసుకోవడంపై చర్చించారు. సారనాథ్ బౌద్ధ స్థూపం నమూనాను థాయ్‌లాండ్ రాజుకు మోదీ అందజేశారు.

మోదీ శ్రీలంక పర్యటన ప్రారంభం

థాయ్‌లాండ్‌లో మోదీ రెండు రోజుల పర్యటన శుక్రవారం ముగిసింది. అనంతరం ఆయన శ్రీలంక చేరుకున్నారు. అక్కడ మూడు రోజులపాటు పర్యటిస్తారు. అధ్యక్షుడు అనూర కుమార దిసనాయకేతో సమావేశమవుతారు. మోదీ చివరిసారిగా 2019లో శ్రీలంకలో పర్యటించారు. 2015 తర్వాత ఆయన శ్రీలంకలో పర్యటిస్తుండడం ఇది నాలుగోసారి.

అంతకు మించి...!

అమెరికాపై 34 శాతం సుంకాలు ● దెబ్బకు దెబ్బ తీసిన చైనా

- అదనంగా మరిన్ని ప్రతీకార చర్యలు
- పలు అమెరికా సంస్థలపై ఆంక్షలు
- అమెరికాకు ఖనిజ ఎగుమతులు బంద్
- రక్షణ, కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ పరిశ్రమలకు దెబ్బ
- తక్షణం అమల్లోకి వస్తాయన్న డ్రాగన్ దేశం
- ఇది తొండాట: ట్రంప్
- తప్పుడు నిర్ణయాలంటూ ధ్వజం

బీజింగ్: తెంపరి ట్రంప్ తెర తీసిన టారిఫ్‌ల యుద్ధం అప్పుడే ముదురు పాకాన పడుతోంది. అమెరికా అధ్యక్షుని సుంకాల బాదుడుపై ప్రపంచ దేశాలు దీటుగా స్పందిస్తున్నాయి. అమెరికా ఆటో ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్టు కెనడా గురువారమే ప్రకటించడం తెలిసిందే. శుక్రవారం చైనా కూడా అదే బాట పట్టింది. అమెరికాపై 34 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్టు చైనా ఆర్థిక శాఖ ప్రకటించింది. అగ్ర రాజ్యపు ఉత్పత్తులపై ఇప్పటికే అమల్లో ఉన్న సుంకాలకు ఇవి అదనం. తమ నుంచి చైనా ఏకంగా 54 శాతం సుంకాలు వసూలు చేస్తోందని ట్రంప్ బుధవారం ఆక్షేపించడం తెలిసిందే. అందుకే ఆ దేశంపై 34 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. అవి ఏప్రిల్ 10 నుంచి అమల్లోకి రానున్నాయి. ఆలోపే అమెరికాపై తానూ అంతే మొత్తం సుంకాలు విధించడం ద్వారా డ్రాగన్ దేశం దెబ్బకు దెబ్బ తీసింది. టారిఫ్ పోరులో తగ్గేదే లేదని స్పష్టం చేసింది. అంతటితో ఆగలేదు! అమెరికాకు అత్యవసరమైన పలు అరుదైన ఖనిజాల ఎగుమతులపైనా నియంత్రణలు ప్రకటించింది. సమారియం, గాడోలినియం, టెర్బియం, డైస్ప్రోరియం, లుటేటియం, స్కాండియం, ఇత్రియం వంటి పలు ఖనిజాలు ఈ జాబితాలో ఉన్నాయి. చైనా నిర్ణయంతో అమెరికా రక్షణ, కంప్యూటర్, స్మార్ట్ ఫోన్ పరిశ్రమలు తీవ్రంగా ప్రభావితం కానున్నాయి. ఆయా ఖనిజాల కోసం చైనా దిగుమతులపైనే భారీగా ఆధారపడుతుండటమే ఇందుకు కారణం. వీటికి తోడు 16 అమెరికా కంపెనీలకు పలు 'డ్యుయల్ యూజ్' వస్తువుల ఎగుమతులను పూర్తిగా నిలిపేయాలని కూడా చైనా నిర్ణయించింది. చైనాకు ఎలాంటి ఎగుమతులూ చేయకుండా మరో ఆరు అమెరికా కంపెనీలపై నిషేధం విధించింది. అమెరికా, భారత్ నుంచి దిగుమతైన మెడికల్ సీటీ ట్యూబులపై యాంటీ డంపింగ్ దర్యాప్తు ప్రారంభిస్తున్నట్టు పేర్కొంది. తాజా సుంకాలు, ఖనిజ ఎగుమతులపై ఆంక్షలు ఏప్రిల్ 4 నుంచే అమల్లోకి రానున్నట్టు చైనా ప్రకటించింది. దీనిపై ట్రంప్ మండిపడ్డారు. ''చైనాది తొండాట. మా దెబ్బతో వారు గాభరా పడిపోయారు. దాంతో చేయకూడని పనులు చేస్తున్నారు'' అంటూ ఆక్షేపించారు. అయితే తన నిర్ణయాలు, విధానాలు మారబోవని కుండబద్దలు కొట్టారు. ఈ మేరకు తన సోషల్‌మీడియా హ్యాండిల్ ట్రూత్‌లో పోస్టులు పెట్టారు.

డబ్ల్యూటీఓలో చైనా దావా

చైనాపై ట్రంప్ ఇప్పటికే 20 శాతం సుంకాలు విధించడం తెలిసిందే. బుధవారం నాటి వడ్డింపులతో అవి ఏకంగా 54 శాతానికి 64 శాతానికి చేరాయి. దీనిపై చైనా తాజాగా ప్రపంచ వాణిజ్య సంస్థలో దావా వేసింది.

కేరళలో సీపీఎంకు ఎదురుదెబ్బ

సీఎం విజయన్ కుమార్తెపై విచారణకు కేంద్రం అనుమతి


విజయన్ కుమార్తె వీణ

న్యూఢిల్లీ: కేరళలో అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అక్రమ చెల్లింపుల కేసులో ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె వీణపై విచారణకు కేంద్రం అనుమతి ఇచ్చింది. కొచ్చిన్ మినరల్స్ (సీఎంఆర్‌ఎల్) నుంచి అక్రమ చెల్లింపుల కేసులో ఆమె ప్రాసిక్యూషన్కు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఆమోదం తెలిపింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్‌ఎఫ్‌ఐఓ) కొచ్చిలోని ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసిన నేపథ్యంలో ఈ క్లియరెన్స్ లభించింది. వీణ, ఆమె సంస్థ ఎక్సలాజిక్ సొల్యూషన్స్ సీఎంఆర్‌ఎల్ నుంచి రూ .2.73 కోట్లు పొందారు. ఈ చెల్లింపులు మోసపూరితమైనవని, అసమంజసమైనవని ఎస్‌ఎఫ్‌ఐఓ పేర్కొంది. వీణతో పాటు 25 మందిని నిందితులుగా పేర్కొంది. 2017–2020 మధ్య ఎలాంటి సేవలు అందించకున్నా సీఎంఆర్‌ఎల్ నుంచి ఎక్సలాజిక్ రూ.1.72 కోట్లు అందుకున్నట్లు 2023 ఆగస్టు 8న వార్తలొచ్చాయి. అలా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఎస్‌ఎఫ్‌ఐఓను కేంద్ర ఆదేశించింది. నేరం రుజువైతే వీణకు ఆర్నెల్ల నుంచి పదేళ్ల దాకా జైలు శిక్ష, మూడు రెట్లు జరిమానా పడవచ్చు.


మైనార్టీలకు భద్రత కల్పించండి

- వారిని వేధింపులకు గురిచేసిన వారిని శిక్షించండి
- అక్రమ చొరబాట్లపై కఠినంగా వ్యవహరించండి
- బంగ్లాదేశ్ ప్రభుత్వాధినేత యూనస్‌కు మోదీ హితవు
- బ్యాంకాక్‌లో నేతల భేటీ
- ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ

బ్యాంకాక్: బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులు కొనసాగుతుండడం పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన ఈ అంశాన్ని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ దృష్టికి తీసుకెళ్లారు. హిందువులతోపాటు మైనార్టీలందరికీ తగిన భద్రత కల్పించాలని హితవు పలికారు. మైనార్టీలపై వేధింపులకు సంబంధించిన కేసుల్లో సమగ్ర విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని సూచించారు. శుక్రవారం థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో బిమ్స్‌టెక్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని మోదీ, యూనస్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రజాస్వామ్య, సుస్థిర, శాంతియుత, ప్రగతిశీల బంగ్లాదేశ్‌కు తమ మద్దతు ఉంటుందని మోదీ ఈ సందర్భంగా యూనస్‌కు హామీ ఇచ్చారు. గత ఏడాది ఆగస్టులో బంగ్లాదేశ్ ప్రధానమంత్రి పదవి నుంచి షేక్ హసీనా పదవిచ్యుతురాలైన తర్వాత ప్రధాన సలహాదారు హోదాలో అధికార పగ్గాలు చేపట్టిన యూనస్‌తో మోదీ సమావేశం కావడం ఇదే మొదటిసారి. భారత్-బంగ్లాదేశ్ ద్వైపాక్షిక సంబంధాలపై వారు చర్చించుకున్నారు. సరిహద్దుల్లో అక్రమ చొరబాట్ల అంశాన్ని కూడా మోదీ లేవనెత్తారు. అక్రమ చొరబాట్లపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టంచేశారు. ప్రస్తుతం భారత్‌లో ప్రవాసంలో ఉన్న షేక్ హసీనాను తమకు అప్పగించాలని మోదీని మొహమ్మద్ యూనస్ కోరారు. భారత్‌లో ఉంటూ బంగ్లాదేశ్ ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారంటూ షేక్ హసీనా తీరుపై యూనస్ అభ్యంతరం వ్యక్తంచేశారు. మోదీ–యూనస్ భేటీ నిర్మాణాత్మకంగా, ఫలవంతంగా జరిగినట్లు యూనస్ ప్రెస్ సెక్రెటరీ వెల్లడించారు. ఇరు దేశాలకు సంబంధించిన అంశాలపై వారు మాట్లాడుకున్నారని తెలిపారు. షేక్ హసీనా అప్పగింతతో పాటు ఆమె చేస్తున్న వ్యాఖ్యలను మోదీ వద్ద యూనస్ ప్రత్యేకంగా ప్రస్తావించారని పేర్కొన్నారు. గంగా నది జలాల పంపిణీ అంశంపైనా చర్చ జరిగిందని వివరించారు. ఇదిలా ఉండగా, భేటీ తర్వాత మోదీ, యూనస్ నవ్వుతూ ఫొటోలకు పోజులిచ్చారు. 2015 నాటి ఫొటోను మోదీకి యూనస్ బహూకరించారు. ఇది 2015లో జరిగిన 102వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో యూనస్‌కు మోదీ గోల్డ్ మెడల్ ప్రదానం చేసిన ఫొటో కావడం విశేషం.



బ్యాంకాక్‌లో యూనస్‌తో ప్రధాని మోదీ

వక్ఫ్ బిల్లుపై సుప్రీంకు ఒవైసీ



న్యూఢిల్లీ: పార్లమెంట్ తాజాగా ఆమోదం తెలిపిన వక్ఫ్(సవరణ)బిల్లు చట్టబద్ధతను ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ బిల్లు తీవ్ర వివక్షాపూరితం, రాజ్యాంగ వ్యతిరేకమంటూ శుక్రవారం వేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రతిపాదిత చట్టం ద్వారా ముస్లింలకున్న మతపరమైన స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తూ వక్ఫ్ ఆస్తులు, నిర్వహణపై ఏకపక్షంగా ఆంక్షలు విధించారని ఒవైసీ తెలిపారు. ఇతర మతాలకు సంబంధించిన ఆస్తులపై లేని ఆంక్షలను విధిస్తూ ముస్లిం సమాజంపై వివక్ష చూపారని ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15కు మాత్రమే కాదు, ఇస్లామిక్ చట్టానికీ వ్యతిరేకమన్నారు. ఈ బిల్లు చట్ట రూపం దాల్చితే వక్ఫ్ ఆస్తులపై నియంత్రణ అధికారం వక్ఫ్‌బోర్డులకు బదులుగా జిల్లా కలెక్టర్లకు దఖలు పడుతుందని తెలిపారు. హిందు, జైన, సిక్కు మతపరమైన, దాతృత్వ సంస్థల జోలికి పోకుండా కేవలం వక్ఫ్ ఆస్తులకున్న చట్టపరమైన రక్షణలను ఈ బిల్లు ద్వారా కేంద్రం తొలగించిందని, ఇది ముస్లింలపై తీవ్రమైన వివక్ష చూపడం, రాజ్యాంగ వ్యతిరేకమని ఒవైసీ ఆక్షేపించారు. మెజారిటీల దౌర్జన్యాల నుంచి రాజ్యాంగంలోని మూడో భాగంలో మైనారిటీలకు కల్పించిన హక్కులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థదేనని ఒవైసీ తెలిపారు.

నీట్ వ్యతిరేక బిల్లుకు కేంద్రం నో: స్టాలిన్



చెన్నై: నీట్ నుంచి తమిళనాడును మినహాయించాలంటూ కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిరస్కరించారని సీఎం ఎంకే స్టాలిన్ తెలిపారు. ఈ పరిణామాన్ని సమాఖ్య విధానంలో చీకటి అధ్యాయంగా ఆయన అభివర్ణించారు. స్టాలిన్ శుక్రవారం అసెంబ్లీలో ఈ విషయం తెలిపారు. తమిళ ప్రజల ఆకాంక్షలను కేంద్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నీట్ నుంచి రాష్ట్రాన్ని మినహాయించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ అంశంపై చర్చించేందుకు ఈ నెల 9వ తేదీన శాసనసభా పక్ష నేతలతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సీఎం ప్రకటనపై ప్రతిపక్ష ఏఐఏడీఎంకే చీఫ్ పళనిస్వామి స్పందిస్తూ.. నీట్‌ను రద్దు చేస్తామంటూ 2021లో అధికారంలోకి వచ్చిన డీఎంకే ఇప్పటికీ ఆ హామీని అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. ఇంకా ఎంతకాలం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తారంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు.

ద్వారకకు కాలినడకన అనంత్ అంబానీ



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అత్యంత సంపన్నుడైన రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ ద్వారకకు పాదయాత్ర చేపట్టారు. ఆధ్యాత్మిక భావాలు కలిగిన అనంత్ తన 30వ పుట్టినరోజును దేశంలోని పవిత్ర నగరాల్లో ఒకటైన ద్వారకలో జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు. అక్కడికి కాలినడకన చేరుకోనున్నారు. తమ పూర్వీకుల స్వస్థలమైన గుజరాత్‌లోని జామ్‌నగర్ నుంచి ద్వారకకు 170 కి.మీ. మేర ఆయన పాదయాత్రగా వెళ్తున్నారు. మార్చి 29న అనంత్ పాదయాత్రను ప్రారంభించారు. రోజూ 20 కి.మీ. మేర 7 గంటల పాటు నడక సాగిస్తున్నారు. ఈ నెల 8వ తేదీన తన పుట్టిన రోజుకు ముందు అనంత్ ద్వారకకు చేరుకుని ద్వారకాధీశుడి ఆశీస్సులు అందుకుంటారు. ఈ పాదయాత్రలో పలువురు ఆయనకు సంఘీభావంగా కొంతదూరం పాటు నడిచారు. ఈ సందర్భంగా కొంత మంది ద్వారకాధీశుడి చిత్రాలను అనంత్‌కు బహూకరించారు. అనంత్ పాదయాత్ర పొడవునా హనుమాన్ చాలీసా, సుందరకాండ, దేవీ స్తోత్రం పఠిస్తూనే ఉన్నారు. కుషింగ్ సిండ్రోమ్ అనే అరుదైన హార్మోన్ల రుగ్మత, స్థూలకాయం, ఉబ్బసం తదితరాలతో బాధపడుతున్నా.. 170 కి.మీ. దూరం నడుస్తుండటం విశేషంగా నిలిచింది. సనాతన భక్తుడైన అనంత్.. బద్రీనాథ్, కేదార్‌నాథ్, కామాఖ్య, నాథ్‌ద్వారా, కాశీ ఘాట్ వంటి ప్రఖ్యాత ఆధ్యాత్మిక క్షేత్రాలను తరచూ సందర్శిస్తుంటారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో వన్‌తారా పేరుతో సమగ్ర జంతు సంరక్షణ, పునరావాస కేంద్రాన్ని కూడా అనంత్ అంబానీ నిర్మించడం తెలిసిందే. ప్రధాని మోదీ దాన్ని ఇటీవలే ప్రారంభించారు.

పార్లమెంట్ నిరవధిక వాయిదా

- సోనియా గాంధీ వ్యాఖ్యలపై చివరి రోజు బీజేపీ నిరసన
- క్షమాపణ చెప్పాలని డిమాండ్
- సోనియా వ్యాఖ్యలు దురదృష్టకరమన్న ఓం బిర్లా

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. ఈ ఏడాది జనవరి 31వ తేదీన ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. వక్ఫ్(సవరణ) బిల్లును ఉద్దేశించి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో శుక్రవారం దుమారం రేగింది. ఈ బిల్లు ముమ్మాటికీ రాజ్యాంగంపై దాడేనని, బిల్లును లోక్‌సభలో బుల్డోజ్ చేశారు అంటూ సోనియా చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సోనియా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ... సోనియా గాంధీ వ్యాఖ్యలు దురదృష్టకరం, సభ గౌరవానికి విరుద్ధం అని పేర్కొన్నారు. దీంతో విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమెరికా టారిఫ్‌లపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓంబిర్లా మధ్యాహ్నం 12 గంటల వరకు సభను వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత స్పీకర్ తన ముగింపు వ్యాఖ్యలను చదివారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో 173 మంది, కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో 169 మంది సభ్యులు పాల్గొన్నారని తెలిపారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో మొత్తం 16 బిల్లులు ఆమోదించినట్లు, సభ ఉత్పాదకత 118 శాతానికి పెరిగినట్లు ప్రకటించారు. సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు.

రాజ్యసభలో రెండో సుదీర్ఘ భేటీ

ఈ సెషన్‌లో రాజ్యసభ మొత్తంగా 119 గంటలపాటు పని చేసిందని, ఉత్పాదకత 119 శాతానికి పెరిగిందని ఎగువ సభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ చెప్పారు. సభలో రికార్డు స్థాయిలో 49 మంది సభ్యులు ప్రైవేటు మెంబర్ బిల్లులు ప్రవేశపెట్టారని వివరించారు. వక్ఫ్(సవరణ) బిల్లుపై చర్చ సందర్భంగా రాజ్యసభ గురువారం ఉదయం 11 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 4.02 గంటల వరకు విరామం లేకుండా సుదీర్ఘంగా సమావేశమైందని, ఇదొక రికార్డు అని అన్నారు. పార్లమెంటరీ రికార్డుల ప్రకారం.. రాజ్యసభలో ఇది రెండో సుదీర్ఘ భేటీ. మొదటి సుదీర్ఘ భేటీ 1981 సెప్టెంబర్ 18న జరిగింది. అప్పట్లోసభ మరుసటి రోజు తెల్లవారుజామున 4.43 గంటల వరకు కొనసాగింది. అత్యవసర సేవల నిర్వహణ బిల్లు–1981పై రాజ్యసభలో సుదీర్ఘంగా చర్చించారు. ఇదిలా ఉండగా, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను ధ్రువీకరిస్తూ రాజ్యసభలో ఒక తీర్మానాన్ని శుక్రవారం ఆమోదించారు. పార్టీలకు అతీతంగా సభ్యులంతా ఈ తీర్మానానికి ఆమోదం తెలిపారు. మణిపూర్‌లో ఘర్షణకు తెరదించడమే లక్ష్యంగా రెండు ముఖ్యమైన తెగల మధ్య సమావేశం త్వరలో జరగబోతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలో వెల్లడించారు. ఢిల్లీలో ఈ భేటీ జరుగుతుందన్నారు.

'ఎలక్టోరల్ బాండ్ల' తీర్పుపై సమీక్షకు సుప్రీం నో

న్యూఢిల్లీ: 2018నాటి ఎలక్టోరల్ బాండ్ పథకం ద్వారా రాజకీయ పార్టీలు అందుకున్న రూ.16,518 కోట్లను జప్తు చేయాలన్న పిటిషన్లను తిరస్కరిస్తూ ఇచ్చిన తీర్పుపై సమీక్ష చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ మేరకు ఖేమ్ సింగ్ భాటి అనే వ్యక్తి వేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం కొట్టివేసింది. ఇందుకు సంబంధించిన పెండింగ్ పిటిషన్లను సైతం తిరస్కరిస్తూ మార్చి 26వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది ఫిబ్రవరిలో అప్పటి సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని రద్దు చేయడం తెల్సిందే. ఎలక్టోరల్ బాండ్ల పథకంపై సుప్రీంకోర్టు సారథ్యంలో విచారణ జరపాలని, ఆ నిధులను జప్తు చేయాలంటూ గతేడాది ఆగస్టులో భాటి సహా పలువురు వేసిన పిటిషన్లు సైతం తిరస్కరణకు గురయ్యాయి.

గాజాపై మళ్లీ దాడులు..17 మంది మృతి

ఖాన్ యూనిస్: గాజాలోని దక్షిణ ప్రాంత ఖాన్ యూనిస్ నగరంపై ఇజ్రాయెల్ బలగాలు శుక్రవారం జరిపిన దాడిలో 17 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. భవనాల శిథిలాల కింద చిక్కుకుపోయిన వారి కోసం స్థానికులు గాలిస్తున్నారు. హమాస్‌ను కట్టడి చేసేందుకు మరో సెక్యూరిటీ జోన్ ఏర్పాటు చేయాలని నెతన్యాహూ ప్రభుత్వం పథక రచన చేసింది. ఇందులో భాగంగా పాలస్తీనియన్లను నివాసాలు వదిలి వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. వారిని భయభ్రాంతులకు గురిచేసేలా దాడులకు పాల్పడుతోంది. అక్కడే ఉన్నవారిని వెళ్లగొట్టేందుకు ఇజ్రాయెల్ బలగాలు శుక్రవారం ఆ ప్రాంతంలోకి ప్రవేశించాయి. గాజాలోని వేర్వేరు ప్రాంతాలపై గురువారం ఇజ్రాయెల్ చేపట్టిన భారీ వైమానిక దాడుల్లో 14 మంది చిన్నారులు కనీసం 100 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 70 మంది తీవ్రంగా గాయపడ్డారని, మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని పేర్కొంది.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 5 । ఏప్రిల్ । 2025



సేంద్రియ సాగులో కలిసి నడుద్దాం

సేంద్రియ సాగు వైపు దృష్టి సారించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 'ప్రకృతి–సేంద్రియ రైతు సమ్మేళనం'లో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. -8లో



కళాత్మక వేదిక..

నగరంలో ప్రతిష్టాత్మక 'ఇండియా ఆర్ట్ ఫెస్టివల్' (ఐఏఎఫ్) ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 6 వరకు కొనసాగనున్న ఈ ఫెస్టివల్‌లో ప్రముఖ ఆర్టిస్టులు పాల్గొంటున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0/23.0

నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 35, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

అధ్యక్షుడే లక్ష్యంగా..

- బీజేపీలో రచ్చకెక్కిన అంతర్గత పోరు
- మరోసారి రాజాసింగ్ ఘాటు వ్యాఖ్యలు



సాక్షి, సిటీబ్యూరో: మహా నగర బీజేపీలో అంతర్గత పోరు చినికి చినికి గాలివానగా మారుతోంది. గత ఎన్నికల ముందు నుంచి బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే రాజాసింగ్ సొంత పార్టీ నేతలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సందర్భం వచ్చినపుడల్లా ఘాటు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లా అధ్యక్షుల ఎన్నికలో తన నియోజకవర్గ పరిధిలో.. తనకు తెలియకుండా అధ్యక్షులను ప్రకటించడంపై తీవ్రంగా మండిపడిన రాజాసింగ్.. ఈ దఫా హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతం రావు పేరును ఖరారు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో ఎంతో మంది పార్టీకి నమ్మకంగా పని చేస్తున్న వారు ఉండగా, మీ నియోజకవర్గంలోని వ్యక్తులకు మాత్రమే పదవులు వస్తున్నాయని, మీకు గులాంగిరీ చేసేవారికి మాత్రమే పదవులు ఇస్తారా? అంటూ ఏకంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడినే లక్ష్యంగా చేసుకుంటూ వీడియో రిలీజ్ చేశారు. తనకు పోటీగా శోభాయాత్ర చేయాలని ప్రయత్నిస్తున్నారని తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం



లక్డీకాపూల్: నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా నీటి సరఫరా పథకం ఫేజు – 2లో భాగంగా పటాన్‌చెరు నుంచి హైదర్ నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు ఆర్‌సీపురం, ఫాదర్ స్కూల్, ఓల్డ్ ముంబై రోడ్డు.. ఈ రెండు చోట్ల భారీ లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీలు అరికట్టడానికి మరమ్మతు పనులు చేపట్టనున్నారు. దీంతో నగరంలోని పలు డివిజన్ల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. అంతరాయం ఏర్పడే ప్రాంతాలు ఇవీ.. ఓఅండ్ఎం డివిజన్ – 6, ఎర్రగడ్డ, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్ (లోప్రెజర్‌తో నీటి సరఫరా). ఓఅండ్ఎం డివిజన్ – 8 : హాఫ్ టేక్ పాయింట్లు, బల్క్ కనెక్షన్లు. ఓఅండ్ఎం డివిజన్ – 9: కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి, భాగ్యనగర్ కాలనీ, వసంత్ నగర్. అలాగే.. ఓఅండ్ఎం డివిజన్ – 15 : ఆర్సీపురం, అశోక్ నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, దీప్తిశ్రీ నగర్, మదీనాగూడ, మియాపూర్. ఓఅండ్ఎం డివిజన్ – 24 : బీరంగూడ, అమీన్‌పూర్, బొల్లారంలలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని జలమండలి అధికారులు సూచించారు.



శ్రీరామ నవమికి వేళాయే!

శ్రీరామ నవమి పర్వదినానికి సర్వం సిద్ధమైంది. ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువగా జరగనుంది. ఈ సందర్భంగా జానకీరాముల విగ్రహాల విక్రయాలు ఊపందుకోనున్నాయి. ఉప్పల్ సమీపంలోని రహదారి పక్కన సీతారాములతో పాటు లక్ష్మణ, హనుమాన్ ప్రతిమలను అమ్మకానికి సిద్ధంగా పెట్టారు.

బలం మజ్లిస్‌దే!

- హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక
- రసవత్తరంగా మారిన రాజకీయం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక రసవత్తరంగా మారింది. ఎన్నికల్లో ఓటర్ల (కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు) బలం ఎంఐఎం (మజ్లిస్)కే ఎక్కువగా ఉన్నందున ఆ పార్టీ అభ్యర్థి గెలవడం నల్లేరు మీద నడకేనని, ఆ లెక్కన మిగతా పార్టీలేవీ కూడా తమ అభ్యర్థిని కూడా బరిలో దింపకుండా ఎన్నిక ఏకగ్రీవమే కాగలదని ఇప్పటిదాకా అందరూ భావించారు. నామినేషన్ల చివరి రోజున ఊహించని విధంగా బీజేపీ కూడా తమ అభ్యర్థిని బరిలో దింపడంతో పోలింగ్ నాటికి ఏం జరగనుందన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్నికల్లో తమ పార్టీకి బలం లేదన్నది బీజేపీకి తెలియనిది కాదు.. అయినా రంగంలోకి దిగిందంటే లోపాయికారీగా ఏదో జరుగుతోందన్న ప్రచారానికి తావిచ్చింది. జీహెచ్ఎంసీలో 25 అసెంబ్లీ నియోజకవర్గాలు, 150 వార్డులున్నప్పటికీ, ఈ 'స్థానిక'



అయినా బరిలో బీజేపీ..

ఎన్నికల్లో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు, 81 కార్పొరేటర్ల డివిజన్లు మాత్రమే ఉన్నాయి. దీంతో పాటు ఈ స్థానిక సంస్థలో ఓటేసేందుకు ఎంపిక చేసుకున్న ఎమ్మెల్సీలు, ఎంపీలు సైతం ఉన్నారు. ఈ ఎన్నికకు సంబంధించి ఓటర్లుగా బీజేపీ నుంచి తాజాగా ఒక రాజ్యసభ సభ్యుడు డా. కె.లక్ష్మణ్, ఇద్దరు ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలు చేరారు. ఓటర్లుగా చేరేందుకు ఇక ఎవరికీ అవకాశం లేదు. గడువు ముగిసిపోయింది.

రాబోయే మేయర్ స్థానంపై అవగాహనతో..?

ఇటీవల కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీలుగా ఎన్నికైన విజయశాంతి, అద్దంకి దయాకర్, బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన దాసోజు శ్రవణ్ ఇంకా ప్రమాణం చేయనందున వారు ఓటర్లు కాలేదని సమాచారం. తాజా సమాచారం మేరకు సైతం అన్ని పార్టీల కంటే ఎంఐఎంకే ఎక్కువ బలం ఉంది. ఆ పార్టీకి చెందిన ఓటర్లు 49 మంది ఉన్నారు. ఇక తర్వాత స్థానాల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లు ఉన్నాయి. కాంగ్రెస్ ఎలాగూ తమ అభ్యర్థిని బరిలోకి దింపదని, ఎంఐఎంకు మద్దతునిస్తుందని, రాబోయే జీహెచ్ఎంసీ మేయర్ స్థానాన్ని సైతం దృష్టిలో ఉంచుకొని ఈ అవగాహనకు వచ్చినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా.. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం తమ అభ్యర్థిని బరిలో దించకుండా కాంగ్రెస్‌కు మద్దతిచ్చినట్లుగానే అందరూ భావిస్తున్నారు.

విశ్వసనీయంగా తెలిసిన తాజా సమాచారం మేరకు ఆయా పార్టీల బలాబలాలు

పార్టీ	కార్పొరేటర్లు	ఎమ్మెల్యేలు	ఎమ్మెల్సీలు	ఎంపీలు	మొత్తం
కాంగ్రెస్	07	02	03	01	13
బీఆర్ఎస్	15	05	01	03	24
ఎంఐఎం	40	07	01	01	49
బీజేపీ	19	01	01	04	25
టీజేఎస్	-	-	01	-	01
మొత్తం	81	15	07	09	112

మద్దతు కూడగట్టే ధీమాలో బీజేపీ..

మారుతున్న రాజకీయ పరిస్థితులతో ఎంఐఎంతో పోరాడి గెలిచేందుకు తాము ఇతర పార్టీల మద్దతు కూడగట్టగలమనే ధీమాలో బీజేపీ ఉన్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి కార్పొరేటర్లు, ఎమ్మెల్యేల ఎన్నికలప్పుడు ఒక పార్టీలో ఉండి ఇప్పుడు వేరే పార్టీలో చేరిన వారు కూడా ఎందరో ఉన్నారు. వారిలో ఎందరు ఇప్పుడు తాముంటున్న పార్టీ అభ్యర్థికే ఓటు వేస్తారో చెప్పలేని పరిస్థితి. దాంతో కాంగ్రెస్ మద్దతిచ్చే ఎంఐఎంకు ఎందరు ఓటు వేస్తారో కూడా చెప్పలేమంటున్నారు. మరోవైపు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారు తమపై పెత్తనం చెలాయిస్తున్నారనే అభిప్రాయం కాంగ్రెస్ కార్పొరేటర్లలో ఉంది. వాస్తవానికి కార్పొరేటర్ ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్‌నుంచి ఇద్దరు కార్పొరేటర్లు మాత్రమే గెలిచినప్పటికీ, వారీ ఎన్నికలో ఓటర్లు కారు. ఇక కార్పొరేటర్లలో.. బీఆర్ఎస్ నుంచి వచ్చిన కార్పొరేటర్లే కాంగ్రెస్ ఓటర్లుగా ఉన్నారు. ఇలా వివిధ అంశాలు, వ్యక్తిగత పరిచయాలు, అభిమానాలు, తదితరమైన వాటితో తాము బలంగా పోటీనివ్వగలమన్న ధీమాతోనే బీజేపీ బరిలో దిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వైఖరి ఏమిటన్నది కూడా ఆసక్తిగా మారింది. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ వేటికవిగా మిగతా రెండూ ఒకటేనని ఆరోపిస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏం జరగనుంది? బీఆర్ఎస్ ఎటు మొగ్గుచూపనుంది? కాంగ్రెస్, బీజేపీలు ఏం చేయనున్నాయి? అనేది కూడా ఆసక్తికరంగా మారింది.

ప్లాట్లలోనే పడిగాపులు!

ఎల్ఆర్ఎస్‌పై నీటిపారుదల, వ్యవసాయ అధికారుల అలసత్వం

- తమకు కుదిరినప్పుడే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తామంటూ పేచీలు
- ఫీజులపై ఉన్న శ్రద్ధ ప్రొసీడింగుల్లో లేదంటున్న దరఖాస్తుదారులు

సాక్షి, సిటీబ్యూరో: హిమాయత్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి సంగారెడ్డి జిల్లా కోత్లాపూర్‌లో పదేళ్ల క్రితం నాలుగు వందల చదరపు గజాల స్థలం కొనుగోలు చేశారు. 2020లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా ఫీజు చెల్లించాలని నోటీస్ వచ్చింది. కానీ.. ఆ స్థలం చెరువుకు దగ్గరలో ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు నీటిపారుదల, రెవెన్యూ అధికారుల అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఎల్ఆర్ఎస్ నిబంధనల ప్రకారం కూడా ఇప్పుడు రెవెన్యూ, నీటిపారుదల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే హెచ్ఎండీఏ నుంచి ప్రొసీడింగులు లభిస్తాయి. కానీ.. రెవెన్యూ, నీటిపారుదల అధికారుల కోసం ఎదురు చూస్తూ సదరు వ్యక్తి తన స్థలం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఏదో ఒకరోజు వస్తామని అధికారులు చెబుతున్నారు. ఏ రోజు వస్తారో తెలియక సదరు వ్యక్తి నిత్యం హిమాయత్‌నగర్ నుంచి కోత్లాపూర్‌కు, సంగారెడ్డికి తిరగాల్సి వస్తోంది. ఇది ఒక్క కోత్లాపూర్‌కు చెందిన బాధితుడి సమస్య మాత్రమే కాదు. చాలామంది దరఖాస్తుదారులు నీటిపారుదల, రెవెన్యూ అధికారుల అలసత్వం కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పొడిగించినప్పటికీ సాంకేతిక చిక్కులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫీజులు చెల్లించాలా.. వద్దా..?

- చెరువులు, కుంటలు తదితర నీటి వనరులకు 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు రెవెన్యూ, నీటిపారుదల శాఖల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. ఎల్ఆర్ఎస్ ఫీజు నోటీసు అందుకున్నవారు ఫీజు చెల్లించేందుకు వెసులుబాటు ఉంది. క్షేత్రస్థాయి తనిఖీల్లో ఆ స్థలం నీటి వనరులను ఆనుకొని ఉన్నట్లు తేలితే చెల్లించిన ఫీజును తిరిగి దరఖాస్తుదారుల ఖాతాలో జమ చేస్తారు. కాగా.. ప్రాసెసింగ్ పేరిట 10 శాతం వసూలు చేస్తారు. దీంతో చాలామంది ముందస్తుగా ఫీజులు చెల్లించేందుకు వెనకడుగు వేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేసిన తరువాతనే ఫీజు చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాల మధ్య సమన్వయ లోపం తదితర కారణాలతో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది.
- నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మధ్యతరగతి వర్గాలు శివారు ప్రాంతాల్లో స్థలాలు కొనుగోలు చేశారు. అలాగే.. వివిధ జిల్లాలకు చెందినవారు సైతం నగరానికి చేరువలో సొంత స్థలాలను కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఘట్‌కేసర్, పోచారం, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో స్థలాలను కొనిపెట్టుకున్నారు. ఇలా వివిధ చోట్ల కొనుగోలు చేసిన వాళ్లంతా అటు అధికారుల చుట్టూ, ఇటు తమ స్థలాల వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ప్రొసీడింగులు లభిస్తాయో లేదోననే సందేహంతో ఫీజులు చెల్లించేందుకు వెనకడుగు వేస్తున్నారు. హెచ్ఎండీఏ కార్యాలయంతో పాటు పలు మున్సిపల్ కార్యాలయాలకు బాధితులు బారులు తీరుతున్నారు. ఎల్–1, ఎల్–2 స్థాయిలోనే ఆటంకాలు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు.

సర్వర్ల డౌన్‌తో అవస్థలు..

సాంకేతిక కష్టాలు అధికారులను సైతం వదలడం లేదు. తరచూ సర్వర్లు డౌన్ కావడంతో అకస్మాత్తుగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియ స్తంభించిపోతోంది. తిరిగి ఆన్‌లైన్ సేవలను పునరుద్ధరించేవరకు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. 'ఒక్కో జోన్‌లో నలుగు రైదుగురు టెక్నికల్ సిబ్బంది పని చేస్తున్నప్పటికీ రోజుకు 40 ఫైళ్లు కూడా పరిష్కరించలేకపోతున్నాం' అని ఒక అధికారి తెలిపారు. సర్వర్ డౌన్ కావడంతో గంటకోసారి 'ఎర్రర్' వచ్చేసి పనులు నిలిచిపోతున్నాయని పేర్కొన్నారు. హెచ్ఎండీఏలో సుమారు 3.44 లక్షల దరఖాస్తులు ఉండగా.. ఇప్పటి వరకు 40 వేలుకూడా పూర్తి కాకపోవడం గమనార్హం. ఎల్ఆర్ఎస్ ఫీజుల రూపంలో హెచ్ఎండీఏకు రూ.1,500 కోట్లు వస్తాయని అంచనా. కాగా.. ఇప్పటి వరకు రూ.120 కోట్ల ఆదాయం కూడా లభించలేదు.



మైనరూ.. తగ్గాలి జోరు

డ్రైవింగ్ చేస్తూ చిక్కితే వాహనం ఆర్సీ సస్పెండ్

- వీరికి 25 ఏళ్లు నిండే వరకు లైసెన్సు ఇవ్వరు
- ఎంవీ యాక్ట్‌లోని సెక్షన్ 199 (ఎ) వినియోగం
- కీలక నిర్ణయం తీసుకున్న సిటీ ట్రాఫిక్ చీఫ్
- నేటి నుంచి నగర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్



సాక్షి, సిటీబ్యూరో: పద్నాలుగేళ్ల పిల్లాడు పాఠశాలకు ద్విచక్ర వాహనంపై వస్తుంటాడు.. పదహారేళ్ల కుర్రాడు జూనియర్ కాలేజీకి స్పోర్ట్స్ బైక్ తెస్తాడు.. పదిహేడేళ్ల యువకుడు కళాశాలకు హైస్పీడ్ వాహనం లేదా కారులో రాకపోకలు సాగిస్తాడు.. నగరంలో నిత్యం కనిపించే దృశ్యాలివి. ఇలాంటి మైనర్లు నగరంలో అనేక మంది అమాయకులను బలి తీసుకోవడంతో పాటు వాళ్లూ ప్రాణాలు కోల్పోతున్నారు. మైనర్లకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండదని, వాళ్లు వాహనం నడుపకూడదని తల్లిదండ్రులు, కుటుంబీకులు సహా అందరికీ తెలుసు. అయితే ఎవరూ పక్కాగా పట్టించుకోవట్లేదు. ఈ పరిస్థితులన్నీ పరిగణనలోకి తీసుకున్న సిటీ ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ కీలక నిర్ణయం తీసుకున్నారు. డ్రైవింగ్ చేస్తూ మైనర్లు చిక్కితే ఆ వాహనం రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయనున్నారు. దీనికి సంబంధించిన స్పెషల్ డ్రైవ్ శనివారం నుంచి ప్రారంభమవుతుందని శుక్రవారం ఆయన ప్రకటించారు.

కఠిన చట్టాలు లేకపోవడం వల్లే..

- ప్రస్తుతం అమలులో ఉన్న మోటారు వెహికిల్ యాక్ట్ ప్రకారం మైనర్లకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండే అవకాశం లేదు. కొన్ని పాశ్చాత్య దేశాల్లో మాదిరి ఇక్కడ కఠిన చట్టాలు లేకపోవడంతోనే మైనర్లు వాహనాలపై విజృంభిస్తున్నారు. అక్కడ మైనర్లు డ్రైవింగ్ చేస్తూ వస్తే వారితో పాటు తల్లిదండ్రులకూ జరిమానా విధిస్తారు. ఆ జరిమానాలు భారీ స్థాయిలో ఉండటం, మూడు ఉల్లంఘనలకు మించితే తల్లిదండ్రుల లైసెన్స్ పూర్తిగా రద్దు వంటి కఠిన చర్యలు ఉంటాయి. ఇక్కడ అంతటి కఠిన చట్టాలు లేకపోయినా.. ఇప్పటి వరకు అధికారులు ఎంవీ యాక్ట్‌లోని సెక్షన్ 180 ప్రకారం ఓ మైనర్ కానీ, డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తి కానీ వాహనం నడిపితే... అతడితో పాటు వారికి వాహనం అందించిన దాని యజమానికీ జరిమానా విధిస్తున్నారు.
- ఇక నుంచి ఆ చట్టంలోని 199 (ఎ) సెక్షన్‌ను వినియోగించాలని జోయల్ డెవిస్ నిర్ణయించారు. ఈ సెక్షన్ ప్రకారం వాహనం నడుపుతూ చిక్కిన మైనర్‌కు జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఆ వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ) ఏడాది పాటు సస్పెండ్ అవుతుంది. సాధారణంగా 18 ఏళ్లు నిండిన వ్యక్తి మొదట లెర్నింగ్ లైసెన్స్, ఆపై శాశ్వత లైసెన్స్ తీసుకోవచ్చు. అయితే డ్రైవింగ్ చేస్తూ చిక్కిన మైనర్‌కు మాత్రం 25 ఏళ్ల నిండే వరకు ఈ రెండింటిలో ఏదీ తీసుకోవడానికి అవకాశం ఉండదు. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఎవ్వరూ మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని జోయల్ డెవిస్ కోరుతున్నారు. ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు సహకరిస్తూ రోడ్డు ప్రమాదాలు, అందులో మృతుల్ని తగ్గించడంతో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.



మైనర్ డ్రైవింగ్ కేసులు ఇలా...

ఏడాది	కేసులు
2022	4,218
2023	1,878
2024	2,976



ఎన్టీఆర్ నగర్‌లోని ఓ ఇంట్లోకి చేరిన జింక

లేడి.. రోడ్లపై పరుగిడి..

ఓ ఇంట్లోకి వచ్చి చేరిన జింక ❖ జూపార్క్‌కు తరలించిన అటవీ అధికారులు


గచ్చిబౌలి: రోడ్లపై పరుగులు తీసిన ఓ జింక ఎట్టకేలకు ఓ ఇంట్లోకు చేరింది. పోలీసులు, ఫారెస్ట్ అధికారుల దాన్ని జూపార్క్‌కు చేర్చారు. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఓ జింక గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్‌లో రోడ్లపై పరుగులు తీయసాగింది. దీనిని కుక్కలు వెంబడించడంతో వాటి బారి నుంచి స్థానికులు రక్షించారు. భయంతో అక్కడే ఉన్న ఓ హార్డ్‌వేర్ షాపులోకి వెళ్లింది. షాపు నిర్వాహకుడు సూరజ్.. దానికి చపాతీ తిపించారు. కొద్ది నిమిషాల అనంతరం అక్కడి నుంచి జింక పరుగుతీసి బస్తీలోకి వెళ్లింది. రాణి అనే మహిళ ఇంట్లో నుంచి కమల అనే మహిళ ఇంటి ఆవరణలోకి చేరింది. ఆ సమయంలో ఆ ఇంట్లో ఉన్న వారు పనికి వెళ్లారు. గమనించిన స్థానికులు బయటకు వెళ్లకుండా గేట్ మూశారు. విషయం తెలుసుకున్న శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు రవి కుమార్ యాదవ్ పోలీసులకు సమాచారం అందించారు. గచ్చిబౌలి పోలీసులు జింక బయటకు రాకుండా చర్యలు చేపట్టి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందిచారు. ఎఫ్ఆర్ఓ రమేష్ కుమార్, వెటర్నరీ డాక్టర్ షానవాజ్ , నెహ్రూ జూలాజికల్ సిబ్బంది రెస్క్యూ వాహనంతో వచ్చారు. మొదట వల వేసి బంధించి ఇంటి నుంచి బయటకు రప్పించాలని చూడగా వారు అనుకున్న రీతిలో జింక స్పందించలేదు. దీంతో దానికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి రెస్క్యూ వాహనంలో జూ పార్క్‌కు తరలించారు.

బెదిరి.. సమూహం నుంచి చెదిరి..

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జింకల సమూహాలు ఉన్నాయి. అవి గుంపులు గుంపులుగా ఒకచోట నుంచి మరో చోటికి వెళ్తుంటాయి. గత నాలుగు రోజులుగా కంచ గచ్చిబౌలి సర్వే నెంబర్ 25లో టీజీఐఐసీ చేపట్టిన పనుల కారణంగా జింకల సమూహాలు బెదిరి.. చెదిరిపోయి ఉంటాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జేసీబీల శబ్దాలు, చెట్ల నరికివేతతో భయంతో జింకలు కాంక్రీట్ జంగిల్‌లోకి పరుగులు తీస్తున్నాయి. జింకలు, వన్య ప్రాణుల రక్షణ కోసం తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత యూనివర్సిటీ యాజమాన్యం, ఫారెస్ట్ అధికారులపై ఉంది.

ఆహార కల్తీకి కళ్లెం

'ఫుడ్‌సేఫ్టీ' డిజిగ్నేటెడ్ అధికారులుగా జడ్‌సీలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఎన్ని తనిఖీలు జరుగుతున్నా ఆహార కల్తీ ఆగడంలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో.. తనిఖీల్లో ఉల్లంఘనలు గుర్తిస్తే లైసెన్సులు రద్దుచేయడం తదితర అధికారాలు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లకు అప్పగించారు. ఇప్పటి వరకు ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారులకు ఉన్న ఈ విధుల్ని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లకు అప్పగించారు. వారిని ఇన్‌చార్జి ఫుడ్‌సేఫ్టీ డిజిగ్నేటెడ్ అధికారులుగా నియమించారు. ఈ మేరకు ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారాల బదలాయింపు..

ఫుడ్‌సేఫ్టీకి సంబంధించిన నిబంధనల మేరకు తనిఖీల సమయంలో ఉల్లంఘనలు గుర్తిస్తే సదరు ఆహార పదార్థాల విక్రయాన్ని నిషేధించేందుకు, దుకాణాల్ని మూసివేసేందుకు, నిర్వాహకుల లైసెన్స్‌ను రద్దుచేయడానికి జడ్‌సీలకు అధికారాలు బదలాయించారు. తదుపరి ఉత్తర్వులు, ఆదేశాలు వెలువడేంత వరకు వారికే అధికారాలుంటాయి. ఆహార పదార్థాల దుకాణాలకు లైసెన్సులిచ్చే అధికారం సైతం వీరికే ఉంటుంది. తమ పరిధిలోని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు సేకరించిన ఆహార నమూనాల పరీక్షల నివేదికలు తెప్పించుకుంటారు. ఉల్లంఘనల తీవ్రతను బట్టి ప్రాసిక్యూషన్ కోసం సిఫార్సు చేస్తారు. జీహెచ్ఎంసీ అధికారులకే అధికారాలు బదలాయించడం ద్వారా త్వరితగతిన కల్తీకి కళ్లెం పడుతుందని భావిస్తున్నారు. కాగా.. ప్రస్తుతం జడ్‌సీలకున్న బాధ్యతలతోనే వారికి సమయం సరిపోవడం లేదు. అదనంగా ఈ బాధ్యతలతో ఏ మేరకు సత్వరం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ఐదుగురు జడ్‌సీలకు అధికారాలు

- జీహెచ్ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లకు సంబంధించిన అధికారాల్ని ఐదుగురు జోనల్ కమిషనర్లకు అప్పగించారు. ఏ జోనల్ కమిషనర్‌కు ఏ సర్కిళ్లో వివరాలిలా ఉన్నాయి.
- **ఎల్బీనగర్:** కాప్రా, ఉప్పల్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్, మలక్‌పేట్. **కూకట్‌పల్లి:** శేరిలింగంపల్లి, చందానగర్, ఆర్‌సీపురం–పటాన్‌చెరు, మూసాపేట్, కూకట్‌పల్లి. **సికింద్రాబాద్:** కుత్బుల్లాపూర్, గాజుల రామారం, అల్వాల్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, బేగంపేట. **చార్మినార్:** సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్. **ఖైరతాబాద్:** మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్, ముషీరాబాద్, అంబర్‌పేట్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ.

శోభాయాత్ర ఏర్పాట్లపై సీపీ సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం శోభాయాత్ర జరగనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తీసుకుంటున్న బందోబస్తు, భద్రత చర్యలపై నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ దృష్టి పెట్టారు. శుక్రవారం ఇన్‌స్పెక్టర్ ఆపై స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన ఏర్పాట్లపై సమీక్షించారు. అధికారులకు పలు కీలక సూచనలు, సలహాలు అందజేశారు. అన్ని ప్రభుత్వ విభాగాలతో సమన్వయం ఏర్పాటు చేసుకోవాలని, సిటీలోని అన్ని జోనల్ కంట్రోల్ రూమ్స్ అధికారులు, స్పెషల్ బ్రాంచ్ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. శోభాయాత్రలో జేబుదొంగతనాలు, చైన్ స్నాచింగ్స్, ఈవ్‌టీజింగ్ వంటివి లేకుండా చూడాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్వాల్‌తో పాటు అదనపు సీపీ (శాంతిభద్రతలు) విక్రమ్ సింగ్ మాన్, డీసీపీ (స్పెషల్ బ్రాంచ్) ఎస్. చైతన్య కుమార్ పాల్గొన్నారు.

నేను డీఎస్పీని..పదండి ఠాణాకు..

- ఇద్దరు యువకుల కిడ్నాప్..
- జూబ్లీహిల్స్‌లో నకిలీ పోలీసుల హల్‌చల్..

బంజారాహిల్స్: నంబర్ ప్లేట్ లేని కారుకు పోలీస్ స్టిక్కర్ తగిలించుకుని వెళ్లిన ఆగంతకులు గదిలో ఉన్న ఇద్దరు సినీ పరిశ్రమకు చెందిన యువకులను కిడ్నాప్ చేసి అచ్చంపేటకు తీసుకువెళ్లి చితకబాదిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..కడప జిల్లాకు చెందిన భూమిరెడ్డి కిషోర్‌రెడ్డి టీవీ నటులు ఇంద్రాణి, మేఘనలకు పర్సనల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. టీవీ సీరియళ్లకు డ్రైవర్‌గా పనిచేస్తున్న సందీప్‌రెడ్డి, ఓ తెలుగు ఛానల్‌లో కాస్ట్యూమర్‌గా పనిచేస్తున్న పల్లె శివ ముగ్గురూ కలిసి శ్రీకృష్ణానగర్‌లో అద్దెకు ఉంటున్నారు. అచ్చంపేట సమీపంలోని బీకే ఉప్పునూతల గ్రామానికి చెందిన శివ అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నాడు. ఇద్దరూ కలిసి నాలుగు రోజుల క్రితం పెద్దలకు చెప్పకుండా పారిపోయారు. ఈ నేపథ్యంలో ఆమె సోదరుడు సోహెల్‌తో పాటు మరో ఇద్దరు యువకులు గురువారం రాత్రి కిషోర్‌రెడ్డి గదికి వచ్చారు. తాము పోలీసులమని, శివ ఆచూకీ చెప్పాలని అతడిని చితకబాదారు. తమకు ఏమీ తెలియదని చెప్పినా వినిపించుకోకపోగా, తాము పోలీసులమంటూ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పదండి అంటూ కిషోర్, సందీప్‌లను కారులో ఎక్కించుకుని తక్కుగూడకు తీసుకెళ్లి మళ్లీ కొట్టి, ఫోన్లు లాక్కున్నారు. అక్కడి నుంచి ఉప్పునూతల గ్రామానికి తీసుకెళ్లడంతో అప్పటికే అక్కడ అప్పటికే రెండు కార్లలో సిద్ధంగా ఉన్న మరో 10 మంది యువకులతో కలిసి వారిని మరోసారి తీవ్రంగా కొట్టారు. అనంతరం బాధితులను అచ్చంపేట పోలీస్ స్టేషన్ సమీపంలో వదిలేసి వెళ్లిపోయారు. టీవీ నటి ఇంద్రాణికి కిషోర్ ఫోన్ చేసి చెప్పడంతో ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం అందించింది. బాధితులు కూడా అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విషయాన్ని చెప్పారు. జూబ్లీహిల్స్ పోలీసుల నగరానికి తిరిగి వచ్చిన కిషోర్, సందీప్ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సోహెల్, ఇబ్బూతో పాటు ప్రియురాలి పెదనాన్న, వారి బంధుమిత్రులపై కేసు నమోదు చేశారు. కిషోర్, సందీప్‌లను కిడ్నాప్ చేసింది నకిలీ పోలీసులని తేల్చారు. అమ్మాయి అడ్రస్ కనుక్కునేందుకు వారిని కిడ్నాప్ చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి గాలిస్తున్నారు. జూబ్లీహిల్స్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సికిల్ సెల్‌కు చెక్..

- సికిల్ సెల్ ఎనీమియా నియంత్రణకు సీసీఎంబీ కృషి
- 4 రాష్ట్రాల్లో ప్రాథమిక స్థాయిలో వ్యాధి గుర్తింపునకు ప్రత్యేక మిషన్
- నూతనంగా జార్ఖండ్ ప్రాజెక్టుకు టాటా ఫౌండేషన్‌తో భాగస్వామ్యం
- వివరాలు వెల్లడించిన టాటా ఫౌండేషన్ సీఈఓ, సీసీఎంబీ డైరెక్టర్



సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా సికిల్ సెల్, ఎనీమియా వ్యాధిగ్రస్తులకు సేవలందించడంతో పాటు ఈ వ్యాధి ప్రాథమిక గుర్తింపునకు నగరంలోని జాతీయ పరిశోధనా సంస్థ సీసీఎంబీ విశేషంగా కృషి చేస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డా. వినయ్‌కే.నందికూరి తెలిపారు. ఇందులో భాగంగా సీసీఎంబీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ మిషన్‌లో ప్రముఖ సంస్థ టాటా స్టీల్ ఫౌండేషన్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుంది. ఈ నేపథ్యంలో సీసీఎంబీ వేదికగా శుక్రవారం టాటా స్టీల్ ఫౌండేషన్ సీఈఓ డా.సౌరవ్ రాయ్ సమక్షంలో ఎంఓయూను ప్రకటించారు. ఈ సందర్భంగా డా. వినయ్ మాట్లాడుతూ., సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ మిషన్‌లో భాగంగా మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో ఇప్పటి వరకు 28 లక్షల మందికి పరీక్షలు చేశామన్నారు. ఇందులో 2 లక్షల మంది క్యారియర్లుగా (జన్యుపరమైన వ్యాధి కారకులు)నిర్ధారించగా, 11 వేల మంది సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రయత్నంలో టాటా స్టీల్ ఫౌండేషన్ భాగస్వామ్యం కావడం శుభపరిణామమన్నారు. జన్యుపరమైన కారణాలతో వచ్చే ఈ వ్యాధిని ముందుగా గుర్తించడంతో బాధితులకు మేలు చేయవచ్చని, వీరికి బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ చికిత్స, హైడ్రాక్సీ యూరియా మెడిసిన్ అందించడం అనే 2 అవకాశాలు న్నాయన్నారు. శాశ్వత పరిష్కారం కోసం సీఎస్ఐఆర్, ఎయిమ్స్ న్యూ ఢిల్లీతో కలిసి పరిశోధనలు చేస్తుందన్నారు. భవిష్యత్‌లో తెలుగు రాష్ట్రాల్లోనూ ఇతర భాగస్వాముల సహకారంతో ఈ సేవలను ప్రారంభించే యోచనలో ఉన్నామని, ఖమ్మం, భద్రాచలం తదితర ఆదివాసీ ప్రాంతాల్లో ఈ మిషన్ సేవల అవసరముందన్నారు.

సేంద్రియ సాగులో కలిసి నడుద్దాం

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



ఆవిష్కరణలు చేసిన వారిని సన్మానిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

శంకర్‌పల్లి: వ్యవసాయంలో రసాయనాల వాడకం మానేసి, సేంద్రియ సాగువైపు దృష్టి సారించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. గ్రామాల్లో సురాజ్యం, అభివృద్ధి, ప్రగతి రావాలని, అందుకు అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వాలు కలిసి పనిచేయాలన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో రంగారెడ్డి- వికారాబాద్ జిల్లాలకు సంబంధించి 'ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్' (ఈజీవీఎఫ్) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 'ప్రకృతి- సేంద్రియ రైతు సమ్మేళనం' కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం పలువురు తయారు చేసిన వ్యవసాయ యంత్రాలను పరిశీలించారు. రైతులకు ఉపయోగకరంగా, సులభతరంగా ఉండే వ్యవసాయ పరికరాలను తయారు చేస్తున్నందుకు వారిని సన్మానించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని రైతుల్లో చైతన్యం నింపి, వారిని సేంద్రియ వ్యవసాయం వైపు నడిపించేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. రసాయనాల వాడకంతో భూమి ఆరోగ్యం విషతుల్యం కావడంతో పాటు, మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించేందుకు ఈజీవీఎఫ్ ముందుకు రావడం అభినందనీయన్నారు. సైంటిస్టులు, పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి, నూతన ఆవిష్కరణలతో సేంద్రియ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నారు.

వ్యవసాయానికి పూర్వ వైభవం రావాలి

16, 17 శతాబ్దాల్లో భారతదేశం వ్యవసాయాధార దేశంగా ఉండేది. అప్పటి జీడీపీలో 52శాతం వ్యవసాయమే ఉండేది. ప్రస్తుతం అది 16శాతానికి పడిపోయింది. మళ్లీ వ్యవసాయానికి పూర్వ వైభవం తేవాలి. ప్రస్తుతం చాలా ప్రదేశాల్లో డ్రోన్ల ద్వారా రసాయనాలు పిచికారీ చేసే స్థాయికి రైతులు ఎదగడం అభినందనీయం. - సతీశ్‌రెడ్డి, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్

ఆవిష్కరణలకు ఊతమిచ్చాం

ఆర్మీలో చేసిన సేవలకు గాను 2005లో రాష్ట్రపతి ద్వారా విశిష్ట సేవా మెడల్‌తో సత్కారించారు.. ఆ ఏడాదిలోనే ఉద్యోగ విరమణ పొందా. రైతులకు సాయం చేయాలనే తపనతో 'పల్లె సృజన' పేరుతో సంస్థను స్థాపించాం. 2,500 పైగా జ్ఞాన పద్ధతులను డాక్యుమెంట్ చేసి, గ్రామాల్లో వెళ్లి, కొత్త ఆవిష్కరణలను కనుగొని, ప్రోటో టైపులుగా మార్చి, పేటెంట్లు పొందడం, విక్రయాల్లో తోడ్పాటు అందిస్తున్నాం. - గణేశన్, పల్లె సృజన, బ్రిగేడియర్

ఆకర్షించిన ఆసు యంత్రం

యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన చింతకింది మల్లేశం తయారు చేసిన ఆసు యంత్రం సమ్మేళనానికి వచ్చిన వారిని విశేషంగా ఆకట్టుకుంది. చేనేత కార్మికులు చీర తయారు చేసేందుకు పాత యంత్రాల మీద చేతులతో నేస్తూ, ఎంతో ఇబ్బంది పడేవారు. తన ఇంట్లో తన తల్లి పడే కష్టాన్ని చూసిన మల్లేశం ఆసు యంత్రాన్ని తయారు చేశాడు. దీంతో మనుషులు లేకుండానే ఆసు పోస్తున్నారు. పెద్ద పెద్ద డిజైన్ల చీరలకు 40 పిన్నులతో ఆసు పోసే వారని, తాను తయారు చేసిన యంత్రం ద్వారా 120 పిన్నులతో ఆసు పోసుకోవచ్చని మల్లేశం స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకారిణి సదస్సులు భాగయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఈజీవీఎఫ్ చైర్మన్ వెంకటేశ్వర రావు, పద్మశ్రీ సుభాష్‌వర్మ పాల్గొన్నారు.



ఆసుయంత్రం ఆవిష్కరణను వివరిస్తున్న చింతకింది మల్లేశం

నైపుణ్యం, అంకితభావంతోనే గుర్తింపు

గూగుల్ కంపెనీ మాజీ సీఈఓ కిరణ్‌బాబు



సర్టిఫికెట్లు అందుకున్నవారితో నిర్వాహకులు

రాయదుర్గం: కార్పొరేట్ కంపెనీలు తమ ఇంటర్వ్యూల్లో అభ్యర్థుల ఎంపికలో స్కిల్, విల్, కల్చర్‌ను చూస్తారని, యువత వీటిని అలవర్చుకుంటే ఉద్యోగాలు పొందడం సులభమని గూగుల్, డెల్ సంస్థల మాజీ సీఈఓ కిరణ్‌బాబు అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్‌ఆఫ్ ఇండియా లో ప్రైమ్ మినిస్టర్ కౌశల్ వికాస్ యోజన, స్కిల్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో జంట నగరాల్లోని విద్యార్థులకు మూడవ స్కాల్ స్నాతకోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యువతకు నైపుణ్యంతో పాటు, అంకితభావం, ఆసక్తి ఉండాలని, అప్పుడే ప్రపంచం వారికి రెడ్ కార్పెట్ వేస్తుందన్నారు. ఇందుకు గూగుల్ కంపెనీ సీఈఓ సుందర్ పిచ్చాయ్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్లను ఇందుకు నిదర్శనంగా పేర్కొన్నారు. 'డోంట్ థింక్ స్మాల్....థింగ్ బిగ్' అని విద్యార్థులు ఆలోచించాలని సూచించారు.

హైదరాబాద్‌లో వందకు పైగా ఇంక్యుబేషన్ సెంటర్లు

రాష్ట్ర ప్రభుత్వ ఐటీ సలహాదారు డాక్టర్ హఫీజ్ భాషా

స్టార్టప్‌లను ప్రారంభించే యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎదురు చూస్తున్నదని తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారు డాక్టర్ హఫీజ్ భాషా అన్నారు. హైదరాబాద్ నగరంలోనే వందకు పైగా ఇంక్యుబేషన్ సెంటర్లు ఉన్నాయని, యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఇవి దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఐఐటీ రూర్కీ కో ఫౌండర్ ప్రమోద్ ఐటీ రంగంలో వస్తున్న మార్పులపై ప్రజెంటేషన్ చేశారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జీ రామేశ్వరరావు మాట్లాడుతూ మరో 4,800 మంది విద్యార్థులకు హైదరాబాద్ నగరంలోనే కాకుండా దేశంలో గుర్తించిన మరికొన్ని నగరాల్లో కూడా తమ కాలేజ్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని తమ కాలేజీ ప్రాంగణంలోనే ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 107 మందికి స్కిల్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, మహ్మద్ సిరాజుద్దిన్, సాయికిషోర్, మోహన్, సన్వేష్‌కుమార్, పలువురు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

54 కేసుల్లో రూ.3.28 కోట్లు రిఫండ్

ఓ బాధితుడికి చెక్కు అందించిన సీపీ



సాక్షి, సిటీబ్యూరో: నగర కమిషనరేట్ పరిధిలో మార్చిలో నమోదైన సైబర్ క్రైమ్ కేసుల్లో 54 మంది బాధితులకు రూ.3.28 కోట్లు రిఫండ్ అయింది. ఫిర్యాదు వచ్చిన మరుక్షణం స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు సైబర్ నేరగాళ్ల ఖాతాల్లో ఈ మొత్తాన్ని ఫ్రీజ్ చేశారు. న్యాయస్థానం అనుమతితో ఈ మొత్తాన్ని బాధితులకు అందించారు. ఓటీపీ ఫ్రాడ్‌లో రూ.47 లక్షలు పోగొట్టుకున్న బాధితుడికి రూ.40 లక్షలు రిఫండ్‌కు సంబంధించిన చెక్కును నగర కొత్వాల్ సీవీ ఆనంద్‌శుక్రవారం అందజేశారు.

క్రికెట్ ఆడుతూ కుప్పకూలాడు

గుండెపోటుతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

సీఎంఆర్‌ఈసీ కళాశాలలో ఘటన



వినయ్ (ఫైల్)

మేడ్చల్‌రూరల్: క్రికెట్ ఆడుతూ ఓ విద్యార్థి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన కండ్లకోయలోని సీఎంఆర్‌ఈసీ కళాశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి ఖమ్మం జిల్లాకు చెందిన వినయ్ సీఎంఆర్‌ఈసీ కళాశాలతో బీటెక్ నాల్గో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం తోటి విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడేందుకు కళాశాల ఆవరణలోని గ్రౌండ్‌కు వెళ్లాడు. ఆటలో భాగంగా ఫీల్డింగ్ చేస్తున్న వినయ్ గుండపోటు రావడంతో ఒక్కసారిగా గ్రౌండ్‌లోనే కుప్పకూలాడు. తోటి విద్యార్థులు అతడిని సమీపంలోని సీఎంఆర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు వినయ్ ఖమ్మం జిల్లాకు చెందిన పేద విద్యార్థి .. తల్లిదండ్రులు రోజు కూలీ చేస్తూ తమ కుమారుడిని ఉన్నత చదువు చదివిస్తున్నట్లు తెలిసింది.

డ్రగ్స్ పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 11 లో డ్రగ్స్ విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఎక్సైజ్ ఎస్టీఎఫ్ టీమ్ అరెస్ట్ చేసింది. అతడి నుంచి 3.7 గ్రాముల ఎస్టిఫిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్‌కు చెందిన కుర్రపాటి సాయి మణికంఠ అనే యువకుడు డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిచ్చిన సమాచారం ఆధారంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న గాజుల రామారం ప్రాంతానికి చెందిన ప్రభాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

1.2 కేజీల గంజాయి పట్టివేత..

చాంద్రాయణ గుట్ట రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో ఎస్టీఎఫ్ పోలీసులు దాడి చేసి 1.2 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పి.నిఖిల్ ప్రేమ్‌కుమార్ రాజును అరెస్టు చేశారు. అతడి నుంచి రెండు మొబైల్స్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కార్పొరేటర్ వింత నిరసన



సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ భూసేకరణలో భాగంగా ఆస్తులు కోల్పోయే వారికి చెల్లించాల్సిన నష్ట పరిహారం చెల్లించనందున తన మల్కాజిగిరి డివిజన్‌లోని బాల సరస్వతీనగర్ నాలా పనులు జరగడం లేదని కార్పొరేటర్ శ్రవన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో నేలపై పడుకుని నిరసన వ్యక్తం చేశారు. ఏడాదిగా నష్టపరిహారం చెల్లించకుండా జీహెచ్ఎంసీ తాత్సారం చేస్తోందని, మళ్లీ వర్షా కాలం వస్తున్నా పనులు జరగడం లేదన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, సీసీపీ పరిహారం త్వరలో చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

బాలికపై లైంగికదాడి కేసు బదిలీ

సికింద్రాబాద్: రైలులో బాలికపై లైంగిక దాడి కేసులో విచారణ పూర్తి చేసిన సికింద్రాబాద్ రైల్వే పోలీసులు కేసును మహారాష్ట్ర, ఇత్వారి పోలీస్‌స్టేషన్‌కు తదుపరి విచారణ నిమిత్తం బదిలీ చేశారు. ఈనెల 2న రక్సెల్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ కుటుంబం నగరానికి బయలుదేరింది. 3న తెల్లవారు జామున రైలు కెల్జార్ స్టేషన్‌కు చేరుకున్న సమయంలో సదరు వ్యక్తి పెద్ద కుమార్తె (12) రైలు బోగీలోని టాయ్‌లెట్‌కు వెళ్లింది. ఆమెను అనుసరించి టాయ్‌లెట్‌లోకి దూరిన ఓ ఆగంతకుడు బాలికను బంధించి లైంగికదాడికి పాల్పడ్డాడు. అంతేకాకుండా బాలిక నగ్న వీడియోలు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. అరగంట వరకు బాలికబయటికి రాకపోవడాన్ని గుర్తించిన ఆమె తల్లితండ్రులు బాలికను బయటకు రప్పించి అసలు విషయం తెలుసుకున్నారు. నిందితుడిని పట్టుకుని పోలీస్ కంట్రోల్ రూంకు సమాచారం అందించిన బాధితురాలి తండ్రి 3న ఉదయం రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని మన్మాడ్ జిల్లా ఖజోలి గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్‌గా గుర్తించారు. అతను నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నట్లు తెలిపారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం ఇత్వారి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. నిందితుడు సంతోష్‌కుమార్‌ను కూడా అక్కడికి తరలిస్తున్నట్లు తెలిపారు.

రైలుకిందపడి నర్సు ఆత్మహత్య



లత (ఫైల్)

సికింద్రాబాద్: ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం ఒక యువతి మౌలాలి-చర్లపల్లి రైల్వేస్టేషన్ మధ్య గల రైల్వే ట్రాక్‌పైకి వచ్చింది. ఆమెను గుర్తించిన కీ మ్యాన్ వారిస్తున్నా వినకుండా మౌలాలి నుంచి చర్లపల్లి వైపు వేగంగా వస్తున్న రైలుకు ఎదురుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఘటన స్థలంలో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మృతురాలు వరంగల్ ఉర్సుకు చెందిన రవికుమార్ కుమార్తె మాదారపు లత (30)గా గుర్తించారు. హన్మకొండలోని శ్రీలక్ష్మి ఆసుపత్రిలో ఆమె నర్సుగా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మానసిక పరిస్థితి సరిగా లేదని, గతంలోనూ ఇంట్లో చెప్పకుండా మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లిందని, సమాచారం అందుకుని తాము తిరిగి ఇంటికి తీసుకు వచ్చినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటికి వచ్చిందని, చర్లపల్లి వైపు వెళుతుందని తాము ఊహించలేదన్నారు. ఇదిలా ఉండగా మృతురాలి హ్యాండ్‌బ్యాగులో లభించిన లేఖలో హిందూ సంప్రదాయం ప్రకారం తన అంత్యక్రియలు నిర్వహించాలని పేర్కొన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



సాక్షి,సిటీబ్యూరో: జర్నలిస్టుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో :ప్రెస్ క్లబ్ హైదరాబాద్- 2025 డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్‌కు ప్రస్తుత స్థలాన్ని కేటాయించాలని పాలకమండలి సభ్యులు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం తరపున ప్రెస్ క్లబ్‌కు, జర్నలిస్టులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ పాలకమండలి ఉప ముఖ్యమంత్రికి పూల మొక్కను అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎల్.వేణుగోపాలనాయుడు, ప్రధాన కార్యదర్శి ఆర్.రవికాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు కె.శ్రీకాంత్‌రావు, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్, కార్యవర్గ సభ్యులు గోపరాజు, పి.బాపు రావు, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏఐ కేంద్రంగా హైదరాబాద్

మ్యాథ్ సంస్థ సీఈఓ రాహుల్ పైత్ వెల్లడి

రాయదుర్గం: హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మ్యాథ్ సంస్థ సీఈఓ రాహుత్ పైత్ అన్నారు. శుక్రవారం ఆయన నాలెడ్జి సిటీలోని సంస్థ కార్యాలయంలో మ్యాథ్-ఏఐ, ఎంఎల్ టెక్నాలజీ హబ్ సహకారంతో 'మాయ' పేరిట రూపొందించిన ఏఐ ఆధారిత నియామకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'హైర్ ప్లస్ ప్లస్' సంస్థ అనేది మ్యాథ్ స్థాపన ఉద్దేశాన్ని ప్రతిబింబించే అద్భుతమైన ఉదాహరణగా పేర్కొన్నారు.' మాయ' అనే అధునాతన ఏఐ రిక్రూటర్ ద్వారా అభ్యర్థుల్లో రియల్ టైమ్ సంభాషణలు జరిపి, లోతైన ప్రశ్నలు అడిగి, రిక్రూటర్లకు అన్ని రకాలుగా వారిలోని నైపుణ్యాలను తెలుసుకుని నియామకం చేసే అవకాశం కలుగుతుందన్నారు. ఇది బహుభాషా ఇంటర్వ్యూలు నిర్వహించి సాంకేతిక, సాంస్కృతిక అర్హతలను ఖచ్చితంగా అంచనా వేస్తుందన్నారు. హైర్‌ప్లస్ సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ పీయూష్‌రాజ్ అఖౌరీ మాట్లాడుతూ తాము మాయ అనే ఏఐ రిక్రూటర్ ద్వారా సంస్థలకు సరైన టాలెంట్‌ను వేగంగా కనుగొనటంలో సహాయపడాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. హైర్ ప్లస్ ప్లస్ సేవలను ఉపయోగిస్తున్న సంస్థలు 63 శాతం నియామక ఉత్పాదకత, 47 శాతం సోర్సింగ్ ఖర్చు తగ్గింపు, 75 శాతం వరకు అనర్హుల తొలగింపుతో అద్భుతమైన ఫలితాలను పొందాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో మ్యాథ్, హైర్ ప్లస్‌ప్లస్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దొంగతనానికి వచ్చి.. భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి



జగద్గిరిగుట్ట : దొంగతనానికి వచ్చి ఓ వ్యక్తి భవనంపై నుంచి పడి మృతి చెందిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఆల్విన్ కాలనీ ఫేజ్ 2 లో నాగూరి శ్రీనివాస్ అనే వ్యక్తి ఇల్లు నిర్మిస్తున్నాడు. సదరు నిర్మాణం వద్ద జగద్గిరిగుట్టకు చెందిన లింగస్వామిని వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అతను భవనం మెట్ల వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు భవనం ఎదురుగా ఉన్న ఓ క్లినిక్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సదరు వ్యక్తి సెంట్రింగ్ బాక్స్‌లను అపహరించేందుకు యత్నించినట్లు గుర్తించారు. తాగిన మైకంలో ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి మృతి చెందినట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ పాటించాలి

హిమాయత్‌నగర్: కేంద్ర ప్రభుత్వం, మావోయిస్టు పార్టీ మధ్య వెంటనే కాల్పుల విరమణ పాటించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శాంతి చర్చలపై మావోయిస్టు పార్టీ ప్రకటన నేపథ్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో పీస్ డైలాగ్ కమిటీ(శాంతి చర్చల కమిటీ) ఆధ్వర్యంలో 'కేంద్ర ప్రభుత్వానికి, మావోయిస్టు పార్టీ మధ్య చర్చలు' అనే అంశంపై జస్టిస్ బి.చంద్రకుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, సాధినేని వెంకటేశ్వర్ రావు, జీవన్, గాదె ఇన్నయ్య, చంద్రశేఖర్, ప్రొఫెసర్ తిరుమల్, బాలకిషన్ రావు, తిరుపతి, ప్రొఫెసర్ వినాయకరెడ్డి, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. హరగోపాల్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. పౌర సమాజం జాగ్రత్తగా లేకపోతే ఎక్కడో ఒక చోట హింస జరగడం ఆగదని అన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తన పరిమితుల్లో పనిచేయకుండా ప్రశ్నించే వారిని హత్య చేస్తుందన్నారు.

14న ర్యాలీ

హిమాయత్‌నగర్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14న బషీర్‌బాగ్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ట్యాంక్ బండ్ 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ప్రజా విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో సూట్లు బూట్లు, బ్లూ షర్ట్స్, జై భీమ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..భారత రాజ్యాంగ రక్షణే లక్ష్యంగా ఈ ర్యాలీ ఉంటుందన్నారు. సూట్లు బూట్లు, బ్లూ షర్ట్స్, జై భీమ్ ర్యాలీ చైర్మన్‌గా డాక్టర్ మీసాల మల్లేశం, రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా అంబేడ్కర్ సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు రాములు, కన్వీనర్లుగా గజ్జెల్లి మల్లికార్జున్, డాక్టర్ బొమ్మెర స్టాలిన్, రింగు రాంబాబు, బోరెల్లి సురేష్, నక్క మహేష్, ఎర్రమల్ల మొగులయ్య, చాగంటి చంద్రశేఖర్, మారపాక సాయిలు, వరలక్ష్మి, వీరమణి, చిరుమర్తి రాజు, కోటగిరి ఉషారాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ నరేష్, జోగు గణేష్, గుర్రం కోటేష్ పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

హిమాయత్‌నగర్: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని సౌత్, ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్, నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ డీసీపీ అందే శ్రీనివాస రావు తెలిపిన వివరాల ప్రకారం నారాయణగూడ ప్రాంతంలో నివాసం ఉండే గురువిందర్ సింగ్, సర్దార్ జస్విందర్ సింగ్, కొప్పుల కార్తీక్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డారు. ఐపీఎల్ ప్రారంభం కావడంతో వికాస్, ముఖేష్ అనే మెయిన్ బూకీలతో యూజర్ ఐడీలు తీసుకొని రాధేఎక్చేంజ్ డాట్ కామ్ బెట్టింగ్‌లను నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ముగ్గురిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నగదు రూ.1,32,400, మూడు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ శ్రీనివాసరావు తెలిపారు.

ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ చోరీ

ఫిలింనగర్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ చోరీ అయిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ఫిలింనగర్‌లోని పద్మాలయా అంబేడ్కర్‌నగర్ బస్తీలో నివసించే హరీష్‌కుమార్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. గత నెల 31న తన పల్సర్ బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేసి ఆటో ర్యాపిడో బుకింగ్ కోసం వెళ్లాడు. అటు నుంచి అటే తన స్వగ్రామానికి ఆటోలో వెళ్లిపోయాడు. ఈ నెల 3న రాత్రి ఇంటికి తిరిగి వచ్చి పార్కింగ్‌లో చూడగా బైక్ కనిపించలేదు. దీంతో తన బైక్ చోరీకి గురైందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈ-బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయాలి

పంజగుట్ట: ఎకనామికల్లీ బ్యాక్‌వర్డ్ (ఈ-బీసీ) వర్గాల సంక్షేమం కోసం రాష్ట్రంలో ఈ-బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, ఈ-బీసీ కమిషన్, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ఈ-బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ జాతీయ అధ్యక్షుడు పల్లపు రెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ-బీసీల సంక్షేమం కోసం రూ.10 వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మిగిలిన వర్గాలకు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఈ-బీసీలకు వర్తింపచేయాలని, గురుకులాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ-బీసీలకు స్వయం ఉపాధి, పావలావడ్డీ రుణ సౌకర్యం కల్పించాలన్నారు. వివిధ ఓసీ కుల సంఘాల నాయకులు తోడేటి నర్సింహారెడ్డి, చందు జనార్దన్, బొడ్డు రవిశంకర్ రావు, దివాకర్ రావు, శ్రీనివాసాచార్యులు, రమణారావు పాల్గొన్నారు.

303 చోట్ల డ్రైనేజీ ఓవర్ ఫ్లో

- క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బృందాలు
- సీవరేజీ జెట్టింగ్ మిషన్లతో వ్యర్థాల తొలగింపు

24 గంటల్లోగా సమస్య పరిష్కరించాలని ఉన్నతాధికారుల ఆదేశం

బంజారాహిల్స్: అకాల వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. ప్రధాన, అంతర్గత రహదారులు జలమయమై సీవరేజీ మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కురిసిన కుండపోత వర్షంతో జలమండలి డివిజన్-6 పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో వరదనీటి కాలువలతో పాటు మురుగునీటి మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లాయి. మురుగు అంతా రోడ్ల పైకి వచ్చి వరదనీటితో కలిసి ఎక్కడికక్కడ తిష్టవేయడంతో పరిస్థితి తీవ్రతరమైంది. గురువారం కురిసిన భారీ వర్షానికి జలమండలి డివిజన్-6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, తట్టిఖానా, ఎర్రగడ్డ, బోరబండ, ఎస్పీఆర్‌హిల్స్, ఎల్లారెడ్డిగూడ, వెంగళరావునగర్, సోమాజీగూడ, ఎస్సార్‌నగర్ వాటర్ సెక్షన్ పరిధిలో 303 చోట్ల డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు ఓవర్‌ఫ్లో అవుతున్నాయని ఫిర్యాదులు అందాయి. ఇందుకోసం జలమండలి 23 సీవరేజీ క్లీనింగ్ బృందాలను ఏర్పాటు చేసింది.



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లో సీవరేజీ ఓవర్‌ఫ్లో పరిశీలిస్తున్న జలమండలి జీఎం

- గురువారం రాత్రి నుంచే ఈ బృందాలు ఓవర్‌ఫ్లో అవుతున్న మ్యాన్‌హోళ్ల వద్దకు సీవరేజీ జెట్టింగ్ మిషన్లతో చేరుకుని మ్యాన్‌హోళ్లలో ఇరుక్కున్న వ్యర్థాలను, రాళ్లను, ప్లాస్టిక్ వస్తువులను మట్టిని తొలగించాయి.
- శుక్రవారం కూడా జెట్టింగ్ మిషన్లతో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను క్లీన్ చేశారు.
- 24 గంటల్లోగా ఓవర్‌ఫ్లో అవుతున్న మ్యాన్‌హోళ్లను క్లీన్ చేసి సమస్యను పరిష్కరించాలని జలమండలి ఉన్నతాధికారులు ఆదేశించారు.
- జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్‌తో పాటు వాటర్‌వర్క్స్ సెక్షన్ మేనేజర్లు, లైన్‌మెన్లు, సీవరేజీ సిబ్బంది పూర్తిగా రోడ్ల పైకి వచ్చి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యాత్మక ప్రాంతాల్లో పరిష్కారం దిశగా చొరవ చూపారు.
- మ్యాన్‌హోళ్ల ఓవర్‌ఫ్లో కావడానికి ప్రధాన కారణం వరదనీటికి ప్లాస్టిక్ వస్తువులు, వ్యర్థాలు కొట్టుకురావడమేనని తనిఖీల్లో తేలింది.
- ఎక్కడెక్కడ ఫిర్యాదులు అందాయో ఆ ప్రాంతాలను తప్పనిసరిగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తున్నారు.
- సీవరేజీ జెట్టింగ్ మిషన్లు భారీవి వెళ్లలేని చోట్లకు మినీ జెట్టింగ్ మిషన్లను పంపిస్తున్నారు.
- పరిష్కారమైన ప్రాంతాల్లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారు.
- తొలగించిన వ్యర్థాలను, మట్టి, రాళ్లను ఎప్పటికప్పుడు అక్కడి నుంచి తరలిస్తున్నారు.

విద్యార్థులు అర్థవంతమైన చర్చలు జరపాలి

బంజారాహిల్స్: బీటెక్ చదువుతున్న యువత సామాజిక అంశాలపై చర్చించేందుకు ముందుకు రావడం అభినందనీయమని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం.4లోని రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో సీబీఐటీ విద్యార్థులు మోడల్ యూనైటెడ్ నేషన్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సీబీఐటీ కాలేజీలో చదివే విద్యార్థులు అంటే ఎంతో ట్యాలెంట్ ఉన్న విద్యార్థులు ఉంటారని ఇంత టాలెంట్ ఉన్న వారు ఉద్యోగం చేయడానికి ఆసక్తి చూపకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగేందుకు తమ ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ఐఏఎస్ అధికారిణి హరి చందన మాట్లాడుతూ..యువ విద్యార్థులు ఫ్రీడమ్ ఆఫ్ ప్రెస్, లింగవివక్షత, మహిళల హక్కులపై కూడా చర్చించాలని సూచించారు. సీబీఐటీ ప్రిన్సిపాల్ సీవీ నర్సింహులు మాట్లాడుతూ.. సీబీఐటీ నిర్వహిస్తున్న ఎంయూఎన్ 14వదని ఈ ఏడాది బడ్జెట్ అనే థీమ్‌తో విద్యార్థులు చర్చించడంతో పాటు ఆయా దేశాల్లోని వివిధ పరిస్థితులపై చర్చలు తీర్మానాలు ఉంటాయని తెలిపారు. ఈ ఎంయూఎన్‌కు క్లబ్ అధ్యక్షురాలిగా స్నికితా గోవిందు వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ వైస్ ప్రిన్సిపాల్ పి.రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంయూఎన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: ఎస్ఆర్‌టీనగర్, దుర్గానగర్ 11కెవీ ఫీడర్లు బోరబండ, ఎర్రమంజిల్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వినాయకరావునగర్, ఎస్ఆర్‌టీ మార్కెట్, భరత్‌నగర్, ఇందిరానగర్, ఫేజ్-ఏ, రాజ్‌నగర్, హైదరాబాద్ సెంట్రల్, ఠాకూర్ హరిప్రసాద్ లైన్, బజాజ్ ఎలక్ట్రానిక్స్, పంజగుట్ట మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.13, నల్లవంకాయ.18, పొడుగువంకాయ.23, బెండకాయ.35, పచ్చిమిర్చి.40, బజ్జీమిర్చి.40, క్యాప్సికం.38, పచ్చి కాకరకాయ.35, పందిరిబీర.35, క్యాబేజీ.09, క్యారెట్.17, దొండకాయ.23, గుండు బీన్సీస్.65, గింజచిక్కుడు.50, గోకరకాయ.35, కీర.13, దోసకాయ.18, బీట్‌రూట్.13, ఉల్లిగడ్డ.22, ఆలుగడ్డ.24, చామగడ్డ.40, మొరంగడ్డ.23, కందగడ్డ.60, క్యాలిఫ్లవర్ 18, సొరకాయ.09, పొట్లకాయ.18, అరిటికాయ.09, మునగకాయ.4, మామిడికాయ.37, ముల్లంగి.4-5, ఉల్లిపొరక.28. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

నేటి నుంచి కాంక్రీట్ మిల్లర్ల బంద్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ ప్రతినిధులు

పంజగుట్ట: లేబర్ కూలీల రేట్లు విపరీతంగా పెరిగినందువల్ల కాంక్రీట్ మిల్లర్ రేట్లు పెంచాలని తెలంగాణ కాంక్రీట్ మిల్లర్ ఓనర్ అండ్ లేబర్ యూనియన్ డిమాండ్ చేసింది. తగ్గుతున్న రేట్లకు నిరసనగా ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంక్రీట్ మిల్లర్ల బంద్ పాటిస్తున్నట్లు, 10న ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కాంక్రీట్ మిల్లర్ల బంద్ పోస్టర్‌ను యూనియన్ గౌరవాధ్యక్షుడు రేపల్లె కృష్ణా వాల్మీకి, చైర్మన్ వి.నాగరాజు, కన్వీనర్లు బినం గోపాల్, రవికుమార్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వంద శాతం రిస్క్‌తో పనిచేస్తున్న కాంక్రీట్ మిల్లర్‌ను బిల్డర్లు, మేస్త్రీలు, సెంట్రింగ్ కాంట్రాక్టర్లు ఓనర్ల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని తమకు నామమాత్రంగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంద గజాల నుంచి, 500గజాల వరకు ఒక్కరోజుకు కేవలం 12 వేలు మాత్రమే ఇస్తున్నారని అందులోనే లేబర్ కూడా చూసుకోవాలంటున్నారని లేబర్ ఖర్చులు పోను తమకు ఏమీ మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేటర్‌లో దాదాపు లక్ష కాంక్రీట్ మిల్లర్ యంత్రాల ఓనర్లు ఉన్నారని వీరిని ఆధారం చేసుకుని సుమారు 10 లక్షల మంది లేబర్ ఉంటారని 10 లక్షల మందికి ఉపాధి ఇస్తున్న కాంక్రీట్ మిల్లర్‌లను కాపాడుకోవాలని వారు కోరారు. మిల్లర్, లిఫ్ట్, వైబ్రేటర్‌కు ఒకరోజుకు 12 వేల అద్దె ఇవ్వాలని, లేబర్‌కు సపరేట్‌గా చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకై రేపటి నుంచి 12వ తేదీ వరకు బంద్ పాటిస్తున్నట్లు, 10న ఇందిరాపార్క్‌వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఇ.తిరుపతయ్య, బి.రాములు, ఎ.సత్యనారాయణ, శాంతయ్య, మిథున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో రోగి సహాయకుడి ఆత్మహత్య

పంజగుట్ట: కల్లుకు బానిసై కల్లు దొరకక ఓ రోగి సహాయకుడు నిమ్స్ ఆసుపత్రి రెండో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యా చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం..మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లికి చెందిన హనుమాండ్ల పోశం (70) బాడీ మొత్తం ఇన్‌ఫెక్షన్ రావడంతో నిమ్స్ ఆసుపత్రికి నాలుగు రోజుల క్రితం అతని కుమారుడు హనుమాండ్ల నారాయణ (55), మరో కుమారుడు మధుకర్‌తో కలిసి వచ్చాడు. పోశంకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో చికిత్స అందిస్తున్నాడు. తోడుగా వచ్చిన నారాయణకు ప్రతిరోజు కల్లు తాగే అలవాటు ఉందని, నగరంలో కల్లు ఎక్కడ దొరుకుతుందో తెలియక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. మానసికంగా బాధపడుతున్న నారాయణ శుక్రవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో నిమ్స్ ఆసుపత్రి స్పెషాలిటీ బ్లాక్ నుంచి ఎమర్జెన్సీ వార్డుకు వెళ్లే వంతెన రెండో అంతస్తు నుంచి కిందకు దూకాడు. స్పందించిన నిమ్స్ సిబ్బంది నారాయణను చికిత్స నిమిత్తం ఎమర్జెన్సీ వార్డుకు తరలించి వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స పొందుతున్న నారాయణ రాత్రి మృతి చెందాడు. నారాయణ సోదరుడు మధుకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంటల వ్యవధిలోనే కరెంటు పునరుద్ధరణ

బంజారాహిల్స్: భారీ వర్షానికి ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో విద్యుత్ అధికారులతో పాటు సిబ్బంది గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి సరఫరాను పునరుద్ధరించారు. గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, శ్రీనగర్‌కాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ డివిజన్ల పరిధిలో పలుచోట్ల వైర్లు తెగి చెట్లు కూలి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఫీడర్ల పరిధిలోని ఎర్రమంజిల్, సోమాజీగూడ, దుర్గానగర్, బీఎస్ మక్తా, శ్రీనగర్‌కాలనీ ప్రాంతాల్లో భారీ చెట్లు విరిగిపడడంతో వాటిని తొలగించి నూతన కండక్టర్ అమర్చడం వల్ల రెండు మూడు గంటల సమయంలోనే కరెంటు సరఫరాను పునరుద్ధరించగలిగారు. శుక్రవారం సాయంత్రానికి అన్ని ఫీడర్ల పరిధిలో సరఫరా సాధారణమైంది. డిస్ట్రిబ్యూషన్ స్థాయి వరకు సరఫరా తీరును పర్యవేక్షించాలని, ఎలాంటి సమస్య లేకుండా చూడాలని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సీఈలు, ఎస్ఈలను ఆదేశించారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిన ప్రాంతాల్లో జరుగుతున్న పునరుద్ధరణ పనులను గురువారం రాత్రి ఆయన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. టీజీఎస్పీడీసీఎల్ బంజారాహిల్స్ ఏడీఈ, ఏఈతో పాటు ఇతర అధికారులు అన్ని ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. కరెంటు సరఫరాలో లోపాలు లేకుండా చూశారు. గంట వ్యవధిలోనే కరెంటు పునరుద్ధరించారు.



ఫీడర్ల వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న బంజారాహిల్స్ ఏఈ రమేష్

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

ఫిలింనగర్: అనుమానాస్పదస్థితిలో ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..షేక్‌పేట సమీపంలోని గుల్షన్ కాలనీలో నివసించే మెట్టు ఆంజనేయులు కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. ఆయన కూతురు ఎం.వరలక్ష్మి (19) ఇటీవలనే ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రాసింది. ఈ నెల 1న ఉదయం 10 గంటలకు ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. తండ్రి ఆంజనేయులుతో పాటు తల్లి శివమ్మ కూతురు కోసం అన్ని ప్రాంతాలు గాలించారు. ఒకవైపు కూతురు కోసం గాలిస్తుండగానే, గుర్తుతెలియని వ్యక్తి ఆంజనేయులుకు ఫోన్ చేసి నీ కూతురు క్షేమంగా ఉంది వెతకవద్దని ఫోన్ పెట్టేశాడు. ఆందోళన చెందిన ఆంజనేయులు తన కూతురు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిలింనగర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని బాధిత వరలక్ష్మి కోసం గాలిస్తున్నారు.



వరలక్ష్మి

హకీంపేటలో జీహెచ్ఎంసీ కమిషనర్ పర్యటన



వరద ప్రాంతాలను పరిశీలిస్తున్న ఇలంబర్తి

బంజారాహిల్స్: నగరంలో కురిసిన వర్షాలకు హకీంపేట వరద ప్రవాహం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొకుండా శాశ్వత పరిష్కారం చేసేందుకు పూర్తి ప్రణాళికను సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఎస్.ఈ.రత్నాకర్, ఇతర అధికారులతో కలిసి వరద ముంపునకు గురైన ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. బంజారాహిల్స్, ఎమ్మెల్యే కాలనీ, లోటస్ పాండ్ నుంచి వర్షపు వరద ప్రవాహం హకీంపేట్ నుంచి బల్కాం చెరువులోకి వెళ్తున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. గతంలో వరదరాలేదని, ఇటీవల కురిసిన వర్షాలకు హకీంపేట్‌కు లేఔట్ మట్టితో వరద వస్తుందని తెలిపారు. వరదలో వచ్చిన మట్టిని వెంటనే తొలగించాలని ఆదేశించారు.

హెచ్‌సీయూ గొడవల వెనుక కేటీఆర్ హస్తం

ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం

బంజారాహిల్స్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల గొడవల వెనుక మాజీ మంత్రి కేటీఆర్ హస్తముందని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం ఆరోపించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎమ్మెల్యే కాలనీలో ఆయన శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కొంత మంది విద్యార్థులకు మాజీ మంత్రి కేటీఆర్ డబ్బులిచ్చి మరీ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారన్నారు. విద్యార్థులు హరీష్‌రావు, కేటీఆర్ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. వ్యాపారవేత్త బిల్లీరావుతో కేటీఆర్ చీకటి ఒప్పందం చేసుకున్నారని, ఆ భయంతోనే నేడు లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి విష ప్రచారం చేస్తున్నాడని అన్నారు. అసత్యాల ప్రచారం చేస్తూ విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తూ ఆందోళన చేయిస్తున్నారని పేర్కొన్నారు. అది సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన భూమి కాదని అన్నారు. చదువుకున్న విద్యార్థులు అన్ని విషయాలు తెలుసుకోవాలని సూచించారు. నాడు కేసీఆర్ హయాంలో ఐటీ మంత్రిగా కేటీఆర్ ఉన్న సమయంలో కూడా సుప్రీంకోర్టులో ఈ భూమిపై కొట్లాడకుండా బిల్లీరావుతో చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు.



ముందుకు సాగని సీసీ రోడ్డు పనులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లోని నందినగర్‌లో మాజీ సీఎం కేసీఆర్ ఇంటికి వెళ్లే రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణం కోసం నెల క్రితం రోడ్డును తవ్వి గాలికొదిలేశారు. ఈ రోడ్డులో బసవతారకం కేన్సర్ ఆస్పత్రి నుంచి కేసీఆర్ ఇంటి వైపు వెళ్లే మార్గంలో సగం మాత్రమే సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు. కేసీఆర్ ఇంటి నుంచి నందినగర్ గ్రౌండ్‌కు వెళ్లే రోడ్డులో రోడ్డును తవ్వేసి అలాగే వదిలేశారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తవ్వేసిన రోడ్డులో వాహనదారులతో పాటు పాదచారులు నరకాన్ని చవిచూస్తున్నారు. రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, పార్టీలకతీతంగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి కూడా పనులు వెంటనే పూర్తయ్యేవిధంగా ప్రతిరోజూ మానిటరింగ్ చేస్తున్నారు. అయినా సరే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఇక్కడ కళ్లకు కడుతోంది. ఇప్పటికైనా ఇంజినీరింగ్ అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రూ.2.20 కోట్ల వ్యయంతో నందినగర్‌లో సీసీ రోడ్లు వేస్తున్నారు.



నందినగర్‌లో రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం

కల్యాణి ప్రసాద్ కేన్సర్ రీసెర్చ్ కేంద్రం ప్రారంభం



బసవతారకంలో కల్యాణిప్రసాద్ కేన్సర్ రీసెర్చ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో అమెరికాకు చెందిన డాక్టర్ రాఘవేంద్రప్రసాద్, కల్యాణిల ఆర్థిక సహకారంతో కల్యాణిప్రసాద్ కేన్సర్ రీసెర్చ్ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. రూ.10 కోట్లతో ఈ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పీహెచ్ఎఫ్ఐ ప్రొఫెసర్ శ్రీనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేన్సర్ చికిత్స అందిస్తున్న బసవతారకం లాంటి పెద్ద ఆస్పత్రులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో జోడించగలిగితేనే కేన్సర్‌పై పోరాటంలో మెరుగైన ఫలితాలను సాధించగలుగుతామన్నారు. దీనికి సంబంధించి పెద్ద ఆస్పత్రులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో జోడించే నెట్‌వర్క్ తయారుచేయడం ప్రాముఖ్యత కలిగిన అంశమన్నారు. ఈ కార్యక్రమంలో ఇండో అమెరికన్ కేన్సర్ రీసెర్చ్ ఫౌండేషన్ అధ్యక్షుడు సీహెచ్.మోహన్ రావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు జేఎస్ఆర్ ప్రసాద్, దాతలు రాఘవేంద్రప్రసాద్, కల్యాణితో పాటు టీఎస్‌రావు, ఫణి కోటేశ్వరరావు, కల్పనా రఘునాథ్, సెంథిల్ రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

మనీ ల్యాండరింగ్ పేరిట మోసం

హిమాయత్‌నగర్: మనీ ల్యాండరింగ్, మానవ అక్రమ రవాణాకు పాల్పడ్డారని ఓ ఎన్ఆర్ఐను సైబర్ నేరగాళ్లు మోసగించారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపిన వివరాల ప్రకారం..యునైటెడ్ కింగ్‌డమ్‌లో నివసిస్తున్న భారతీయ 44 ఏళ్ల మహిళ హైదరాబాద్‌కు వచ్చి తాత్కాలికంగా ఓ ఫ్లాట్‌లో నివసిస్తున్నారు. బాధిత మహిళకు స్కామర్స్ ఫోన్ చేసి, ట్రాయ్ అధికారుల పేరిట మాట్లాడారు. ఆమె మొబైల్ నెంబర్ నుంచి చట్ట వ్యతిరేకమైన ప్రకటనలు, వేధించే మెసేజ్‌లు చేశారని ఆరోపించారు. ఢిల్లీకి చెందిన ఓ ఆర్థిక నేరస్తుడు బాధిత మహిళ ఆధార్ కార్డు ఉపయోగించి ఢిల్లీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అకౌంట్ తెరిచి, మనీ ల్యాండరింగ్, మానవ అక్రమ రవాణాకు పాల్పడ్డారని తెలిపారు. అనంతరం సీబీఐ అధికారిగా నటిస్తున్న స్కామర్ మరో కాల్ చేసి, బాధితురాలి ఆధార్ కార్డు చూపించాలని, ఈ విషయం ఎవరికి చెప్పొద్దని సూచించాడు. ఈ కేసులో బాధితురాలి ప్రమేయం లేదని తేల్చేందుకు ఆమె అకౌంట్‌లో ఉన్న నగదు బదిలీ చేయాలని, ఆర్‌బీఐ గైడ్‌లైన్స్ మేరకు విచారణ జరిపి ప్రమేయం లేకపోతే క్లియరెన్స్ సర్టిఫికెట్‌తో పాటు ఆ నగదును తిరిగి పంపిస్తామని తెలిపారు. బాధితురాలు మొత్తం రూ.13,29,999లను స్కామర్స్ అకౌంట్‌కు బదిలీ చేసింది. అనంతరం బాధితురాలు స్కామర్స్‌కు ఫోన్ కాల్ చేయగా వారు స్పందించలేదు. మోసపోయానని గ్రహించిన బాధిత మహిళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు.

రిజర్వేషన్ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చేలా కృషి చేయాలి

హిమాయత్‌నగర్: బిహార్, తెలంగాణ రిజర్వేషన్ బిల్లులను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేలా అన్ని రాజకీయ పక్షాలు ఓబీసీ సంఘాలు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్ అన్నారు. శుక్రవారం ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్, బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం, ఛాత్ర ఆర్జేడీ, స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ద్రవిడియన్స్, రిజర్వేషన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో సదస్సు నిర్వహించినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్, ప్రొ.సురజ్ మండల్, ప్రొఫెసర్ రతన్‌లాల్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ సలహాదారు ఆళ్ల రామకృష్ణ, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్ కుమార్, ఇళయ కుమార్(ఎస్ఎఫ్‌డీ) రితు అనుపమ(రిజర్వేషన్ క్లబ్), అక్షన్ రంజన్(ఛాత్ర ఆర్జేడీ), పంకజ్ కుష్వాహా, మహేశ్, రితు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మంత్రి పొన్నం, ఎంపీ విల్సన్, చిరంజీవులు, ఆళ్ల రామకృష్ణ, శ్రీనివాస్ గౌడ్

వర్ష బీభత్సం

బంజారాహిల్స్: వర్షం బీభత్సానికి ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బస్తీలన్నీ అతలాకుతలమయ్యాయి. గురువారం రాత్రి వరకు కురిసిన వర్షానికి ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు కాలనీలు, బస్తీలు అర్ధరాత్రి వరకు కరెంటు లేక చీకట్లోనే ఉన్నాయి. సోమాజిగూడలోని దుర్గానగర్ కాలనీలోని పలు అపార్ట్‌మెంట్లలో అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కరెంటు రాలేదని కాలనీవాసులు ఆరోపించారు. ఖైరతాబాద్ ఐమ్యాక్స్ వద్ద, నెక్లెస్ రోడ్డులో గాలి వానకు కూలిన చెట్లను తెల్లవారే వరకు కూడా సిబ్బంది తొలగిస్తూనే ఉన్నారు. ఇక ఖైరతాబాద్ డివిజన్‌లోని తుమ్మల బస్తీ నాలాలో వ్యర్థాలు తొలగిస్తున్న హిటాచీ వాహనాన్ని వరద, మురుగు ముంచెత్తింది. దీంతో నాలాలోనే హిటాచీ నిలిచిపోయింది. బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని ఉదయ్‌నగర్ బస్తీలో నాలాను ఆనుకొని రోడ్డు వరద తాకిడికి కొట్టుకుపోవడంతో బస్తీలో రాకపోకలు నిలిచిపోయాయి.



ఐమ్యాక్స్ ఇందిరాగాంధీ చౌరస్తాలో కూలిన భారీ చెట్టును తొలగిస్తున్న సిబ్బంది



తుమ్మలబస్తీలో నాలాలో వ్యర్థాలు తొలగిస్తున్న హిటాచీ వాహనాన్ని ముంచెత్తిన మురుగు, చెత్తా చెదారం

సాక్షి 10 సిటీ ప్లస్
హైదరాబాద్, శనివారం, 5, ఏప్రిల్, 2025



- వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన ప్రముఖ ఆర్టిస్టులు
- 200లకు పైగా కళాకారులతో, మూడు వేలకు పైగా ప్రదర్శనలు
- 6వ తేదీ వరకూ నగరంలో కళా ఉత్సవం

కళాత్మక వేదిక..

నగరం వేదికగా ప్రతిష్టాత్మక ఇండియా ఆర్ట్ ఫెస్టివల్





సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా ప్రసిద్ధ కళలకు, కళాకారులకు కేంద్రంగా నిలుస్తున్న హైదరాబాద్ నగరంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక 'ఇండియా ఆర్ట్ ఫెస్టివల్' (ఐఏఎఫ్) ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని రేతిబౌలి–అత్తాపూర్‌లోని కింగ్స్ క్రౌన్ కన్వెన్షన్ వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఫెస్టివల్‌లో పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ప్రముఖ కళాకారులు లక్ష్మణ్ ఆలే, జగదీష్ చింతల, దేవేందర్ రెడ్డి, ప్రసిద్ధ రచయిత ప్రయాగ్ శుక్లా, ప్రముఖ కళా సేకరణ కర్త అంజు పొదార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సారి ఫెస్టివల్‌లో ప్రత్యేకమైన 25 ఆర్ట్ గ్యాలరీలతో, 100 ఎయిర్ కండిషన్డ్ స్టాల్స్‌తో, దేశవ్యాప్తంగా 50 మంది దిగ్గజ కళాకారులతో పాటు దాదాపు 200 మంది ప్రముఖ, యువ, ఔత్సాహిక కళాకారులు రూపొందించిన 3,500 పైగా వైవిధ్యమైన పెయింటింగ్‌లు, శిల్పాలు ఈ ఆర్ట్ ఫెస్టివల్‌లో ప్రదర్శిస్తున్నారు. గత 15 ఏళ్లుగా ముంబై, ఢిల్లీ, బెంగళూరులో నిర్వహించే ఈ ఫెస్ట్‌ను నగరానికి తీసుకురాగలిగిన రాజేంద్ర పాటిల్‌కు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.



దిగ్గజ కళాకారులు.. అద్భుత ప్రదర్శనలు..

ఈ నెల 6 వరకు కొనసాగనున్న ఈ ఫెస్టివల్‌లో విభిన్న నగరాల నుంచి ప్రముఖ ఆర్టిస్టులు పాల్గొంటున్నారు. ఆర్ట్ ఫెస్టివల్‌తో పాటు ఫ్యూజన్ షోలు, లైవ్ మ్యూజిక్ షోలు, ఇతర ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులోని 'ది ఎటర్నల్ కాన్వాస్ – 12,000 ఇయర్స్ జర్నీ త్రూ ఇండియన్ ఆర్ట్' ప్రదర్శన కార్యక్రమానికే హైలైట్‌గా నిలువనుంది. హైదరాబాద్ నగరం నుంచి ఆర్ట్స్ బ్రీజ్ ఆర్ట్ గ్యాలరీ, గ్యాలరీ సెలెస్టే, ఐకాన్ ఆర్ట్ గ్యాలరీ, స్నేహా ఆర్ట్స్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ వంటి సంస్థలు తమ కళాకృతులను ప్రదర్శిస్తున్నారు. ప్రముఖ కళాకారులు జోగెన్ చౌదరి, మను పరేఖ్, క్రిషేన్ ఖన్నా, శక్తి బర్మన్, సీమా కోహ్లి, పరేశ్ మెయితీ, యూసుఫ్ అరక్కల్, ఎస్ జి వాసుదేవ్, అంజోలీ ఎలా మీనన్, అతుల్ దోడియా, లక్ష్మా గౌడ్, టి వైకుంఠం, చింతల జగదీశ్, గిగి సర్కారియా, ఎంవి రమణా రెడ్డి, లక్ష్మణ్ ఏలె, అశోక్ భౌమిక్, గురుదాస్ షెనాయ్, జతిన్ దాస్, పి జ్ఞాన, రమేశ్ గోర్జాల వంటి వారు అలరించనున్నారు.





శ్రీ సీతారాముల కల్యాణానికి నగరం నలుమూలలా ఉన్న రామాలయాలు ముస్తాబయ్యాయి. వీటిల్లో ముఖ్యంగా చెప్పుకోదగిన ఆలయం 'అమ్మపల్లి' దేవస్థానం. ఏకశిలా రాతి విగ్రహంతో.. దశావతారంలో మకర తోరణం కలిగి శ్రీ సీతారామ లక్ష్మణులు ఇక్కడ కొలువయ్యారు. యేటా రామనవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కూడ శివారులోని అమ్మపల్లిలోని ఈ ఆలయం 18వ శతాబ్దంలో నిర్మించినట్లు ప్రశస్తి. ఇక్కడి ఆలయ, ప్రాకారాల నిర్మాణాల గురించి ఎలాంటి లిఖిత పూర్వక ఆధారాలూ లేకపోయినా.. అప్పటి నిర్మాణ శైలి, విగ్రహ రూపాలను బట్టి 18వ శతాబ్దం నాటివిగా పురావస్తు శాఖ అంచనా వేస్తోంది.

– శంషాబాద్ రూరల్

- అమ్మపల్లి ఆలయానికి చారిత్రక గుర్తింపు
- 18వ శతాబ్దం నాటి విగ్రహాలుగా తేల్చిన పురావస్తు శాఖ
- ప్రత్యేక ఆకర్షణగా ఎత్తయిన గోపురం
- యేటా ఘనంగా నిర్వహిస్తున్న కల్యాణోత్సవాలు

శ్రీ రామ నవమికి ఆలయాలు ముస్తాబు

సీతారాముల కల్యాణం..


చూతము రారండీ..

నర్కూడలోని అమ్మపల్లి ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీ రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించారు. ఆదివారం ఉదయం 11.49 గంటలకు స్వామి కల్యాణం జరుగనుంది. భక్తుల సౌకర్యార్థం ప్రధాన ఆలయం చుట్టూ క్యూలైన్లు, ఇతర ఏర్పాటు చేస్తున్నారు అధికారులు.



ఎత్తయిన ఆలయ గోపురం..

అమ్మపల్లి ఆలయానికి ఎత్తయిన గోపురం ప్రత్యేక ఆకర్షణ. సుమారు 80 అడుగుల ఎత్తులో ఏడు అంతస్తులతో ఈ గోపురం నిర్మితమైంది. ఆలయ గోపురం, ప్రాకారాలు చారిత్రక కళా నైపుణ్యాన్ని చాటి చెబుతాయి. ఆలయానికి ఈశాన్యంలో కోనేరు, వెనకాల మరో కోనేరు ఆకర్షణీయంగా నిలుస్తాయి. ఎదురుగా ఉన్న మంటపంలో యేటా శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. మంటప సమీపంలో నగారా, రథశాల ఉన్నాయి. శ్రీరామ లింగేశ్వర, శ్రీ ఆంజనేయ స్వామి ఉప ఆలయాలు ఉన్నాయి.



అత్తాపూర్ రాంబాగ్‌లో..

అత్తాపూర్ : అత్తాపూర్ రాంబాగ్‌లోని చారిత్రాత్మక శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం కల్యాణ మహోత్సవానికి ముస్తాబైంది. ఇప్పటికే దేవాలయాన్ని రంగులు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణ మహోత్సవం, 7న దశమి రోజున రథోత్సవంతో పాటు లంకా దహనం, 8న సీతా రామలక్ష్మణులకు దోపుసేవ, 9న వీధి సేవతో పాటు చక్రతీర్థం వంటి కార్యక్రమాలతో ముగుస్తాయని పూజారి తిరుమల దేశభక్త ప్రభాకర్, శ్రీనివాస్‌లు వెల్లడించారు.



గద్వాల్ సంస్థానం నుంచి విగ్రహాలు..


నిజాం దర్బార్‌లో వివిధ హోదాల్లో పని చేసిన రాజా భవానీ ప్రసాద్ భట్నాగర్ 1790లో దేవాలయం పనులను ప్రారంభించగా.. 1802లో విగ్రహ ఆవిష్కరణను కేరళకు చెందిన పూజారి వెంకటరమణాచారి, రాజా భవానీ ప్రసాద్‌ల నేతృత్వంలో గద్వాల్ సంస్థానం నుండి శ్రీ సీతారామ లక్ష్మణ విగ్రహాలను తీసుకొచ్చి అత్తాపూర్ రాంబాగ్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. దీనికి మూడో నిజాం సికిందర్ జా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాటి నుంచి నేటి వరకూ వారి వారసులు ఈ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్నారు. 300 సంవత్సరాలు గల ఈ దేవాలయానికి భక్తులు అధికంగా వస్తుంటారు. భద్రాది రాములోరి కల్యాణం జరిగే సమయంలోనే అత్తాపూర్ రాంబాగ్ దేవాలయంలో అత్యంత వైభవంగా కల్యాణ ఉత్సవం ఆనవాయితీగా వస్తుంది.



కశ్మీర్ టు కన్యాకుమారి

లైవ్ డ్రాయింగ్..

- ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న 400లకు పైగా చిత్రాలు
- 10వ తేదీ వరకు ఆర్ట్ గ్యాలరీ కొనసాగింపు



మాదాపూర్ : కళాయాత్ర పోచమ్ వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇలాంటి చిత్రాలు తనకు ఎంతో ఇష్టమని చెన్నూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం ఏర్పాటు చేసిన కశ్మీర్ టు కన్యాకుమారి లైవ్ డ్రాయింగ్స్ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. సైకిల్ పై యాత్ర చేస్తూ ఆయా ప్రదేశాల్లో లైవ్ డ్రాయింగ్స్ వేయడం అభినందించదగిన విషయమని, దీంతో పాటు అక్కడి సంస్కృతి, సంప్రదాయాలను తెలిపేలా చిత్రాలు ఉన్నాయని తెలిపారు. చిత్రాలు వేయడమంటే సులువు కాదని, ఆసక్తి, ఉత్సాహం ఉన్నప్పుడే ఎలాంటి పనులనైన సునాయాసంగా చేయవచ్చన్నారు. ప్రదర్శన ఈనెల 10 వరకూ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 11గంటల నుంచి రాత్రి 7గంటల వరకూ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో గీతాంజలి పాఠశాల ప్రిన్సిపాల్ సోనియానాగ్‌పాల్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎం వి.రమణారెడ్డి పాల్గొన్నారు.





బొటానికల్ గార్డెన్స్‌లో

డెక్కన్‌వుడ్స్

- పర్యావరణ పరిరక్షణపై సందర్శకులకు అవగాహన
- ఎకో టూరిజంలో విద్య, వినోదం మిళితం చేసే కార్యక్రమాలు
- వర్చువల్ పద్ధతిలో వివిధ రకాల థీమ్ పార్కుల ప్రజెంటేషన్

గచ్చిబౌలి : బొటానికల్ గార్డెన్ మరింత పర్యావరణ ప్రాంతంగా మారింది. రోజురోజుకూ సందర్శకుల సంఖ్య పెరగడంతో తాజాగా తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డెక్కన్‌వుడ్స్, ట్రయల్స్ పేరిట అనేక ఎకో టూరిజమ్ కార్యక్రమాలు చేపడుతున్నారు. పర్యావరణ హితం కోసం విద్య, వినోదాన్ని మిళితం చేసేలా సందర్శకులను ఆకట్టుకునే చర్యలు చేపడుతున్నారు. ప్రతి శనివారం ఉదయం 9 గంటలకు సందర్శకులకు ఆడియో, వీడియోల ద్వారా చెట్ల ప్రాధాన్యత, సీతాకోకచిలుకలు, ఇతర వన్యప్రాణులు, జీవులపై ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తారు.

బ్యాటరీ వాహనాల్లో..

సందర్శకులకు వృక్ష పరిచయం కోసం క్షేత్ర స్థాయిలో బ్యాటరీ ఆపరేటెడ్ వాహనాల్లో 75 థీమ్ పార్కులు, వాటి ప్రాముఖ్యతను వివరిస్తారు. పెన్సిల్, రబ్బర్, సంగీతం, సీతాకోకచిలుకు, పాన్ గార్డెన్, బతుకమ్మ వనం, మూలికా వనం వంటి థీమ్‌లను చూపిస్తూ వివరిస్తారు. స్నేక్ ఫెండ్స్ సొసైటీ వారు జీవవైవిధ్యంపై అపోహలను తొలగిస్తారు. అనంతరం వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీ పార్కులో అద్భుతమైన అనుభూతిని కల్పిస్తారు.





వర్చువల్ వండర్స్..

వర్చువల్ పద్ధతిలో తెలంగాణ గిరిజన జీవనశైలి, సంస్కృతి, వాటర్‌ఫాల్స్, ఈస్టర్న్, వెస్టర్న్ ఘాట్స్, 9డీ సినిమా థీమ్స్, నేచర్‌వాక్, స్పేస్ ఆక్వేరియం వంటి వాటిని వీక్షించేందుకు అవకాశం కల్పిస్తారు. ఏసీ బస్సులో టూరిస్టులకు త్రీ స్టార్ హోటల్‌లో భోజనం చేయించి మృగవని నేషనల్ పార్కుకు తీసుకెళ్తారు. ఇందుకుగానూ ఒక్కొక్కరికీ రూ.2,950గా టికెట్ ధర నిర్ణయించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9493549399, 9885298980లో సంప్రదించవచ్చు.



వద్దనుకుని.. చివరికి నటినయ్యా..

- కథ చెప్పడంలో స్క్రిప్ట్ అత్యంత కీలకం
- మంచి స్క్రిప్ట్ రాయడం సులభం కాదు
- థియేటర్ ఆర్ట్స్ ఒక సవాలుతో కూడిన పని
- ప్రఖ్యాత నటి, నాటక కళాకారిణి రత్నపాఠక్‌షా



రాయదుర్గం : మొదట్లో నేను నటిని కావాలనే ఆలోచననే అసహ్యించుకున్నా.. కానీ చివరకు నటిగా మారానని ప్రఖ్యాత నటి, నాటక కళాకారిణి రత్నపాఠక్‌షా స్పష్టం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 'పాత్రలు, కథలను రూపొందించడం' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం చేశారు. అనంతరం తెలంగాణ పురాతన డోక్రా క్రాఫ్ట్ జ్ఞాపికను ఆమె ఆవిష్కరించారు. నేను కథకుల కుటుంబంలో పెరిగానని, కాబట్టి ఆ నైపుణ్యం నాకు సహజంగానే వచ్చిందని, అందరిలా కాకుండా నేను భిన్నంగా ఉండాలని కోరుకున్నాని వివరించారు. మంచి స్క్రిప్ట్ రాయడం అంత సులభం కాదని, దీనికి ఎంతో అనుభవం, పరిజ్ఞానం ఉండాలని అన్నారు. సినిమాలతో పోలిస్తే థియేటర్ ఆర్ట్స్ ఒక సవాలుతో కూడిన పని అని గుర్తుచేశారు.



డోక్రా మెటల్ కాస్టింగ్ క్రాఫ్ట్ పునరుద్ధరణే లక్ష్యం..

"చేతి వృత్తులకు మద్దతు ఇవ్వడం ద్వారా 4వేల ఏళ్ళ పురాతన డోక్రా మెటల్ కాస్టింగ్ క్రాఫ్ట్‌ను పునరుద్ధరించాలనేదే లక్ష్యం. మన సంప్రదాయాన్ని కాపాడుకోడమేకాదు, దానిని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఉషేగావ్, జామ్‌గావ్, కేస్లా గూడ నుంచి వచ్చిన చేతి వృత్తులవారితో కలిసి పనిచేయడాన్ని గర్వంగా భావిస్తున్నాం."

– ప్రతిభాకుందా, ఎఫ్ఎల్ఓ హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్

కిచెన్.. ఫస్ట్ చాయిస్..

నచ్చినట్లు డిజైన్ చేసుకోవాలి

- ముందే ప్లాన్ చేసుకోవాలి
- ప్రస్తుత ట్రెండ్.. ఓపెన్ కిచెన్

❖ మెట్రో నగరాల్లో గృహ కొనుగోలులో వంట గది కీలకంగా మారింది. అందుబాటు ధర, అభివృద్ధి చెందే ప్రాంతం, వసతులు మాత్రమే కాదండోయ్.. ఇంట్లోని వంట గది శైలి కూడా ఆధునికంగా ఉండాలంటున్నారు కొనుగోలుదారులు. అందుకే సాధారణ కిచెన్స్ స్థానంలో ఇప్పుడు ఓపెన్ కిచెన్స్ ట్రెండ్ నడుస్తోంది. లివింగ్, డైనింగ్ రూమ్‌లతో వంట గది కలిసి ఉండటమే దీని ప్రత్యేకత!

❖ నగరంలోని నిర్మాణ సంస్థలు 1,000 చ.అ.పైన ఉండే ప్రతి ఫ్లాట్‌లోనూ ఓపెన్ కిచెన్ ఏర్పాటుకే ప్రాధాన్యమిస్తున్నాయి. హాలుకు అనుసంధానంగా అడ్డుగా గోడలు లేకుండా ఓపెన్ కిచెన్స్ ఏర్పాటు చేస్తారు. అంటే లివింగ్ రూమ్, డైనింగ్ రూమ్‌కు కిచెన్ కలిసే ఉంటుందన్నమాట.

– సాక్షి, సిటీబ్యూరో



ముచ్చటిస్తూ వంటలు..

❖ ఓపెన్ కిచెన్స్‌లో సానుకూల, ప్రతికూల రెండు రకాల అంశాలూ ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అవేంటంటే..

❖ వంట చేస్తూనే ఇతర గదుల్లో ఉన్న వారితో, ఇంటికి వచ్చిన అతిథులతో సంభాషించవచ్చు. హాల్‌లో ఉండే టీవీలోని కార్యక్రమాలనూ వీక్షించొచ్చు.

❖ ఓపెన్ కిచెన్ కాబట్టి శుభ్రంగా ఉంచేందుకు శ్రద్ధ తీసుకుంటారు. ఇంటిని అందంగా అలంకరించే కసరత్తును వంట గది నుంచి మొదలుపెడతారు.


❖ ఘుమఘుమలు ఇల్లంతా వ్యాపిస్తాయి. దీంతో కుటుంబ సభ్యుల మూడ్‌ను మారుస్తాయి.

❖ ఇంట్లో చిన్నారులు ఉంటే వంట గది నుంచి కూడా వీరిపై పర్యవేక్షణకు వీలుంటుంది.

❖ వంట పాత్రలు బయటకు కనిపిస్తుంటాయి. కాబట్టి ఇది కొందరికి నచ్చకపోచ్చు.

❖ డిష్‌వాషర్, మిక్సీల శబ్దాలు ఇతర గదుల్లోకి వినిపించి అసౌకర్యంగా ఉంటుంది.

❖ దూరపు బంధువులు, అంతగా పరిచయం లేనివారు వచ్చినప్పుడు వారి ముందు వంట చేయడం కొంత మందికి అంతగా నచ్చకపోవచ్చు.



సంప్రదాయ వంటగది:

❖ వీటిని పాత రోజుల నుంచి చూస్తున్నవే.. వంట గది ప్రత్యేకంగా ఉంటుంది. ఏకాంతంగా వంట చేయాలని కోరుకునే వారు సంప్రదాయ శైలిలో ఉండే వంటిల్లునే ఇష్టపడతారు.

❖ గదికి అన్ని వైపులా గోడలుంటాయి. అరలు ఎక్కువ ఏర్పాటుకు వీలుండటంతో పాత్రలన్నింటినీ చక్కగా సర్దేయవచ్చు.

❖ వంటింట్లోని శబ్దాలు, వాసనలు బయటకు రావు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఉంటుంది.

❖ చుట్టూ గోడలు ఉండటంతో ఇరుగ్గా, చీకటిగా ఉంటుంది. ఒకేసారి ఎక్కువ మంది తిరిగేందుకు వీలుండదు.

❖ ఇల్లు డిజైన్ సమయంలోనే ఎలాంటి వంట గది కావాలో నిర్ణయించుకోవాలి. ఎందుకంటే ఒకసారి వంట గదిని నిర్మించేశాక మళ్లీ ఓపెన్ కిచెన్‌లా మార్చాలంటే మరింత ఖర్చు అవుతుంది.



ఈవీ ఇళ్లకు ఆదరణ

సాక్షి, సిటీబ్యూరో: ఇంధన వనరుల ధరలు రోజుకో రేటు ఉంటున్న నేపథ్యంలో ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలు(ఈవీ) వైపు మొగ్గుచూపుతున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా ఈవీ వాహనాలను ప్రోత్సహిస్తుండటంతో చార్జింగ్ స్టేషన్ల అవసరం పెరిగింది. ఒకవైపు పెట్రోల్ బంక్‌లు, మెట్రో స్టేషన్ల వద్ద ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటవుతుంటే.. మరోవైపు కొత్తగా నిర్మిస్తున్న నివాస, వాణిజ్య సముదాయాలలోనూ వీటిని నెలకొల్పుతున్నారు. జిమ్, స్విమ్మింగ్ పూల్ అంటూ ప్రకటించే వసతుల జాబితాలో ఈవీ చార్జింగ్ పాయింట్ అనే ప్రత్యేకంగా ప్రకటించే స్థాయికి చేరిందంటే ఆశ్చర్యమేమీ లేదు. దీంతో ప్రస్తుతమున్న సాధారణ నివాస భవనాలలో ధరలు 1 శాతం మేర పెరిగితే.. ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసిన నివాస భవనాలలో ధరలు 2–5 శాతం మేర వృద్ధి చెందుతాయని జేఎల్ఎల్ నివేదిక తెలిపింది.

❖ 2030 నాటికి ఎలక్ట్రిక్ వాహనాల వాటా 40 శాతం కంటే ఎక్కువకు చేరుతుంది. దీంతో ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఉన్న భవనాలకు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. కొత్త ప్రాజెక్ట్‌లోనే కాకుండా ఇప్పటికే ఉన్న భవనాలలో కూడా ఈవీ పాయింట్ల ఏర్పాటు వ్యవస్థ 2026 నాటికి భారీగా పెరుగుతుంది. భవనాల రకం, సహజ వనరుల పునర్వినియోగ(రెట్రోఫిట్) ప్రాజెక్టల నివాస తరగతులను బట్టి ధరల పెరుగుదల ఉంటుంది. ప్రస్తుతం నివాస ప్రాంతాలలో యజమానులు సర్వీస్ ప్రొవైడర్ల సహాయంతో ఈవీ స్టేషన్లను ఇన్‌స్టాల్ చేస్తున్నారు.



ఆఫీస్ స్పేస్‌లలో కూడా..

ఈవీ స్టేషన్లు ఉన్న ఆఫీస్ స్పేస్‌లకు కూడా డిమాండ్ ఏర్పడింది. కొందరు స్థల యజమానులు వినియోగదారు రుసుముతో ఈవీ స్టేషన్ల సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మరికొందరు చార్జింగ్ సర్వీస్ ప్రొవైడర్లకు భూమిని లీజుకు లేదా రెవెన్యూ షేర్ మోడల్ ద్వారా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఆఫీస్ పార్కింగ్‌లలో ఖాళీ ప్లేస్‌లు లేకపోవటమే అసలైన సవాల్. ఇప్పటికే ఉన్న కొన్ని కార్యాలయాలలోని పార్కింగ్ ప్లేస్‌లలో ఇలాంటి అవసరాల కోసం కొంత స్థలాన్ని కేటాయించాయి. ప్రభుత్వ విభాగాలు చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసి వాటిని ప్రైవేట్ ఆపరేటర్లకు లీజుకు ఇవ్వొచ్చు లేదా దీర్ఘకాలానికి సంబంధిత భూమిని సర్వీస్ ప్రొవైడర్లకు లీజుకు ఇవ్వొచ్చని జేఎల్ఎల్ సూచించింది.



పెద్దస్థాయి ప్రాజెక్టులు, గేటెడ్ కమ్యూనిటీలలో అసోసియేషన్లు వీటిని ఏర్పాటు చేస్తున్నాయి. ఇందుకోసం వినియోగదారులపై నిర్ణీత రుసుములను వసూలు చేస్తున్నారు. రానున్న కొత్త నివాస సముదాయాలలో 5 శాతం పార్కింగ్ స్థలాన్ని ఈవీ చార్జింగ్ స్టేషన్ల కోసం కేటాయించబడతాయని జేఎల్ఎల్ ఇండియా స్ట్రాటర్జిక్ కన్సల్టింగ్ అండ్ వాల్యువేషన్ అడ్వైజరీ హెడ్ ఏ.శంకర్ తెలిపారు. ఈవీ స్టేషన్ల ఏర్పాటు కోసం ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్(ఐటీటీ) చార్జింగ్ ఉపకరణాలు, ఇంటర్నెట్ లభ్యత కూడా అందుబాటులో ఉండాలి గనక.. ఇప్పటికే ఉన్న పెద్ద రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లు, బహుళ అంతస్తుల భవనాలలో చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు వ్యయం, పరిమిత విద్యుత్ సరఫరా సామర్థ్యాలను బట్టి 1 శాతం ప్రీమియం ఉంటుందని పేర్కొన్నారు. 60 శాతం కంటే ఎక్కువ నివాసితులు ఈవీ చార్జింగ్ పాయింట్ల అవసరాన్ని కోరుకుంటుంటే ఈ ప్రీమియం 2–5 శాతం వరకు ఉంటుందని తెలిపారు.



కరోనా తర్వాత నుంచి గృహ కొనుగోలుదారుల అభిరుచులు మారాయి. నివాస కొనుగోళ్ల ట్రెండ్‌ను కరోనాకు ముందు, ఆ తర్వాత అని విభజించాల్సిన పరిస్థితి వచ్చింది. కోవిడ్ కంటే ముందు ఇల్లు కొనాలంటే మొదటి ప్రాధాన్యత బడ్జెట్ ఎంత అనే.. కానీ, కరోనా తర్వాత బడ్జెట్ అంటే లెక్కేలేదు. విస్తీర్ణమైన ఇళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు. మహమ్మారితో వర్క్ ఫ్రం హోమ్, ఆన్‌లైన్ క్లాసుల నేపథ్యంలో ఇంటిలో గడిపే సమయం పెరిగింది. మరోవైపు ఐసొలేషన్ కారణంగా విశాలమైన, ప్రత్యేక గదుల అవసరం ఏర్పడింది. దీంతో గృహ కొనుగోలుదారులు క్రమంగా విశాలమైన ఇళ్లకు మారిపోతున్నారు. అప్పటిదాకా 2 బీహెచ్‌కే వాసులు.. క్రమంగా 3 వైపు.. 3 బీహెచ్‌కే వాసులు నాలుగు పడక గదుల్లో ఉండేందుకు మొగ్గు చూపిస్తున్నారు. దీంతో గ్రేటర్‌లో ఇంటి విస్తీర్ణాలు క్రమంగా పెరుగుతున్నాయి. కస్టమర్ల అభిరుచులకు తగినట్టుగా డెవలపర్లు కూడా విశాలమైన ఇళ్లనే నిర్మిస్తున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

విశాలమైన ఇల్లు.. బడ్జెట్ ఎంతైనా ఓకే..

కరోనా తర్వాత నుంచి వినియోగదారుల ఆసక్తి

1700 చ.అ.ల నుంచి దాదాపు 2200 చ.అ.లకు..	కస్టమర్ల అభిరుచి మేరకు నిర్మిస్తున్న బిల్డర్లు	వెల్లడించిన అనరాక్–ఫిక్కీ హోమ్ బయ్యర్స్ సెంటిమెంట్ సర్వే



4 బీహెచ్‌కేకు ఆదరణ..

స్థిరమైన ధరలు, అధిక రాబడుల కారణంగా హైదరాబాద్‌లో ప్రాపర్టీలలో పెట్టుబడులకు పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తున్నారు. పెద్ద కుటుంబాలు, విలాసవంతమైన జీవనశైలి, ఆధునిక వసతులు కోరుకునేవారు ఎక్కువగా 4 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్లను కొనుగోలు చేస్తున్నారు. మియాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, కొంపల్లి, కూకట్‌పల్లి వంటి ప్రాంతాలలో 4 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. సైనిక్‌పురి, యాప్రాల్, నాచారం, మల్లాపూర్, తార్నాక, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల్లోని యూనిట్లకూ ఆదరణ బాగానే ఉంది. వీటి సగటు ధర రూ.1.78 కోట్ల నుంచి ఉన్నాయి.

గ్రేటర్‌లో పెరిగిన విస్తీర్ణాలు..

హైదరాబాద్‌లో ఏటేటా అపార్ట్‌మెంట్ల విస్తీర్ణాలు పెరుగుతున్నాయి. 2014లో నగరంలో ఫ్లాట్ల సగటు విస్తీర్ణం 1,830గా ఉండగా.. 2018 నాటికి 1,600లకు తగ్గాయి. నాలుగేళ్లలో ఏకంగా ఫ్లాట్ల సైజు 13 శాతం తగ్గింది. కోవిడ్ కాలంలో ఇంట్లో గడిపే సమయం ఎక్కువైపోయింది. దీంతో ఇంటి అవసరం తెలిసొచ్చింది. వర్క్ ఫ్రం హోమ్, ఆన్‌లైన్ క్లాస్‌లతో ఇంట్లో ప్రత్యేక గది అనివార్యమైపోయింది. దీంతో ఇంటి విస్తీర్ణం క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2019లో నగరంలో ఫ్లాట్ల సగటు విస్తీర్ణం 1,700 చ.అ.లుగా ఉండగా.. ఇప్పుడది ఏకంగా 2,200 చ.అ.లకు పెరిగింది.



45 శాతం డిమాండ్..

కరోనా కంటే ముందు లగ్జరీ గృహాలైన 4 బీహెచ్‌కే ఫ్లాట్లకు 27 శాతం డిమాండ్ ఉండగా.. ఇప్పుడది ఏకంగా 45 శాతానికి పెరిగిందని అనరాక్–ఫిక్కీ హోమ్ బయ్యర్స్ సెంటిమెంట్ సర్వే వెల్లడించింది. గత ఐదేళ్లలో దేశంలోని ఏడు నగరాల్లో అపార్ట్‌మెంట్ల విస్తీర్ణాలు 32 శాతం మేర పెరిగాయి. 2019లో సగటు ఫ్లాట్ సైజు 1,145 చ.అ.లుగా ఉండగా.. ఇప్పుడది 1,513 చ.అ.లకు పెరిగింది.

నగరాల వారీగా సగటున ఫ్లాట్ల విస్తీర్ణాలు:

నగరం	విస్తీర్ణం (చ.అ.ల్లో)	వృద్ధి (శాతంలో)
కోల్‌కతా	1,150	44
హైదరాబాద్	2,200	29
పుణే	1,013	16
బెంగళూరు	1,300	08
చెన్నై	1,175	06
ఎంఎంఆర్	743	05

ఇల్లు ఏదైనా సరే..

బాల్కనీ ఉండాల్సిందే!



75 శాతం గృహ కొనుగోలుదారుల ఆసక్తి ఇదే..

1,2,3 బీహెచ్‌కే.. ఇల్లు ఏదైనా సరే బాల్కనీ ఉండాల్సిందే.. గృహ కొనుగోలుదారులు నిర్మాణం నాణ్యత, ప్రాంతం, ధర, వసతులతో పాటు బాల్కనీకి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో ఇంటిలోని ప్రతి అంగుళం స్థలాన్ని వినియోగించాలని భావించిన కస్టమర్లు.. ప్రస్తుతం ఎక్కువ ఓపెన్ స్పేస్ ఉండాలని కోరుకుంటున్నారు. 75 శాతం మంది బాల్కనీ ఉండే ఇళ్ల కొనుగోళ్లకే ఆసక్తి చూపిస్తున్నారని ఫిక్కీ, అనరాక్ సర్వేలో వెల్లడించింది. అలాగే 74 శాతం మంది కస్టమర్లు నాణ్యమైన నిర్మాణాలకే మొగ్గు చూపిస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



- లాంచింగ్ ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్ల గిరాకీ
- రూ.కోటిన్నర ధర ఉన్న ఇళ్లకు డిమాండ్
- ఫిక్కీ, అనరాక్ సర్వేలో వెల్లడి

గృహాల ధరలు పెరుగుతున్నప్పటికీ కొనుగోలుదారులు విశాలమైన ఇళ్లకే ఆసక్తి చూపిస్తున్నారు. 50 శాతం మంది కస్టమర్లు 3 బీహెచ్‌కే కొనుగోలుకు ఆసక్తి చూపిస్తే.. 38 శాతం మంది 2 బీహెచ్‌కే గృహాలకు మొగ్గు చూపిస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఎన్‌సీఆర్ నగరాలలో 3బీహెచ్‌కే యూనిట్లకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. అధిక ధరల కారణంగా ముంబైలో 44 శాతం మంది కస్టమర్లు 2 బీహెచ్‌కేలకు, 17 శాతం 1 బీహెచ్‌కేలకు ఆసక్తి చూపిస్తున్నారు. పుణేలో 10 శాతం కొనుగోలుదారులు 1 బీహెచ్‌కే జై కొడుతున్నారు.

లగ్జరీ ఇళ్లకు డిమాండ్..

రూ.కోటిన్నర ధర ఉన్న గృహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. 2023 హెచ్–2లో 20 శాతం మంది లగ్జరీ ఇళ్లకు ఆసక్తి చూపించగా.. 2021 హెచ్–2లో ఇది కేవలం 12 శాతంగా ఉంది. రూ.45–90 లక్షల బడ్జెట్ గృహాలకు 33 శాతం మంది మొగ్గు చూపిస్తున్నారు. ఇక అందుబాటు గృహాలకు డిమాండ్ క్రమంగా తగ్గిపోతోంది. 2020 హెచ్–2లో 40 శాతంగా అఫర్డబుల్ హౌసింగ్ గిరాకీ.. 2021 హెచ్–2 నాటికి 25 శాతానికి, 2023 హెచ్–2లో ఏకంగా 21 శాతానికి క్షీణించింది.

లాంచింగ్‌లో కొంటున్నారు..

గృహ కొనుగోలుదారుల అభిరుచి మారింది. గతంలో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న వాటిల్లో కొనేందుకు ఆసక్తి చూపిన కస్టమర్లు.. ప్రస్తుతం లాంచింగ్ ప్రాజెక్ట్‌లలో కొనేందుకు ఇష్టపడుతున్నారు. 2020లో రెడీ టూ మూవ్, లాంచింగ్ ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్ల నిష్పత్తి 46:18 శాతంగా ఉండగా.. 2024 నాటికి 23:24 శాతానికి మారింది. అలాగే 2021లో శివారు ప్రాంతాలలో స్థిరాస్తుల కొనుగోలుకు జై కొట్టిన కొనుగోలుదారులు 2024 నాటికి 36 శాతానికి తగ్గారు.

పెట్టుబడులకు రియల్టీ బెటర్..

ఏటా దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఫ్లాట్ల విస్తీర్ణాలు 11 శాతం మేర పెరుగుతున్నాయి. 2022లో 1,175 చ.అ.లుగా ఉన్న సగటు ఫ్లాట్ల సైజు.. 2024 నాటికి 1,300 చ.అ.లకు పెరిగాయి. 58 శాతం మిలీనియల్స్, 39 శాతం జెన్స్–ఎక్స్ కస్టమర్లు ఇతర పెట్టుబడుల నుంచి వచ్చిన లాభాలతో ఇళ్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. 57 శాతం మంది రియల్ ఎస్టేట్ అత్యంత ప్రాధాన్య పెట్టుబడిగా విశ్వసిస్తున్నారు. ఇందులోనూ 36 శాతం మంది నివాస విభాగంలో పెట్టుబడులకే ఆసక్తి చూపిస్తున్నారు. గృహ రుణ వడ్డీ రేట్లు 8.5 శాతం కంటే తక్కువగా ఉన్నంత కాలం ఇంటి కొనుగోలు నిర్ణయంపై ప్రభావం ఉండదని చెప్పారు.





ఇంటి అవసరం పెరిగింది!

గ్రేటర్‌లో ఓపెన్ ప్లాట్లు, విల్లాలకు డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: కరోనా మహమ్మారి కంటే ముందుతో పోలిస్తే ఇంట్లో గడిపే సమయం పెరిగింది. దీంతో ఇంటి కొనుగోలు ఎంపికలో రాజీ పడటం లేదు. రిస్క్ తీసుకునైనా సరే సొంతింటిని కొనుగోలు చేయాలని.. చిన్న సైజు ఇంటి నుంచి విస్తీర్ణమైన గృహానికి వెళ్లాలని.. ఐసోలేషన్ కోసం ప్రత్యేక గది లేదా కుటుంబ సభ్యులతో గడిపేందుకు హాలిడే హోమ్ ఉండాలని భావించే వాళ్ల సంఖ్య పెరిగింది. దీంతో రాబోయే రోజుల్లో గృహ విభాగానికి డిమాండ్ ఏర్పడటం ఖాయమని జేఎల్ఎల్–రూఫ్‌అండ్‌ఫ్లోర్ సంయుక్తంగా నిర్వహించిన సర్వే వెల్లడించింది.

- హైదరాబాద్‌తో సహా ముంబై, ఢిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరు, చెన్నై, పుణే నగరాలలో 2,500 మంది గృహ కొనుగోలుదారులతో సర్వే నిర్వహించింది. పలు కీలకాంశాలివే.. వర్క్ ఫ్రం హోమ్, ఆన్‌లైన్ క్లాస్‌ల నేపథ్యంలో ఫ్లోర్ ప్లాన్స్‌లలో మార్పులు చేయాలని కొనుగోలుదారులు కోరుతున్నారు. బాల్కనీ స్థలంలో అదనంగా ఒక గదిని, ఐసోలేషన్ గదిని ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ఆ తరహా ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్లకే కస్టమర్లు మక్కువ చూపిస్తున్నారు. గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న అపార్ట్‌మెంట్లు లేదా పేరు మోసిన డెవలపర్లకు చెందిన నిర్మాణంలోని ప్రాజెక్ట్‌లలో మాత్రమే కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు.
- వచ్చే మూడు నెలల కాలంలో 80 శాతం కంటే ఎక్కువ కొనుగోలుదారులు గృహాలను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రూ.75 లక్షల కేటగిరీలోని ప్రాపర్టీలను కొనేందుకు సుముఖంగా ఉన్నారు. హైదరాబాద్‌తో సహా బెంగళూరు, చెన్నై, ఢిల్లీ–ఎన్‌సీఆర్ నగరాలలో 3 బీహెచ్‌కే ఫ్లాట్లకు డిమాండ్ పెరిగింది. ఆయా మార్కెట్లలో పెట్టుబడిదారులు తామ ఉండేందుకు గృహాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు.
- బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో విల్లాలు, అభివృద్ధి చేసిన ప్లాట్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ధరలు అందుబాటులో ఉండటం, మార్కెట్‌లో సానుకూల వాతావరణం నెలకొనడం, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలతో రాబోయే రోజుల్లో హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌లో ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని జేఎల్ఎల్ ఇండియా (రెసిడెన్షియల్ సర్వీసెస్) ఎండీ శివ కృష్ణన్ తెలిపారు. కరోనా ప్రారంభం నుంచి ల్యాండ్ బ్యాంక్‌ను సమీకరించిన డెవలపర్లు.. ఇప్పుడు కొత్త ప్రాజెక్ట్‌లను చేపట్టేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. దీంతో రెండో అర్ధ భాగం నుంచి గృహ లాంచింగ్స్‌లో వృద్ధి నమోదవుతుందని అంచనా వేస్తున్నారు.

క్లుప్తంగా...



సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి

టీజీసీపీసీఆర్ చైర్‌పర్సన్‌గా సీతా దయాకర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (టీజీసీపీసీఆర్) చైర్‌పర్సన్‌గా కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి నియమితులయ్యారు. సభ్యులుగా కంచర్ల వందనగౌడ్, మరిపల్లి చందన, బి.అపర్ణ, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్, బి.వచన్ కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిషన్ మూడేళ్ల పాటు కొనసాగుతుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సభ్యుల వయోపరి మితి 65 సంవత్సరాలు అని, నిర్దేశించిన గడు వు కంటే ముందే సభ్యులు 65 సంవత్సరాలు పూర్తి చేసుకుంటే పదవీ విరమణ అవుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం నూతన చైర్‌పర్సన్, సభ్యులు కమిషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు త్వరలోనే మోక్షం

జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు త్వరలోనే మోక్షం లభిస్తుందని, ఈ మేరకు ఉపముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి చెప్పారు. శుక్రవారం ప్రజాభవన్‌లో పలువురు ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాల్సిన అనివార్యతను ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో తమ వినతిపట్ల డిప్యూటీ సీఎం భట్టి సానుకూలంగా స్పందించారని, వీలున్నంత త్వరలోనే పెండింగ్ బిల్లులను విడుదల చేస్తామని హామీఇచ్చినట్టు లచ్చిరెడ్డి తెలిపారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాములు, రమేశ్‌పాక తదితరులున్నారు.

రిలయన్స్ డిజిటల్ రాయితీలు

సాక్షి, హైదరాబాద్: రిలయన్స్ డిజిటల్ సంస్థ తమ ఉత్పత్తులపై భారీగా 'డిజిటల్ డిస్కౌంట్స్'ఇచ్చేందుకు సిద్ధమైంది. భారత దేశంలో అతి పెద్ద ఎలక్ట్రానిక్స్ సంస్థ అయిన రిలయన్స్ డిజిటల్.. ప్రముఖ బ్యాంకు కార్డులు, పేపర్స్‌పై రూ.25000 వరకు రాయితీ ఇస్తోంది. ఏప్రిల్ 20 వరకు అన్ని రిలయన్స్ డిజిటల్ షోరూమ్స్, మై జియో స్టోర్స్, ఆన్‌లైన్ రిలయన్స్‌డిజిటల్.ఇన్‌లో ఎలక్ట్రానిక్స్ వస్తువుల కొనుగోలుపై రాయితీలు ఇస్తారని సంస్థ వెల్లడించింది.

భీమ జ్యువెలర్స్ 'బంగారం అంటే భీమ'

సాక్షి, హైదరాబాద్: భారతదేశంలో ప్రముఖ ఆభరణాల రిటైలర్ భీమ జ్యువెలర్స్ 'బంగారం అంటే భీమ'నినాదంతో సరికొత్త ప్రచారం ప్రారంభించింది. ఈ ఉత్సాహభరిత ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నటుడు రామ్‌చరణ్ వ్యవహరిస్తున్నారు. ఈ ప్రచారంలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంస్కృతికి అద్దం పట్టేలా.. హారాలు, వడ్డాణాలు, గుట్టపూసలు, చోకర్లు, నక్షి గాజులు, అద్భుతమైన ఝుమ్కాలు తదితర ఆభరణాల ప్రదర్శన ఉంటుంది. తాము బలంగా విశ్వసించే.. విలువలపై నమ్మకం, పారదర్శకత, అద్భుతమైన హస్తకళలను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుందని భీమ జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ అభిషేక్ బిందు మాధవ్ వెల్లడించారు.

అమెరికా ఎన్‌ఎస్‌ఎస్ కాంపిటీషన్స్‌లో నారాయణ హవా

సాక్షి, హైదరాబాద్: నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ కాంపిటీషన్స్‌లో 2024–25 విద్యాసంవత్సరంలో నారాయణ విద్యార్థులు సత్తాచాటారు. వరల్డ్ గ్రాండ్‌ప్రైజ్‌తో పాటు వరల్డ్ నెంబర్ వన్ స్థానంలో 12 సెలక్షన్స్ దక్కించుకున్నట్లు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు సింధూర నారాయణ, శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వరల్డ్ నెంబర్ 2 స్థానంలో 17, వరల్డ్ నెంబర్ 3 స్థానంలో 14 సెలక్షన్లతో పాటు 55 హానరబుల్ ప్రైజ్‌లను తమ విద్యార్థులు కై వసం చేసుకున్నారన్నారు. మొత్తం 99 ప్రాజెక్టుల్లో విజయకేతనం ఎగురవేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఘన విజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునీత్ ప్రత్యేకంగా అభినందించారు.



మండుటెండలతో ఆదిలాబాద్ జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీని ప్రభావం మనుషులే కాదు మూగజీవాలపైన పడుతోంది. మార్చి నెలాఖరు వరకు నిండుకుండలా ఉన్న తలమడుగు మండలం సుంకిడి గ్రామ వాగు.. ఎండల తీవ్రతకు అడుగంటింది. చిన్నపాటి మడుగుల్లో కొద్దిపాటి నీళ్లున్నాయి. ఇందులో కొంతమంది చేపల వేట సాగిస్తుండగా.. వాగులో అక్రమార్కులు ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. దాహం తీర్చుకునేందుకు వచ్చిన మూగజీవాలు నీటి కోసం అల్లాడిపోతున్నాయి.

.: సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్ :.




సాధారణంగా మామిడి చెట్ల కొమ్మలకు కాయలు కాస్తాయి. మహబూబాబాద్ మండలం మల్యాలకు చెందిన మర్రు సత్యనారాయణ మామిడి తోటలో మాత్రం.. చెట్టు కాండానికి మామిడి కాయలు కాశాయి. తోటలో వంద మామిడి చెట్లు ఉండగా.. 25 చెట్ల కాండాలకు 30 వరకు కాయలు ఉన్నాయి. అయిదేళ్లుగా ఇలాగే కాస్తున్నాయని రైతు తెలిపారు. కొమ్మ కత్తిరింపులతో కాండాలకు కాస్తున్నాయని పేర్కొన్నారు.

.: మహబూబాబాద్ రూరల్ :.

బనకచర్ల, ఆర్‌ఎల్‌ఐపై 'సుప్రీం'కు

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- ఏపీ ఈ రెండు ప్రాజెక్టులు అక్రమంగా నిర్మిస్తోంది
- వీటివల్ల రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులకు, తాగునీటికి ముప్పు

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా నదులపై అక్రమంగా నిర్మిస్తున్న బనకచర్ల, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం (ఆర్‌ఎల్‌ఐ)లపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించినట్టు రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణం నీటి ఒప్పందాల ఉల్లంఘననేనని అన్నారు. వీటివల్ల తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు, తాగునీటికి పెను ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్టులను అడ్డుకునేలా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు గాను న్యాయ నిపుణులు, సాగునీటి శాఖ స్టాండింగ్ కౌన్సిల్స్‌తో పాటు అడ్వొకేట్ జనరల్‌తో త్వరలోనే సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. శుక్రవారం జలసౌధలో సాగునీటి శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడారు.



నిబంధనలు ఉల్లంఘించి 'బనకచర్ల', ఆర్‌ఎల్‌ఐ

ఈ రెండు ప్రాజెక్టులపై సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. వేగవంతమైన, సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ఎలాంటి జాప్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత నియంత్రణ సంస్థల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ఏపీ ప్రభుత్వం ఏకపక్షంగా ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి ఉపక్రమించిందని చెప్పారు. గోదావరి, కృష్ణా బేసిన్‌లలో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటాను రక్షించేందుకు సుప్రీంకోర్టులో గట్టిగా కొట్లాడతామన్నారు. గోదావరి నదీ జలాల వివాదాల ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) చేసిన పంపకాలతో పాటు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని నిబంధనలను కూడా బనకచర్ల ప్రాజెక్టు ఉల్లంఘిస్తోందని, కేంద్ర జల సంఘం, గోదావరి బోర్డు, కృష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్‌ల నుంచి రావాల్సిన అనుమతులు కూడా రాలేదని చెప్పారు. ఆర్‌ఎల్‌ఐ పథకం విషయంలోనూ పర్యావరణ నిబంధనలు, నీటి నిల్వ తదితర విషయాల్లో ఉల్లంఘనలు జరుగుతున్నాయని మంత్రి చెప్పారు. అయితే తెలంగాణ ప్రభుత్వం పలుమార్లు కోరిన అనంతరం నిపుణుల కమిటీ ఈ పథకం పనులు నిలిపివేయాలని ఆదేశించిందని, అయినా ఏపీ ప్రభుత్వం ఇతర రూపాల్లో ప్రాజెక్టు పనులను కొనసాగిస్తోందని ఉత్తమ్ పేర్కొన్నారు.

దానివల్ల భద్రాచలానికీ ప్రమాదం

గోదావరి వరదను రాయలసీమకు తరలించడం ద్వారా టెంపుల్ సిటీ అయిన భద్రాచలానికి కూడా ప్రమాదం పొంచి ఉందని మంత్రి ఉత్తమ్ చెప్పారు. వరదలు సహజంగా ప్రవహించే స్థితి కోల్పోయేలా ఏపీ ప్రభుత్వం ముందుకెళుతోందని, భద్రాచలం చుట్టూ గోడ కట్టడం ద్వారా వరదల నుంచి భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదం రాకుండా కేంద్ర సాయాన్ని కోరతామని తెలిపారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో పూడికను తొలగించే పనులకు త్వరలోనే టెండర్లు పిలవాలని, ప్రతి నీటి చుక్కను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు అవసరమైన చర్యలన్నీ చేపడతామని చెప్పారు. సమీక్షలో సాగునీటి శాఖ ఉన్నతాధికారులు పలువురు పాల్గొన్నారు.

..పునరావాస కేంద్రాలుగా మార్చొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

నిధులు కేటాయించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం హామీ ఇచ్చారు. వీసీలందరూ తమ ఉమ్మడి సమస్యలు, అలాగే యూనివర్సిటీల వారీగా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావుతో సమావేశమై చర్చించాలని సూచించారు. వర్సిటీల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని చెప్పారు.

విద్యా వ్యవస్థలో మార్పులు చేయాలి

క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాల స్థాయిలో తీసుకురావాల్సిన మార్పులపై సమాజంలోని వివిధ సంఘాలు, ప్రముఖులతో చర్చించి సమగ్ర విధాన పత్రాన్ని రూపొందించాలని సూచించారు. ఇది ఆచరణకు దగ్గరగా ఉండాలని చెప్పారు. విద్యా రంగాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అవసరమైన నిధులు సమకూరుస్తామని భరోసా ఇచ్చారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో కూడా రేవంత్ సమీక్ష నిర్వహించారు. విద్యారంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని ఈ సందర్భంగా సీఎం చెప్పారు. పెద్ద ఎత్తున ఉపాధ్యాయుల నియామకం, అమ్మ ఆదర్శ పాఠశాలలకు కమిటీల ఏర్పాటు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నట్టు తెలిపారు.

ప్రాథమిక దశే పునాది

ప్రాథమిక దశలో అందే విద్య కీలకమని, విద్యార్థికి పునాది వేసేది ఇదేనని సీఎం తెలిపారు. ప్రాథమిక విద్య బలోపేతం చేస్తే ఉన్నత విద్యలో మరింత రాణిస్తారని అన్నారు. వివిధ రాష్ట్రాలు, దేశాల్లో ప్రాథమిక విద్యలో అనుసరిస్తున్న విధానాలను విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 1960 దశకం నుంచి ఇప్పటి వరకు విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన పలు సంస్కరణలు, విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి, ఆలోచన ధోరణి ఏ విధంగా క్షీణిస్తోందో ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ వివరించారు.

విద్యా ప్రమాణాలు ఎందుకు పడిపోతున్నాయ్?

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోవడంపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పరీక్ష (న్యాస్)లో విద్యార్థుల ప్రమాణాలు తగ్గిపోవడం, భాషల్లోనూ బలహీనంగా ఉండటాన్ని సీఎం ప్రస్తావించారు. అధికారుల నుంచి వివరణ కోరారు. అధికారులు దీనిపై ప్రతినెలా ఎందుకు సమీక్షించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికీ ప్రజల్లో ప్రభుత్వ స్కూళ్ళు సరిగా నడవవని, పాఠాలు సరిగా చెప్పరనే అపోహ ఉందంటూ, దీన్ని ఎలా దూరం చేస్తారో చెప్పాలన్నారు. ఈ దిశగా చేపట్టబోయే చర్యలపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ప్రైవేటు స్కూళ్ళు ప్రతి ఏటా ప్రవేశాలు పెంచుకుంటున్నాయని, ప్రభుత్వ స్కూళ్ళు మాత్రం ప్రజల్లో నమ్మకాన్ని కల్పించలేకపోవడంతో ప్రవేశాలు తగ్గుతున్నాయని సీఎం అన్నట్టు తెలిసింది.

వేసవి సెలవుల్లో టీచర్లకు ప్రత్యేక శిక్షణ

డిజిటల్, ఏఐ సాంకేతిక విద్యను ప్రాథమిక దశలోనే ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తున్నామని, దీనికి తగ్గట్టుగా టీచర్లూ తమ నాణ్యతను పెంచుకోవాలని సీఎం సూచించినట్టు సమాచారం. ఇలావుండగా వేసవి సెలవుల్లో ప్రభుత్వ టీచర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని రేవంత్ సూచించారు. ఈ సమీక్షల్లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, శ్రీనివాసరాజు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ప్రాథమిక విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డి, వీసీలు ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ టి.యాదగిరిరావు, ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, ప్రొఫెసర్ ఉమేష్ కుమార్, ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, ప్రొఫెసర్ కిషన్ కుమార్ రెడ్డి, ప్రొఫెసర్ టి.గంగాధర్, ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్, ప్రొఫెసర్ వి.నిత్యానందరావు, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

భారత్‌కు ఆస్ట్రేలియా నైపుణ్యాలు

- నైపుణ్య భాగస్వామ్యం కోసం సిద్ధంగా ఉన్నాం
- తెలంగాణ ప్రభుత్వంతోనూ దీనిపై చర్చిస్తాం
- ఆస్ట్రేలియా వ్యాపార, పెట్టుబడుల కమిషనర్ విక్‌సింగ్
- దేశంలోని పరిశ్రమ, విద్యా సంస్థలతో చర్చలు



మీడియాతో మాట్లాడుతున్న కెర్న్ ఫిలిప్స్, విక్‌సింగ్, మిష్, టానియా బీమెట్, ట్రిసా స్కాట్

సాక్షి, హైదరాబాద్: పరిశ్రమలకు ప్రపంచస్థాయి విద్య, నైపుణ్యాన్ని అందించడంలో ఆస్ట్రేలియా విద్యా సంస్థలు అంతర్జాతీయ గుర్తింపు పొందాయని ఆ దేశ వ్యాపార, పెట్టుబడుల కమిషనర్ విక్‌సింగ్ అన్నారు. భారత్‌లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకొనేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. శుక్రవారం ఆస్ట్రేలియా ఫ్యూచర్ స్కిల్స్ ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో పలు విద్యా సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమైంది. అనంతరం విక్‌సింగ్‌తో పాటు స్విన్‌బర్న్ యూనివర్సిటీ డైరెక్టర్ కెర్న్ ఫిలిప్స్, ఆర్ఎంఐటీ యూనివర్సిటీ డిప్యూటీ వైస్–చాన్సలర్ మిష్, ఎడిత్ కోవన్ వర్సిటీ అసోసియేట్ డీన్ టానియా బీమెట్, గ్రోత్ బెండిగో కంగన్ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ట్రిసా స్కాట్‌లు మీడియాతో మాట్లాడారు. 'ఆస్ట్రేలియా నైపుణ్య శిక్షణ రంగాన్ని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా, పరిశ్రమల ద్వారా రూపొందించారు. భారత్ నైపుణ్య అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తోంది. ఈ కృషిలో భాగం పంచుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నాం'అని విక్‌సింగ్ తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వంతో చర్చిస్తాం

ఆస్ట్రేలియాలో దాదాపు 1.30 లక్షల మంది భారత విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసిస్తున్నారని, ఆన్‌లైన్‌లో నైపుణ్యాభివృద్ధి పెంచుకునే ఉద్యోగులు, విద్యార్థులు మరో 40 వేల మంది ఉంటారని విక్‌సింగ్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిన అంశాన్ని ప్రస్తావిస్తూ.. ప్రభుత్వంతోనూ ఈ అంశంపై చర్చలు జరుపుతామని చెప్పారు. హైదరాబాద్ నగరం అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలకు (జీసీసీ) అడ్రస్‌గా మారుతోందని పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచ నైపుణ్య రాజధానిగా ఎదుగుతున్నవేళ, ఆస్ట్రేలియా వంటి గ్లోబల్ లీడర్లతో వ్యూహాత్మక భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఆస్ట్రేలియన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్ (ఆస్ట్రేడ్) తమ దేశ ప్రభుత్వ రంగ సంస్థ అని వివరించారు. మార్కెట్ సమాచారం, ఉత్పత్తులకు సంబంధించి ఆస్ట్రేలియా సామర్థ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా విస్తృతమైన ప్రపంచ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.

ఐఏఎస్ వాణీప్రసాద్ ఆంధ్రప్రదేశ్‌కే..

- కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ తీర్పు
- డీవోపీటీ ఉత్తర్వులను సమర్థించిన క్యాట్

సాక్షి, హైదరాబాద్: ఐఏఎస్ అధికారిణి వాణీప్రసాద్ ఆంధ్రప్రదేశ్‌లోనే పని చేయాలని కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్(క్యాట్) స్పష్టం చేసింది. గత అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం జారీ చేసిన ఉత్తర్వులను సమర్థిస్తూ తీర్పు వెలువరించింది. తనను తెలంగాణలోనే ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వాణీప్రసాద్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం.. ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటినుంచి కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. కొందరు క్యాట్‌ను ఆశ్రయించి ఉపశమనం పొందారు. క్యాట్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేంద్రం తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. ఈ వివాదంలో నిర్ణయం తీసుకునే బాధ్యతను డీవోపీటీకి అప్పగించింది. దీనిపై కేంద్రం దీపక్ ఖండేకర్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు కమిటీ.. అధికారుల విజ్ఞప్తులను తోసిపుచ్చుతూ ఎక్కడి వారు అక్కడికే వెళ్లాలని నివేదిక ఇచ్చింది. తక్షణమే ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్ర కేడర్ నుంచి రిలీవ్ కావాలని.. అక్టోబర్ 16లోగా కేటాయించిన రాష్ట్రంలో రిపోర్టు చేయాలని అక్టోబర్ 9న అధికారులను డీవోపీటీ ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్ వాణీప్రసాద్ క్యాట్‌ను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన తొలిరోజే వాణీప్రసాద్ ఏపీకి వెళ్లాలని ట్రిబ్యునల్ మధ్యంతర ఆదేశాలిచ్చింది. హైకోర్టు కూడా ఈ నిర్ణయాన్ని సమర్థించింది. దీంతో ఆమె ఏపీకి వెళ్లి స్పెషల్ చీఫ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వాణీప్రసాద్ పిటిషన్‌పై వాదనలు ముగియడంతో డాక్టర్ బస్వరాజ్ పట్నే(జ్యుడీషియల్), వరుణ్ సింధు కుల్ కౌముది(అడ్మినిస్ట్రేషన్) బెంచ్ మార్చి 4న తీర్పు రిజర్వు చేసింది. వాణీప్రసాద్ ఏపీలోనే పని చేయాలని గురువారం తీర్పు వెలువరించింది.

హైదరాబాద్‌కు చెందిన ఫాదర్... అమెరికాలో దారుణ హత్య

- అతి సమీపం నుంచి కాల్చి చంపిన దుండగుడు
- పోలీసుల అదుపులో అనుమానితుడు

సెనెకా (అమెరికా): హైదరాబాద్‌కు చెందిన క్యాథలిక్ మతగురువు ఫాదర్ అరుల్ కరసాల (57) అమెరికాలో గురువారం దారుణ హత్యకు గురయ్యారు. కాన్సాస్‌లోని సెనెకాలో మధ్యాహ్న సమయంలో ఒక వ్యక్తి చర్చి బయటే ఆయనపై సమీపం నుంచి మూడుసార్లు కాల్పులు జరిపారు. దాంతో కరసాల తీవ్రంగా గాయపడి కుప్పకూలిపోయారు. హుటాహుటిన అంబులెన్సులో ఆస్పత్రికి తరలించినా లాభం లేకపోయింది. కాన్సాస్‌లోని సెయింట్ మేరీస్‌లో ఉన్న ఇమ్మాక్యులేట్ కాన్సెప్ట్ చర్చి ఆయన మరణాన్ని ధ్రువీకరించింది. "గుర్తు తెలియని వ్యక్తి కాల్పుల్లో ఫాదర్ కరసాల మరణించారు. ఒక నాయకుడిని, స్నేహితుడిని కోల్పోయాం. ఈ హృదయ విదారక వార్తను వెల్లడించాల్సి రావడం బాధగా ఉంది" అని కాన్సాస్ సిటీ ఆర్చ్ బిషప్ జోసెఫ్ ఫ్రెడ్ నామన్ పేర్కొన్నారు. కాల్పులకు దారితీసిన పరిస్థితులపై అధికారులు ఎలాంటి సమాచారం వెల్లడించలేదు. ఇది ఓక్లహామాకు చెందిన గ్యారీ హెర్మెష్ అనే వ్యక్తి పనిగా అనుమానిస్తున్నారు. 66 ఏళ్ల హెర్మెష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఫాదర్ కరసాలది హైదరాబాద్. 1994లో కడప డయాసిస్ ఫాదర్‌గా చేశారు. ఆర్చ్ బిషప్ జేమ్స్ పి.కెలెహర్ ఆహ్వానం మేరకు 2004లో కాన్సాస్ వెళ్లారు. 2011లో అమెరికా పౌరసత్వం పొందారు. సెనెకాలోని సెయింట్స్ పీటర్, పాల్ కాథలిక్ చర్చిల్లో పాస్టర్‌గా చేశారు.

ప్రజలను చంపే హక్కు ప్రభుత్వాలకు లేదు



- మావోయిస్టులు ఆదివాసీల హక్కుల కోసం ముందుకు రావాలి
- శాంతి చర్చల కమిటీ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, ఇతర వక్తలు

సాక్షి, హైదరాబాద్: 'ప్రభుత్వానికి ప్రజలను చంపే అధికారం లేదు. వారిని రక్షించడానికి అధికారాన్ని ఉపయోగించాలి'అని శాంతి చర్చల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు పౌరహక్కుల నేతలు అభిప్రాయపడ్డారు. శాంతి చర్చలకు మావోయిస్టులు ముందుకు రావడం శుభపరిణామమని, శాంతి చర్చల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ భాగస్వామ్యం అయితేనే ఫలితం ఉంటుందని వారు సూచించారు. ప్రభుత్వానికి, మావోయిస్టులకు మధ్య శాంతిచర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లి విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో చర్చించారు. ఇందుకు రాజకీయ మద్దతు కూడగట్టడం కూడా ముఖ్యమేననే అభిప్రాయం వ్యక్తమైంది. భవిష్యత్తు కార్యాచరణ ముందుకు తీసుకెళ్లేందుకు జస్టిస్ చంద్రకుమార్ కన్వీనర్‌గా 15 మంది సభ్యులతో అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేసినట్టు సమావేశంలో ప్రకటించారు. శాంతి చర్చలపై మావోయిస్టు పార్టీ ప్రకటన నేపథ్యంలో శుక్రవారం శాంతి చర్చల కమిటీ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, కందిమల్ల ప్రతాప్‌రెడ్డి, జంపన్న, చెరుకు సుధాకర్, గాదె ఇన్నయ్య, ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. 'స్వీయ రక్షణ కోసం ఆయుధం కలిగి ఉండటం సరే కానీ ఒకరిని చంపకూడదు. ఖనిజాలను తవ్వడానికి మాత్రమే ప్రభుత్వం మావోయిస్టులను చంపుతోంది. అనవసర ప్రాణనష్టం లేకుండా మావోయిస్టులు శాంతిచర్చలకు ముందుకు రావడం ఆహ్వానించదగిన పరిణామం. ఆదివాసీయుల మౌలిక సమస్యలు, అటవీ ప్రాంతంలో ఖనిజాల సమస్యలపై చర్చకు రావాల్సిన అవసరం ఉంది'అని వక్తలు అభిప్రాయపడ్డారు. కాగా, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలన్న డిమాండ్‌తో ఈనెల 8న ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో ప్రజాధర్నా నిర్వహించనున్నట్టు న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

జీపీఓ మార్గదర్శకాలు సవరించాల్సిందే

- పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏలకు పరీక్ష వృథా ప్రయాసే
- సీనియార్టీ తీసేయాలి... లేదంటే 16 తర్వాత ఉద్యమం
- తెలంగాణ వీఆర్వోల జేఏసీ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కోసం నియమించ తలపెట్టిన గ్రామ పాలనాధికారుల (జీపీవో) పోస్టుల కోసం విడుదల చేసిన మార్గదర్శకాలను ప్రభుత్వం సవరించాల్సిందేనని, జీవో 129లో మార్పులు చేయాలని తెలంగాణ వీఆర్వోల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ నెల 16వ తేదీలోగా రాష్ట్ర ప్రభుత్వం ఈ సవరణలకు పూనుకోని పక్షంలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించింది. జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్ అధ్యక్షతన వీఆర్వోల జేఏసీ రాష్ట్రస్థాయి సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్ జేఏసీ నేతలు మారం జగదీశ్, ఏలూరి శ్రీనివాసరావు, వంగ రవీందర్‌రెడ్డి, హుస్సేన్ ముజీబ్, ట్రెసా నేత గౌతమ్‌కుమార్ తదితరులు హాజరై సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా గోల్కొండ సతీశ్ మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలో గతంలో దశాబ్దాలపాటు పనిచేసిన వారిని ఎలాంటి పరీక్షలు లేకుండా మళ్లీ రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కామన్ సీనియార్టీని వర్తింపజేయాలని, ఈ మేరకు ఇటీవల విడుదల చేసిన జీవోలో మార్పులు చేయాలని కోరారు. విద్యార్హత, చివరి తేదీ నిబంధనలను కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. గతంలో రెవెన్యూ శాఖలో ప్రశంసా పత్రాలు తీసుకున్న ఉద్యోగులకు మళ్లీ పరీక్షలు పెట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి తమ ఆవేదనను తెలియజేసేందుకు త్వరలోనే 25 వేల మంది పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏల కుటుంబసభ్యులతో ఆత్మగౌరవ సభను నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో 33 జిల్లాలకు చెందిన పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌కు మీనాక్షి

విద్యార్థి సంఘాలతో సమావేశమయ్యే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ శనివారం హైదరాబాద్ రానున్నట్లు సమాచారం. ఆమె గాంధీభవన్‌కు వస్తారని, హెచ్‌సీయూ వివాదం నేపథ్యంలో.. విద్యార్థి సంఘాలతో సమావేశమవుతారని కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

హైదరాబాద్ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతమ్‌రావు

- పార్టీ చీఫ్ కిషన్‌రెడ్డి ప్రధాన అనుచరుడికి టికెట్
- శుక్రవారం ప్రకటన.. ఆ వెంటనే నామినేషన్ దాఖలు
- ఈ నెల 23న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్



నామినేషన్ దాఖలు చేస్తున్న గౌతమ్‌రావు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ రెవెన్యూ జిల్లా పరిధిలో జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తన అభ్యర్థిగా ఎన్.గౌతమ్‌రావును ప్రకటించింది. శుక్రవారం ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్టానం ప్రకటించగానే, ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను నిలుపలేదు. దీంతో ఎంఐఎంకు ఈ సీటు దక్కకూడదన్న ఉద్దేశంతోనే బీజేపీ తన అభ్యర్థిని ప్రకటించింది. బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘం ఏబీవీపీలో వివిధ హోదాల్లో 25 ఏళ్లపాటు పనిచేసిన గౌతమ్‌రావు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా పేరు పొందారు.

112 ఓట్లు

ఈ ఎమ్మెల్సీ స్థానంలో 81 మంది కార్పొరేటర్లు, 31 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు (లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు) కలిపి మొత్తం 112 మంది ఓటర్లుగా ఉన్నారు. పార్టీ పరంగా చూస్తే బీజేపీకి చెందిన 25 మంది కార్పొరేటర్లలో ఐదుగురు పార్టీ ఫిరాయించగా, ఒకరు చనిపోయారు. వీరితోపాటు ఎంపీలు కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే టి.రాజాసింగ్, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి ఓట్లున్నాయి.

ధిక్కార స్వరం పెంచిన రాజాసింగ్

ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కిషన్‌రెడ్డి తన ప్రధాన అనుచరుడికి టికెట్ ఇప్పించారని విమర్శలు గుప్పిస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం టేబుల్ సాఫ్‌చేసేవాళ్లకు పదవులు, టికెట్లు ఇస్తున్నారని ఆరోపించారు. కాగా, దేశ ఐక్యతకు కట్టుబడి ఉన్న తమ పార్టీకి జీహెచ్‌ఎంసీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు తెలపాలని కార్పొరేటర్లకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు.


4 నామినేషన్ల దాఖలు

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. చివరిరోజైన శుక్రవారం బీజేపీ అభ్యర్థి గౌతమ్‌రావు, ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి నామినేషన్లు వేశారు. స్వతంత్ర అభ్యర్థిగా కంటె సాయన్న, చాలిక చంద్రశేఖర్‌లు ఇదివరకే నామినేషన్లు వేశారు. 7న నామినేషన్ల పరిశీలన జరుగనుంది. నామినేషన్ల ఉపసంహరణలకు 9వ తేదీ వరకు గడువుంది. 23వ తేదీన పోలింగ్ జరగనుంది.

నివాళి మనోజ్ కుమార్ (1937-2025)

'ఈ దేశం నీకేమిచ్చిందనేది కాదు...
ఈ దేశానికి నువ్వేమిచ్చావ్ అనేది చూడాలి' అన్నారు నెహ్రూ.
'జై జవాన్ జై కిసాన్' అన్నారు లాల్‌బహదూర్ శాస్త్రి.
ఈ దేశానికి ప్రధానులైన వారు ప్రజలను దేశం వైపు చూసేలా చేయగలిగారు.
ఈ స్ఫూర్తిని సినిమా రంగంలో మొదటగా అందుకున్న హీరో మనోజ్ కుమార్.
సినిమాల్లో తన పాత్రకు 'భారత్' అని పేరు పెట్టుకుని
అందరి చేత 'మిస్టర్ భారత్' అనిపించుకున్నాడు.
శుక్రవారం మరణించిన ఈ దేశభక్త నటుడికి నివాళి

వెండితెరకు మిస్టర్ భారత్



1974.

'రోటీ కపడా ఔర్ మకాన్' రిలీజైంది.

జనం మొదటిరోజు మొదటి ఆటకు వెళ్లారు.

ఫస్ట్‌సీన్... జేబులో డిగ్రీ పెట్టుకుని రోడ్ల మీద బేకార్‌గా తిరుగుతున్న హీరో ఒకచోట ఆగిపోయాడు. కారణం... పోలీస్ ఒకతనిపై తుపాకీ ఎక్కుపెట్టి 'చెప్పు... ఎవరు నువ్వు' అని అడుగుతున్నాడు.

'నేనా... ఢిల్లీ యూనివర్సిటీలో గ్రాడ్యుయేట్‌ని'...

'ఏం దొంగిలించుకుని వెళుతున్నావ్?'

'చూస్తావా...'

కోటు చాటున ఉన్న వస్తువు చూపించాడు.

రొట్టె ముక్క.

ఈ సీన్‌తోనే ఆనాటికి దేశంలో పేరుకొనిపోయిన ఆకలిని, నిరుద్యోగాన్ని చూపించి ప్రేక్షకుల గుండెలను గట్టిగా చరుస్తాడు మనోజ్ కుమార్. ఆ తర్వాతి సీను కప్పుకోవడానికి గుడ్డలేని పేద స్త్రీలు... నిలువ నీడలేని నిరుపేద కూలివాళ్లు. దర్శకుడు తీసిన కథ తమ కష్టాల గురించే అని జనం అర్థం చేసుకున్నారు. సినిమా సూపర్ హిట్ అయ్యింది.

'సినిమా అనేది సందేశాలివ్వడానికి కాదు అని కొందరు అంటారు... అనుకుంటారు. కాని నేను తీసేది మాత్రం ఏదో ఒక సందేశం ఇవ్వడానికి. సమాజం నుంచి ఎంతో పొందాం... బదులుగా మంచి మాట చెప్పడానికి ఏమిటి కష్టం' అంటాడు మనోజ్ కుమార్.

• • •

బాధ చూసినవాడు బహుశా బాధ్యతగా ఉంటాడు. పదేళ్ల వయసులో ఉండగా దేశ విభజన చూశాడు మనోజ్ కుమార్. నేటి పాకిస్తాన్‌లో ఉన్నా అబ్బాబాద్ నుంచి అతడి కుటుంబం ఢిల్లీకి వచ్చేసింది. రెఫ్యూజీ క్యాంప్‌లో ఉంటూ చదువుకున్నాడు. ఆ కష్టాలను మర్చిపోవడానికి అప్పుడప్పుడు మేనమామ వచ్చి సినిమాకు తీసుకెళ్లేవాడు. పన్నెండేళ్ల మనోజ్ చూసిన మొదటి సినిమా 'జుగ్నూ'. ఇందులో దిలీప్ కుమార్ హీరో. సినిమా చివరలో చనిపోతాడు. తర్వాత మనోజ్ మరో సినిమా చూశాడు. 'షహీద్'. ఇందులో కూడా దిలీప్ కుమార్ హీరో. సినిమాలో చనిపోతాడు. మనోజ్ చాలా విస్మయం చెంది ఇంటికొచ్చి తల్లిని అడిగాడు 'అమ్మా.. ఒక మనిషి ఎన్నిసార్లు చనిపోతాడు?'. 'ఒకసారే'. 'మరి రెండుసార్లు చనిపోతే?'... 'అలాంటి వాళ్లు దేవదూతలై ఉంటారు' అంది. 'అంటే సినిమా హీరోకు మరణం లేదన్నమాట. నేను హీరోను అవుతాను. దిలీప్ కుమార్ లాంటి హీరో' అనుకున్నాడు మనోజ్ కుమార్. అంతే కాదు దిలీప్ కుమార్ నటించిన 'షబ్నమ్' చూసి అందులో దిలీప్ పేరు 'మనోజ్' అని ఉంటే 'నేను పెద్దయ్యి హీరో అయ్యాక ఆ పేరే పెట్టుకుంటాను' అనుకున్నాడు. అనుకున్నట్టుగానే హీరో అయ్యాడు. అదే పేరుతో విఖ్యాతం అయ్యాడు. ఎంతగా అంటే అతని అసలు పేరు హరికిషన్ గిరి గోస్వామి అని ఎవరికీ తెలియనంత!

• • •

ఢిల్లీ నుంచి బాంబే వచ్చి సినిమా అవకాశాల కోసం చాలా కష్టపడ్డాడు మనోజ్ కుమార్. వాళ్ల నాన్న కవి. ఇతనికి కూడా రాయడం వచ్చింది. కొన్నాళ్లు ఘోస్ట్ రైటర్‌గా పని చేశాడు. సినిమాల్లో 'ఎక్స్‌ట్రా'గా కూడా కనిపించాడు. దిలీప్ కుమార్‌ను ఇమిటేట్ చేస్తూ ఇతను చేస్తున్న నటన ఖరీదైన దిలీప్ కుమార్‌ను బుక్ చేసుకోలేకపోయేవారిని ఆకర్షించింది. మెల్లగా అవకాశాలు వచ్చాయి. 1960లో వచ్చిన 'కాంచ్ కీ గుడియా'తో తొలిసారి హీరోగా కనిపించాడు. సినిమా ఫ్లాప్ అయ్యింది. మరికొన్ని సినిమాలు కూడా ఫ్లాప్ అయ్యాయి. అదే సమయంలో హీరో అవకాశాలు పొందడానికి డింకీలు కొడుతున్న ధర్మేంద్ర, శశి కపూర్‌లతో దోస్తీ కట్టి ఎక్కే స్టూడియో దిగే స్టూడియోగా ఉండేవాడు. ముగ్గురి జాతకం బాగుంది... ముగ్గురూ పెద్ద హీరోలయ్యారు. కాని మిగిలిన ఇద్దరి కంటే మనోజ్ ఎక్కువ నైపుణ్యాలు ప్రదర్శించాడు. నటుడు, రచయిత, ఎడిటర్, నిర్మాత, దర్శకుడు... అన్నింటికి మించి దేశభక్తి అనే అంశాన్ని సినిమాకు ఫార్ములాగా మార్చగలిగిన మేధావి అయ్యాడు.

• • •

పెద్ద హీరోల రొమాంటిక్ సినిమాల హవా నడుస్తున్న రోజుల్లో డాన్స్ ఏ మాత్రం చేయలేని, లిమిటెడ్ బాడీ లాంగ్వేజ్ ఉన్న మనోజ్ కుమార్ సీరియస్ సబ్జెక్ట్స్ తనను గట్టెక్కిస్తాయని భావించాడు. భగత్‌సింగ్‌లాంటి కేరెక్టర్ తన ఇమేజ్‌ను పెంచుతుందని ఆ సినిమా చేయాలనుకున్నాడు. కాని భగత్ సింగ్‌కు సంబంధించి సినిమా తీసేంత సమాచారం ఆ రోజుల్లో లేదు. మనోజ్ కుమారే నాలుగేళ్లు తిరిగి సమాచారం సేకరించి కథ తయారు చేయడంలో కీలకపాత్ర పోషించాడు. 1965లో వచ్చిన 'షహీద్'... భగత్ సింగ్ మీద వచ్చిన తొలి భారతీయ సినిమా. పెద్ద హిట్ అయ్యింది. అంతేకాదు 'నర్గిస్‌దత్ జాతీయ పురస్కారం' గెలుచుకుంది. ఈ సందర్భంగా ఢిల్లీకి వెళ్లినప్పుడు నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి సినిమాను చూశారు. మరుసటి రోజు టీకి ఆహ్వానించి మనోజ్‌తో 'నేను జై జవాన్ జై కిసాన్ నినాదం ఇచ్చాను కదా. నువ్వు ఆ నినాదం పై సినిమా తీయరాదూ' అని అడిగారు. దేశ ప్రధాని కోరిన కోరిక మనోజ్‌ను సూటిగా తాకింది. ఒక నోట్‌బుక్, పెన్ను పట్టుకుని ఢిల్లీలో రైలెక్కి ముంబైలో దిగేలోపు 'ఉప్‌కార్' స్క్రిప్ట్ రాశాడు. దర్శకుడు కావాలనే కోరిక అప్పటి వరకూ మనోజ్‌కు లేదు. కాని ప్రధానిని ఇంప్రెస్ చేసేలా సినిమా తీయాలంటే తానే దర్శకుడిగా మారక తప్పదు అనుకున్నాడు. అంటే ఒక ప్రధాని వల్ల దర్శకుడైన ఏకైక వ్యక్తి మనోజ్. భారతదేశంలో రైతుకు ప్రాధాన్యం ఇవ్వాలని, సైనికులకు బాసటగా నిలవాలని మనోజ్ తీసిన 'ఉప్‌కార్' అతణ్ణి అంబరంలో కూచోబెట్టింది. అవార్డుల రాసి పోసింది. 'మేరే దేశ్ కీ ధర్తీ' పాట జనాన్ని ఊపేసింది. సినిమాలో పాత్రకు పెట్టిన పేరు భారత్ మనోజ్ కుమార్ నిక్‌నేమ్ అయ్యింది. 'మిస్టర్ భారత్'.

• • •

పాశ్చాత్య సంస్కృతి చెడ్డది కాకపోయినా దానిని చెడ్డగా ఇమిటేట్ చేస్తున్న వారిపై 'పూరబ్ ఔర్ పశ్చిమ్' తీశాడు మనోజ్. మన సంస్కృతి మనకు ముఖ్యం అని చాటాడు. ఇక దేశంలో నిరుద్యోగం, యువకుల్లో పేరుకుపోతున్న అనిశ్చితి పై 'రోటీ కపడా ఔర్ మకాన్' తీశాడు. నేటికీ ప్రభుత్వాలు ఈ మూడూ అందించడానికి ఆపసోపాలు పడుతూనే ఉన్నాయి. ఇక బ్రిటిష్ వారు ఆక్రమించుకున్న చిన్న సంస్థానాల నుంచి వారిపై సాయుధ పోరాటం చేసిన వారి కథతో తీసిన భారీ చిత్రం 'క్రాంతి' సూపర్‌డూపర్ హిట్ అయ్యి భాష తెలియని ప్రాంతాల్లో కూడా పెద్ద కలెక్షన్లు రాబట్టింది. కార్మికుల సమస్యలతో 'షోర్' తీశాడు. చిరుద్యోగుల తరపున 'క్లర్క్' తీశాడు.

• • •

హోమియోపతి డాక్టర్

మనోజ్ కుమార్ మంచి హోమియోపతి డాక్టర్. అతనికి ఒకసారి చెంప మీద నర్వ్ వచ్చింది. అల్లోపతిలో ఎన్ని వైద్యాలు చేసినా పని చేయలేదు. నటుడికి ముఖాన నర్వ్ చాలా ప్రమాదం. ఆ సమయంలో మద్రాసులో షూటింగ్‌లో ఉండగా హోమియోపతి ప్రాక్టీసు చేసే నటుడు అశోక్ కుమార్ ఒక డోస్ మందు వేశాడు. వారంలో నర్వ్ మాయమైంది. మనోజ్‌కు ఇది ఎంతగా ఆసక్తి రేపిందంటే అతడు హోమియోపతి డాక్టర్ల కంటే ఎక్కువగా హోమియోపతి చదివి ఆ వైద్యం ప్రాక్టీసు చేయడానికి సర్టిఫికెట్ పొందాడు. చాలామందికి హోమియోపతి వైద్యం చేశాడు.

తెలుగు సినిమాల్లో మనోజ్ కుమార్

మనోజ్ కుమార్ తెలుగు ప్రేక్షకులకు తెలియకుండా తెలుగు సినిమాల్లో ఉన్నాడు. ఆయన తీసిన 'ఉప్‌కార్' తెలుగులో కృష్ణ హీరోగా 'పాడిపంటలు'గా రీమేక్ అయ్యి హిట్ అయ్యింది. మరో సూపర్‌హిట్ 'రోటీ కపడా ఔర్ మకాన్' తెలుగులో శోభన్ బాబు హీరోగా 'జీవన పోరాటం' పేరుతో రీమేక్ అయ్యింది. హిందీలో అమితాబ్ వేసిన పాత్రను తెలుగులో రజనీకాంత్ చేశాడు. మనోజ్ కుమార్ నటించిన 'ఓ కౌన్ థీ' తెలుగులో జగ్గయ్య, జయలలిత కాంబినేషన్‌లో 'ఆమె ఎవరు'గా వచ్చింది. 'హిమాలయ్ కీ గోద్ మే' శోభన్ బాబు హీరోగా 'డాక్టర్ బాబు'గా వచ్చింది. 'దస్ నంబరీ' పెద్ద హిట్ కావడంతో ఎన్టీఆర్ హీరోగా 'కేడీ నంబర్ 1' పేరుతో రీమేక్ చేశారు. చిరంజీవి నటించిన 'మగ మహారాజు' సినిమాలో ఏడు రోజులు సైకిల్ తొక్కే సన్నివేశం ఒరిజినల్ మనోజ్ కుమార్ నటించిన 'షోర్'లో ఉంది.



'ఓ కౌన్ థీ' చిత్రంలో సాధనాతో....

మనోజ్ కుమార్ కన్నుమూత

సుప్రసిద్ధ సినీనటుడు, దర్శకుడు మనోజ్ కుమార్ (87) శుక్రవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. చాలాకాలంగా వెన్నునొప్పితోనూ, వయసు సంబంధమైన ఇతర రుగ్మతలతోనూ బాధపడుతున్న మనోజ్‌కుమార్ ముంబైలోని కోకిలా బెన్ ఆస్పత్రిలో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు. కునాల్, విశాల్. వీరిలో కునాల్ హీరోగా కొన్ని సినిమాల్లో నటించాడు. దేశభక్తి సినిమాలతో ఖ్యాతి పొందిన మనోజ్‌కుమార్‌ను 1992లో పద్మశ్రీ, 2015లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులు వరించాయి. షహీద్, ఉప్‌కార్, పూరబ్ ఔర్ పశ్చిమ్, క్రాంతి తదితర సూపర్‌హిట్ సినిమాలు మనోజ్ దర్శకత్వంలో రూపొందాయి.



ఆకాంక్షలో స్వచ్ఛత, ప్రయత్నంలో శ్రమ ఉంటే విజయం వరిస్తుందనడానికి మనోజ్ కుమార్ జీవితం ఒక ఉదాహరణ. ఏ హీరోని అయితే చూసి హీరో అయ్యాడో ఆ దిలీప్ కుమార్‌తో 'ఆద్మీ'లో నటించగలిగాడు మనోజ్ కుమార్. అదే దిలీప్ కుమార్‌ను డైరెక్ట్ చేసి 'క్రాంతి'గా సూపర్‌హిట్ సాధించగలిగాడు. తగిన ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వలేక ముఖాన్ని చేతుల్లో దాచుకునే మేనరిజంతో ఫేమస్ అయిన మనోజ్‌ను అప్పుడప్పుడు కళాకారులు అదే మేనరిజంతో ఆటపట్టించడం కద్దు. షారూక్ ఖాన్ 'ఓమ్ శాంతి ఓమ్'లో మనోజ్‌ను ఇమిటేట్ చేసి ఆయనకు కోపం తెప్పించాడు. పరువు నష్టం దావా వేసే వరకూ వ్యవహారం వెళ్లి తర్వాత సద్దుమణిగింది.

మనోజ్ కుమార్ నిజమైన దేశ ప్రేమికుడు. తన సినిమాల్లో అన్ని మతాల, వర్గాల వారి పాత్రలు సృష్టించి దేశమంటే మనుషులోయ్ అని చూపించినవాడు.

నేటి హేట్ ఫిల్మ్స్ మధ్యలో మనోజ్ భావధార వెనుకబడ్డట్టు అనిపించిన అంతిమంగా గెలవబోయేది అదే. ఎందుకంటే విలువల వరుసలో మానవత్వం ముందు ఉండి తర్వాతే కదా మతం ఉండేది.

సెల్యూట్ మిస్టర్ భారత్.

బ్యూటిప్స్

వేసవిలో మేకప్ ఎక్కువసేపు ఉండాలంటే...

పొడి చర్మం: వేసవిలో మేకప్‌కు ముందు మాయిశ్చరైజర్ రాయాల్సిన అవసరం ఉండదు. అయితే చెమట ప్రతాపానికి మేకప్ పోకుండా వాటర్ ప్రూఫ్ మేకప్ వాడటం మేలు. లిక్విడ్ ఫౌండేషన్‌ని ఉపయోగించిన తర్వాత మస్కారా, లైనర్‌తో కళ్లను తీర్చిదిద్దుకోవాలి. తర్వాత పెదవులకు లిప్ లైనర్, గ్లాస్‌ను ఉపయోగించాలి. బుగ్గలకు బ్లష్‌ను అద్ది, టిష్యూ పేపర్‌తో టచ్ చేస్తూ అదనపు రంగును తీసేయాలి.



జిడ్డు చర్మం: వేసవిలో మరింత జిడ్డుగా మారుతుంది. అలాంటప్పుడు ముందుగా ఐస్‌తో ముఖమంతా రబ్ చేసి, తర్వాత ఫౌండేషన్‌ని ఉపయోగించాలి. మేకప్‌కు ముందు బేస్ కోసం ప్రైమర్ లోషన్ (మార్కెట్లో లభిస్తుంది)ని ఉపయోగించాలి. దానిమీద కాంపాక్ట్, ఫౌండేషన్ వాడకుండా వాటర్ బేస్డ్ పాన్‌కేక్స్‌ను ఉపయోగించాలి. తర్వాత కళ్లు, పెదవులు, బుగ్గలు తీరుగా తీర్చిదిద్దుకోవాలి.

సాధారణ చర్మం: చాలామంది సాధారణ చర్మతత్వం గలవారని అంటుంటారు కానీ, వీరిది కాంబినేషన్ స్కిన్ అనవచ్చు. ముఖంలో నుదురు, గడ్డం జిడ్డు అవుతుంది. అందుకని వీరు కూడా మేకప్‌కు ముందు ఐస్‌తో ముఖమంతా రబ్ చేయాలి. నుదురు, గడ్డానికి ప్రైమర్ లోషన్‌ని బేస్‌గా వాడి తర్వాత కళ్లు, పెదవులు, బుగ్గలను తీర్చిదిద్దుకోవాలి.

ఓనర్‌షిప్

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఉన్న పథకాలు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెట్ మెళకువలు, అందుతున్న రుణాలు, వడ్డీ రేటు, సబ్సిడీలు, ఎక్కడ.. ఎలా దరఖాస్తు చేసుకోవాలి, అవసరమైన డాక్యుమెంట్లు, సక్సెస్ రేట్ వంటి వివరాలను "ఓనర్‌షిప్" పేరుతో ప్రతి శనివారం అందిస్తున్నాం!
ఈ వారం స్కీమ్ కిసాన్ క్రెడిట్ కార్డ్

వ్యవసాయ అనుబంధ పరిశ్రమల కోసం...

కిసాన్ క్రెడిట్ కార్డ్



ప్రధాన మంత్రి మత్స్యకార అభివృద్ధి పథకం కింద పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. అందులో ఒకటి కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) స్కీమ్. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల కింద రైతులు పాడి, పశువులు, చేపల పెంపకం వంటివి ప్రారంభించడానికి కేసీసీతో దరఖాస్తు చేసుకొని రుణాన్ని పొందవచ్చు. కొన్ని రాష్ట్రాలు మత్స్య సంపద అభివృద్ధి కోసం వడ్డీలేని ప్రత్యేక రుణాలు, గ్రాంట్లు, బీమా పథకాలు వంటివీ అందిస్తున్నాయి. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా చేపల పెంపకం యూనిట్లకు రుణాలు మంజూరు చేస్తున్నాయి. చేపలు, రొయ్యల పెంపకంలో అధిక దిగుబడి, లాభాల కోసం ప్రభుత్వం అందిస్తున్న శిక్షణను పొందడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ముఖ్యం. పరిశుభ్ర వాతావరణంలో చేపల అమ్మకాలను ప్రోత్సహించడానికి ఈ శాఖ చేపల మార్కెట్‌ల నిర్మాణాలనూ చేపడుతోంది. ఇప్పటివరకు రూ.760.89 లక్షల ఆర్థిక వ్యయంతో 84 చేపల మార్కెట్లను మంజూరు చేసింది. అలాగే మత్స్యకారుల సహకార, పొదుపు సంఘాలనూ ఏర్పాటు చేసింది. మత్స్యకారులు, చేపల పెంపకందారుల (ఫిష్ ఫార్మర్స్) మూలపెట్టుబడి అవసరాలకు (విత్తనాలు, దాణా, సేంద్రియ ఎరువులు, చార్జీలు, ఇంధనం, విద్యుత్ చార్జీలు, బీమా, శ్రమ, లీజు, అద్దె, నిర్వహణ ఖర్చులు మొదలైనవి) సరళీకృత విధానంలో ఒకే విండో కింద సకాలంలో తగినంత రుణ సహాయాన్ని అందించడం కిసాన్ క్రెడిట్ పథకం ముఖ్య లక్ష్యం. అంతేకాక కొన్ని ప్రత్యేక స్కీమ్‌ల కింద పడవలు, వినియోగ వస్తువులు, వలలు, గాలాలు వంటి వాటికీ సబ్సిడీ అందుతోంది.

"తెలంగాణ ప్రభుత్వ రాజీవ్ యువ వికాస పథకానికి ఏప్రిల్ 14 ఆఖరు..

తెలంగాణ యువతను ఆంట్రప్రెన్యూర్‌షిప్ వైపు నడిపించడానికి తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రారంభించింది. దీనికింద రూ. నాలుగు లక్షల వరకు రుణసహాయాన్ని అందిస్తోంది. రాయితీ సౌకర్యమూ ఉంది. దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 14.. ఆఖరు తేదీ. ఆ గడువులోపే అప్లై చేసుకోవాలి."



– బి.ఎన్. రత్న
బిజినెస్ కన్సల్టెంట్, దలీప్
మీ సందేహాలను పంపవలసిన మెయిల్ ఐడీ
ownership.sakshi@gmail.com
నిర్వహణ : సరస్వతి రమ

దర్గాలో సీతారామ కల్యాణం

- భద్రాచలం తరహాలోనే కల్యాణ వేడుకల నిర్వహణ
- వేద పండితుల ఆధ్వర్యంలో కల్యాణం, పట్టాభిషేకం
- తెల్లని దుస్తులు, నెత్తిన టోపీతో వేడుకలు తిలకించే భక్తులు
- మతసామరస్యానికి ప్రతీక ఇల్లెందు నాగుల్ మీరా దర్గా



కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేద పండితులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలోని హజ్రత్ నాగుల్ మీరా మౌలా చాన్ దర్గా షరీఫ్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది.. శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఈ దర్గాలో సీతారాములకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించడమే కాదు ఆ మరుసటి రోజు కోదండ రాముడికి ఘనంగా పట్టాభిషేకం కూడా చేస్తారు.

ఇల్లెందు పట్టణానికి చెందిన సత్యనారాయణ ఈ దర్గాకు మాలిక్‌గా ఉన్నారు. 1960వ ప్రాంతంలో నాగుల్‌మీరా ఆయనకు కలలో కనిపించి సత్యనారాయణపురం సమీపంలోని అడవుల్లో తాను ఉన్నానని చెప్పారు. అప్పటి నుంచి ఈ గుట్టపై ఓ చెట్టు కింద పుట్టలో కొలువై ఉన్న నాగుల్‌మీరాను ఆయన పూజించడం ప్రారంభించారు. కాలక్రమంలో ముస్లింలతో పాటు హిందువులు, క్రిస్టియన్లు ఈ దర్గాకు రావడం మొదలైంది. 1972 నాటికి ఈ అడవిలో దర్గా వెలిసింది. గడిచిన పాతికేళ్లలో ఉమ్మడి ఖమ్మం జిల్లానే కాకుండా వరంగల్, కరీంనగర్, నల్గొండ, హైదరాబాద్ నుంచి కులమతాలకు అతీతంగా ఇక్కడికి భక్తులు రావడం మొదలైంది. ఈ క్రమంలో 2008లో కొందరు భక్తులు తమిళనాడు నుంచి సీతారాముల పంచలోహ విగ్రహాలను దర్గా ఆవరణలో ప్రతిష్ఠించి పూజించడం ప్రారంభించారు. దర్గా ఆవరణలో ఒకవైపు మహ్మదీయ సంప్రదాయ ప్రకారం ప్రార్థనలు నిర్వహిస్తూనే మరోవైపు హిందూ సంప్రదాయంలో శ్రీరాముడికి పూజలు చేసే ఆనవాయితీ మొదలైంది.

నవమి కల్యాణం

శ్రీరామనవమి సందర్భంగా నాగుల్‌మీరా దర్గా ఆవరణలో తొలిసారిగా 2013లో శ్రీరాముడికి కల్యాణం, ఆ మరుసటి రోజు పట్టాభిషేకం జరిపించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా ఈ వేడకలు నిర్వహించగా భక్తులు కులమతాలకు అతీతంగా ఈ వేడుకలను కనులారా వీక్షించారు. హిందూ – ముస్లిం భాయి భాయి అనే స్ఫూర్తికి మరోసారి ప్రాణప్రతిష్ఠ చేశారు. అప్పటి నుంచి ప్రతి నవమికి ఇక్కడ కల్యాణం, పట్టాభిషేక వేడుకలను కన్నులపండువగా నిర్వహిస్తున్నారు.

పట్టాభిషేకం ప్రత్యేకం

శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఆలయాల్లో శ్రీరాముడి కల్యాణం జరిపిస్తారు. అంతటితో వేడుకలు ముగిస్తారు. భద్రాచలం తరహాలోనే సత్యనారాయణపురం దర్గాలో కూడా పట్టాభిషేకం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని తొమ్మిది మంది వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపిస్తూ శ్రీరాముడికి కిరీటధారణ చేస్తారు.

దమ్మక్క వారసుల తలంబ్రాలు

పోకల దమ్మక్క అనే గిరిజన మహిళ తొలిసారిగా భద్రాచలంలో సీతారాములకు పూజాదికాలు నిర్వహించింది. భద్రాద్రి రాముడికి తొలిసారిగా పూజలు అందించిన పోకల దమ్మక్క వారసుల్లో కొందరు నవమి సందర్భంగా దర్గాలో జరిగే కల్యాణ తంతుకు తొలి తలంబ్రాలు పంపిస్తారు. అదే విధంగా సత్యనారాయణపురం గ్రామంలోని రామాలయంలో జరిగే శ్రీరాముడి కల్యాణానికి దర్గా నుంచి ముత్యాల తలంబ్రాలు పంపే విధానం కూడా మొదలు పెట్టారు. రాబోయే రోజుల్లో ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీరాముడికి గుడిని నిర్మించాలని సంకల్పించారు. ఈ దర్గా ప్రాంగణంలోనే చర్చి, మసీదు, గురుద్వారాలను కూడా నిర్మిస్తామని భవిష్యత్తులో సకల మతాల సమ్మేళనానికి ఈ దర్గాను వేదికగా మారుస్తామని ఇక్కడి భక్తులు అంటున్నారు.

– సూరం శ్రావణ్‌రెడ్డి,
సాక్షి, ఇల్లెందు రూరల్

వంటిల్లు

వడపప్పు



కావలసినవి: పెసరపప్పు – కప్పు, పచ్చి కొబ్బరి ముక్కలు– పది

తయారీ: పెసరపప్పును కడిగి పప్పు మునిగేటట్లు నీటిని పోసి నాననివ్వాలి. రెండు గంటల పాటు నానిన తర్వాత నీటిని వడపోసి కొబ్బరి పలుకులు కలపాలి. దేవుడికి నైవేద్యంగా పెట్టే వడపప్పును ఇలాగే చేయాలి. రుచికోసం నానిన పెసరపప్పులో అరకప్పు మామిడి తురుము, చిటికెడు ఉప్పు కలిపి పోపు పెట్టుకోవచ్చు.

పానకం



కావలసినవి: బెల్లం – 100 గ్రా, మిరియాలు – పది (పొడి చేయాలి), ఏలకులు – ఆరు (పొడి చేయాలి)

తయారీ: బెల్లంలో ఒక గ్లాసు నీటిని పోసి కరగనివ్వాలి. ఒక గంట తర్వాత బెల్లం నీటిని పలుచని తెల్లని వస్త్రంతో వడపోయాలి. వడపోసిన బెల్లం నీటిలో మిరియాల పొడి, ఏలకుల పొడి కలిపితే పానకం రెడీ.

చక్కెర పొంగలి



కావలసినవి: బియ్యం – కప్పు, శనగపప్పు – గుప్పెడు, **పాలు** – మూడు కప్పులు, **చక్కెర** – ఒకటిన్నర కప్పు, **ఏలకులు** – పది, (పొడి చేయాలి), **జీడిపప్పు, కిస్‌మిస్**– ఒక్కొక్కటి పది, **నెయ్యి**– మూడు టీ స్పూన్లు

తయారీ: ముందుగా బాణలిలో నెయ్యివేసి, జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి పక్కన ఉంచాలి. బియ్యం, శనగ పప్పు కడిగి అందులో పాలు పోసి, జీడిపప్పు వేయించగా మిగిలిన నేతిని కూడా బియ్యం – పాలలో వేసి ప్రెషర్ కుకర్‌లో ఉడికించాలి. కుకర్‌లో ప్రెషర్ తగ్గిన తర్వాత మూత తీసి పాయసం మిశ్రమంలో చక్కెర, ఏలకుల పొడి వేసి, చక్కెర కరిగే వరకు కలిపి జీడిపప్పు, కిస్‌మిస్‌తో గార్నిష్ చేసి మూత పెట్టాలి. పది నిమిషాలకు అన్నానికి తీపి బాగా పట్టి రుచిగా ఉంటుంది.

● యోగా

శ్వాస మరింత మెరుగ్గా!

శరీరం, మనస్సును సమన్వయం చేయడంలో శ్వాస కీలకపాత్ర పోషిస్తుంది. యోగా ద్వారా శ్వాసలోని లోపాలు, ఒత్తిడి, నిరాశ లను అదుపు చేయవచ్చు. మానసిక స్థిరత్వాన్ని మెరుగ పరచుకోవచ్చు.

శ్వాస వ్యాయామాలు...

● ఉజ్జయి శ్వాసను సముద్ర శ్వాస పద్ధతితో పోల్చుతారు. ముక్కు ద్వారా దీర్ఘంగా గాలి పీల్చి, ముక్కు ద్వారా వదలడం. దీనిని సాధారణంగా అష్టాంగ, విన్యాస తరగతులలో ఉపయోగిస్తారు. ● మూడుభాగాల శ్వాసగా పిలిచే ఈ పద్ధతిలో బొడ్డు, ఛాతీ, దిగువ వీపును గాలితో నింపి, ఆపై రివర్స్ క్రమంలో ఉచ్ఛ్వాసం చేయడం జరుగుతుంది. ఇది విశ్రాంతిని, ఆక్సిజన్ సరఫరాను పెంచుతుంది. మెరుగైన దృష్టిని ప్రోత్సహిస్తుంది.



● నాలుకను గొట్టం మాదిరి ముడిచి, వంకరగా ఉంచుతూ నోటి ద్వారా శ్వాస పీల్చుకోవడం, ఆపై ముక్కు ద్వారా ఊపిరి పీల్చడాన్ని సితాలి శ్వాస అంటారు.

● భ్రమరి శ్వాస ఆందోళన, నిరాశను తగ్గించడంలో సహాయపడుతుంది. చూపుడు వేలును ముక్కుపైన ఉంచాలి. ముక్కు ద్వారా శ్వాస పీల్చుకోవాలి. శ్వాస వదిలేటప్పుడు తేనెటీగ లాగా హమ్ చేయాలి.

● కపాలభాతి శ్వాసను 'బ్రెయిన్ మెరిసే శ్వాస' అని కూడా పిలుస్తారు. ఇది చిన్న, శక్తివంతమైన ఉచ్ఛ్వాసాలపై దృష్టి పెడుతుంది. దీర్ఘంగా శ్వాస పీల్చుకుని, ఆపై ముక్కు ద్వారా 15–30 సార్లు గాలిని వదలాలి. ● నాడి శోధన శ్వాసను 'ప్రత్యామ్నాయ నాసికా ప్రాణాయామం' అని కూడా అంటారు. ఒక ముక్కు రంధ్రాన్ని మూసి, మరొకదాని ద్వారా శ్వాస తీసుకొని, వదలాలి.

ఈ వివిధ యోగా శ్వాస పద్ధతులను సాధన చేయడం వల్ల శారీరక, మానసిక శ్రేయస్సు బాగా పెరుగుతుంది.



కిచెన్ గార్డెన్‌తో పిల్లల అల్లరికి చెక్



వేసవి వచ్చేసింది. పరీక్షలు అయిపోగానే పిల్లలకు సెలవలు. తల్లిదండ్రులకు అసలు పరీక్షాకాలం మొదలవుతుందప్పుడే. అయితే ఈ సెలవల్లో వారిని వేసవి 'శిక్షణా కేంద్రాలలో చేర్చేసి చేతులు దులుపుకునే కంటే వారి చేత క్రియేటివ్‌గా ఏదైనా పని చేయిస్తే ఎలా ఉంటుంది? అదీ వంటింటి వ్యర్థాలతోనే వారి చిట్టి చేతులతో పెరటి తోట పెంచి, అందులో పూలు, కాయలు, పళ్లూ పెంచితే..? ఇంకెందుకాలస్యం? వెంటనే పనిలోకి దిగుదామా మరి!

వంటింటి వ్యర్థాలతో కంపోస్ట్ ఎరువు తయారు చేసి కిచెన్ గార్డెన్‌లో పెరిగే మొక్కలకు ఎరువుగా వాడితే అవి ఏపుగా పెరిగి నవనవలాడే పూలూ, కాయలూ, పండ్లూ ఇస్తాయి. అసలు ఇంత వరకూ కిచెన్ గార్డెన్ లేదా టెర్రస్ గార్డెన్ లేనివారు ఏం చేయాలి మరి?

టమోటా పంట

టెర్రస్ గార్డెన్‌లో సులువుగా పెంచదగ్గవి టమోటాలే. ఈసారి టొమోటోలు తరిగేటప్పుడు బాగా పండిన టొమోటోలోని గింజలను ఒక పేపర్ టవల్ మీదికి తీసుకోవాలి. మీ పిల్లలను ఆ పేపర్ టవల్‌ను గాలికి ఎగిరిపోకుండా జాగ్రత్తగా ఎండబెట్టమనండి. ఒక కంటెయినర్‌లో మట్టి నింపి, ఆ మట్టిలో ఈ విత్తనాలను పాతి రోజూ కాసిని నీళ్లు చిలకరిస్తూ ఏం జరుగుతుందో గమనించమనండి. వారం తిరిగేసరికి వాటిలో నుంచి మొలకలు రావడం గమనించి వాళ్ల పెదవులు సంబరం తో విచ్చుకోవడాన్ని మీరే గమనిస్తారు. వాటిని సంరక్షించి ఒకదానికి ఒకటి తగలకుండా కొంచెం దూరం దూరంగా పాతి, కాస్త ఎండ తగిలేలా పెట్టి, రోజూ నీళ్లు పోస్తూ ఉంటే నెల తిరిగేసరికల్లా చిన్ని చిన్ని టొమాటోలను చూసి వాళ్లే ఎగిరి గంతులేస్తారు చూడండి.

ఉల్లి మొక్కలు...

ఉల్లిమొక్కలు.. స్ప్రింగ్ ఆనియన్లు పెంచుకోవడం అన్నింటికన్నా తేలిక. ఉల్లిపాయలు తరిగేటప్పుడు పైన ఆకుపచ్చటి మొలకల్లా ఉండే భాగాన్ని తీసిపారేస్తుంటాం కదా... అలాంటివన్నింటినీ సేకరించాలి. ఒక కంటెయినర్ లో నీళ్లు పోసి వాటికి నీళ్లు తగిలేలా ఈ తొడిమ భాగాన్ని ఉంచాలి. రెండు మూడు రోజులకోసారి ఆ నీటిని మారుస్తూ ఉండాలి. వారం తిరిగేసరికల్లా రెండు మూడు అంగుళాలకు పైగా ఉల్లి కాడలు రావడం గమనిస్తారు. వాటిని తీసి కుండీలలో లేదా నేరుగా గార్డెన్‌లోని మట్టిలో పాతి రోజూ కాసిని నీళ్లు చిలకరిస్తూ ఉంటే సరి.. కొద్దిరోజులలోనే పైన ఉండే కాడలు ఎండిపోయి కింద ఉల్లిపాయలు ఊరి ఉంటాయి. ఉల్లి కాడల్ని కూడా అప్పుడప్పుడు పైనుంచి కట్ చేసుకుని సలాడ్స్‌లో వాడితే రుచిగా ఉంటాయి.

మెంతి మొక్కలు...

స్పూను మెంతులు తీసుకుని గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టాలి. వాటిని ఒక పేపర్ టవల్‌లో వేసి మట్టిలో పెట్టి రోజూ నీళ్ల చిలకరిస్తూ ఉంటే సరి మెంతికూర పెరుగుతుంది. మనకు కావలసిన సైజులోకి రాగానే వాటిని కోసుకుని వాడుకోవచ్చు.

బంగాళదుంప...

బంగాళ దుంప మీద కళ్లలా ఉండే చిన్న చిన్న భాగాలుంటాయి. అలా ఉన్న వాటిని కొద్దిగా ముక్క ఉండేలా కోసి తీసి కుండీలో పాతి, రోజూ నీళ్లతో తడపాలి. వారం తిరిగేసరికి వాటినుంచి మొలకలు వస్తాయి. వాటిని నేరుగా గార్డెన్‌లో నాటవచ్చు లేదా కుండీల్లోనే ఉంచి రోజూ కొద్దిగా నీళ్లు పోస్తూ ఉంటే కొద్దిరోజుల్లోనే ఏపుగా పెరిగి పైన ఉన్న ఆకులు ఎండిపోయి, కింద బంగాళదుంపలు ఊరి ఉండటాన్ని గమనించవచ్చు.



ఇవే కాదు.. ఇంకా పుదీనా కాడలను కూడా ఆకులు కట్ చేసుకుని కాండాన్ని కుండీలలో నాటి రోజూ కాసిని నీళ్లు పోస్తూ ఉంటే మొక్కలు పచ్చగా చిగురిస్తాయి.

అలాగే ధనియాలను కూడా వాటిని ఒక పాత న్యూస్ పేపర్ మీద పోసి పైన ఫ్లాట్‌గా ఉండే కంటెయినర్‌తో రుద్దాలి. ఒక్కొక్కటి రెండుగా విడిపోయేలా చేయాలి. వాటిని నీళ్లలో నానబెట్టి కుండీలలో పాతితే కొత్తిమీర పెరుగుతుంది.



గార్డెనింగ్ నేర్పించడం వల్ల పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుంది. ఓపిక, క్రమశిక్షణ, జాగ్రత్తగా సంరక్షించడం, నా అనే భావన కలుగుతాయి.

కాబట్టి ఈ వేసవిలో వారి చేత గార్డెనింగ్ చేయించండి. మొక్కలతోపాటే వారిలో వికాసం కూడా పెరుగుతుంది.

లైఫ్@360

వర్కవుట్స్ వీరికి వర్కవుట్ కాదు!



వర్కౌట్స్ చేయడం ఎన్నో ప్రయోజనాలు అందించినప్పటికీ కొన్ని సమస్యలు ఉన్నవారు వర్కవుట్స్ చేయకపోవడమే మంచిది. వారెవరో తెలుసుకుందాం.

ఎముకలు, కండరాల సమస్యలు...

లిగమెంట్స్ సమస్యలు, బెణుకులు, కీళ్ల గాయలు, ఎముకల పగుళ్ల వంటి సమస్యలు ఉన్నవారు వర్కౌట్ చేయడం వల్ల మరింత నష్టమవుతుంది కాబట్టి, ఈ సమస్యలున్నవారు పూర్తిగా కోలుకున్న తర్వాతే వర్కవుట్స్ చేయాలి. అదే విధంగా వళ్లు నొప్పులు ఎక్కువగా ఉన్నా వర్కవుట్స్ చేయకూడదు.

సర్జరీలు...

కొన్నిసార్లు సర్జరీలు జరుగుతాయి. వీటి తర్వాత శరీరం కోలుకోవడానికి కొద్దిగా సమయ పడుతుంది. సర్జరీలు అయిన వెంటనే వర్కౌట్స్ చేస్తే ఇంటర్నల్ బ్లీడింగ్ కావొచ్చు. ఇతర సమస్యలు కూడా వస్తాయి. అదేవిధంగా స్త్రీలు సిజేరియన్ వంటి ఆపరేషన్ తర్వాత కోలుకునేవరకూ వాకింగ్ వంటి తేలికపాటి వ్యాయామాలతోనే సరిపెట్టుకోవాలి.

గుండె సమస్యలు...

అరిథ్మియా, గుండె సమస్యలు, హై బ్లడ్ ప్రెజర్, హార్ట్ ఫెయిల్యూర్, గుండె సమస్యలు ఉన్నవారు డాక్టర్ సలహా లేకుండా వర్కౌట్స్ చేయొద్దు. కష్టమైన వర్కౌట్స్ అసలే వద్దు. ఎక్కువ ఎఫెక్టివ్‌గా ఉండే వర్కౌట్స్ గుండెపై ప్రెజర్‌ని పెంచుతాయి. దీని వల్ల ఛాతీ నొప్పి, హార్ట్ బీట్‌లో తేడా వచ్చి ఏకంగాగుండె ఆగిపోయే ప్రమాదమే ఉంది కాబట్టి, వర్కౌట్స్ చేసే ముందు డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది.

ఇన్ఫెక్షన్, ఫీవర్‌తో బాధపడేటప్పుడు...

మీరు ఏదైనా ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నప్పుడు, ముఖ్యంగా జ్వరంతో ఉన్నప్పుడు ఎంత రెస్ట్ తీసుకుంటే అంత మంచిది. అలాంటి సమయంలో వర్కౌట్స్ చేయడం వల్ల డీహైడ్రేట్ అవుతారు. హార్ట్ బీట్ పెరుగుతుంది. కండరాల బలహీనత, అలసట పెరుగుతుంది. అంతేకాకుండా గాయాలు అవుతాయి. అందుకే, జ్వరం తగ్గేవరకూ వర్కౌట్స్ జోలికి పోకపోవడమే మంచిది.

● మీకు తెలుసా?

ఉదయం కాఫీనే ఉత్తమం



చాలా మందికి ఉదయం లేచి బ్రష్‌చేసుకోగానే వేడి వేడి ఫిల్టర్ కాఫీ తాగనిదే రోజు ప్రారంభం కాదు. ఉదయాన్నే కాఫీ తాగడం వల్ల మెదడు, శరీరం మేల్కొంటాయని చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. ఎందుకంటే కాఫీలోని ప్రధాన ఉద్దీపనమైన కెఫీన్ మెదడులోని అడెనోసిన్ గ్రాహకాలను అడ్డుకుంటుంది, మనం నిద్రపోకుండా చేస్తుంది. దాంతోపాటు ఒత్తిడిని నియంత్రించడంలో సహాయపడే కార్టిసాల్ అనే హార్మోన్ సహజంగా ఉదయం పూటే ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో కాఫీ తాగడం వల్ల మన శరీరం సహజ శక్తి స్థాయిలను భర్తీ చేయవచ్చు. ఇది మన రోజును ప్రారంభించడానికి అవసరమైన ఉత్సాహాన్ని ఇస్తుంది.

అందువల్ల మీ రోజును ప్రారంభించడంలో... మీ సహజ శక్తి స్థాయిలను పెంచడంలో మీకు ఉపకరించేది ఉదయం పూట తాగే కాఫీనే కాబట్టి పొద్దున లేవగానే కాఫీ తాగేవారు ఇక ఉత్సాహం తెచ్చుకోవచ్చు. ఆ తర్వాత కూడా ఒకటి రెండు కప్పుల వరకు కాఫీ తాగడం వల్ల ప్రమాదం ఏమీ ఉండదు. అయితే రాత్రి పూట కాఫీ తాగే అలవాటే అంతమంచిది కాదని అధ్యయనాలు చెబుతున్నాయి.

సాక్షి సినిమా

ఆగస్టులో కూలీ



● రజనీకాంత్

రజనీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కూలీ'. ఈ మూవీ విడుదల తేదీ ఫిక్స్ అయింది. ఆగస్టు 14న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించింది చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నాగార్జున, ఉపేంద్ర, శ్రుతీహాసన్ కీలక పాత్రలు పోషించారు. సన్ పిక్చర్స్‌పై కళానిధి మారన్ నిర్మించారు. శనివారం ఈ చిత్రం విడుదల తేదీ ప్రకటించి, రజనీకాంత్ కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. కాగా ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ అతిథి పాత్ర చేశారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఏఐ కూడా ఊహించలేదుగా...



● కేతికా శర్మ, శ్రీవిష్ణు, ఇవాన

శ్రీవిష్ణు హీరోగా, కేతికా శర్మ, ఇవాన హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సింగిల్'. కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ సినిమా మే 9న రిలీజ్ కానుంది. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'శిల్పి ఎవరో...' అంటూ సాగే తొలి పాటను విడుదల చేశారు. ఈ పాటకి శ్రీమణి సాహిత్యం అందించగా, యాజిన్ నిజార్ పాడారు. 'ఏఐ కూడా ఊహించలేదుగా ఇంత అందాన్ని ఏం చెప్పినా' అనే పల్లవితో ఈ పాట ఆరంభం అవుతుంది. ''తన జీవితంలోని ఇద్దరమ్మాయిల (కేతిక, ఇవానా) అందంపై శ్రీవిష్ణు ప్రశంసలు కురిపిస్తూ ఈ పాట సాగుతుంది'' అని యూనిట్ పేర్కొంది.

ఫీల్ గుడ్ లవ్



● పృథ్వీ అంబర్, సుమయ

సుమయ రెడ్డి హీరోయిన్‌గా, రచయితగా, నిర్మాతగా రూపొందించిన చిత్రం 'డియర్' ఉమ. సుమయ రెడ్డి, పృథ్వీ అంబర్ జంటగా నటించారు. సాయి రాజేశ్ మహాదేవ్ స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించిన ఈ చిత్రం ఈ నెల 18న రిలీజ్ కానుంది. ''కొత్త పాయింట్‌తో ఫీల్ గుడ్ ఎమోషనల్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొందించాం. ఈ చిత్రంలో మంచి ప్రేమకథతో పాటు చక్కని సందేశం కూడా ఉంది'' అని యూనిట్ పేర్కొంది.

నవ్వించడం అనేది గొప్ప వరం - హీరో ఎన్టీఆర్



● కల్యాణ్ శంకర్, రామ్ నితిన్, సంగీత్ శోభన్, నార్నే నితిన్, రాధాకృష్ణ, ఎన్టీఆర్, హారిక, నాగవంశీ, త్రివిక్రమ్

''షూటింగ్‌కి వెళ్లి కెమేరా ముందు నిల్చున్న ప్రతిసారీ నాకు వణుకు వస్తుంటుంది. అలాగే మీ ముందు (ఫ్యాన్స్) మాట్లాడాలన్నా... (నవ్వుతూ). ఒక నటుడికి వినోదం పండించడం అనేది చాలా కష్టం. అందుకే నేను 'అదుర్స్ 2' చేయడానికి కాస్త భయపడుతున్నాను. మళ్లీ జీవితంలో అలాంటి కామెడీ మూవీ వస్తుందో లేదో'' అని హీరో ఎన్టీఆర్ అన్నారు. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ హీరోలుగా నటించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సునీల్, 'సత్యం' రాజేశ్, కార్తికేయ, విష్ణు, ప్రియాంకా జవాల్కర్, రెబ్బా మోనికా జాన్ (స్పెషల్ సాంగ్) ఇతర పాత్రలు పోషించారు. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం మార్చి 28న విడుదలైంది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'మ్యాడ్ స్క్వేర్' సక్సెస్‌మీట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన **ఎన్టీఆర్ మాట్లాడుతూ–** ''అభిమాన సోదరులకు పేరు పేరునా కృతజ్ఞతలు. చాలా కాలమైంది మనం కలుసుకుని. నవ్వించడం అనేది చాలా గొప్ప వరం. ఎన్ని బాధలు, కష్టాలు ఉన్నా మనల్ని నవ్వించే మనిషి ఉంటే చాలు కదా అనిపిస్తుంది. ఈ రోజు దర్శకుడు కల్యాణ్ శంకర్ మనకి దొరికాడు. 'మ్యాడ్ స్క్వేర్'తో మళ్లీ సక్సెస్ కొట్టిన కల్యాణ్‌కి అభినందనలు. ఓ బ్లాక్‌బస్టర్ మూవీ సీక్వెల్‌తో జనాలని రంజింపచేయడం చాలా కష్టం. కానీ మీరు సాధించారు. ఇలాంటి దర్శకుడికి అండగా నిలిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు థ్యాంక్స్. ఈ మూవీలో మురళీధర్ గారు అద్భుతంగా నటించారు. లడ్డు పాత్ర చేసిన విష్ణు లేకుంటే ఈ సినిమా ఇంత పెద్ద హిట్ కాదేమో? అనిపించింది. డైరెక్టర్ శోభన్‌గారి అబ్బాయిలు సంతోష్, సంగీత్‌లను చూస్తే ఆయన గుర్తొస్తారు. మనకి బాగా ఇష్టమైన వాళ్లు మనకి దూరమైనా మన చుట్టూనే ఉంటారు. మీ నాన్నగారు కూడా గర్వపడుతుంటారు. 'మ్యాడ్'లో రామ్ నితిన్‌ని చూస్తే నేను యంగ్‌గా ఉన్నప్పుడు ఎలా ఉన్నానో అలానే ఉన్నారు. నాకు 2011లో పెళ్లయింది. నార్నే నితిన్ అప్పుడు చాలా చిన్నపిల్లాడు. నాతో ఎక్కువ మాట్లాడేవాడు కాదు. కానీ, ధైర్యం చేసి నా వద్దకు వచ్చి నాతో చెప్పిన ఒకే ఒక్క మాట 'బావా... నేను యాక్టర్ అవుతాను' అని.. అంతే ధైర్యంగా నేను 'నా సపోర్ట్ నీకు ఉండదు... పోయి చావ్ అన్నాను'. కానీ, ఇండస్ట్రీలో తన కెరీర్ ఎలా ఉండబోతోంది? అనే భయం ఉండేది. నీకు నువ్వుగా ముందుకెళ్లు అన్నాను. తనే నిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళ్లాడు. ఈ రోజు తనని చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. సునీల్ లేకపోతే 'మ్యాడ్ స్క్వేర్' లేదు. సంగీత దర్శకుడు భీమ్స్, రచయిత కాసర్ల శ్యామ్‌తో పాటు ఈ సినిమాకి పని చేసిన అందరికీ అభినందనలు. వీళ్లందరి వెనకాల కనపడని ఓ శక్తే మా చినబాబు. త్వరలోనే మేం ఓ సినిమా చేయబోతున్నాం. ఇక 'దేవర' చిత్రాన్ని ఆదరించినందుకు, మీ (ఫ్యాన్స్) భుజాలపైన మోసినందుకు ధన్యవాదాలు. 'దేవర 2' కచ్చితంగా ఉంటుంది. కాకపోతే మధ్యలో ప్రశాంత్ నీల్‌గారు వచ్చారు. నేను ఫ్యాన్స్ కోసమే కష్టపడుతుంటాను. మిమ్మల్ని ఆనందపరచడానికే బతికుంటాను. మీరెప్పుడూ కాలర్ ఎత్తుకునేలాగే ప్రయత్నిస్తాను.. అప్పుడప్పుడు కుదరకపోయినా పర్లేదు.. కానీ మీకోసం కష్టపడుతూనే ఉంటాను'' అన్నారు. **డైరెక్టర్ త్రివిక్రమ్ మాట్లాడుతూ–** ''మ్యాడ్ స్క్వేర్' సినిమా నటీనటులకు, సాంకేతిక నిపుణులందరికీ కంగ్రాట్స్. నేను వచ్చినప్పటి నుంచి 'జై ఎన్టీఆర్.. జై ఎన్టీఆర్' అనే స్లోగన్స్ చూస్తుంటే... జేఏఐఎన్‌టి... జెయింట్ గుర్తొస్తోంది. సో.. ఎన్టీఆర్ జెయింట్'' అన్నారు.


ఈ వేడుకలో 'మ్యాడ్ స్క్వేర్' నటీనటులు, సాంకేతిక నిపుణులు, పంపిణీదారులకు షీల్డ్‌లు ప్రదానం చేశారు.

కారులో తిరగ్గలనా అనుకున్నాను - సంపూర్ణేష్ బాబు



''నేను నటించిన 'హృదయ కాలేయం' విడుదలై పదకొండేళ్లయింది. ఇన్నేళ్లలో హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు చిత్రాల్లో నటించాను. ఈ నెల 25న 'సోదరా' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను. మరో రెండు సినిమాలు కూడా రిలీజ్‌కు సిద్ధంగా ఉన్నాయి'' అని సంపూర్ణేష్ బాబు తెలిపారు. సాయి రాజేశ్ నీలం స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'హృదయ కాలేయం'. ఈ మూవీ ద్వారా సంపూర్ణేష్ బాబు హీరోగా పరిచయమయ్యారు. 2014 ఏప్రిల్ 4న ఈ చిత్రం విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ మూవీ 11వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం సంపూర్ణేష్ బాబు విలేకరులతో మాట్లాడుతూ– ''నరసింహాచారిగా చిన్న పల్లెటూరి నుంచి వచ్చిన నన్ను 'హృదయ కాలేయం'తో సంపూర్ణేష్ బాబుగా మార్చిన సాయి రాజేశ్ అన్నకు రుణపడి ఉంటాను. ఈ మూవీ టైమ్‌లో డైరెక్టర్ రాజమౌళిగారు చేసిన ట్వీట్ వల్ల నాకెంతో గుర్తింపు దక్కింది. 'హృదయ కాలేయం' టైమ్‌లో సందీప్ కిషన్ అన్న, మారుతి, తమ్మారెడ్డి భరద్వాజగార్లు ఎంతో సపోర్ట్ చేశారు. నా జీవన విధానానికి, 'బిగ్ బాస్' పరిస్థితికి సరిపోక ఆ షోలో ఉండలేకపోయాను. నా సంపాదనలో కొంత విరాళంగా ఇవ్వడం ఎంతో సంతృప్తిని కలిగిస్తోంది. కనీసం కారులో తిరగ్గలనా? అనుకున్న నన్ను విమానంలో తిరిగేలా చేశారు సాయి రాజేశ్ అన్న'' అని తెలిపారు.

బాలీవుడ్ ఐకాన్ మనోజ్ కుమార్ మృతికి ప్రముఖుల స్పందన



''మా నాన్న ఇప్పుడు దుఃఖం నుంచి బయటపడ్డారు'' అని పేర్కొన్నారు బాలీవుడ్ ప్రముఖ స్టార్ మనోజ్ కుమార్ తనయుడు కునాల్ గోస్వామి. కొన్నేళ్లుగా ఆయన పలు ఆరోగ్య సమస్యలతో పోరాడుతూ, మంచానికి పరిమితం అయ్యారని తెలిపారు. సినిమాలకు దూరమయ్యాక ప్రశాంత జీవితంలోకి వెళ్లిపోయారని, కానీ ఆరోగ్య సమస్యలతో అప్పుడప్పుడు ఆస్పత్రిలో చేరడం... ఇంటికి రావడం జరిగేదని, ఈ మధ్య నిమోనియాతో ఆస్పత్రిలో చేర్చామని కూడా పేర్కొన్నారు కునాల్. మనోజ్ కుమార్‌కి భార్య శశి గోస్వామి, ఇద్దరు తనయులు విశాల్, కునాల్ ఉన్నారు. నటుడుగా–దర్శక–నిర్మాతగా–రచయితగా బాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన మనోజ్ కుమార్ శుక్రవారం తుది శ్వాస విడిచారు. శనివారం ముంబైలోని పవన్ హన్స్ శ్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు జరుగుతాయి. ఇక మనోజ్ కుమార్ మృతి పట్ల పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు ఈ విధంగా స్పందించారు.

● ''భారతీయ సినిమాకి ఆయన ఐకాన్. దేశభక్తి విషయంలో ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారు. ఆయన చిత్రాలోనూ దేశభక్తి ప్రతిబింబించింది. మనోజ్ జీ పని జాతీయ స్థాయిలో స్ఫూర్తి నింపింది. తర తరాలుగా స్ఫూర్తినిస్తుంటుంది. ఓం శాంతి'' అని 'ఎక్స్' ద్వారా పేర్కొన్నారు **ప్రధాని నరేంద్ర మోదీ.**

● ''సైనికులు, రైతులు, ఇతర జాతీయ హీరోల పాత్రలకు వెండితెరపై ప్రాణం పోసిన మనోజ్ కుమార్ మన జ్ఞాపకాల్లో నిలిచిపోతారు. ఆయన సినిమాలు జాతికి గర్వకారణం, తరతరాలకు స్ఫూర్తిదాయకం'' అని **రాష్ట్రపతి ద్రౌపది ముర్ము** 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

● ''ఆయన నాకు ఆప్త మిత్రుడు. సినీ పరిశ్రమలో మా తొలి నాళ్లల్లో మేం ఎక్కువ సమయం గడిపేవాళ్లం. ఆయనతో నాకెన్నో జ్ఞాపకాలు ఉన్నాయి'' అని మనోజ్ కుమార్ పార్థివ దేహాన్ని సందర్శించిన **సీనియర్ నటుడు ధర్మేంద్ర** పేర్కొన్నారు.

● ''ఆయనది అద్భుతమైన వ్యక్తిత్వం. కానీ ప్రభుత్వం నుండి పొందాల్సిన గౌరవం దక్కని వ్యక్తి. ఆయన దేశానికి ఎంతో సేవ చేశారు. తన ప్రతి సినిమాలో భారత దేశం గురించి సందేశం ఇచ్చారు. భారతరత్న అందుకోవాల్సిన వ్యక్తి ఆయన'' అని **సీనియర్ నటుడు ప్రేమ్ చోప్రా** అన్నారు.

● ఇంకా నటి హేమ మాలిని, ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్ తదితరులు మనోజ్ కుమార్ మృతికి సంతాపం తెలిపారు.

ఒక్కసారిగా...



● ఇంద్ర రామ్, పాయల్ రాధాకృష్ణ

'ధమాకా' మూవీ ఫేమ్ డైరెక్టర్ నక్కిన త్రినాథ రావు 'చౌర్య పాఠం' చిత్రంతో నిర్మాతగా మారారు. ఇంద్ర రామ్, పాయల్ రాధాకృష్ణ హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రంతో నిఖిల్ గొల్లమారి దర్శకునిగా పరిచయమవుతున్నారు. నక్కిన నెరేటివ్ బ్యానర్‌పై నక్కిన త్రినాథరావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. దావ్ జాండ్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'ఒక్కసారిగా...' అంటూ సాగే పాటని హీరో వరుణ్ తేజ్ విడుదల చేశారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించిన ఈ పాటని అనురాగ్ కులకర్ణి పాడారు. ''క్రైమ్, కామెడీ డ్రామాగా రూపొందిన చిత్రం 'చౌర్య పాఠం'. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన 'ఒక్కసారిగా...' పాట ఆకట్టుకుంటుంది'' అన్నారు మేకర్స్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	931	75,365
నిఫ్టీ ▽	346	22,904

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	15,800	▽ 756
డోజోన్స్	39,017	▽ 1,529
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,055	▽ 420
డాక్స్	20,642	▽ 1,076
షాంఘై (గురువారం ముగింపు)	3,342	▽ 9
నికాయ్	35,781	▽ 955

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	90,014	△ 331
బంగారం (99.5 స్వచ్ఛత)	89,983	△ 667
వెండి (కిలో)	92,910	▽ 3,047

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	83.40	87.08
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	108.44	113.32
€	యూరో	భారతీయ	91.80	96.31
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	49.74	54.48
S$	సింగపూర్ డాలర్	భారతీయ	61.34	66.01
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.83	23.39
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	22.32	24.10
¥	చైనా యువాన్	భారతీయ	10.83	12.65

పసిడి ర్యాలీకి బ్రేక్

- 10 గ్రాములకు రూ.1,350 డౌన్
- ఢిల్లీలో రూ.93,000కు పరిమితం

న్యూఢిల్లీ: పసిడి ఐదు రోజుల వరుస ర్యాలీకి శుక్రవారం బ్రేక్ పడింది. ఒకరోజు భారీ నష్టాన్ని చూసింది. ఢిల్లీలో 10 గ్రాముల (99.9 శాతం స్వచ్ఛత) ధర రూ.93,000కు దిగొచ్చింది. అంతర్జాతీయంగా నెలకొన్న బలహీన ధోరణి ధరలు తగ్గడానికి కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. అంతక్రితం రోజు గురువారం పసిడి రూ.200 పెరిగి ఆల్‌టైమ్ గరిష్టం రూ.94,350ని నమోదు చేయడం తెలిసిందే. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం 10 గ్రాములకు రూ.1,350 నష్టపోయి రూ.92,550 వద్ద ముగిసింది. వెండి సైతం నాలుగు నెలల్లో భారీ నష్టాన్ని (ఒకరోజులో) చూసింది. కిలోకి రూ.5,000 నష్టంతో ఢిల్లీలో రూ.95,500కు దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం 80 డాలర్ల నష్టపోయి 3,040 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



ఆర్‌బీఐ గవర్నర్ సంతకంతో కొత్త నోట్లు

త్వరలోనే రూ.10, రూ.500 నోట్లు విడుదల

ముంబై: ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకం చేసిన మహాత్మాగాంధీ సిరీస్‌తో నూతన రూ.10, రూ.500 నోట్లు త్వరలో మార్కెట్లోకి రానున్నాయి. ఈ విషయాన్ని ఆర్‌బీఐ స్వయంగా ప్రకటించింది. రూ.10, రూ.500 నోట్ల డిజైన్ గత సిరీస్ నోట్ల మాదిరే ఉంటుందని స్పష్టం చేసింది. గతంలో ఆర్‌బీఐ జారీ చేసిన రూ.10 నోట్లు అన్నీ చెల్లుతాయని పేర్కొంది. అలాగే, మహాత్మాగాంధీ చిత్రంతో గతంలో జారీ చేసిన రూ.500 నోట్ల చెల్లింపు కొనసాగుతుందని వెల్లడించింది. గవర్నర్ మల్హోత్రా సంతకం చేసిన కొత్త రూ.100, రూ.200 నోట్లను విడుదల చేయనున్నట్టు ఆర్‌బీఐ గత నెలలో ప్రకటించడం గమనార్హం. ఆర్‌బీఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ స్థానంలో మల్హోత్రా 2024 డిసెంబర్‌లో బాధ్యతలు స్వీకరించడం తెలిసిందే.



బేర్ విశ్వరూపం!

- టారిఫ్ టెర్రర్‌కు ఆజ్యం పోసిన మాంద్యం ఆందోళనలు
- 931 పాయింట్లు క్షీణించి 76 వేల స్థాయి దిగువకు సెన్సెక్స్
- 23 వేల స్థాయిని కోల్పోయిన నిఫ్టీ; 346 పాయింట్ల నష్టం
- ఫార్మా, మెటల్ షేర్లలో భారీ అమ్మకాలు
- ఇన్వెస్టర్లకు రూ.10 లక్షల కోట్ల నష్టం

ముంబై: వాణిజ్య యుద్ధ భయాలకు ఆర్థిక మాంద్యం ఆందోళనలు తోడవడంతో ప్రపంచ మార్కెట్లు కకావికలం అవుతున్నాయి. ముందురోజు వాల్‌స్ట్రీట్ బ్లడ్‌బాత్ దెబ్బకు శుక్రవారం కూడా బేర్ విశ్వ రూపం ప్రదర్శించింది. దీంతో మన స్టాక్ సూచీలు ఒక శాతానికి పైగా నష్టపోయాయి. క్రూడాయిల్ ధరల అనూహ్య క్షీణత, అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్ షేర్ల భారీ పతనం అంశాలు మరింత ఒత్తిడిని పెంచాయి. సెన్సెక్స్ 931 పాయింట్లు నష్టపోయి 76 వేల స్థాయి దిగువన 75,365 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 346 పాయింట్లు కోల్పోయి 23వేల స్థాయి దిగువన 22,904 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,055 పాయింట్లు క్షీణించి 75,240 వద్ద, నిఫ్టీ 382 పాయింట్లు పతనమై 22,868 వద్ద కనిష్టాలు తాకాయి. ఎఫ్‌ఎంసీజీ షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు నష్టాలు చవిచూశాయి. సూచీల వారీగా మెటల్ 6%, ఫార్మా 4%, క్యాపిటల్ గూడ్స్, ఆయిల్ అండ్ గ్యాస్, ఇండస్ట్రియల్స్, ఇంధన, రియల్టీ, ఐటీ ఇండెక్సులు 3% చొప్పున నష్టపోయాయి.

- ఫార్మా రంగంపై గతంలో లేనంతగా భారీగా టారిఫ్‌లు ఉండబోతున్నాయంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో దేశీయ ఫార్మా కంపెనీల షేర్లు భారీగా కుప్పకూలాయి. అరబిందో ఫార్మా 11%, లారస్ ల్యాబ్స్ 9.50%, లుపిన్ 8.50%, బయోకాన్, సిప్లా 7%, డాక్టర్ రెడ్డీస్ క్షీణించాయి.
- మెటల్ షేర్లలో అత్యధికంగా నాల్కో, వేదాంత 9%, టాటా స్టీల్ 8.50% క్షీణించాయి. హిందాల్కో, ఎన్‌ఎండీసీ 8%, జిందాల్ స్టీల్‌స్టెయిన్‌లెస్, హిందుస్థాన్ జింక్ 7%, జిందాల్ స్టీల్, పవర్ 6%, సెయిల్ 5%, నష్టపోయాయి.
- స్టాక్ మార్కెట్ వరుస పతనంతో రూ.10 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.403.34 లక్షల కోట్లకు పడిపోయింది.

కొనసాగుతున్న కమోడిటీల క్రాష్



వృద్ధి మందగమన భయాలతో ఈక్విటీ మార్కెట్లతో పాటు కమోడిటీ ధరలు సైతం నేలచూపులు చూస్తున్నాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు గడిచిన మూడేళ్లలో ఒకరోజులో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. నైమెక్స్ చమురు బ్యారెల్ ఏడున్నర శాతం పడిపోయి 62.00 డాలర్ల వద్ద, బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 6.50% క్షీణించి 65 డాలర్ల వద్ద ట్రేడవుతుంది. ఔన్స్ పసిడి ధర 2.50% (80 డాలర్లు) దిగివచ్చి 3,042 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 7% నష్టంతో 29.86 డాలర్ల వద్ద, ఔన్స్ కాపర్ ధర ఏడున్నర శాతం పతనమై 4.4618 డాలర్ల వద్ద కదలాడుతున్నాయి.

ఆగని ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల పతనం

డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీయడంతో ప్రపంచ దేశాలు సైతం ప్రతీకార సుంకాల విధింపునకు సిద్ధమయ్యాయి. ఇప్పటికే కెనడా టారిఫ్‌లు ప్రకటించగా.. తాజాగా అమెరికా నుంచి దిగుమతయ్యే వస్తువులపై 34% పన్ను ఉంటుందంటూ చైనా ప్రకటించింది. ఈయూ దేశాలు సైతం అదేబాటలో పయనించనున్నాయి. వాణిజ్య యుద్ధాలు అంతర్జాతీయ ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపుతాయనే భయాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు పతనం కొనసాగుతూనే ఉంది. ఆసియాలో జపాన్, థాయ్‌లాండ్, సింగపూర్ స్టాక్ సూచీలు 3% క్షీణించాయి. దక్షిణ కొరియా ఇండెక్స్ ఒకశాతం నష్టపోయింది. ఫ్రాన్స్ ఇండెక్స్ సీఏసీ 4.5%, జర్మనీ సూచీ డాక్స్ 5%, బ్రిటన్ ఎఫ్‌టీఎస్‌ఈ 5% నష్టపోయాయి. గురువారం ట్రేడింగ్ సెషన్ 2020 తర్వాత భారీ పతనానికి కొనసాగింపుగా అమెరికా మార్కెట్లు శుక్రవారం సైతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి. డోజోన్స్ సూచీ 1,500 పాయింట్లు క్షీణించగా. నాస్‌డాక్ 5% ఎస్ అండ్‌పీ 4 శాతం పైగా భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
టారిఫ్‌ల భారంపై బేరసారాలు | పేటీఎమ్ నుంచి డిస్‌ప్లే సౌండ్‌బాక్స్

వాణిజ్య లోటుకు టారిఫ్‌లతో చెక్..

ట్రంప్ సర్కార్ యోచన

- చర్చనీయాంశంగా సుంకాల హేతుబద్ధత



న్యూఢిల్లీ: వివిధ దేశాలపై అమెరికా వడ్డించిన భారీ టారిఫ్‌ల వెనుక హేతుబద్ధత ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అసలు ఏ ప్రాతిపదికన ఈ టారిఫ్‌లను నిర్ణయించారనే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. మిగతా దేశాలు తమపై ఎంత టారిఫ్‌లు విధిస్తున్నాయో అదే స్థాయిలో తామూ సుంకాలు విధించామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నప్పటికీ వాస్తవానికి లెక్కలు వేరేగా ఉన్నాయి. మిగతా దేశాలతో వాణిజ్య లోటును భర్తీ చేసుకునే విధంగా టారిఫ్‌లను నిర్ణయించినట్లుగా పరిశీలకులు చెబుతున్నారు. సాధారణంగా పైకి కనిపించే టారిఫ్‌లే కాకుండా తమ ఉత్పత్తులకు నియంత్రణ సంస్థలపరమైన అడ్డంకులు, సాంకేతిక అవరోధాలు, కరెన్సీ హెచ్చుతగ్గులు తదితర టారిఫ్‌యేతర అంశాలు కూడా వాణిజ్య లోటుకు కారణమవుతున్నాయని అగ్రరాజ్యం భావిస్తోంది. కాబట్టి వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత రేటును నిర్ణయించింది. ఉదాహరణకు భారత్‌తో అమెరికాకు 46 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఉందంటే.. దాన్ని సున్నా స్థాయికి తీసుకొచ్చేలా సుంకాలను నిర్ణయించినట్లు పరిశీలకులు పేర్కొన్నారు. అంటే ప్రస్తుతం భారత్‌పై విధించిన 26% రేటు ద్వారా మన దేశంతో ఉన్న వాణిజ్య లోటును పూర్తిగా భర్తీ చేసుకోవచ్చని అమెరికా భావిస్తోంది. ఈ సుంకాల వల్ల భారతీయ ఉత్పత్తుల ధరలు పెరిగి, అమెరికన్లు మన దగ్గర నుంచి దిగుమతులు తగ్గించుకుంటారని, తద్వారా వాణిజ్య లోటు తగ్గుతుందని అమెరికా అభిప్రాయం.

లోపభూయిష్టమైన విధానం..

అయితే, ఇది తప్పుల తడక విధానమని విమర్శలు వస్తున్నాయి. వాణిజ్య లోటుకు లేదా మిగులుకు టారిఫ్‌లు, టారిఫ్‌యేతర అడ్డంకులు, కరెన్సీ హెచ్చుతగ్గుల్లాంటివి కారణమే అయినప్పటికీ.. కేవలం సుంకాల విధింపు ద్వారా దీన్ని పరిష్కరించుకోవడం సాధ్యపడదని విశ్లేషకులు చెబుతున్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్య లోటుకు కారణాలు అనేకం ఉంటాయని తెలిపారు. ఉదాహరణకు బియ్యం ప్రధాన ఆహారంగా ఉండే దేశానికి .. గోధుమలను భారీగా పండించి, ఎగుమతి చేసే మరో దేశం నుంచి ఎక్కువగా దిగుమతులు ఉండకపోవచ్చు. కానీ తాము దేశీయంగా ఉత్పత్తి చేసుకోలేని పరికరాలు, కంప్యూటర్లను ఎగుమతి చేసే ఇంకో దేశంతో వాణిజ్య లోటు ఉండొచ్చు. అలాగని ఈ వాణిజ్య లోటేమీ అవాంఛనీయమైన లేదా అనుచితమైనదేమీ కాదు.

ప్రస్తుతం అమెరికా పాటిస్తున్న విధానాన్ని బట్టి చూస్తే ఏప్రిల్ 2 నాటి టారిఫ్‌లే అంతిమం కాదని భావించాలి. రేప్పొద్దున్న డాలరు మారకం విలువ పెరిగి, అమెరికాలో మన ఉత్పత్తుల ధరలు పెరగకపోయి, అక్కడి వారు దిగుమతులు చేసుకోవడం కొనసాగిస్తే.. వాణిజ్య లోటు యథాప్రకారం కొనసాగుతుంది. అప్పుడు మళ్లీ వాణిజ్య లోటును భర్తీ చేసుకోవడానికి మళ్లీ టారిఫ్‌లు పెంచాల్సి వస్తుంది. ఆ విధంగా సుంకాల వడ్డింపు నిరంతర ప్రక్రియగా కొనసాగే అవకాశం ఉంది.

సాక్షి స్పోర్ట్స్



బుమ్రా... మరికొన్ని రోజుల తర్వాతే...

ఐపీఎల్ తాజా సీజన్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా సేవలు లభించేందుకు మరికొన్ని రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత జనవరిలో ఆస్ట్రేలియా పర్యటన నుంచి వెన్ను నొప్పితో బాధపడుతున్న బుమ్రా బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చికిత్స తీసుకుంటున్నాడు. వేగంగా కోలుకుంటున్న బుమ్రా ఐపీఎల్‌లో కనీసం మరో రెండు మ్యాచ్‌లు ముంబై జట్టుకు దూరంగా ఉండనున్నాడు. బుమ్రాకు పూర్తి స్థాయి ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించిన తర్వాత... బీసీసీఐ మెడికల్ టీమ్ బుమ్రా ఫిట్‌నెస్‌పై సంతృప్తి వ్యక్తం చేస్తేనే అతను ఐపీఎల్‌లో ఆడతాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించాకే మళ్లీ మైదానంలో అడుగు పెట్టాలని బుమ్రా భావిస్తున్నాడు. వచ్చే జూన్‌లో ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో భారత్ పర్యటించనుంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో బుమ్రా పునరాగమనంపై తొందరపడకూడదని బీసీసీఐ భావిస్తోంది. ముంబై తరఫున బుమ్రా ఆడలేకపోతుండటంతో... సత్యనారాయణ రాజు, విఘ్నేశ్, అశ్వని కుమార్‌లాంటి యువ ఆటగాళ్లకు ఐపీఎల్‌లో అరంగేట్రం చేసే అవకాశం లభించింది.

ఇంట గెలిచిన లక్నో

ముంబై ఇండియన్స్‌పై 12 పరుగులతో సూపర్ జెయింట్స్ విజయం

లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ విజయలక్ష్యం 204 పరుగులు... నమన్, సూర్యకుమార్ చెలరేగినప్పుడు గెలుపు సునాయాసం అనిపించింది... చివర్లో 2 ఓవర్లో 29 పరుగులు చేయాల్సి ఉన్నా హార్దిక్ పాండ్యా కొట్టగలడని అనిపించింది... కానీ లక్నో మ్యాచ్‌ను కాపాడుకోగలిగింది. 19వ ఓవర్లో శార్దుల్ 7 పరుగులే ఇవ్వగా, ఆఖరి ఓవర్‌లో పదునైన బౌలింగ్‌తో అవేశ్ ఖాన్ 9 పరుగులే ఇచ్చాడు. దాంతో ముంబైకి ఓటమి తప్పలేదు. నలుగురు లక్నో బౌలర్లు 40కి పైగా పరుగులు ఇవ్వగా... స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీ 21 పరుగులే ఇవ్వడటం చివరకు ఫలితంపై ప్రభావం చూపించింది. అంతకుముందు మిచెల్ మార్ష్, మార్క్‌రమ్ బ్యాటింగ్‌తో 200 పరుగులు దాటిన లక్నో ప్రత్యర్థికి సవాల్ విసిరింది.



దిగ్వేశ్ రాఠీ

- మార్ష్, మార్క్‌రమ్ అర్ధసెంచరీలు
- బౌలింగ్‌లో రాణించిన దిగ్వేశ్ రాఠీ



దిగ్వేశ్ రాఠీ బౌలింగ్‌లో నమన్ ధీర్ బౌల్డ్

లక్నో: ఐపీఎల్ సీజన్‌లో సొంత మైదానంలో లక్నో సూపర్ జెయింట్స్‌కు తొలి విజయం దక్కింది. శుక్రవారం ఉత్కంఠభరితంగా జరిగిన పోరులో లక్నో 12 పరుగుల తేడాతో ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ (31 బంతుల్లో 60; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఎయిడెన్ మార్క్‌రమ్ (38 బంతుల్లో 53; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేయగా, ఆయుష్ బదోని (19 బంతుల్లో 30; 4 ఫోర్లు) రాణించాడు. హార్దిక్ పాండ్యా (5/36) తన టి20 కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. అనంతరం ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులే చేయగలిగింది. సూర్యకుమార్ యాదవ్ (43 బంతుల్లో 67; 9 ఫోర్లు, 1 సిక్స్), నమన్ ధీర్ (24 బంతుల్లో 46; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు.

పంత్ విఫలం...

లక్నోకు ఓపెనర్లు మార్ష్, మార్క్‌రమ్ శుభారంభం అందించారు. బౌల్ట్ వేసిన తొలి ఓవర్ నాలుగో బంతి మార్ష్ బ్యాట్‌ను తాకుతూ కీపర్ చేతుల్లో పడింది. అయితే దీనిని ముంబై బృందం గుర్తించక అప్పీల్ చేయలేదు. దాంతో బతికిపోయిన మార్ష్ ఆ తర్వాత చెలరేగిపోయి బౌల్ట్ తర్వాతి ఓవర్లో 6, 4 కొట్టాడు. అనంతరం అశ్వని ఓవర్లో మార్ష్ వరుసగా 6, 4, 2, 2, 4, 4 బాదగా, వైడ్‌తో కలిపి మొత్తం 23 పరుగులు వచ్చాయి. ఈ క్రమంలో 27 బంతుల్లో మార్ష్ హాఫ్ సెంచరీ పూర్తి కాగా, పవర్‌ప్లేలో లక్నో 69 పరుగులు సాధించింది. ఎట్టకేలకు పుతూర్... మార్ష్‌ను వెనక్కి పంపించాడు. మార్ష్, మార్క్‌రమ్ తొలి వికెట్‌కు 42 బంతుల్లోనే 76 పరుగులు జోడించారు. ఫామ్‌లో ఉన్న నికోలస్ పూరన్ (12) ఎక్కువసేపు నిలబడలేకపోగా, రిషభ్ పంత్ (2) వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ విఫలమయ్యాడు. ఈ దశలో బదోని, మార్క్‌రమ్ కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. సాంట్నర్ ఓవర్లో బదోని వరుసగా 3 ఫోర్లు కొట్టగా, ఎట్టకేలకు 17వ ఓవర్లో మార్క్‌రమ్ అర్ధసెంచరీ (34 బంతుల్లో) పూర్తయింది. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 31 బంతుల్లో 51 పరుగులు జత చేశారు. చివర్లో డేవిడ్ మిల్లర్ (14 బంతుల్లో 27; 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుతో స్కోరు 200 దాటింది.

సూర్య హాఫ్ సెంచరీ...

ఛేదనలో ముంబై ఆరంభంలోనే జాక్స్ (5), రికెల్టన్ (10) వికెట్లు కోల్పోయింది. అయితే నమన్, సూర్య భాగస్వామ్యంతో స్కోరు దూసుకుపోయింది. ముఖ్యంగా నమన్ మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగిపోయాడు. ఆకాశ్‌దీప్ ఓవర్లో అతను వరుసగా 6, 6, 4, 4 బాదాడు. దాంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 64 పరుగులకు చేరింది. అయితే రాఠీ బౌలింగ్‌లో నమన్ బౌల్డ్ కావడంతో 69 పరుగుల (35 బంతుల్లో) మూడో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. ఆ తర్వాతా జోరు సాగించిన సూర్య 31 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 24 బంతుల్లో 52 పరుగులు చేయాల్సిన స్థితిలో సూర్య అవుట్ కాగా...షాట్లు ఆడటంలో బాగా ఇబ్బంది పడిన తిలక్‌వర్మ (23 బంతుల్లో 25; 2 ఫోర్లు) 'రిటైర్డ్ అవుట్'గా తప్పుకున్నాడు. చివర్లో హార్దిక్ పాండ్యా (16 బంతుల్లో 28 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ఎంతగా ప్రయత్నించినా ముంబైకి ఓటమి తప్పలేదు. 17వ, 18వ ఓవర్లలో కలిపి 23 పరుగులు వచ్చినా... చివరి 2 ఓవర్లలో 29 పరుగులు చేయడంలో ముంబై విఫలమైంది.



పాండ్యా

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మార్ష్ (సి అండ్ బి) పుతూర్ 60; మార్క్‌రమ్ (సి) బావా (బి) పాండ్యా 53; పూరన్ (సి) చహర్ (బి) పాండ్యా 12; పంత్ (సి) (సబ్) బాష్ (బి) పాండ్యా 2; బదోని (సి) రికెల్టన్ (బి) అశ్వని 30; మిల్లర్ (సి) నమన్ (బి) పాండ్యా 27; సమద్ (సి) నమన్ (బి) బౌల్ట్ 4; శార్దుల్ (నాటౌట్) 5; ఆకాశ్‌దీప్ (సి) సాంట్నర్ (బి) పాండ్యా 0; అవేశ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 203. వికెట్ల పతనం**: 1–76, 2–91, 3–107, 4–158, 5–173, 6–182, 7–200, 8–200. **బౌలింగ్:** బౌల్ట్ 3–0–28–1, దీపక్ చహర్ 2–0–23–0, అశ్వని కుమార్ 3–0–39–1, సాంట్నర్ 4–0–46–0, విఘ్నేశ్ పుతూర్ 4–0–31–1, హార్దిక్ పాండ్యా 4–0–36–5.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: జాక్స్ (సి) బిష్ణోయ్ (బి) ఆకాశ్‌దీప్ 5; రికెల్టన్ (సి) బిష్ణోయ్ (బి) శార్దుల్ 10; నమన్ ధీర్ (బి) రాఠీ 46; సూర్యకుమార్ (సి) సమద్ (బి) అవేశ్ 67; తిలక్‌వర్మ (రిటైర్డ్ అవుట్) 25; పాండ్యా (నాటౌట్) 28; సాంట్నర్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 191. వికెట్ల పతనం:** 1–11, 2–17, 3–86, 4–152, 5–180. **బౌలింగ్:** శార్దుల్ ఠాకూర్ 4–0–40–1, ఆకాశ్‌దీప్ 4–0–46–1, అవేశ్ ఖాన్ 4–0–40–1, దిగ్వేశ్ రాఠీ 4–0–21–1, రవి బిష్ణోయ్ 4–0–40–0

రోహిత్ శర్మ దూరం

ముంబై ఓపెనర్ రోహిత్ శర్మ లక్నోతో మ్యాచ్‌లో ఆడలేదు. గురువారం ప్రాక్టీస్ సందర్భంగా అతని మోకాలికి గాయమైంది. దాంతో అతను ఈ పోరు నుంచి తప్పుకున్నాడు. రోహిత్ స్థానంలో రాజ్ బావాకు టీమ్ అవకాశం కల్పించింది.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
పంజాబ్	2	2	0	4	1.485
ఢిల్లీ	2	2	0	4	1.320
బెంగళూరు	3	2	1	4	1.149
గుజరాత్	3	2	1	4	0.807
కోల్‌కతా	4	2	2	4	0.070
లక్నో	4	2	2	4	0.048
ముంబై	4	1	3	2	0.108
చెన్నై	3	1	2	2	-0.771
రాజస్తాన్	3	1	2	2	-1.112
హైదరాబాద్	4	1	3	2	-1.612

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై X ఢిల్లీ
వేదిక: చెన్నై
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

పంజాబ్ X రాజస్తాన్
వేదిక: ముల్లాన్‌పూర్
రాత్రి 7: 30 గంటల నుంచి

స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఫైనల్లో హితేశ్



న్యూఢిల్లీ: వరల్డ్ బాక్సింగ్ కప్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్ హితేశ్ (70 కేజీలు) స్వర్ణ పతకానికి విజయం దూరంలో నిలిచాడు. బ్రెజిల్‌లోని ఫాజ్ డు ఇగువాకు నగరంలో జరుగుతున్న ఈ టోర్నీలో హితేశ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఫ్రాన్స్ బాక్సర్ మకన్ ట్రావోర్‌తో జరిగిన సెమీఫైనల్లో హితేశ్ 5–0తో ఘనవిజయం సాధించాడు. ఫైనల్లో ఒడెల్ కమారా (ఇంగ్లండ్)తో హితేశ్ తలపడతాడు. ఇతర సెమీఫైనల్స్‌లో భారత బాక్సర్లు జాదూమణి సింగ్ (50 కేజీలు), విశాల్ (90 కేజీలు), సచిన్ సివాచ్ (60 కేజీలు) ఓడిపోయి కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు. సెమీఫైనల్స్‌లో జాదూమణి సింగ్ 2–3తో అస్లిబెక్ జలీలోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో, విశాల్ 0–5తో తురాబెక్ ఖబిబులాయెవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో, సచిన్ 0–5తో పావెల్ బ్రాచ్ (పోలాండ్) చేతిలో ఓటమి చవిచూశారు.

చెయిన్ సింగ్‌కు కాంస్య పతకం




బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్ పతకాల బోణీ కొట్టింది. శుక్రవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత షూటర్ చెయిన్ సింగ్ కాంస్య పతకాన్ని సాధించాడు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 36 ఏళ్ల చెయిన్ సింగ్ 443.7 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచాడు. మార్టన్ పెనీ (హంగేరి; 461 పాయింట్లు) స్వర్ణ పతకం సొంతం చేసుకోగా... జియామింగ్ టియాన్ (చైనా; 458.8 పాయింట్లు) రజత పతకాన్ని దక్కించుకున్నాడు. భారత్‌కే చెందిన ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ 432.6 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలువగా... నీరజ్ కుమార్ 402.5 పాయింట్లతో ఏడో స్థానాన్ని సంపాదించాడు. అంతకుముందు 45 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఐశ్వర్య ప్రతాప్ సింగ్ 589 (10 పాయింట్ల షాట్‌లు 31) పాయింట్లతో రెండో స్థానంలో, చెయిన్ సింగ్ 589 (10 పాయింట్ల షాట్‌లు 27) పాయింట్లతో మూడో స్థానంలో, నీరజ్ కుమార్ 587 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు. ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో చెయిన్ సింగ్‌కిది మూడో పతకం. న్యూఢిల్లీలో 2021లో జరిగిన ప్రపంచకప్‌లో స్వర్ణం నెగ్గిన అతను, చాంగ్వాన్‌లో 2022లో జరిగిన ప్రపంచకప్‌లో రజతం సాధించాడు.

స్టూడియో జీబ్లీ.. మీరూ వెతికారా?

గూగుల్‌లో జీబ్లీని ఎక్కువగా వెతికిన వారు (రాష్ట్రాలవారీగా)

ఆధారం: గూగుల్ ట్రెండ్స్ డాటా (మార్చి 27–ఏప్రిల్ 3 వరకూ)
50 అంటే పాపులర్ అని..
100 అంటే పాపులారిటీలో పీక్స్ అని..



సాక్షి, సెంట్రల్‌డెస్క్

రూ.9కే చీర.. 10 వేల మంది జనం



- వికారాబాద్‌లో షాపింగ్ మాల్ ప్రారంభం సందర్భంగా ఆఫర్.. భారీగా ట్రాఫిక్ జాం
- రద్దీ పెరగడంతో మాల్‌ను మూసేసిన నిర్వాహకులు
- ఫ్రీ బస్సు కావడంతో ఎక్కువ మంది మహిళలు వచ్చారన్న పోలీసులు

వికారాబాద్: ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా తొమ్మిది రూపాయలకు చీర ఇస్తామంటూ పెట్టిన ఆఫర్‌తో జనం ఎగబడ్డారు. ఈ కార్యక్రమానికి శుక్రవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్, యాంకర్ అనసూయ, బిత్తిరి సత్తి హాజరవుతారని పేర్కొనడంతో జనం పోటెత్తారు. 10 వేల మంది రావడంతో వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రామయ్యగూడకు వెళ్లే రహదారి పూర్తిగా స్తంభించిపోయింది. కొంతమంది రూ.9 చీరలు తీసుకుని వెళ్లగా, మరికొంత మంది రద్దీని చూసి వెనక్కి మళ్లారు. జనం రద్దీ భారీగా పెరగడంతో చేతులెత్తేసిన నిర్వాహకులు మాల్‌ను మూసేసి, పోలీసు బందోబస్తు పెట్టుకున్నారు. దీనిపై మహిళలు మండిపడ్డారు. చేతకానిది ఎందుకు రమ్మన్నారు.. ఎందుకు ప్రచారం చేశారు.. అంటూ అసహనం వ్యక్తం చేస్తూ తిరిగి వెళ్లారు. ఈ విషయమై వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా.. 'మేము షాప్ ఓపెనింగ్‌కు మాత్రమే అనుమతిచ్చాం. మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం ఉండటంతో ఎక్కువ మంది వచ్చారు. దీనికి మేమేం చేస్తాం'అని బదులిచ్చారు.

డిగ్రీలో 'బకెట్' ఎత్తివేత

- రెండు విడతల్లోనే దోస్త్ అడ్మిషన్లు పూర్తి
- జూన్ 16 నుంచి మొదటి సెమిస్టర్ క్లాసులు
- వర్సిటీ వీసీల సమావేశంలో కీలక నిర్ణయాలు



వర్సిటీల వీసీలతో ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో గుణాత్మక మార్పుల దిశగా అడుగులేయాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి అధ్యక్షతన శుక్రవారం రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్ల (వీసీ)తో సమావేశం జరిగింది. కొత్త విద్యా సంవత్సరం క్యాలెండర్, దోస్త్ నిర్వహణ, అనుబంధ గుర్తింపు, కొత్త సిలబస్ వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. ఇప్పటి వరకు డిగ్రీలో ఉన్న బకెట్ విధానాన్ని ఎత్తివేయాలని నిర్ణయించారు. ఒక విద్యార్థి ఒక కాలేజీలో చేరినప్పటికీ, ఆ కాలేజీలో లేని, వేరే కాలేజీలో ఉన్న సబ్జెక్టును చదివేందుకు వీలుగా 2023లో బకెట్ విధానం తీసుకొచ్చారు. ఇప్పటికే బకెట్ సిస్టమ్‌లో చేరిన విద్యార్థులు ఆ కోర్సు పూర్తయ్యే వరకు కొనసాగుతారు. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీస్, తెలంగాణ (దోస్త్)ను ఎత్తివేయాలనే ప్రతిపాదనను మండలి వెనక్కు తీసుకుంది. అయితే, రెండు కౌన్సెలింగుల్లోనే డిగ్రీ ప్రవేశాల ప్రక్రియను ముగించాలని నిర్ణయించారు. డిగ్రీలో 4.6 లక్షల సీట్లుండగా, 2.25 లక్షల మందే చేరుతున్నారు. దీంతో జీరో అడ్మిషన్లు నమోదయ్యే కాలేజీలు, కోర్సులకు అనుమతి ఇవ్వొద్దని వర్సిటీలకు మండలి సూచించింది.

సిలబస్‌లో మార్పులు

రాష్ట్రంలోని ప్రైవేటు, ప్రభుత్వ కాలేజీల్లో కొత్త సిలబస్‌ను 2025–26 విద్యా సంవత్సరం నుంచి అమలుచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈసారి 20 శాతం సిలబస్‌ను మార్చబోతున్నట్టు మండలి చైర్మన్ వీసీలకు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్ వంటి కోర్సులను డిగ్రీ సిలబస్‌లో చేరుస్తున్నట్టు చెప్పారు. డిజిటల్ ప్లాట్ ఫాంలో బోధన అందించేందుకు టీ–శాట్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నట్టు వివరించారు. మూల్యాంకన విధానంలో మార్పులు అవసరమని సమావేశం అభిప్రాయపడింది. అసైన్ చేసిన ప్రాజెక్టు వర్క్‌కు 25, మిడ్‌టర్మ్‌కు 25, ఆఖరు సెమిస్టర్‌కు 50 మార్కుల చొప్పున మూల్యాంకనం చేపట్టాలని నిర్ణయించారు. ఏప్రిల్ 30 నాటికి విద్యా సంవత్సరం ముగించాలని నిర్ణయించారు.

యాజమాన్య కోటాకు ఆన్‌లైన్ లేనట్టే

ఇంజనీరింగ్‌లో యాజమాన్య కోటా సీట్ల భర్తీని ఈసారి ఆన్‌లైన్‌లో చేపడతామని చెప్పిన ఉన్నత విద్యా మండలి యూటర్న్ తీసుకుంది. ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో, ఈసారికి బీ కేటగిరీ సీట్లను ఆయా కాలేజీల యాజమాన్యాలే భర్తీ చేసుకునే వెసులుబాటు కల్పించాలని వీసీల సమావేశం నిర్ణయించింది. ఈ ఏడాది సీపీగెట్‌ను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించాలని మండలి తీర్మానించింది. అన్ని వర్సిటీలకు చెందిన 2025–26 సంవత్సరం అకడమిక్ క్యాలెండర్‌కు సమావేశం ఆమోదం తెలిపింది. అన్ని వర్సిటీల పరిధిలో జూన్ 16 నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ క్లాసులు మొదలవుతాయని అకడమిక్ క్యాలెండర్‌లో పేర్కొన్నారు. అక్టోబర్ 20తో సెమిస్టర్ ముగుస్తుంది. నవంబర్ 20 నుంచి రెండో సెమిస్టర్‌కు వెళ్తారు. మూడు, నాలుగు, ఐదు సెమిస్టర్లకు జూన్ 2 నుంచి క్లాసులు మొదలవుతాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



స్పీడ్ గన్.. తప్పదు ఫైన్

రయ్ రయ్ మంటూ వందకుపైగా వేగంతో దూసుకుపోతున్న వాహనాలను చాటుగా స్పీడ్ గన్ పసిగడుతోంది. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా వేస్తోంది. రాజీవ్ రహదారిపై నిత్యం సుమారు వంద వాహనాల వరకు స్పీడ్‌గన్ ఫొటోలు తీస్తోంది. అయినా, వాహనదారుల తీరు మారడం లేదు. నిబంధనలు పాటిస్తూ ప్రయాణాలు సాగించాలని, మితిమీరిన వేగంతో ప్రాణాలు పోగొట్టుకోవద్దని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తూనే ఉన్నారు. పెద్దపల్లి జిల్లా శివారులో.. అతివేగంగా వస్తున్న వాహనాలను స్పీడ్ గన్ ఇలా ఫొటోలు తీయడం కనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



కూలర్ గడ్డి

ఇక్కడ ఎండలో ఆరేసింది ఉతికిన వస్త్రాలు కాదు.. కూలర్‌లో వినియోగించే గడ్డి. ఎండలు మండిపోతుండడంతో కూలర్లకు గిరాకీ పెరిగింది. ఇళ్లలో కూలర్లకు కొత్తగా గడ్డి పెట్టించడం, మరమ్మతులు ఎక్కువయ్యాయి. జిల్లా శివారులోని ఒక ఇంటిపై ఎండలో ఆరేసిన కూలర్ గడ్డి అందంగా కనిపించింది. హైదరాబాద్ నుంచి కూలర్ గడ్డి తెప్పించి.. ఇక్కడి దుకాణాలకు విక్రయించే వారు ఇలా మేడమీద ఆరబెట్టారు.

మల్లన్న సన్నిధిలో..

సీతారాముల కల్యాణం

రేపు శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు



ఓదెల (పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా ఓదెల మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఈనెల 6న నిర్వహించనున్న శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు భారీసంఖ్యలో తరలివస్తారు. ఉదయం సుప్రభాత సేవతో పూజలు, వేడుకలు ప్రారంభమవుతాయి. ఆదివారం ఉదయం 11.30 గంటలకు శ్రీసీతారాముల కల్యాణ ప్రక్రియ ప్రారంభిస్తారు. దేవతామూర్తులను మంగళవాయిద్యాలతో వేదికపైకి తీసుకొచ్చి ఆశీనులు చేస్తారు.

చకచకా ఏర్పాట్లు..

ఓదెల శ్రీమల్లికార్జునస్వామి సన్నిధిలో నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణం కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. భక్తులకు నీడ సౌకర్యం కల్పించేందుకు చలువ పందిళ్లు నిర్మిస్తున్నారు. మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసులు ఇప్పటికే సమీక్షించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారు. అర్చకుడు ఆరుట్ల శ్రీనివాసచార్యుల ఆధ్వర్యంలో కల్యాణం జరిపిస్తారు.

వైభవంగా కల్యాణం



ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణం అంగరంగవైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో స్వామివార్ల కల్యాణం సుమారు మూడుగంటల పాటు నిర్వహిస్తాం. అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తులు తీర్థప్రసాదాలు అందిస్తాం. - ఆరుట్ల శ్రీనివాసచార్యులు, అర్చకుడు

ఏర్పాట్లు చేస్తున్నాం



ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఆదివారం జరిగే సీతారాముల కల్యాణ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నాం. నీడ, మంచినీరు, వసతి గదులు అందుబాటులో ఉంచుతాం. ఆలయాన్ని విద్యుద్ దీపాలతో అలంకరిస్తాం.

- బొడ్క సదయ్య, ఆలయ ఈవో, ఓదెల

కనుల పండువగా ఉంటుంది



ఓదెల మల్లన్న సన్నిధిలో ఏటా శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా జరిపిస్తారు. మూడుగంటల పాటు మంగళవాయిద్యాలతో కల్యాణం జరుగుతుంది. అధికసంఖ్యలో భక్తులు తరలిరావాలి.

- రంగు బ్రహ్మచారి, భక్తుడు కొలనూర్

సన్నబియ్యంతో విపక్షాలకు కడుపు మంట

రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పేద ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేస్తుండడంతో.. ప్రతిపక్షాలకు కడుపు మండుతోందని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమం అమలు ద్వారా కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉండటం బీఆర్ఎస్, బీజేపీలకు ఇష్టం లేదని చెప్పారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. పదేళ్ల పాటు రాష్ట్ర ఖజానాను దోచుకుని ఫాంహౌజ్‌లు, ప్యాలెస్‌లు కట్టుకున్న బీఆర్ఎస్ నేతలు.. పదేపదే అబద్ధాలు చెప్పి నిజాలుగా నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీలు కూడబలుక్కుని రాజకీయం చేస్తున్నారని, ఆ రెండు పార్టీలు తలకిందులుగా తపస్సు చేసినా తెలంగాణలో అధికారంలోకి రాలేరని ఎద్దేవా చేశారు. కేటీఆర్ మాత్రం మూడేళ్ల తర్వాత తామే అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారని.. మూడేళ్లు కాదని.. పదమూడేళ్లయినా వారు అధికారంలోకి రారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలు కలిసి పోటీ చేసినా, బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసినా తమకు అభ్యంతరం లేదని మెట్టు సాయికుమార్ వ్యాఖ్యానించారు.

గ్రూప్ వన్ పరీక్షల్లో గోల్‌మాల్

బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి


సాక్షి, హైదరాబాద్: ఆరు గ్యారంటీల తరహాలోనే.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ వన్ పరీక్షను గోల్‌మాల్ చేసిందని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి ఆరోపించారు. గ్రూప్ వన్ పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగినట్లు అనుమానాలు ఉన్నాయని, ప్రొఫెసర్లతో దిద్దించాల్సిన జవాబు పత్రాలను కాంట్రాక్టు ఉద్యోగులతో దిద్దించారని విమర్శించారు. ఆయన తెలంగాణ భవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గ్రూప్ వన్ పరీక్ష రాసిన 9వేల మంది అభ్యర్థులు రీ కౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఒక్కరికి కూడా మార్కులు పెరగలేదన్నారు. ఈ పరీక్షలపై 30కి పైగా కోర్టు కేసులు ఉన్నాయని వివరించారు. 563 పోస్టులకు ఫలితాలు ప్రకటిస్తే.. 500 ర్యాంకుల లోపు ఒక్క తెలుగు మీడియం విద్యార్థి కూడా లేకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నలభై శాతం మంది తెలుగు మీడియం అభ్యర్థులు గ్రూప్ వన్ మెయిన్స్ రాస్తే.. వారిలో పది శాతం కూడా పోస్టులు సాధించలేదా? అని ప్రశ్నించారు. కేవలం రెండు పరీక్ష కేంద్రాల నుంచే 74 మంది గ్రూప్ వన్ టాపర్లు ఉన్నారని తెలిపారు. కేవలం 15 కేంద్రాల నుంచి అన్ని ర్యాంకులు రావడం వెనుక మతలబు ఏమిటని నిలదీశారు. గ్రూప్ వన్ ప్రిలిమ్స్‌కు ఒక హాల్ టికెట్ నంబర్, మెయిన్స్‌లో ఇంకో హాల్ టికెట్ నంబర్ కేటాయించడం విచిత్రమని విమర్శించారు. గ్రూప్ వన్ జవాబు పత్రాలను మళ్లీ దిద్దించాలని ఏనుగుల రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

అజరామ'రామప్ప'కు 812 ఏళ్లు

యునెస్కో గుర్తింపుతో పెరిగిన పర్యాటకులు

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లాలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సుప్రసిద్ధ రామప్ప దేవాలయం శుక్రవారంతో 812 ఏళ్లు పూర్తి చేసుకున్నట్లు ఆలయ అర్చకులు, పర్యాటక గైడ్‌లు తెలిపారు. 1,213 సంవత్సరంలో శాలివాహన శకం ప్రకారం శ్రీముఖ నామ సంవత్సరం, చైత్రమాసం, శుక్ల పక్షం, అష్టమ తిథి రోజు ఈ ఆలయ నిర్మాణం పూర్తయిందని ఆలయ ఆవరణలోని శిలాశాసనంలో కాకతీయులు పేర్కొన్నట్లు వారు వెల్లడించారు. తెలుగు క్యాలెండర్ ప్రకారం (శాలివాహనం శకం) రామప్ప ఆలయాన్ని నిర్మించి 812 ఏళ్లు పూర్తయినట్లు వారు తెలిపారు. 812 ఏళ్లయినా నేటికీ రామప్ప దేవాలయం చెక్కు చెదరలేదని, ఏటా కాకతీయ ఉత్సవాలు రామప్పలో నిర్వహిస్తే రామప్ప కీర్తి ప్రపంచ నలుమూలలా విస్తరిస్తుందని అభిప్రాయపడ్డారు.

రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు రావడంతో ప్రపంచ వ్యాప్తంగా ఆలయ ఖ్యాతి మార్మోగింది. 2021 జూలై 25న రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు రావడంతో.. పర్యాటకుల సంఖ్యతో పాటు విదేశీయుల రాక పెరిగింది. పర్యాటకుల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ ప్రాజెక్ట్ కింద రూ.62 కోట్లతో రామప్ప శివారులో పనులు చేపడుతోంది. రామప్పకు వచ్చే పర్యాటకులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెచ్చిస్తున్నాయి. హైదరాబాద్‌లో జరగనున్న మిస్ వరల్డ్ పోటీలకు వచ్చే విదేశీ సుందరీమణులు రామప్ప ఆలయాన్ని మే13న సందర్శించనున్నారు. వారికోసం రామప్పలో చేస్తున్న ఏర్పాట్లపై కేంద్ర పురావస్తు, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు శనివారం ఆలయాన్ని సందర్శించనున్నట్లు తెలిసింది.





రామప్ప దేవాలయం (ఫైల్) ()
రామప్ప రామలింగేశ్వరస్వామి

ఫార్మాసిటీ భూములపై మాట తప్పిన సీఎం

సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

సాక్షి, హైదరాబాద్: ఫార్మాసిటీని రద్దు చేసి, గతంలో సేకరించిన భూములను కూడా రైతులకే తిరిగి ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడా భూములను మళ్లీ లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి తదితర గ్రామాల్లోని దాదాపు 800 మంది రైతులు 2 వేల ఎకరాల భూములను ఫార్మాసిటీకి ఇవ్వబోమని సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. వారికి అనుకూలంగా తీర్పు వచ్చిందని ఆయన గుర్తు చేశారు. తీర్పు వచ్చాక వందలాది మంది పోలీసులు, రెవెన్యూ అధికారులు ఈ భూముల్లోకి ప్రవేశించి బలవంతంగా కంచె వేస్తున్నారని ఆరోపించారు. అడ్డుకున్న రైతులను అరెస్టు చేయడాన్ని పార్టీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. రైతుల పోరాటాలకు మద్దతిస్తున్నామని వెల్లడించారు. రికార్డుల్లో రైతుల పేర్లు లేకుండా చేసి.. వారికి రాయితీలు రాకుండా, భూములను అమ్ముకోనివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని జాన్‌వెస్లీ ఆరోపించారు.

లీజు పొడిగింపునకు కమిషనర్ నిరాకరణ

దేవాదాయ శాఖ స్థలం ఖాళీ చేయాల్సిందేనన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కిషన్‌బాగ్‌లోని అద్దె స్థలాన్ని ఖాళీ చేయాల్సిందేనని పిటిషనర్ బ్రిజ్ గోపాల్‌కు హైకోర్టు తేల్చిచెప్పింది. ఒకసారి లీజు పొడిగింపునకు దేవాదాయ శాఖ కమిషనర్ నిరాకరించాక, అదే స్థలంలో కొనసాగడానికి వీలు లేదని పేర్కొంది. బ్రిజ్ గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. బహదూర్‌పురాలోని కిషన్‌బాగ్‌లోని అద్దె స్థలం విషయంలో మురళీమనోహరస్వామి ఆలయ ఈవో జోక్యం చేసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బ్రిజ్ గోపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామని, నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ పిటిషన్ జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సదరు ప్రాపర్టీని పిటిషనర్ తండ్రి సీతారామ్‌కు 1980లో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ లీజుకు ఇచ్చారన్నారు. అప్పట్లో నెలకు రూ.500 అద్దె చెల్లించేవారని, ఆ తర్వాత అందులో స్టోర్‌రూం, స్టాఫ్ రూం, గేట్ నిర్మాణానికి 2015లో అనుమతి ఇచ్చారన్నారు. అలా నెలకు చెల్లించే అద్దె రూ.25 వేలకు చేరిందన్నారు. పార్కింగ్ కోసమని తీసుకొని ఐరన్ వ్యాపారం ప్రారంభించడంతో అధికారులు నోటీసులు జారీ చేశారని చెప్పారు. 7 రోజుల్లో సదరు స్థలాన్ని ఖాళీ చేయాలని 2021లో తుది నోటీసులు కూడా ఇచ్చారన్నారు. కోర్టు ఆదేశాల మేరకు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించినా, లీజు పొడిగింపునకు నిరాకరించారని పేర్కొన్నారు. అయినా ఖాళీ చేయకుండా పిటిషన్ వేశారని నివేదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. 2021లో కమిషనర్ నిరాకరించినా ఇప్పటి వరకు ఖాళీ చేయకపోవడంపై పిటిషనర్ తీరును తప్పుబట్టారు. పిటిషన్‌ను కొట్టివేశారు.

'ప్రారంభ' శూరత్వం!

సింగరేణి షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమిపూజల ప్రహసనం

- ఒకసారి సీఎం.. రెండు సార్లు ఎమ్మెల్యేతో భూమి పూజలు
- అయినా ప్రారంభం కాని పనులు
- షాపుల కోసం నిరుద్యోగుల నిరీక్షణ

గోదావరిఖని: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకసారి.. రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ రెండుసార్లు భూమి పూజ చేసినా సింగరేణి కాంప్లెక్స్ నిర్మాణం మొదలు కాలేదు. రోడ్డు విస్తరణలో షాపులు, క్వార్టర్లు కోల్పోతున్న క్రమంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పన, పారిశ్రామిక ప్రాంత సుందరీకరణ కోసం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలో రూ.15 కోట్లతో భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. దీనికోసం సింగరేణి సంస్థ కొన్ని క్వార్టర్లను కూల్చివేసింది. కొన్నిషాపులను కూడా రోడ్డు విస్తరణలో తొలగించారు. దీంతో చాలామంది నిరుద్యోగులు షాపులు మూసివేసి.. నూతన కాంప్లెక్స్ ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా సింగరేణి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తిచేస్తే.. షాపులు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతామని ఆశలు పెట్టుకున్నారు. షాపింగ్ నిర్మాణ పనులకు గతేడాది డిసెంబర్ 4న పెద్దపల్లి జిల్లా కేంద్రానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. దీంతోపాటు సింగరేణి సంస్థకు చెందిన వివిధ అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఈ ఏడాది జనవరి 11న రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ షాపింగ్ కాంప్లెక్స్ పనులకు భూమిపూజ చేశారు. పనులు ప్రారంభిస్తామని సింగరేణి యాజమాన్యం మరోసారి ఎమ్మెల్యేను పిలిపించి మార్చి 11న పనులకు ప్రారంభోత్సవం చేయించింది. కానీ ఇప్పటివరకు ఎలాంటి పనులు మొదలు కాలేదు. ఆరంభంలో చూపించిన ఉత్సాహాన్ని.. పనుల ప్రారంభంలో చూపడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.



షాపింగ్ కాంప్లెక్స్ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజఠాగూర్ (ఫైల్)

త్వరలో నిర్మాణం పూర్తి



పనులు త్వరగా ప్రారంభమవుతాయనే సంకేతం ఇవ్వడానికే.. ప్రారంభోత్సవం నిర్వహించాం. టెండర్ నిర్వహణ పూర్తయ్యింది. త్వరలోనే షాపింగ్ కాంప్లెక్స్ పనులు ప్రారంభిస్తాం. సాధ్యమైనంత త్వరగా పనులు మొదలుపెట్టి ఆధునిక హంగులతో షాపింగ్ కాంప్లెక్స్ పూర్తి చేస్తాం. ఈప్రాంత నిరుద్యోగులు వ్యాపారం చేసుకునేందుకు షాపింగ్ కాంప్లెక్స్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

- లలిత్‌కుమార్, ఆర్జీ-1 జీఎం

క్లుప్తంగా...

మంగళగిరికి ఎంఎస్ఎంఈ డీసీ కార్యాలయం

సాక్షి, అమరావతి: ఏపీఎంఎస్ఎంఈడీసీ (ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ)ని మంగళగిరికి తరలించారు. ఇప్పటి వరకు విజయవాడ, ముత్యాలంపాడులోని గవర్నమెంట్ ప్రెస్‌లో ఉన్న ఈ కార్యాలయాన్ని మంగళగిరి ఏపీఐఐసీలోని ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌కు మార్చారు. కొత్త కార్యాలయాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు.

కాకాణి ముందస్తు బెయిల్‌పై విచారణ 7కి వాయిదా

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పై విచారణ 7కి వాయిదా పడింది. అక్రమ మైనింగ్ వ్యవహారంలో నెల్లూరు జిల్లా, పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం కాకాణి తరపు సీనియర్ న్యాయవాది వాదనలు ముగియడంతో, పోలీసుల తరపున ఏజీ వాదనల నిమిత్తం విచారణ వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీ చేశారు.

రుషికొండ భవనాలను మ్యూజియంగా మార్చాలి

సీఎంకు సీపీఎం లేఖ

సాక్షి, అమరావతి: విశాఖపట్నం రుషికొండ భవనాలను సైన్సు అండ్ టెక్నాలజీ మ్యూజియంగా మార్చాలని సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం లేఖ రాశారు. రుషికొండపై గత ప్రభుత్వం నూతనంగా నిర్మించిన అతిథిగృహం నిర్వహణపై రాష్ట్ర కేబినెట్ చర్చల్లో రకరకాల ఆలోచనలు చేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఇదే విషయమై గత ఏడాది నవంబర్ 16న తాను సీఎంకు ఒక లేఖ రాసినట్టు శ్రీనివాసరావు గుర్తు చేశారు.

రజనీ, గోపీనాథ్ ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ 8కి వాయిదా

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత విడదల రజని, ఆమె మరిది విడదల గోపీనాథ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌లపై విచారణ 8కి వాయిదా పడింది. స్టోన్ క్రషర్ యజమాని నుంచి డబ్బు తీసుకున్నారంటూ ఏసీబీ నమోదు చేసిన అక్రమ కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని వారు హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం రజనీ, గోపీనాథ్ తరపు సీనియర్ న్యాయవాది వాదనలు ముగియడంతో, ఏసీబీ తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) వాదనల నిమిత్తం విచారణ వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందు రజనీ, గోపీనాథ్ తరపున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్, న్యాయవాది వేలూరి మహేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు.

ఆక్వా రంగాన్ని ఆదుకోండి

ప్రధాని మోదీకి జాతీయ రొయ్య రైతుల సమాఖ్య వినతి

సాక్షి, అమరావతి: అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం ఆహార ఉత్పత్తుల దిగుమతులపై 27 శాతం దిగుమతి సుంకం విధింపు నేపథ్యంలో తీవ్రంగా నష్టపోనున్న ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని జాతీయ రొయ్య రైతుల సమాఖ్య అధ్యక్షుడు ఐపీఆర్ మోహనరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖను ఆయన మీడియాకు విడుదల చేశారు. ట్రంప్ ప్రభుత్వం విధించిన దిగుమతి సుంకాన్ని తక్షణమే ఉపసంహరింప చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బ్రూడ్ స్టాక్, హేచరీ, ష్రింప్, ఫిష్ ఫీడ్స్, ప్రీమిక్సెస్, ఆర్టిమియా వంటి ఆక్వాకల్చర్ ఇన్‌పుట్స్‌పై దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తివేసేలా కృషి చేయాలన్నారు. లేకుంటే ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతుందని, ఆ ప్రభావం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

38 మార్కెట్ కమిటీలకు చైర్మన్లు

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం మరో 38 మార్కెట్ కమిటీలకు చైర్మన్లను ఖరారు చేసింది. 31 చైర్మన్లు టీడీపీకి, 6 జనసేనకు, ఒకదాన్ని బీజేపీకి కేటాయించారు. పెడన, గన్నవరం, ఉండి, ఆలమూరు, భీమిలి, రాజాం మార్కెట్ కమిటీలను జనసేనకు కేటాయించగా, జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఎర్రగుంట్ల మార్కెట్ కమిటీని బీజేపీకి కేటాయించారు. ఆ కమిటీల్లో సభ్యులను కూడా ఖరారు చేశారు. త్వరలో వీటికి సంబంధించి ఉత్తర్వులు వెలువడనున్నాయి. మొదటి విడతలో 47 మార్కెట్ కమిటీలకు చైర్మన్లను నియమించారు. దీంతో మొత్తం 85 కమిటీలు నియమించినట్లయింది. ఇంకా 120కిపైగా మార్కెట్ కమిటీలను నియమించాల్సి వుంది.

6న సెలవు మంజూరు చేయాలి

సాక్షి, అమరావతి: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఏప్రిల్ 6న పదో తరగతి మూల్యాంకన విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు సెలవు మంజూరు చేయాలని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లెక్కల జమాల్ రెడ్డి, ఏసీవీ గురువారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అల.. ఏకశిలానగరిలో..

రాష్ట్ర విభజన తర్వాత ఒంటిమిట్ట రామాలయం టీటీడీలోకి విలీనమైంది. టీటీడీ ఏటా బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తోంది. ఈ ఏడు కూడా శనివారం నుంచి ఈ నెల 15 వరకు బ్రహ్మోత్సవాలు అత్యంత వేడుకగా నిర్వహించనున్నారు. తొలిరోజున అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. ఈనెల 11న రాములోరి కల్యాణం కన్నుల పండువగా చేయనున్నారు. ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట రామయ్య క్షేత్రం ప్రత్యేక కళను సంతరించుకుంది.



ఒంటిమిట్ట కోదండ రామాలయం వ్యూ

రాత్రిపూటే కల్యాణం..

ఒంటిమిట్ట స్వామివారి కల్యాణం రాత్రిపూట నిర్వహిస్తారు. చతుర్దశినాటి రాత్రి వివాహ మహోత్సవం, కళాపూర్ణుడైన చంద్రుడు సీతారామ కల్యాణాన్ని పరమానందంతో తిలకిస్తాడని పురాణకథ చెపుతోంది. కాగా రాత్రి కల్యాణం సంప్రదాయం ఇప్పటిదికాదు. అది ఒంటిమిట్ట ఆలయం ప్రజలకు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇలాగే జరుగుతోంది. అన్ని రామాలయాలలో నవమిరోజున కల్యాణం నిర్వహిస్తారు. అది పగటిపూట. ఒక్క ఒంటిమిట్ట కోదండరామాలయంలోనే రాత్రి పూట రాములోరి కల్యాణం జరుగుతుంది. ఈ నెల11న రాత్రి 8–10 గంటలలోపు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు.

జాంబవంతుడు ప్రతిష్టించిన రామక్షేత్రం!

- త్రేతాయుగంలో సీతారామలక్ష్మణ నివాసమే ఏకశిలానగరం
- ఆంజనేయుడు లేకపోవడమే ఆలయ ముఖ్య విశేషం
- వంటడు..మిట్టడుతో ఆలయ నిర్మాణానికి అంకురార్పణ
- నేటి నుంచి ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాలు
- 11న రాములోరి కల్యాణానికి టీటీడీ సమాయత్తం

ఒంటిమిట్ట (రాజంపేట): ఒంటిమిట్టలోని కోదండ రామాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబయింది. ఈ నెల 5వ తేదీ నుంచి 15 వరకు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టనున్నారు. రోజుకొక అలంకారంలో రామయ్య భక్తులకు దర్శనమివ్వనున్నాడు.

ప్రధాన విశేషం..

సీతారామలక్ష్మణులు కొలువుదీరిన ఏ ఆలయంలో అయినా హనుమ కూడా దర్శనమిస్తారు. అయితే ఒంటిమిట్ట గుడిలో సీతారామలక్ష్మణులు మాత్రమే ఏకశిలపై దర్శనమిస్తారు. ఆంజనేయుడి విగ్రహం లేదు. అయితే ఆలయ తూర్పు గాలిగోపురానికి తూర్పుగా రథశాల పక్కనే సంజీవరాయుడుగా వెలసిన ఆంజనేయస్వామి గుడి నిర్మించారు.

త్రేతాయుగంలో సీతారామలక్ష్మణ నివాసం..

త్రేతాయుగంలో సీతారామలక్ష్మణులు ఈ ప్రాంతంలో కొంతకాలం నివసించారని పురాణ కథనం. అప్పుడు సీతమ్మకు దప్పిక అయింది..రాముడు బాణం సంధించి భూమిలోకి వదిలాడు. నీరుపైకి ఎగజిమ్మింది. సీతమ్మ దప్పిక తీరింది. లక్ష్మణుడు అన్న అనుజ్ఞతో తాను ఒక బాణం వదిలాడు. నీరుపైకి వచ్చింది. ఆ నీటిబుగ్గలనే నేడు రామతీర్థం..లక్ష్మణతీర్థం అని పిలుస్తున్నామనే కథ పురాణాల ద్వారా తెలుస్తోంది.

ధర్మ సంస్థాపన కోసం ఒంటిమిట్ట గుడి..

రాముడిక్కడ కోదండం ధరించి ఉన్నాడు. కోదండం ధర్మరక్షణకు ప్రతీక. అలనాడు శ్రీరామచంద్రుడు అడవుల్లో తిరుగుతూ నార వస్త్రాలు ధరించినా కోదండాన్ని విడువలేదు. అది ధర్మరక్షణ కోసమే. బుక్కరాయులు తర్వాత సిద్దవటం మట్లి రాజులు ఆలయాన్ని అత్యంత వైభవోపేతంగా తీర్చిదిద్దారు. అనంతరాజు, తిరుమలరాయలు, తిరువెంగళనాథరాజు, కుమార అనంతరాజులు ఒంటిమిట్ట కోవెలను తీర్చిదిద్దారు. ఉన్నతమైన ప్రాకారకుడ్యాలు సమున్నతమైన గోపుర శిఖరాలు రంగమంటపాల్లో అద్భుత శిల్పవిన్యాసాలు కనిపిస్తాయి.

ఆలయ చరిత్ర..

విజయ నగర సామ్రాజ్యంలో క్రీ.శ 1340లో ఉదయగిరి పాలకుడు కంపరాయలు ఒంటిమిట్ట ప్రాంతంలో పర్యటించారు. ఆయన కొంతపరివారాన్ని వెంటబెట్టుకొని వచ్చాడు. ఈ అడవుల్లో ఇద్దరు బోయలు ఉండేవారు. వారే వంటడు, మిట్టడు. వీరు రాజుగారికి సేవలందించారు. ఈ సమయంలో సమీపంలో గుట్టమీద చిన్నపాటి గుడి ఉంది. జాంబవంతుడు నిలిపిన శిలలో సీతారామలక్ష్మణులని భావించి దండం పెట్టుకొంటున్నారని, అక్కడ గుడి కట్టి పుణ్యం కట్టుకోమన్నారు. సీతమ్మను వెతుకుతూ ఒకనాడు జాంబవంతుడు ఈ గుట్టమీద విశ్రమించాడని, ఆరాత్రి అక్కడే నిద్రించాడని ఉదయం తిరిగి వెళ్తూ ఆ శిలలో సీతారామలక్ష్మణులను భావించుకొని నమస్కరించుకొని వెళ్లాడట. వంటడు..మిట్టడు చెప్పిన మేరకు కంపరాయలు గుడి, చెరువు నిర్మించేందుకు అంగీకరించారు. ఆ బాధ్యత బోయలకే అప్పగించారు. కాగా.. ఒంటడు.. మిట్టడు.. ఆలయ నిర్మాణంలో భాగం అయ్యారు గనుకనే ఈ ఆలయానికి ఒంటిమిట్ట అనే పేరు వచ్చిందనే పురాణ కథ ప్రాచుర్యంలో ఉంది.

ఏకశిలా నగరంగా..

ఒంటిమెట్ట మీద **నిర్మించిన ఆలయం ఉన్న ప్రదేశం** ఒంటిమిట్ట అయింది. **ఒంటిమిట్ట గుడికి అనురూపంగానే ఏర్పడిన** మరోపేరు ఏకశిల. ఒకేశిలలో సీతారామలక్ష్మణ విగ్రహాలు నిర్మితమై ఉన్నాయి. ఇది అరుదైన సంగతి. జాంబవంతుడు ముగ్గుర్ని ఒకే శిలలో భావించుకొన్నాడు. ఆ తర్వాత కాలంలో కంపరాయలు, బుక్కరాయలు అదే సంప్రదాయంతో ఏకశిలలో ముగ్గురు మూర్తులు ఉండేటట్లు నిర్మాణం చేయించారు. బహుశా ఒకే శిలలో ముమ్మూర్తులను నిలిపిన సంఘటన ఒంటిమిట్టలో మొదటిగా ఆవిష్కృతమైంది. అరుదుగా కొలవైన ఏకశిలావిగ్రహ ప్రాంతాన్ని ఏకశిల అని భక్తితో అన్నాడు పోతన.

ఏకశిలానగరానికి ఎలా చేరుకోవాలంటే..

చెన్నై–ముంబాయి రైలుమార్గంలోని ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో దిగి ఒంటిమిట్ట(ఏకశిలానగరం)కు చేరుకోవచ్చు. కడప నుంచి రేణిగుంట తిరుపతికి వెళ్లే బస్సు మార్గంలో , కడప నుంచి 25కిలోమీటర్ల దూరంలో ఒంటిమిట్ట వస్తుంది.

రామయ్య సేవలో కవులు

ఒంటిమిట్ట కోదండరామాలయంలో వెలసిన రఘురాముడిని సేవిస్తూ కవులెందరో తరించారు. వారిలో అయ్యలరాజు తిప్పయ్య, బమ్మెర పోతన, అయ్యలరాజు రామభద్రుడు, ఉప్పుగొండూరు వెంకట కవి, వరకవి నల్లకాల్వ అయ్యప్ప, వాసుదాసు వావిలికొలను సుబ్బారావులు తమతమ స్థాయిలో కోదండరామునిపై సాహిత్యం, కీర్తనలు, రచనలుతోపాటు ఆలయ అభివృద్ధికి తోడ్పడ్డారు.

కోదండరాముడి బ్రహ్మోత్సవాల వివరాలు..

తేది (ఏప్రిల్)	ఉదయం	రాత్రి
06	ధ్వజారోహణం	శేష వాహనం
07	వేణుగానాలంకారం	హంస వాహనం
08	వటపత్రశాయి అలంకారం	సింహ వాహనం
09	నవనీత కృష్ణాలంకారం	హను మత్సేవ
10	మోహినీ అలంకారం	గరుడ సేవ
11	శివధనుర్భాలంకారం	గజ వాహనం
12	రథోత్సవం	
13	కాళీయమర్ధన అలంకారం	అశ్వవాహనం
14	చక్రస్నానం	ధ్వజావరోహణం
15	సాధారణ కార్యక్రమాలు	పుష్పయాగం, ఏకాంతసేవ

ఆలయ నిర్మాణం ఇలా..

విజయ నగర సామ్రాజ్య చక్రవర్తి బుక్కరాయలు ఒంటిమిట్ట గుడిలో ఏకశిలా విగ్రహం నిలిపిన నాటికి గర్భాలయం, అంతరాళం, చిన్నగోపురం ఉండేవి. మొదటి దశ నిర్మాణమిది. మూడవ దశలో మహా మంటపం (రంగ మంటపం), మహా ప్రాకారం, తూర్పు, ఉత్తర , దక్షిణ గాలిగోపురాలు, మహా ప్రాకారం లోపల నైరుతి దిక్కున కళ్యాణ మంటపం, ఆగ్నేయ దిశలో పాకశాల, ప్రాకారంలోపల ఉత్తరం వైపు తూర్పున, పడమర ఎదుర్కోలు మంటపాలు, రామలింగదేవుని గుడి (1966)లో లింగాన్ని నిలిపారు. సంజీవరాయస్వామి, రథం, రథశాలను ఏర్పాటుచేశారు. అనంతరం అనంతరాజు గుడిని విస్తరించాడు. మహామంటపం, మహాప్రాకారం, గాలిగోపురాల నిర్మాణాలు చేపట్టారు. తెలుగురాష్ట్రాలలో ఒంటిమిట్ట గాలిగోపురాల తరహాలో మరెక్కడా కనిపించవు. ఈ ఆలయాన్ని దర్శించిన టావెర్నియర్ అనే యాత్రికుడు ఎత్తయిన గోపురాలు చూసి విస్మయం చెందాడు.



ఏకశిలపై సీతారామలక్ష్మణ మూర్తులు

రామయ్యకు బ్రహ్మోత్సవ శోభ

ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలతో ఏకశిలానగం శోభాయమానంగా వెలుగొందనుంది. ఇప్పటికే కళ్యాణవేదిక ముస్తాబు, భక్తుల కోసం గ్యాలరీలు చకచకా ఏర్పాటుచేశారు. 60 గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. వీవీవీఐపీ, వీఐపీ, సాధారణ భక్తులను దృష్టిలో ఉంచుకొని గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. దాశరథి కల్యాణానికి వచ్చే భక్తులకు తోపులాట వాతావరణం లేకుండా టీటీడీ చర్యలు తీసుకుంటోంది. రేపటి నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు దాదాపు పూరికావస్తున్నాయి.

దాశరథి కోవెలలో నవమి ఏర్పాట్లు...

ఒంటిమిట్టలో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆరోజున ఆలయంలో పోతన జయంతి కార్యక్రమాన్ని టీటీడీ నిర్వహించనున్నది. కవిసమ్మేళనం నిర్వహిస్తారు. నవమి సందర్భంగా భక్తులు పెద్దఎత్తున రానున్నారు.

కోర్టు ఆదేశించినా సర్కారు కనికరించదు

ఏపీఈపీడీసీఎల్‌లో 1,354 మంది జూనియర్ లైన్‌మెన్ పదోన్నతుల్లో విచిత్రం

- 18 ఏళ్ల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడంపై అభ్యంతరాలు
- ఫలితంగా సీనియర్లు సైతం జూనియర్లుగా మిగిలిపోయిన పరిస్థితి
- హైకోర్టు ఆదేశించినా అమలుచెయ్యని డిస్కంలు

సాక్షి, విశాఖపట్నం: ఏ సంస్థలోనైనా చేసిన సర్వీస్ ప్రకారం సీనియారిటీని పరిగణిస్తుంటారు. కానీ.. విద్యుత్ పంపిణీ సంస్థల్లో మాత్రం విచిత్రంగా పుట్టిన తేదీని పరిగణనలోకి తీసుకున్నారు. ఉద్యోగి వయసు 40 సంవత్సరాలై సర్వీసు 15 ఏళ్లున్నప్పటికీ.. యాభై ఏళ్ల ఉద్యోగికి ఐదేళ్ల సర్వీసు ఉంటే.. సదరు ఉద్యోగినే సీనియర్‌గా పరిగణించారు. ఇలా 2008లో డిస్కం అధికారులు అడ్డగోలుగా పదోన్నతుల జాబితా తయారుచేశారు. దీనిపై కొందరు అప్పట్లోనే హైకోర్టుని ఆశ్రయించారు. సర్వీసు ప్రకారం పదోన్నతుల జాబితా సిద్ధంచెయ్యాలంటూ 2024 జూన్‌లో న్యాయస్థానం ఆదేశించినా.. టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీనిపై సంఘాల ప్రతినిధులు ప్రభుత్వం, అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు. నిజానికి 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చే ముందు కరెంట్ పోతే ఫ్యూజులు బిగించేందుకు రైతులే వెళ్లి మృత్యువాత పడేవారు. దీంతో డిస్కంలలో లైన్‌మెన్ల కొరత వేధిస్తోందని తెలుసుకున్న వైఎస్సార్.. ఉమ్మడి రాష్ట్రంలో వెంటనే 7,114 పోస్టుల్ని భర్తీచేశారు. ఈ సమయంలో ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు ఉమ్మడి సర్కిల్స్ పరిధిలో 1,220 పోస్టులు భర్తీఅయ్యాయి.

గత ప్రభుత్వ హయాంలో ప్రయత్నించినా..

సీనియారిటీ జాబితా విషయంలో అన్యాయం జరిగిందంటూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టికి బాధిత లైన్‌మెన్‌లు తీసుకెళ్లారు. అయితే.. అప్పటికే కోర్టులో కేసు నడుస్తుండటంతో ఫలితం దక్కలేదు. చివరి నిమిషం వరకూ సీనియారిటీ జాబితాలో మార్పులు చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో.. గతేడాది జూన్ 21న హైకోర్టు తీర్పు వెలువరించింది. పనిదినాల ఆధారంగా మాత్రమే కొత్తగా సీనియారిటీ జాబితా తయారుచేయాలని.. వయసు ఆధారంగా చేసిన జాబితాని వెంటనే రద్దుచేసి.. కొత్తగా తయారుచేయాలని డిస్కంలని ఆదేశించింది. అయినా, కూటమి ప్రభుత్వం న్యాయస్థానం తీర్పుని పెడచెవిన పెట్టింది. 10 నెలలు గడుస్తున్నా పట్టించుకోవడంలేదు. పలుమార్లు అధికారులకు, ప్రభుత్వ ప్రతినిధులకు లైన్‌మెన్‌లు వినతులు సమర్పించినా.. సీనియారిటీ లిస్టుని మార్చడంలేదు. ఇటీవల ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్‌లో ప్రక్రియ ప్రారంభించారు.



అయితే.. ఈపీడీసీఎల్ అధికారులు మాత్రం.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అలాగే, 2007లో జూనియర్ లైన్‌మెన్‌లుగా ఎంపికైన 138 మందికి ఉద్యోగాలు ఇవ్వకుండా ఈపీడీసీఎల్ అధికారులు అడ్డుపుల్ల వేశారు. దీనిపై వారు కోర్టుకు వెళ్లగా.. 138 మందికి ఉద్యోగాలివ్వాలని 2011లో న్యాయస్థానం ఆదేశించింది. వీరు విధుల్లో చేరినా సీనియారిటీని కోల్పోయారు. ఇలా.. ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం సర్కిల్‌లో 118 మంది, విజయనగరం సర్కిల్‌లో 136, విశాఖపట్నంలో 198, రాజమండ్రిలో 549, ఏలూరులో 353 మంది కలిపి మొత్తం 1,354 జూనియర్ లైన్‌మెన్‌లు పదోన్నతులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోర్టు తీర్పుని తక్షణమే అమలుచేస్తే.. ఈపీడీసీఎల్ సహా మూడు డిస్కంల పరిధిలో సుమారు 3,500 మంది ఉద్యోగులకు పదోన్నతులు దక్కుతాయి.

సీనియారిటీ లిస్టుల్లో అధికారుల నిర్లక్ష్యం..

2008లో కొత్తగా రిక్రూట్ చేసిన లైన్‌మెన్ల గత అనుభవాన్ని అనుసరించి.. సీనియారిటీ లిస్టులు తయారుచెయ్యాలని అప్పటి ప్రభుత్వం డిస్కంలని ఆదేశించింది. అయితే.. అధికారులు నిబంధనలకు విరుద్ధంగా జాబితా సిద్ధంచేసేశారు. పనిచేసిన అనుభవం బట్టి కాకుండా.. వయసు బట్టి జాబితా తయారుచేశారు. దీనిపై అప్పట్లోనే అధికారులపై నాటి సీఎం వైఎస్ మండిపడ్డారు. ఆ తర్వాత ఆయన మృతిచెందడం.. తర్వాత ప్రభుత్వాలు విస్మరించడంతో నేటికి కూడా సీనియర్లు జూనియర్లుగానే మిగిలిపోయారు. జూనియర్లు మాత్రం ప్రమోషన్లు తీసుకుని సీనియర్లుగా చలామణి అవుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు బాధిత లైన్‌మెన్‌లు హైకోర్టుని ఆశ్రయించారు.

16న కందుకూరి రంగ స్థల పురస్కారాలు

దరఖాస్తులకు ఆహ్వానం

సాక్షి, అమరావతి: తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి సందర్భంగా ఈ నెల 16న కళాకారులకు కందుకూరి ప్రతిష్టాత్మక, విశిష్ట పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాటక రంగంలో కృషి చేసిన వారికి రాష్ట్ర స్థాయిలో కందుకూరి ప్రతిష్టాత్మక రంగ స్థల పురస్కారం, జిల్లా స్థాయిలో కందుకూరి విశిష్ట పురస్కారాలు అందజేస్తామన్నారు. అర్హులైన రచయితలు, దర్శకులు, కళాకారులు, సాంకేతిక నిపుణులు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో జిల్లా స్థాయి అవార్డులు అందుకున్న వారు రాష్ట్రస్థాయి అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని, రాష్ట్ర స్థాయి అవార్డులు పొందిన వారు మళ్లీ దరఖాస్తు చేస్తే తిరస్కరిస్తామన్నారు. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ పరిపాలన భవనం నాలుగో అంతస్తులో నేరుగా దరఖాస్తులు అందజేయొచ్చన్నారు. దరఖాస్తు ఫామ్‌లు www.apsftvtdc.in వెబ్‌సైట్‌లో అందుబాటు ఉన్నాయన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలపై అవగాహన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 352 కేజీబీవీల్లో వచ్చే విద్యా సంవత్సరానికి 6, 11 తరగతుల్లో ప్రవేశాలు, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులపై అవగాహన కల్పిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 22న ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ ఏప్రిల్ 11 వరకు కొనసాగుతుందన్నారు. దరఖాస్తులో సందేహాలు ఉంటే జుఙఖీ. ట్రర్ఖుఙఖ్బుఃఙఖ్బుజీ . ఛొరుు కు పంపించాలని, రెండు రోజుల్లో సమాధానం రాకుంటే 70751 59996, 70750 39990 నంబర్లలోనూ సంప్రదించవచ్చని తెలిపారు.

భోపాల్‌కు 'బర్డ్‌ఫ్లూ' నమూనాలు..

సాక్షి, అమరావతి: ఇక బర్డ్‌ఫ్లూతో చిన్నారి మృతిపై అధ్యయనంలో భాగంగా చికెన్ సెంటర్, పౌల్ట్రీ ఫారమ్‌లలో కోళ్లు, పర్యావరణానికి సంబంధించి 20 నమూనాలను కేంద్ర బృందం సేకరించింది. వీటిని పరీక్షల నిమిత్తం పశుసంవర్ధక శాఖ భోపాల్‌కు పంపుతుందని శుక్రవారం ప్రభుత్వం వెల్లడించింది. మరోవైపు.. మృతిచెందిన చిన్నారి ఇంటినిండా ఎలుకలున్నాయని.. వీటికి విరుగుడుగా ఆమె తల్లిదండ్రులు ఇంట్లోని వివిధ ప్రదేశాల్లో ఎలుకల మందును ఉంచడాన్ని ఈ బృందం గుర్తించింది.

ఏపీ ఇన్ పార్లమెంట్

డిఫెన్స్ స్కూల్స్‌లో ఫీజులు పెంచాం

- జాతీయ గుర్తింపు కోసం 'స్విమ్స్' నుంచి ప్రతిపాదన వచ్చింది
- లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీల ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: సిబ్బందికి జీతాలు, తదితర ఖర్చుల దృష్ట్యా ఇటీవల కాలంలో వైమానిక దళ (డిఫెన్స్) పాఠశాలల్లో ఫీజులు పెంచినట్లు కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేత్ తెలిపారు. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. డిఫెన్స్ స్కూల్స్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు, వీటిని ఎటువంటి నష్టాలు లేని వెంచర్‌లుగా నడుపుతున్నట్లు చెప్పారు. సిబ్బంది జీతాలు, ఇతర అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్వల్పంగా ఫీజులు పెంచినట్లు వివరించారు. కేంద్రం విద్యాసంస్థలను పార్లమెంట్ చట్టం ద్వారా జాతీయ సంస్థలుగా ప్రకటిస్తుందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాధవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ గురుమూర్తి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. జాతీయ గుర్తింపు కోసం తిరుపతిలోని స్విమ్స్ నుంచి ప్రతిపాదన వచ్చిందని చెప్పారు.

కాకినాడ జిల్లాలో 4 రొయ్యల ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో ఆపరేషన్ గ్రీన్–లాంగ్ టర్మ్ ఇంటర్వెన్షన్ స్కీం కింద 4 రొయ్యల ప్రాజెక్టులు ఉన్నట్లు కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ తెలిపారు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. కాకినాడ జిల్లాలో రొయ్యల కోసం రూ.254.34 కోట్లతో 4 ప్రాజెక్టులను కేంద్రం ఆమోదించిందన్నారు. రాష్ట్రంలో పహచాన్ పథకం కింద 66,103 మంది చేతివృత్తిదారులు నమోదు చేసుకున్నట్లు కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిట తెలిపారు. ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. ఈ పథకం కింద ఏపీలో 66,103 మంది చేతి వృత్తిదారులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు.

హైకోర్టులో స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టులో పలువురు న్యాయవాదులను స్టాండింగ్ కౌన్సిళ్లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు వీరు ఈ పోస్టుల్లో కొనసాగుతారు.

వివరాలు ఇలా..

- ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) స్టాండింగ్ కౌన్సిల్‌గా నందం జీవన్ కుమార్
- తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) కర్రి కళ్యాణ దుర్గాప్రసాద్
- రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు మహ్మద్ సలీం
- ఏపీ ఎస్సీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా గంద్రాల రత్నకుమార్
- ఏపీ విత్తనాభివృద్ధి సంస్థకు ఏవీ కొండయ్య

షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలి

ఏపీటీఎఫ్ డిమాండ్

సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అనారోగ్య కారణాలతో పదో తరగతి స్పాట్ వ్యాల్యుయేషన్‌లో పాల్గొనలేని ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చి మరలా విధులకు రాలేదని షోకాజ్ నోటీసులు జారీచేయడం సరికాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, ఎస్. చిరంజీవిలు పేర్కొన్నారు. తక్షణమే వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

● తెలుసుకుందాం



అగ్గిపెట్టె కనిపెట్టింది ఎప్పుడో తెలుసా?

ఇప్పుడంటే నిప్పు వెలిగించడానికి అగ్గిపెట్టె వాడుతున్నాం. అగ్గిపెట్టె లేని కాలంలో నిప్పు పుట్టించడం చాలా టఫ్ విషయం అని మీకు తెలుసా? రాళ్లను మరో రాళ్లతో కొట్టి, కర్రలను మధించి నిప్పు పుట్టించేవారు. ఒకరి ఇంట్లో నిప్పు కావాలంటే పక్కింట్లో నుంచి నిప్పు కణికల్ని తీసుకెళ్లేవారు. అగ్గిపెట్టె వచ్చిన తర్వాత ఈ ఇబ్బందులు తీరాయి.


క్రీ.శ.577 నుంచే చైనాలో రాజవంశానికి చెందిన స్త్రీలు నిప్పు కోసం కొన్ని ప్రత్యేకమైన కర్రల్ని వాడేవారని, వాటికి రసాయనాలు పూసి నిప్పు పుట్టించేవారని చరిత్రకారులు అంటున్నారు. చరిత్రలో అవే తొలి అగ్గిపుల్లలని వారు అంచనా వేస్తున్నారు.



ఆ తర్వాత 16వ శతాబ్దంలో అప్పటి శాస్త్రవేత్తలు గ్యాస్ ఆధారంగా నిప్పు పుట్టించే ప్రయోగాలు చేశారు. 1832లో లండన్‌లో తొలిసారి సిగార్లు వెలిగించుకునేందుకు కర్రతో పుల్లలు తయారు చేసి వాటి చివరన రసాయనాలను అంటించారు. ఇవి చాలా ఉపయోగకరంగా ఉండటంతో వీటిపై మరిన్ని ప్రయోగాలు జరిగి, చివరకు ఇవాళ మనం చూస్తున్న అగ్గిపెట్టెలు అవతరించాయి. భలే ఉందిగా అగ్గిపెట్టె పుట్టుక.



● మహనీయులు



భారతీయ సినిమాకు ఆద్యుడు దాదాసాహెబ్ ఫాల్కే

పిల్లలూ! మీకు సినిమాలు చూడటం ఇష్టమా? సినిమా థియేటర్లకు వెళ్లి ఆ సీన్లు చూస్తూ కేరింతలు కొడుతుంటారా? మనదేశంలో సినిమా రంగానికి ఆద్యుడైన దాదాసాహెబ్ ఫాల్కే గురించి తెలుసుకుందామా?

దాదాసాహెబ్ ఫాల్కే అసలు పేరు దూండీరాజ్ ఫాల్కే. 1870 ఏప్రిల్ 30న త్రయంబకేశ్వర్‌లో పుట్టారు.


ప్రాథమిక విద్య అనంతరం బొంబాయిలో ఆయిల్ పెయింటింగ్, వాటర్ కలర్ పెయింటింగ్ నేర్చుకున్నారు. 1890లో తొలిసారి ఓ ఫొటో కెమెరా కొన్న ఫాల్కే దాంతో రకరకాల ఫొటోలు తీస్తూ ప్రయోగాలు చేసేవారు. అయితే ఫొటోగ్రఫీ అంటూ బలాదూర్ తిరుగుతున్నాడని అందరూ ఆయన్ని మందలించేవారు. అవేవీ లెక్కచేయకుండా తన ఇష్టమైన పనిలో గడిపేవారు.

అనంతరం కుటుంబసభ్యుల ఒత్తిడి పెరగడంతో భార్య, పిల్లలతో కలిసి గుజరాత్ రాష్ట్రం గోద్రాకు వెళ్లి, అక్కడ ఒకరి సహకారంతో ఫొటో స్టూడియో ఏర్పాటు చేసుకున్నారు.

1900లో ఆయన భార్య ప్లేగు వ్యాధితో మరణించింది. దీంతో గుజరాత్ నుంచి ఆయన బరోడాకు తిరిగి వచ్చి ఫొటో స్టూడియో ప్రారంభించారు. అయితే ఫొటోలు తీసుకుంటే అనారోగ్యం వస్తుందని, ఒంట్లో శక్తి నశిస్తుందనే పుకారు చెలరేగడంతో ఎవరూ ఫొటోలు దిగేవారు కాదు. దీంతో ఆయన వ్యాపారం సాగలేదు. అనంతరం నాటకాలకు కర్టెన్లు తయారు చేస్తూ, వాటి మీద బొమ్మలు వేస్తూ జీవించారు. 1902లో సరస్వతీబాయిని రెండో పెళ్లి చేసుకున్నారు.

ఆయన 1911లో తన కొడుకుతో కలిసి 'అమేజింగ్ యానిమల్స్' అనే ఇంగ్లీషు సినిమా చూశారు. అందులో జంతువులు, వాటి విన్యాసాలు చూసి సినిమాల మీద ఆయనకు ఆసక్తి మొదలైంది. తర్వాతి రోజు తన కుటుంబాన్ని తీసుకొని వెళ్లి 'ది లైఫ్ ఆఫ్ క్రైస్ట్' అనే సినిమా చూశారు. ఆ సినిమాలో క్రీస్తును తెర మీద చూసినట్టు మన దేశంలో రాముడు, కృష్ణుడు పాత్రలను తెరపై చూపితే ఎలా ఉంటుందన్న ఆలోచన మొదలైంది. సినిమా తీయాలన్న ఆయన ఆలోచన లక్ష్యంగా మారింది. సన్నిహితుల సాయంతో రూ.10 వేలు సమకూర్చుకుని లండన్ వెళ్లారు. అక్కడ రెండు నెలలు ఉండి సినిమా నిర్మాణం, కెమెరా, ప్రాసెసింగ్, ఎడిటింగ్ లాంటి అంశాలు నేర్చుకొని తిరిగొచ్చారు. వచ్చిన రోజే 'ఫాల్కే ఫిలింస్ కంపెనీ' ప్రారంభించి, హరిశ్చంద్రుని కథను 'రాజా హరిశ్చంద్ర' పేరుతో సినిమాగా తీయాలని అనుకున్నారు. అందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఎన్నో ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నారు. చివరకు 6 నెలల 27 రోజుల షూటింగ్‌తో ఆ సినిమా పూర్తయింది. 1913 ఏప్రిల్ 21న బొంబాయిలోని ఒలింపియా థియేటర్‌లో ఆ సినిమా విడుదలైంది. అలా తొలి భారతీయ చిత్రంగా 'రాజాహరిశ్చంద్ర' రికార్డు నెలకొల్పింది.

ఆ తర్వాత 'మోహినీ భస్మాసుర్', 'సత్యవాన్ సావిత్రి', 'లంకా దహన్', 'శ్రీకృష్ణ జన్మ', 'కాళీయ మర్దన్' తదితర సినిమాలు తీశారు. 1944 ఫిబ్రవరి 16న మరణించారు. భారతీయ సినీరంగ పితామహుడిగా ఆయన్ను గుర్తించిన ప్రభుత్వం 1969 నుంచి ఆయన పేరు మీద సినీరంగంలోని ప్రముఖులకు ఏటా 'దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు' అందిస్తోంది.




● మన సినిమా

THE GARFIELD MOVIE
ఏ బెల్లీఫుల్ అడ్వెంచర్

హేయ్ కిడ్స్.. ఎగ్జామ్స్ అయిపోయాయా. ఎంజాయ్ చేస్తున్నారా..... ఓకే... ఈ రోజు ఓ సూపర్ మూవీ గురించి మాట్లాడుకోబోతున్నాం. ముందుగానే చెప్పేస్తున్నా మీరు బాగా ఫుడీ అయినా లేక మీ పెట్ క్యాట్ ఫుడీ అయినా ఈ సినిమాని బాగా ఎంజాయ్ చేస్తారు. 'ది గార్ఫీల్డ్ మూవీ'. గార్ఫీల్డ్ అనేది ఒక ఫ్యాట్, ఫుడీ, లేజీ ఆరెంజ్ కలర్ పిల్లి. గార్ఫీల్డ్‌కి 'ఓడి' అనే కుక్క ఫ్రెండ్‌గా ఉంటుంది. ఓ రోజు గార్ఫీల్డ్ తన ఫ్రెండ్ ఓడీతో కలిసి రాత్రి భోజనం చేస్తున్నప్పుడు రోలాండ్, నోలన్ అనే ఇద్దరు కిడ్నాపర్స్ వచ్చి వాళ్ళని కిడ్నాప్ చేస్తారు. అయితే గార్ఫీల్డ్‌తో పాటు ఓడీని గార్ఫీల్డ్ తండ్రి రక్షిస్తాడు.

అయితే తండ్రి మీద గార్ఫీల్డ్‌కు కోపం ఉంటుంది. దానికి కారణం చిన్నప్పుడు తనను అతడు ఒక గల్లీలో వదిలేసి ఉంటాడు. ఇంతలో ఇంకో విలన్ జింక్స్ అనే పర్షియన్ పిల్లి కథలో ప్రవేశిస్తుంది. అది గార్ఫీల్డ్ తండ్రిని కిడ్నాప్ చేస్తుంది. మరి గార్ఫీల్డ్ తన తండ్రిని ఎలా రక్షించాడన్నది మాత్రం 'ది గార్ఫీల్డ్ మూవీ'లోనే చూడాలి. ఇది సూపర్ యానిమేటెడ్ మూవీ. గార్ఫీల్డ్ తినే పద్ధతి అలాగే దాని స్టంట్స్ సూపర్ అడ్వెంచరస్ తో పాటు కామెడీగా ఉంటాయి. సో కిడ్స్ గ్రాబ్ యువర్ రిమోట్ అండ్ ట్యూన్ ఇట్ టు నెట్ ఫ్లిక్స్ టు రైడ్ విత్ గార్ఫీల్డ్. ఎంజాయ్.

- ఇంటూరు హరికృష్ణ




గిబ్లీ-స్టైల్ ఫొటో మొదలుపెట్టింది అతనే

● ట్రెండింగ్



Ghibli & Style (గిబ్లీ-స్టైల్) ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ట్రెండ్‌గా మారింది. అందరూ తమ ఫొటోలను ఏఐకి ఇచ్చి, దాని ద్వారా గిబ్లీ-స్టైల్ ఫొటోలను పొందుతున్నారు. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఈ అప్‌డేట్ కారణంగా చాలామంది OpenAI దగ్గరయ్యారు. ఈ ట్రెండ్ ఎంతగా ప్రాచుర్యం పొందిందంటే, చివరకు OpenAI సీఈవో సామ్ ఆల్మన్ వచ్చి 'మీరు కాస్త నిదానించండి. ఇవతల మా ఉద్యోగులు పనిభారంతో చాలా ఒత్తిడికి గురవుతున్నారు' అని యూజర్లను అభ్యర్థించేంత. మరి బొమ్మలకు ఇంత ప్రచారం కల్పించిన వ్యక్తి గురించి మీకు తెలుసా? ఆయనే సీటల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గ్రాంట్ స్లాటన్.

మార్చి 26న స్లాటన్ తన భార్య, కుక్కపిల్లతో కలిసి దిగిన ఫొటోను OpenAI ద్వారా గిబ్లీ-స్టైల్ బొమ్మగా మార్చి ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఆయన పోస్ట్ చేసిన వెంటనే ఆ ఫొటో వైరల్‌గా మారింది. అందరూ దాని గురించి మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. తమకూ అలాంటి ఫొటోలు తయారు చేసుకోవాలని ఉందన్నారు. సుమారు 50 మిలియన్ల మంది ఆ పోస్ట్ చూశారంటే క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. గంటల్లోనే ఈ విషయం ట్విట్టర్‌లో ట్రెండ్‌గా మారింది. కొందరు ఆ ఫొటోను మెచ్చుకోగా, మరికొందరు దాన్ని విమర్శిస్తూ 'అది చిత్రకారుల గౌరవాన్ని దెబ్బతీస్తోందని' కామెంట్లు చేశారు. మొత్తానికి ఆ ఫొటో ట్రెండ్ సృష్టించడంతో OpenAI ఆ విషయాన్ని గుర్తించి వెంటనే చర్యలు చేపట్టింది. అందరు యూజర్లు గిబ్లీ-స్టైల్ ఫొటోలు తయారు చేసుకునే అప్‌డేట్ తీసుకొచ్చింది. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఇది అందరికీ అందుబాటులోకి వచ్చింది. అలా మనం తయారుచేస్తున్న ఫొటోల వెనుక గ్రాంట్ స్లాటన్ చేసిన పని ఉందన్నమాట!

● కథ

కుండ బోధ

ఒక ఊరిలో విశ్వనాథ్ అనే నిరుపేద యువకుడు ఉండేవాడు. అతనితండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. తల్లి చాలా కష్టపడి పెంచి పెద్ద చేసింది.విశ్వనాథ్‌కి పద్దెనిమిది సంవత్సరాల వయసులో తల్లి చనిపోతూ ఒకమట్టికుండ ఇచ్చింది. ''నాయనా! నీకోసం ఏ ఆస్తులూ కూడబెట్టలేదు. ఈ కుండలోపది రూపాయలు, కొన్ని సరుకులు ఉన్నాయి'' అని చెప్పింది.

తల్లి చనిపోయాక ఒంటరివాడయ్యాడు విశ్వనాథ్. ఎన్నో ఇబ్బందులు, కష్టాలు,బాధలు పడ్డాడు. వాటిని భరించలేక చనిపోవాలనే నిర్ణయానికి వచ్చాడు. ఎలా చనిపోతే బాగుంటుందని ఆలోచిస్తున్న సమయంలో ఎవరో నవ్విన శబ్దం వినబడింది.ఉలిక్కిపడి చుట్టూ చూస్తే అమ్మ ఇచ్చిన కుండ అతన్ని చూసి నవ్వుతూ కనిపించింది.


''నవ్వు! నవ్వకేం చేస్తావు? నీకు ఏ కష్టాలూ లేక హాయిగా ఉన్నావు!మానవ జన్మ ఎత్తి నేనెన్ని బాధలు పడుతున్నానో నీకేం తెలుసు? నేను నీలా మట్టికుండనైనా బాగుండేది'' అన్నాడు విశ్వనాథ్.

''బాబూ! ఎవరి కష్టాలు వారికి ఉంటూనే ఉంటాయి. కష్టాలకు భయపడి చనిపోతే ఈ ప్రపంచంలో ఇంక ఎవ్వరూ మిగలరు. అయినా, నేనెన్ని బాధలు పడ్డానోతెలుసా? నన్ను నీళ్ళతో తడిపి, ముద్ద చేసి కాళ్ళతో కసాపిసా తొక్కుతారు. ఒకచక్రం మీద పడేసి గిరగిరా తిప్పి కుండగా తయారు చేస్తారు. తరువాత ఇటుకబట్టీలో వేసి కాల్చుతారు. ఇన్ని కష్టాలు పడ్డ నన్ను కొనడానికి వచ్చిన వాళ్ళంతాఅటు ఇటు తిప్పి మొట్టికాయలు వేస్తారు. మట్టితో తయారుకాబడ్డ నాకే ఇన్ని కష్టాలుంటే, మనిషివి, నీకుండవా మరి? అయితే కష్టాలను తలుచుకుంటూ బాధపడేకంటే వాటిని అధిగమించడంలోనే ఉంది మానవ జన్మ సార్థకం!'' అని చెప్పిందికుండ.

కుండ చేసిన హితబోధతో విశ్వనాథ్ కళ్ళు తెరుచుకున్నాయి. చనిపోవాలని ఎంత మూర్ఖంగా ఆలోచించాడో అర్థమయ్యింది. ఇక ఆరోజు నుంచి విశ్వనాథ్ కష్టపడి పని చేయసాగాడు.

స్వతహాగా మంచివాడు కావటంతో అతనికి అందరిలో మంచి పేరు వచ్చింది.అది విని ఆ ఊరి జమీందారు తన దగ్గర పనికి పెట్టుకున్నాడు. అక్కడే పాలేరుగా పనిచేసే రంగయ్య విశ్వనాథ్‌కి తన కూతుర్ని ఇచ్చి వివాహం జరిపించాడు.

నీతి: కష్టాలు కలిగినప్పుడు కుంగిపోకూడదు.



● వండర్ కిడ్

ఆటిజాన్ని 'మాయ' చేశాడు

పుట్టుకతో లోపం వస్తే మనం ఏడుస్తూ కూచోకూడదు అంటాడు సిలియస్ ఓ.కానర్. ఇతడి కథ ఎవరినైనా ఇన్‌స్పయిర్ చేయాల్సిందే. కానర్ ఐర్లాండ్ దేశస్తుడు. వయసు పదిహేనేళ్లు. అతనికి ఒక నిమిషం టైం ఇస్తే చాలా మాయాజాలం చేసి చూపిస్తాడు. ఆశ్చర్యపరుస్తాడు. ఈ ప్రతిభకు గుర్తింపుగా గిన్నిస్ ప్రపంచ రికార్డు సొంతం చేసుకున్నాడు.

ఇంత ప్రతిభ కలిగిన కానర్‌కు ఉన్న అతి పెద్ద ఇబ్బంది ఆటిజం. చిన్నతనం నుంచే అతను ఆటిజంతో బాధపడుతున్నాడు. ఈ కారణంగా ఎక్కువదూరం నడవలేడు, పెద్ద శబ్దాలు వినలేడు. అయితే కుటుంబసభ్యులు, స్నేహితులు తోడుగా ఉండటం వల్ల మానసికంగా ఏ రోజూ కుంగిపోలేదు. ధైర్యం తెచ్చుకుని అందరితోపాటే స్కూల్‌కి వెళ్లి చదువుకున్నాడు.

2017లో ఏడేళ్ల వయసున్నప్పుడు ఇస్సీ సింప్సన్ అనే మహిళా మెజీషియన్ చేసిన ఇంద్రజాలాన్ని టీవీలో చూశాడు కానర్. ఎలాగైనా ఆమెను కలవాలని తల్లిదండ్రులను కోరాడు. ఆమె ఉండేది ఇంగ్లాండ్‌లో అని, అంత దూరం వెళ్లలేమని అన్నారు. అతను మరింత పట్టుబట్టడంతో చివరకు విమానం ఎక్కించి మరీ కానర్‌ను ఆమె దగ్గరికి తీసుకెళ్ళారు. ఆమెతో మాట్లాడిన అతనికి తానూ మ్యాజిక్ చేయాలన్న ఆసక్తి కలిగింది. అయితే ఎక్కడికి వెళ్లి నేర్చుకోవాలో తెలియదు. దీంతో సొంతంగా నెట్‌లో వీడియోలు చూసి ఇంట్లోనే సాధన చేయడం మొదలుపెట్టాడు. అంతేకాదు 2018లో ఐర్లాండ్‌లో ఉండే మెజీషియన్ సొసైటీలో చేరి మ్యాజిక్ నేర్చుకుంటానని ఉత్సాహం చూపడంతో వారు అతనికి శిక్షణ ఇచ్చారు. 2022లో పన్నెండేళ్ళ వయసులో 'ది బ్లాక్ పూల్ మ్యాజిక్ కన్వెన్షన్'లో తొలి ప్రదర్శన ఇచ్చాడు. కానర్ ఉత్సాహంగా మ్యాజిక్ ట్రిక్కులు చేసి చూపిస్తుండటాన్ని అందరూ ఆశ్చర్యంగా గమనించారు. ఆ తర్వాత అనేక వేదికలపై ప్రదర్శనలు ఇచ్చాడు. స్టేజీ మీద అతను చేసే ట్రిక్స్ అందర్నీ మంత్రముగ్ధులను చేస్తుంటాయి.

ఇలా ప్రతిభ చూపిన సిలియన్ 'America's got Talent', 'Britain's got Talent' అనే రెండు ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల్లో పాల్గొని, తన ప్రతిభతో అందర్నీ ఆకట్టుకున్నాడు. 2024లో గిన్నిస్ ప్రతినిధుల ఎదుట ఒక్క నిమిషంలో 28 మ్యాజిక్ ట్రిక్కులు చేసి చూపించి ప్రపంచ రికార్డు అందుకున్నాడు. 'నీ మ్యాజిక్ ప్రదర్శనలకు ఆటిజం ఇబ్బందిగా ఉంటుందా?' అని కానర్‌ని అడిగితే, 'ఇబ్బంది ఉంటుంది. ఎక్కడైనా పడిపోతానేమో, డ్యాన్స్ చేయలేకపోతానేమో, ట్రిక్ మర్చిపోతానేమో అని అప్పుడప్పుడూ అనిపిస్తూ ఉంటుంది. కానీ నాకున్న ఇబ్బందిని మర్చిపోయేలా చేసి నాకంటూ గుర్తింపు ఇచ్చింది మ్యాజిక్. నన్ను అందరికీ దగ్గర చేసిన ఈ విద్యకు నేనెప్పుడూ రుణపడి ఉంటాను' అని జవాబిస్తాడు.





బిజినెస్ రీల్

టారిఫ్‌లతో ద్రవ్యోల్బణం ముప్పు..

అమెరికా ఫెడ్ రిజర్వ్ చీఫ్ జెరోమ్ పావెల్ హెచ్చరిక



ఆర్లింగ్టన్ (అమెరికా): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎడాపెడా టారిఫ్‌లను విధించడం దేశీయంగా ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తుందని ఫెడరల్ రిజర్వ్ చీఫ్ జెరోమ్ పావెల్ హెచ్చరించారు. దీనితో ఆర్థిక వృద్ధి కూడా నెమ్మదించే ముప్పు ఉందన్నారు. ఎకానమీ, ద్రవ్యోల్బణంపై టారిఫ్‌ల ప్రభావాలు ఊహించిన దానికంటే గణనీయంగా ఎక్కువగానే ఉండబోతున్నాయని ఆయన స్పష్టం చేశారు. భారీ దిగుమతి సుంకాలు తాత్కాలికంగా ధరల పెరుగుదలకు దారి తీయొచ్చని, దాని ప్రభావాలు దీర్ఘకాలికంగా కొనసాగే అవకాశం ఉందని పావెల్ చెప్పారు. ఒక దఫా ధరల పెరుగుదల అనేది దీర్ఘకాలికంగా ద్రవ్యోల్బణ సమస్యగా మారకుండా చూడటం తన బాధ్యతని వ్యాఖ్యానించారు. ద్రవ్యోల్బణంపై ఆయన వ్యాఖ్యలను బట్టి చూస్తే.. రాబోయే రోజుల్లో కీలక వడ్డీ రేట్లు యథాతథంగా 4.3 శాతం స్థాయిలోనే కొనసాగించవచ్చని భావిస్తున్నారు. ఫెడ్ రిజర్వ్ ఈ ఏడాది వడ్డీ రేట్లను అయిదు విడతల్లో తగ్గిస్తుందని ఆశిస్తున్న ఇన్వెస్టర్లను ఇది నిరాశపర్చే అవకాశం ఉంది. పావెల్ వ్యాఖ్యలు బట్టి చూస్తే ఆయన ద్రవ్యోల్బణం పైనే దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు.

ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ 1,200 కోట్ల పెట్టుబడులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఉక్కు తయారీ సంస్థ ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ రూ. 1,200 కోట్ల పెట్టుబడులతో భారీ విస్తరణ ప్రణాళికలు రూపొందించుకుంది. వచ్చే 20 నెలల్లో దేశవ్యాప్తంగా డీలర్ల సంఖ్యను ప్రస్తుతమున్న 400 నుంచి 1,000కి పెంచుకోనున్నట్లు సంస్థ ఎండీ ప్రమోద్ అగర్వాల్ తెలిపారు. అలాగే, 5,000 పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. శుక్రవారం కొత్త ఉత్పత్తి ఎంఎస్ లైఫ్ 600ప్లస్ సీఆర్ఎస్‌ని (తుప్పు నిరోధక ఉక్కు) ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. రాబోయే, 3-4 ఏళ్లలో ఉత్పత్తి సామర్థ్యాన్ని ఐదు రెట్లు పెంచుకోనున్నట్లు అగర్వాల్ చెప్పారు. 2024లో 25,000 ఇళ్ల నిర్మాణానికి ఉక్కును అందించగా, 2025లో దీన్ని రెట్టింపు స్థాయికి పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-4-2025	
విశాఖ	440-00
చిత్తూరు	470-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	430-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.60

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	8,739.90	1.69
TATACONSUM	1,088.00	1.59
HDFCBANK	1,816.80	1.22
APOLLOHOSP	6,735.00	0.95
NESTLEIND	2,258.55	0.57

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATASTEEL	140.67	-8.43
HINDALCO	600	-8.07
ONGC	226.1	-7.07
TATAMOTORS	615.1	-5.94
CIPLA	1,416.60	-5.29

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,670
ఎన్ఎస్ఈ	1,03,513
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,98,702
ఎఫ్ఐఐ	- 3,484
డీఐఐ	- 1,720

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.99 (రాత్రి 11.30కు)	$ 66.95 (క్రితం ముగింపు)
బ్రెంట్	65.58 (రాత్రి 11.30కు)	$ 70.14 (క్రితం ముగింపు)

టారిఫ్‌ల భారంపై బేరసారాలు

అమెరికన్ కంపెనీలతో ఎగుమతిదారుల చర్చలు



న్యూఢిల్లీ: భారీ టారిఫ్‌ల విధింపుతో ఎగుమతులు, ఉద్యోగాల కల్పనపై ప్రభావం పడనున్న నేపథ్యంలో అమెరికా సంస్థలతో భారతీయ ఎగుమతిదారులు సంప్రదింపులు ప్రారంభించారు. ఈ అసాధారణ పరిస్థితిని ఎదుర్కొనే మార్గాలపై వారితో చర్చలు జరుపుతున్నట్లు ఎగుమతిదారుల సంస్థల సమాఖ్య ఎఫ్ఐఈవో ప్రెసిడెంట్ ఎస్‌సీ రాల్హన్ తెలిపారు. దేశీయంగా ఉక్కు రేట్లు ఇప్పటికే భారీగా ఉన్న తరుణంలో అధిక సుంకాల భారాన్ని ఇంజినీరింగ్ ఉత్పత్తుల పరిశ్రమ భరించే పరిస్థితి లేదని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, టారిఫ్‌లతో అమెరికాలో మన లెదర్ ఉత్పత్తులకు డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం పడుతుందని ఫుట్‌వేర్ ఎగుమతి సంస్థ ఫరీదా గ్రూప్ చైర్మన్ రఫీక్ అహ్మద్ చెప్పారు. అమెరికాలోని లెదర్ ఉత్పత్తుల దిగుమతిదారులు, టారిఫ్‌లపరమైన నష్టాల్లో కొంత భరించాలని తమను కోరుతున్నారని తెలిపారు. కొన్నాళ్లపాటు ఉత్పత్తిని నిలిపివేయాలని కూడా వారు అడిగినట్లు వివరించారు. ఇదే పరిస్థితి కొనసాగితే దీర్ఘకాలంలో మన ఎగుమతులకు అమెరికాలో మార్కెట్ గణనీయంగా కుదించుకుపోవచ్చని పేర్కొన్నారు. ఇక, అమెరికా అతి పెద్ద వ్యాపార భాగస్వామిగా ఉన్నందున అక్కడి నుంచి కొన్ని దిగుమతులపై సుంకాలను తగ్గించడం మనకు కూడా శ్రేయస్కరమని ఎఫ్ఐఈవో వైస్ ప్రెసిడెంట్ రవికాంత్ కపూర్ తెలిపారు. కార్పెట్లు, హోమ్ ఫర్నిషింగ్ ఉత్పత్తులపై అధిక టారిఫ్‌ల వల్ల పరిశ్రమలో గణనీయంగా ఉద్యోగాలు పోయే ముప్పు ఉందని వివరించారు.

బియ్యంపై ప్రభావం తాత్కాలికమే..

దీర్ఘకాలికంగా చూస్తే బియ్యం ఎగుమతులపై సుంకాల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. తాత్కాలికంగా ధరలు పెరిగినా, రెండు-మూడు నెలల్లో అంతా సర్దుకోగలదని ఇండియన్ రైస్ ఎక్స్‌పోర్టర్స్ ఫెడరేషన్ (ఐఆర్ఈఎఫ్) జాతీయ అధ్యక్షుడు ప్రేమ్ గర్గ్ తెలిపారు. వ్యూహాత్మక ప్రణాళికలతో మన పరిశ్రమలను కాపాడుకోవడంతో పాటు అమెరికాలో కార్యకలాపాలను కూడా విస్తరించవచ్చని ఆయన చెప్పారు. టారిఫ్‌లు పెంచినప్పటికీ మిగతా పోటీ దేశాలతో పోలిస్తే ఇప్పటికీ భారత్ వైపే మొగ్గు ఉంటుందని వివరించారు. మరోవైపు, ప్రస్తుత కాంట్రాక్టులను సమీక్షించుకోవాల్సి రావచ్చని, అమెరికా దిగుమతిదారులు మరింత ఎక్కువ కాలం క్రెడిట్ ఇవ్వాలని కోరవచ్చని వ్యాపారవర్గాలు చెప్పాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో భారత్ 52.4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం ఎగుమతి చేయగా అందులో 2.34 లక్షల టన్నులను అమెరికాకు పంపింది. 2024 ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో 42 లక్షల టన్నుల బాస్మతి బియ్యం ఎగుమతుల్లో అమెరికా వాటా 2.04 లక్షల టన్నులుగా ఉంది. బియ్యం ఎగుమతులకు పశ్చిమాసియా ప్రధాన గమ్యస్థానంగా ఉంటోంది.

టారిఫ్‌ల ఎఫెక్ట్ స్వల్పమే



నీతి ఆయోగ్ సభ్యులు విర్మానీ

న్యూఢిల్లీ: యూఎస్ విధించిన ప్రతీకార టారిఫ్‌ల ప్రభావం భారత్‌పై స్వల్పమేనని నీతి ఆయోగ్ సభ్యులు అరవింద్ విర్మానీ పేర్కొన్నారు. దేశీ ఆర్థిక వ్యవస్థ విదేశీ వాణిజ్యంపై అతితక్కువగా ఆధారపడుతుండటమే దీనికి కారణమని తెలియజేశారు. మధ్యకాలానికి టారిఫ్‌లతో తలెత్తనున్న ప్రతికూలతలు ప్రతిపాదిత యూఎస్ భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం(బీటీఏ) తొలి దశ అమలుతో తొలగిపోనున్నట్లు అభిప్రాయపడ్డారు. ఇక దీర్ఘకాలంలో చూస్తే తుది బీటీఏ కారణంగా రానున్న 5-10ఏళ్లలో లబ్ది పొందేందుకు వీలున్నట్లు తెలియజేశారు. అమెరికా వస్తువులపై అధిక సుంకాలు విధిస్తున్నట్లు పేర్కొంటూ భారత్‌పై యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ తాజాగా 26 శాతం ప్రతీకార టారిఫ్‌లకు తెరతీసిన విషయం విదితమే. అయితే ఆయా దేశాల వాణిజ్య లోటుతోపాటు.. దిగుమతులను పరిగణించి చేసిన మదింపు ద్వారా టారిఫ్‌లు అమలుకానున్నట్లు వివరించారు.

పోటీ దేశాలపై టారిఫ్‌లు.. మనకు మరిన్ని అవకాశాలు

- తయారీ, ఎగుమతుల హబ్‌గా భారత్ ఎదగొచ్చు
- ఎంఏఐటీ అంచనాలు



న్యూఢిల్లీ: అమెరికా టారిఫ్‌లతో భారత ఎగుమతులకు సవాళ్లు ఉన్నప్పటికీ, పోటీ దేశాలపై మరింత అధిక స్థాయిలో సుంకాలు విధించడం వల్ల, మన వ్యాపారాన్ని పెంచుకునేందుకు గణనీయంగా అవకాశాలు ఉన్నాయని ఎలక్ట్రానిక్స్, ఐటీ హార్డ్‌వేర్ సంస్థల సమాఖ్య ఎంఏఐటీ తెలిపింది. భారత్‌తో పోలిస్తే చైనా, వియత్నాంలపై భారీగా సుంకాలు విధించడమనేది మన ఎగుమతులకు సానుకూలాంశమని వివరించింది. 'భౌగోళిక, రాజకీయ రిస్కులను అధిగమించేందుకు గ్లోబల్ కంపెనీలు తమ తయారీ కార్యకలాపాలను భారత్‌కు మళ్లించే అవకాశం ఉంది. దీంతో మన ఎగుమతులు మరింత పెరగవచ్చు. పోటీ దేశాలతో వ్యాపారం భారీ వ్యయాలతో కూడుకున్నది కావడంతో అంతర్జాతీయంగా కొనుగోలుదారులు భారత ఎగుమతులవైపు మొగ్గు చూపవచ్చు. గ్లోబల్ బ్రాండ్లు తమ తయారీ కేంద్రాలను ఇతర దేశాలకు మళ్లించడంపై దృష్టి పెడతాయి కనుక సరఫరా వ్యవస్థకు సంబంధించి భారత్‌కు మరిన్ని అవకాశాలు లభించవచ్చు' అని ఎంఏఐటీ పేర్కొంది. భారత్‌పై 27 శాతం సుంకాలు ప్రకటించిన అమెరికా, మనకు పోటీ దేశాలైన చైనాపై 54 శాతం, వియత్నాంపై 46 శాతం, థాయ్‌లాండ్‌పై 36 శాతం విధించింది. దీనితో ఎలక్ట్రానిక్స్, టెలికాం పరికరాలు, ఐటీ హార్డ్‌వేర్ విషయంలో ఆయా దేశాలు మనతో పోటీపడే పరిస్థితి తగ్గుతుందని, మన ఎగుమతులకు డిమాండ్ మెరుగుపడవచ్చని ఎంఏఐటీ తెలిపింది. అమెరికాకు భారత్ సుమారు 7 బిలియన్ డాలర్ల స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేస్తోంది. టారిఫ్‌ల వల్ల వీటిపై ప్రభావం పడనుంది.

స్థిరమైన పాలసీలు కావాలి..

పోటీ దేశాలపై టారిఫ్‌లను మనకు అనుకూలంగా మల్చుకోవాలంటే వ్యాపారాల నిర్వహణ సులభతరం చేయడానికి మరింత ప్రాధాన్యత నివ్వాల్సి ఉంటుందని ఎంఏఐటీ తెలిపింది. అలాగే పాలసీలపరంగా స్థిరత్వం ఉండేలా చూడాలని, లాజిస్టిక్స్.. ఇన్‌ఫ్రాపై భారీగా పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని పేర్కొంది. ఇవన్నీ చేయగలిగితే రాబోయే రోజుల్లో ప్రపంచానికి తయారీ, ఎగుమతుల హబ్‌గా భారత్ ఎదగవచ్చని వివరించింది.

2021-22 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో భారత్‌కు అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా నిల్చింది. మొత్తం భారత్ ఎగుమతుల్లో అమెరికా వాటా సుమారు 18 శాతం, దిగుమతుల్లో 6.22 శాతం, ద్వైపాక్షిక వాణిజ్యంలో 10.73 శాతంగా ఉంది. అమెరికాతో మనకు వాణిజ్య మిగులు 2019-20లో 17.26 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2023-24లో ఇది 35.32 బిలియన్ డాలర్లకు చేరింది. ఎలక్ట్రానిక్స్ విషయానికొస్తే 2024 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు భారత్ ఎగుమతులు 10 బిలియన్ డాలర్లుగా, దిగుమతులు 3.17 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

సేవల్లో మందగమనం

- 58.5 శాతానికి పీఎంఐ సూచీ
- ఫిబ్రవరిలో ఇది 59



న్యూఢిల్లీ: సేవల రంగం కార్యకలాపాలు మార్చి నెలలో నిదానించాయి. డిమాండ్ నిదానించడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు తగ్గుముఖం పట్టడం ఇందుకు కారణమని హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ సర్వే తెలిపింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ ఫిబ్రవరిలో 59 పాయింట్ల వద్ద ఉంటే, మార్చి నెలలో 58.5కు తగ్గింది. అయినప్పటికీ దీర్ఘకాల సగటు అయిన 54.2కు పైనే కొనసాగడం గమనార్హం. పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 50 పాయింట్లకు పైన ఉంటే విస్తరణగా, దిగువన క్షీణతగా పరిగణిస్తుంటారు. ''మార్చి నెలలో భారత సేవల పీఎంఐ స్వల్పంగా తగ్గి 58.5 వద్ద నమోదైంది దేశీ, అంతర్జాతీయ డిమాండ్ ఉత్సాహంగానే ఉన్నా, ముందటి నెల కంటే కాస్త తగ్గింది''అని హెచ్ఎస్‌బీసీ ఇండియా చీఫ్ ప్రంజుల్ భండారీ తెలిపారు. అంతర్జాతీయ విక్రయాలు బలహీనపడడం పీఎంఐ తగ్గడానికి కారణమని ఈ సర్వే పేర్కొంది. విదేశీ ఆర్డర్లు 15 నెలల కనిష్టానికి చేరాయని తెలిపింది. రానున్న కాలంలో కంపెనీల వృద్ధికి పోటీ ప్రధాన సవాలు కానుందని ఈ సర్వే అంచనా వేసింది. సానుకూల సెంటిమెంట్ ఏడు నెలల కనిష్టానికి చేరింది. కన్జ్యూమర్ సర్వీసెస్ సంస్థలు బలమైన పనితీరు చూపించాయి. ఆ తర్వాత ఫైనాన్స్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్ అండ్ బిజినెస్ సర్వీసెస్, రవాణా, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ రంగాల్లోనూ పనితీరు మెరుగుపడింది. ఇక హెచ్ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ (తయారీ, సేవలు కలిపి) ఏడు నెలల గరిష్టమైన 59.5కు మార్చిలో చేరుకుంది. ఫిబ్రవరిలో ఇది 58.8గా ఉంది.

పేటీఎమ్ నుంచి డిస్‌ప్లే సౌండ్‌బాక్స్

క్యూ4లో లాభాల్లోకి: సీఈవో శేఖర్



న్యూఢిల్లీ: పేటీఎమ్ బ్రాండ్ కంపెనీ వన్97 కమ్యూనికేషన్స్ తాజాగా డిస్‌ప్లేతోకూడిన మహాకుంభ్ సౌండ్‌బాక్స్‌ను విడుదల చేసింది. దేశీయంగా తయారైన డిస్‌ప్లే సౌండ్‌బాక్స్‌ను కంపెనీ సీఈవో విజయ్ శేఖర్ శర్మ శుక్రవారం విడుదల చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) చివరి త్రైమాసికం(జనవరి-మార్చి)లో కంపెనీ లాభాల్లోకి ప్రవేశించనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. ఇందుకు కీలక బిజినెస్‌లు దోహదం చేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్త విభాగాలలో పెట్టుబడులు చేపడుతున్నట్లు తెలియజేశారు. ప్రీమియం మర్చంట్ల అభిప్రాయాల మేరకు కస్టమర్ల చెల్లింపులను ఇతరులు వినకుండా డిస్‌ప్లేతోకూడిన సౌండ్‌బాక్స్‌ను రూపొందించినట్లు వివరించారు. అధిక విలువగల కొనుగోళ్లకు వీలున్న భారీ మాల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లు తదితర పెద్ద షాపులు లక్ష్యంగా వీటిని తయారు చేసినట్లు తెలియజేశారు.

ఎల్ఐసీకి ఎలాంటి అనుచిత లబ్ధి అందడం లేదు

- పోటీతో కూడిన మార్కెట్లోనే పనిచేస్తున్నాం
- యూఎస్ ట్రేడ్ ఏజెన్సీ ఆరోపణలకు ఖండన
- ప్రభుత్వరంగ దిగ్గజ బీమా సంస్థ ప్రకటన



న్యూఢిల్లీ: భారత బీమా మార్కెట్లో ఎల్ఐసీ అసమంజసమైన పోటీ ప్రయోజనం పొందుతోందంటూ యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) చేసిన ఆరోపణలను ప్రభుత్వరంగ బీమా సంస్థ తోసిపుచ్చింది. గత 25 ఏళ్లుగా పోటీతో కూడిన మార్కెట్లో 24 ప్రైవేటు బీమా కంపెనీల మాదిరే ఎల్ఐసీ సైతం కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేసింది. యూఎస్‌టీఆర్ అభిప్రాయాలు భారత బీమా నియంత్రణలు, ఎల్ఐసీ పనితీరు గురించి సమగ్రంగా అర్థం చేసుకోకుండా చేసినవిగా భావిస్తున్నట్లు పేర్కొంది. ఐఆర్‌డీఏఐ, సెబీ నియంత్రణల పరిధిలో పనిచేస్తూ ప్రభుత్వం నుంచి కానీ, లేదా ఏ ఇతర నియంత్రణ సంస్థ నుంచి ఎలాంటి ప్రత్యేక ప్రయోజనం పొందలేదని వివరించింది. భారత్‌లో ఆర్థిక సేవల విస్తృతికి, పాలసీదారుల ప్రయోజనం విషయంలో ఎల్ఐసీ చేసిన కృషిపై మరింత తటస్థ, వాస్తవిక ప్రశంసను తాము కోరుకుంటున్నట్టు పేర్కొంది.

హామీని ఎప్పుడూ దుర్వినియోగం చేయలేదు..

''ప్రైవేటు బీమా సంస్థల కంటే చాలా మంది కస్టమర్లు ఎల్ఐసీ పాలసీలనే ఎంపిక చేసుకుంటున్నారు. తద్వారా ఎల్ఐసీకి అనుచిత పోటీ ప్రయోజనం లభిస్తోంది''అని అమెరికా ప్రభుత్వ ఏజెన్సీ అయిన యూఎస్‌టీఆర్ తన తాజా నివేదికలో విమర్శించడం గమనార్హం. అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన పాలన, సేవలు, కస్టమర్ల విశ్వాసాన్ని కొనసాగించేందుకు ఎల్ఐసీ కట్టుబడి ఉన్నట్టు సంస్థ ఎండీ, సీఈవో సిద్ధార్థ మహంతి ప్రకటించారు. 1956లో ఎల్ఐసీని ఏర్పాటు చేసినప్పుడు ప్రభుత్వం కల్పించిన హామీ అన్నది.. జాతీయీకరణ ఆరంభ కాలంలో ప్రజా విశ్వాసాన్ని పొందడం కోసమే. అంతేకానీ దీన్ని ఎప్పుడూ మార్కెటింగ్ సాధనంగా ఎల్ఐసీ ఉపయోగించుకుని ప్రయోజనం పొందలేదని ఎల్ఐసీ తెలిపింది.

మెడ్‌ప్లస్‌తో స్టార్‌టూన్ ల్యాబ్స్ ఎంవోయూ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మసీ రిటైల్ దిగ్గజం మెడ్‌ప్లస్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు మెడికల్ డివైజ్‌ల తయారీ అంకుర సంస్థ స్టార్‌టూన్ ల్యాబ్స్ వెల్లడించింది. మెడ్‌ప్లస్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో ఫీజీ పరికరంతో కండరాలు, కీళ్ల సంబంధ వైద్యపరీక్షలు నిర్వహించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. ఫిజియోథెరపీ తీసుకుంటున్న పేషంట్ల రికవరీని పర్యవేక్షించేందుకు అమెరికా ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన ఈ డివైజ్ తోడ్పడుతుందని తెలిపింది. కండరాలు, నరాల సంబంధ సమస్యలు ఉన్న వారు ఈ పరీక్ష చేయించుకోవచ్చని వివరించింది.

గోఫస్ట్ లిక్విడేషన్‌కు మార్గం సుగమం

వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల కొట్టివేత



న్యూఢిల్లీ: కార్యకలాపాలు నిలిచిపోయిన ఎయిర్‌లైన్స్ సంస్థ 'గోఫస్ట్' లిక్విడేషన్ (ఆస్తుల విక్రయానికి)ను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) కొట్టివేసింది. గోఫస్ట్ లిక్విడేషన్‌కు అనుకూలంగా జనవరి 20న జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఢిల్లీ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను అప్పిలేట్ ట్రిబ్యునల్ సమర్థించింది. నాటి ఆదేశాల్లో ఎలాంటి తప్పును తాము గుర్తించలేదని చైర్‌పర్సన్ జస్టిస్ అశోక్ భూషణ్ ఆధ్వర్యంలోని ఎన్‌సీఎల్ఏటీ బెంచ్ వ్యాఖ్యానించింది. గోఫస్ట్ లిక్విడేషన్ అనుకూల ఉత్తర్వులను బిజీ బీ ఎయిర్‌వేస్, భారతీయ కామ్‌గార్ సేన (ముంబై), కెప్టెన్ అర్జున్ ధానస్ ఎన్‌సీఎల్ఏటీ వద్ద సవాలు చేశారు. డీజీసీఏ లైసెన్స్ సహా విలువైన ఆస్తులున్న గోఫస్ట్‌ను ఉన్నది ఉన్నట్టు స్థితిలో కొనుగోలు చేసేందుకు సమ్మతిస్తూ బిజీ బీ ఎయిర్‌వేస్ దరఖాస్తు సమర్పించింది. ఈజీమైట్రిప్ ప్రమోటర్ నిశాంత్ పిట్టీ బిజీ బీ ఎయిర్‌వేస్‌లో ప్రధాన వాటాదారుగా ఉన్నారు. కంపెనీ ఆస్తులను విక్రయించేస్తే 5,000 మంది కార్మికులు నష్టపోతారంటూ భారతీయ కామ్‌గార్ సేన తన పిటిషన్‌లో పేర్కొంది.

భారత్ సార్వభౌమత్వం నిలుపుకోవాలి

- పశ్చిమ దేశాల సాంకేతికతల కాలనీగా మారొద్దు
- స్టార్టప్ మహాకుంభ్‌లో నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్



న్యూఢిల్లీ: భారత్ తన సార్వభౌమత్వాన్ని నిలుపుకోవాలని నీతి ఆయోగ్ సీఈవో, జీ20 షెర్పా అమితాబ్ కాంత్ వ్యాఖ్యానించారు. పశ్చిమ దేశాల సాంకేతికతల కాలనీగా మారొద్దంటూ స్టార్టప్ మహాకుంభ్ ప్రసంగంలో సూచించారు. తెలివైన.. చౌక ఆవిష్కరణల ఆవశ్యకత ఉన్నట్లు నొక్కి చెప్పారు. పశ్చిమ దేశాల మోడళ్లను అవలంబించడంవల్ల దేశీ సంప్రదాయాలు, సంస్కృతి, గుర్తింపులను కోల్పోతామని అభిప్రాయపడ్డారు. ఆధునిక సాంకేతికతలలో దేశ సార్వభౌమత్వాన్ని కొనసాగించవలసి ఉన్నట్లు పేర్కొన్నారు. ముందుండి నడిపించడంలో పశ్చిమ దేశాల లేదా ప్రపంచంలోని ఏ ఇతర ప్రాంతాల కాలనీగా మారకూడదని వ్యాఖ్యానించారు. అతితక్కువ ఇంధన వినియోగం, తక్కువ వ్యయాలతోకూడిన చురుకైన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వవలసి ఉన్నట్లు తెలియజేశారు. పశ్చిమ ప్రభావానికి లోనుకాకుండా సొంత డేటా ఆధారంగా దేశ సార్వభౌమత్వానికి అనుగుణమైన మోడళ్లను ఆవిష్కరించవలసి ఉన్నట్లు వివరించారు. 22 ప్రాంతీయ భాషలుగల దేశ భిన్నత్వానికి అనుగుణంగా వివిధ భాషల ఏఐ మోడళ్లకు తెరతీయవలసి ఉన్నట్లు తెలియజేశారు. తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం సేవలు అందించగలుగుతామని సూచించారు.

స్వీయనియంత్రణ

స్టార్టప్‌లు భారీ కార్పొరేట్లుగా ఎదగాలంటే స్వీయ నియంత్రణకుతోడు.. సుపరిపాలనకు చోటు ఇవ్వాలని అమితాబ్ కాంత్ తెలియజేశారు. ఒకప్పుడు స్టార్టప్‌గా ప్రారంభమై భారీ మల్టీనేషనల్ ఐటీ దిగ్గజంగా అవతరించిన ఇన్ఫోసిస్‌ను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. నైతిక పాలన, ఆడిట్లు, పటిష్ట ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌సహా స్వీయనియంత్రణ స్టార్టప్‌లకు కీలకమని వివరించారు. కాంత్ శుక్రవారం ఫిన్‌టెక్ పరిశ్రమకు స్వీయ నియంత్రణ సంస్థ(ఎస్ఆర్‌వో) అయిన ఇండియా ఫిన్‌టెక్ ఫౌండేషన్(ఐఎఫ్ఎఫ్)ను ప్రారంభించారు. ఎస్ఆర్‌వో- ఫిన్‌టెక్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్(ఎస్ఆర్‌వోఎఫ్‌టీ-డీఎఫ్)గా పేర్కొనే సంస్థ ఆవిర్భావం సందర్భంగా ప్రతిపాదిత ఎస్ఆర్‌వో బోర్డులో ఇప్పటికే 100మంది సభ్యులున్నట్లు వెల్లడించారు. డిజిటల్ లెండింగ్ పేమెంట్స్, వెల్త్‌టెక్, ఇన్సూర్‌టెక్, అకౌంట్ అగ్రిగేషన్‌సహా డెఫీ, వెబ్3 తదితర వర్ధమాన టెక్నాలజీల నుంచి సభ్యులు చేరినట్లు పేర్కొన్నారు. పరిశ్రమకు ప్రమాణాలు నెలకొల్పడంలో ఎస్ఆర్‌వో కీలకపాత్ర పోషించనున్నట్లు తెలియజేశారు. నియంత్రణ సంస్థలు, ఫిన్‌టెక్ కంపెనీల మధ్య వారధిగా వ్యవహరించనున్నట్లు వివరించారు.

విమర్శించడం సులభం



దేశీ స్టార్టప్ కమ్యూనిటీ గ్రోసరీ డెలివరీలు, ఐస్‌క్రీమ్, చిప్స్ తయారీ నుంచి దృష్టి మరల్చాలని వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో పలువురు ఎంట్రప్రెన్యూర్స్ స్పందించారు. సెమీకండక్టర్, మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఏఐ తదితర హైటెక్ రంగాలపై దృష్టి పెట్టాలని స్టార్టప్ మహాకుంభ్ సందర్భంగా గోయల్ సూచించిన సంగతి తెలిసిందే. ప్రధానంగా లోతైన సాంకేతిక నైపుణ్యాలు ప్రదర్శిస్తున్న యూఎస్, చైనాతో పోల్చి దేశీ కన్జూమర్ ఇంటర్నెట్ స్టార్టప్‌లను విమర్శించడం సులభమేనని పీయూష్ గోయల్ వ్యాఖ్యలపై జెప్టో సీఈవో ఆదిత్ పలీచా లింక్‌డ్‌ఇన్ పోస్ట్‌లో వ్యాఖ్యానించారు. నిండా మూడున్నరేళ్ల వయసుకూడా లేని జెప్టో ప్రస్తుతం సుమారు 1.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. క్విక్‌కామర్స్ సంస్థలు ఉద్యోగాలు సృష్టిస్తున్నాయని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకట్టుకుంటున్నాయని తెలియజేశారు. ఇంటర్నెట్ కన్జూమర్ కంపెనీలు టెక్నాలజీ ఆధారిత ఆవిష్కరణకు తెరతీస్తున్నట్లు తెలియజేశారు. మంత్రి వ్యాఖ్యలు వేలెత్తి చూపడం అని కాకుండా.. ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులకు సవాళ్లు విసురుతున్నట్లు జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు పేర్కొన్నారు. మంత్రులు విశ్వాసాన్ని ఉంచాలని, డీప్‌టెక్ స్టార్టప్‌లకు సహాయ సహకారాలు అందించాలని, సమస్యలను తొలగించాలని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ పాయ్ సూచించారు. చైనాతో పోలిక సరికాదని, పరిశ్రమ దేశీయంగా సైతం చిన్నస్థాయిలో స్టార్టప్ పరిశ్రమ అభివృద్ధి చెందుతున్నట్లు పేర్కొన్నారు. గత కొద్ది నెలల్లో పలు డీప్‌టెక్ కంపెనీలతో సమావేశమైనట్లు షాదీ.కామ్ వ్యవస్థాపకుడు అనుపమ్ మిట్టల్ తెలిపారు.

ఇటలీలో హాప్‌మన్ కప్

జూలై 16 నుంచి 20 వరకు నిర్వహణ



బారి (ఇటలీ): ప్రతిష్టాత్మక మిక్స్‌డ్ టీమ్ టెన్నిస్ టోర్నీ 'హాప్‌మన్ కప్' ఈ ఏడాది జరగనుంది. అయితే టోర్నీ ఆతిథ్య వేదికలో రెండోసారి మార్పు జరిగింది. ఇటలీలోని బారి నగరంలో ఈ ఏడాది జూలై 16 నుంచి 20వ తేదీ వరకు ఆరు దేశాల మధ్య ఈ టోర్నీ జరుగుతుంది. ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్, గ్రీస్, కెనడా, డిఫెండింగ్ చాంపియన్ క్రొయేషియా ఈ టోర్నీలో ఆడతాయి. ఆస్ట్రేలియా దిగ్గజ క్రీడాకారుడు హ్యారీ హాప్‌మన్ పేరిట ఈ టోర్నీ 1989లో ప్రారంభమై 2019 వరకు నిరాటంకంగా ఆస్ట్రేలియాలోని పెర్త్ నగరంలో జరిగింది. కరోనా కారణంగా 2020, 2021, 2022లో ఈ టోర్నీ జరగలేదు. అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) ఆధ్వర్యంలో 2023లో ఈ టోర్నీ పునరాగమనం జరిగింది. బొర్నా చొరిచ్–డొనా వెకిచ్ జోడీ విజేతగా నిలిచింది. హాప్‌మన్ కప్‌లో ఒక మహిళల సింగిల్స్ మ్యాచ్, ఒక పురుషుల సింగిల్స్ మ్యాచ్, మరో మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్ జరుగుతాయి. ఆతిథ్య బాధ్యతల నుంచి ఆస్ట్రేలియా తప్పుకోవడంతో 2023లో ఫ్రాన్స్‌లోని నైస్ నగరంలో హాప్‌మన్ కప్ జరిగింది. 2024లోనూ నైస్ నగరంలో హాప్‌మన్ కప్ జరగాల్సినా పారిస్ ఒలింపిక్స్ కారణంగా ఈ టోర్నీని నిర్వహించలేదు. ఏడాది తర్వాత ఈ సంవత్సరం హాప్‌మన్ కప్ మళ్లీ జరగనుంది.

నిలబడలేని స్థితి నుంచి... మళ్లీ గన్ పట్టి...

షూటర్ రాహీ సర్నోబత్ అసాధారణ పోరాటం
అనారోగ్యం నుంచి కోలుకొని బరిలోకి

రాహీ సర్నోబత్... భారత్ తరఫున షూటింగ్ ప్రపంచకప్ 25 మీటర్ల పిస్టల్ విభాగంలో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళ. మొత్తంగా షూటింగ్ ప్రపంచ కప్‌లలో ఆమె ఖాతాలో 5 స్వర్ణాలు, ఒక రజతం, రెండు కాంస్యాలు ఉన్నాయి. దీంతో పాటు ఆసియా క్రీడల్లో స్వర్ణ, కాంస్యాలు... కామన్వెల్త్ క్రీడల్లో 2 స్వర్ణాలు, ఒక రజతం ఆమె గెలుచుకుంది. దాదాపు మూడేళ్ల క్రితం వరకు రాహీ భారత అత్యుత్తమ షూటర్లలో ఒకరిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.





అయితే 32 ఏళ్ల వయసులో ఆమె ఊహించని ఘటన రాహీ జీవితంలో చోటు చేసుకుంది. వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల కోసం ఆమె సిద్ధమవుతోంది. అనూహ్యంగా ఆమె శరీరంలో కాస్త మార్పు కనిపించింది. కొంత నొప్పిగా అనిపించినా ఆ సమయంలో దానిని పట్టించుకోలేదు. కానీ కొద్ది రోజుల తర్వాత పరిస్థితి మరింత దిగజారింది. శరీరమంతా తట్టుకోలేనంత నొప్పితో విలవిల్లాడింది. బెడ్ మీద నుంచి లేవలేని పరిస్థితి వచ్చింది. దాంతో అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించారు. అన్నింటిలో అంతా బాగుందనే వచ్చింది. అసలు సమస్య ఏమిటనేది మాత్రం తేలలేదు. పరిస్థితి మరింత తీవ్రంగా మారి అసలు పడుకోలేని పరిస్థితి. కూర్చొని మాత్రమే నిద్రపోవాల్సి వచ్చేది. చివరకు ఆమెకు 'న్యూరోపతిక్ పెయిన్' ఉన్నట్లుగా డాక్టర్లు తేల్చారు. అయితే దీనికి ప్రత్యేక కారణం గానీ, ప్రత్యేక చికిత్స గానీ ఉండదని, ప్రతీ వ్యక్తికీ భిన్నమైన లక్షణాలు ఉంటాయని చెప్పడం రాహీలో ఆందోళనను మరింత పెంచింది. 'కొన్ని నెలల పాటు రోజుకు 17–20 గంటలు కేవలం పడుకునేదాన్ని. అసలు ఏం జరుగుతోందో అర్థం కాకుండా పైకప్పు వైపు చూస్తూ ఉండిపోయేదాన్ని' అని నాటి బాధాకర రోజులను రాహీ గుర్తు చేసుకుంది.

మహారాష్ట్ర ప్రభుత్వంలోని రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాహీ అదృష్టవశాత్తూ ఆరోగ్యం మెరుగవడం మొదలైంది. కొన్ని నెలల తర్వాత నొప్పి పూర్తిగా తగ్గకపోయినా ఫిజియోథెరపీని మొదలు పెట్టారు. నిర్విరామంగా 20 నిమిషాలు పాటు టీవీ షో చూడటం కూడా ఆమె మొదటి ఎక్సర్‌సైజ్‌గా మారింది. మొదట్లో అది కూడా కష్టంగా అనిపించింది. అయితే ఫిజియోథెరపీతో నెమ్మదిగా పరిస్థితి మారి కొంత ఎక్కువ సమయం కూర్చోవడం మొదలు పెట్టింది. ఆ సమయంలో ఆమె ఆటలో పునరాగమనం గురించి అస్సలు ఆలోచించలేదు. అసలు జీవితం సాధారణంగా మారి ఆరోగ్యంగా ఉంటే చాలు అనుకునే పరిస్థితి మాత్రమే ఆమెది. కానీ రాహీ చివరకు కోలుకొని ఆపై ఫిట్‌నెస్‌పై కూడా దృష్టి పెట్టింది. అంతా చక్కబడటంతో సర్నోబత్ మళ్లీ గన్ పట్టుకొని షూటింగ్ మొదలు పెట్టింది. ఈ సారి తనను తాను నిరూపించుకునేందుకో, పతకాలు గెలుచుకునేందుకో కాదు. తాను ఎలాంటి కఠిన పరిస్థితులను దాటి ధైర్యంగా నిలబడ్డానో, జీవితం ఇచ్చిన రెండో అవకాశాన్ని పట్టుదలగా ఎలా వాడుకున్నానో చూపించేందుకు రాహీ మళ్లీ ఆటలోకి అడుగు పెట్టింది. ఇటీవల డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో 25 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించడంతో ఆమె కొత్త జీవితం మొదలైంది. రియో, టోక్యో ఒలింపిక్స్‌లలో పాల్గొన్న రాహీ సర్నోబత్ ఇప్పుడు మరోసారి తన స్వప్నం ఒలింపిక్స్ పతకం కోసం సిద్ధమవుతోంది. అసలు లేవలేని పరిస్థితి నుంచి కోలుకొని మళ్లీ సత్తా చాటుతూ లాస్ ఏంజెలిస్ గేమ్స్ లక్ష్యంగా తన సన్నాహాలు చేస్తోంది.

–సాక్షి క్రీడా విభాగం



రాహీ సర్నోబత్

పంజాబ్ జోరు కొనసాగేనా!

- నేడు రాజస్తాన్ రాయల్స్‌తో పోరు
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో



శ్రేయస్ అయ్యర్

ముల్లాన్‌పూర్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ 18వ సీజన్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న పంజాబ్ కింగ్స్... రాజస్తాన్ రాయల్స్‌తో మ్యాచ్‌కు సిద్ధమైంది. 'డబుల్ హెడర్'లో భాగంగా శనివారం జరగనున్న రెండో పోరులో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. గత పదేళ్లుగా ప్లే ఆఫ్స్‌కు చేరలేకపోయిన పంజాబ్ జట్టు... ఆసీస్ దిగ్గజం రికీ పాంటింగ్ శిక్షణ, శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో తాజా సీజన్‌లో జోరు మీదుంది. మరోవైపు తొలి సీజన్‌లో చాంపియన్‌గా నిలిచిన రాజస్తాన్ రాయల్స్ తిరిగి సత్తా చాటేందుకు రెడీ అయింది. ఆటేతర అంశాలతో వార్తల్లో నిలుస్తున్న రాయల్స్ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌పై ఒత్తిడి అధికంగా ఉంది. గత మూడు మ్యాచ్‌ల్లో వరుసగా 1, 29, 4 పరుగులు చేసిన జైస్వాల్... ఈసారి ఎలాంటి ప్రదర్శన చేస్తాడో చూడాలి. సీజన్ తొలి మూడు మ్యాచ్‌ల్లో కేవలం ఆటగాడిగానే బరిలోకి దిగిన సంజూ సామ్సన్... ఈ మ్యాచ్‌లో సారథ్య బాధ్యతలు అందుకోనున్నాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకోవడంతో వికెట్ కీపింగ్ చేసేందుకు బీసీసీఐ అతడికి అనుమతినిచ్చింది. జైస్వాల్, సామ్సన్, నితీశ్ రాణా, రియాన్ పరాగ్, ధ్రువ్ జురేల్, హెట్‌మైర్, హసరంగతో రాయల్స్ బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. ఆర్చర్, తీక్షణ, సందీప్ శర్మ, తుషార్ దేశ్‌పాండే, శుభమ్ శర్మ బౌలింగ్ భారం మోయనున్నారు. ఇక గత రెండు మ్యాచ్‌ల్లో చక్కటి ప్రదర్శన కనబర్చిన పంజాబ్ కింగ్స్... సొంతగడ్డపై తొలి మ్యాచ్‌లో అదే జోరు కొనసాగించాలని భావిస్తోంది. అటు విదేశీ హిట్టర్లు... ఇటు స్వదేశీ ప్లేయర్లతో పంజాబ్ పటిష్టంగా ఉంది. ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాంశ్ ఆర్య జట్టుకు మెరుగైన ఆరంభాలు అందిస్తుండగా... శ్రేయస్ అయ్యర్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, శశాంక్ సింగ్, యాన్సెన్‌తో మిడిలార్డర్ పటిష్టంగా కనిపిస్తోంది. అర్ష్‌దీప్ సింగ్‌తో కలిసి ఫెర్గూసన్, యాన్సెన్ పేస్ భారం మోయనుండగా... యుజ్వేంద్ర చహల్ స్పిన్ బాధ్యతలు చూసుకోనున్నాడు. పెద్ద బౌండరీలతో కూడిన ముల్లాన్‌పూర్ మైదానం స్పిన్‌కు అనుకూలించనుంది. గత సీజన్‌లో ఇక్కడ ఓ మాదిరి స్కోర్లే నమోదు కాగా... బౌలింగ్ బలంతోనే జట్లు విజయాలు సాధించాయి.



జైస్వాల్

తుది జట్లు (అంచనా)

రాజస్తాన్ రాయల్స్: సామ్సన్ (కెప్టెన్), జైస్వాల్, రాణా, పరాగ్, జురేల్, హసరంగ, హెట్‌మైర్, ఆర్చర్, తీక్షణ, తుషార్, సందీప్, శుభమ్ దూబే.

పంజాబ్ కింగ్స్: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రభ్‌సిమ్రన్, ప్రియాంశ్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, శశాంక్ సింగ్, సుర్యాంశ్, యాన్సెన్, ఫెర్గూసన్, అర్ష్‌దీప్, చహల్, వైశాక్.

ధోని సారథ్యంలో?

- నేడు ఢిల్లీ క్యాపిటల్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ 'ఢీ'
- గాయం నుంచి ఇంకా కోలుకోని చెన్నై కెప్టెన్ రుతురాజ్
- మధ్యాహ్నం గం. 3:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



కేఎల్ రాహుల్



ధోని
రుతురాజ్

చెన్నై: వరుస విజయాలతో జోరు మీదున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు... ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌కు సిద్ధమైంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ... ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించింది. మరోవైపు విజయంతో లీగ్‌ను ఆరంభించిన చెన్నై సూపర్ కింగ్స్... ఆ తర్వాత వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడింది. రుతురాజ్ గైక్వాడ్ గాయపడటంతో ఈ మ్యాచ్‌లో 'మాస్టర్‌మైండ్' మహేంద్ర సింగ్ ధోని చెన్నై జట్టును నడిపించే అవకాశాలున్నాయి. చెపాక్ స్టేడియంలో మెరుగైన రికార్డు ఉన్న చెన్నై జట్టు... చివరగా ఇక్కడ ఆడిన మ్యాచ్‌లో బెంగళూరు చేతిలో పరాజయం పాలైంది. ఇరు జట్లలోనూ నాణ్యమైన స్పిన్నర్లు ఉండటంతో... ఈ మ్యాచ్‌లో స్పిన్‌ను సమర్థవంతంగా ఆడిన జట్టు ముందంజ వేయనుంది. రాజస్తాన్ రాయల్స్‌తో పోరులో గాయపడ్డ రుతురాజ్ గైక్వాడ్ ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో... అతడు బరిలోకి దిగడంపై సందేహాలు నెలకొన్నాయి. మ్యాచ్ సమయానికి అతడు సిద్ధంగా లేకుంటే... ధోని చెన్నై కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. కాన్వే, రాహుల్ త్రిపాఠి, శివమ్ దూబే, విజయ్ శంకర్, రవీంద్ర జడేజా, ధోనితో చెన్నై బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది. బౌలింగ్‌లో నూర్ అహ్మద్ విజృంభిస్తుండగా... పతిరణ, ఖలీల్ అహ్మద్, అశ్విన్, జడేజా అతడికి అండగా నిలుస్తున్నారు. మరోవైపు ఢిల్లీ జట్టులో కూడా నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారు. ముఖ్యంగా కుల్దీప్ యాదవ్, నూర్ అహ్మద్ మధ్య ప్రధాన పోటీ కనిపిస్తోంది. డుప్లెసిస్, మెక్‌గుర్క్‌తో ఢిల్లీ ఓపెనింగ్ బలంగా ఉండగా... ఫామ్‌లో ఉన్న అభిషేక్ పొరెల్, కేఎల్ రాహుల్, అక్షర్, స్టబ్స్, అశుతోష్ శర్మ మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు రానున్నారు. గతంలో చెన్నైకి ప్రాతినిధ్యం వహించిన డు ప్లెసిస్‌కు చెపాక్ పిచ్‌పై మంచి రికార్డు ఉంది. ఇక పేస్ బౌలింగ్ తురుపు ముక్క మిచెల్ స్టార్క్ తన విలువ చాటుకుంటుండటం ఢిల్లీకి అదనపు ప్రయోజనం చేకూరుస్తోంది. చెపాక్ వేదికగా చెన్నై, ఢిల్లీ జట్ల మధ్య 9 మ్యాచ్‌లు జరగగా... అందులో ఏడింట చెన్నై విజయం సాధించింది.

తుది జట్లు (అంచనా)

చెన్నై సూపర్ కింగ్స్: రుతురాజ్ (కెప్టెన్), కాన్వే, రాహుల్ త్రిపాఠి, శివమ్ దూబే, విజయ్ శంకర్, జడేజా, ఓవర్టన్/రచిన్ రవీంద్ర, ధోని, అశ్విన్, ఖలీల్, నూర్, పతిరణ.

ఢిల్లీ క్యాపిటల్స్: అక్షర్ (కెప్టెన్), డు ప్లెసిస్, మెక్‌గుర్క్, అభిషేక్ పొరెల్, కేఎల్ రాహుల్, స్టబ్స్, అశుతోష్ శర్మ, విప్రాజ్ నిగమ్, కుల్దీప్, స్టార్క్, ముకేశ్, మోహిత్ శర్మ.

భారత్‌తో టెస్టు సిరీస్‌కు ఇంగ్లండ్ పేసర్ స్టోన్ దూరం!



లండన్: స్వదేశంలో భారత క్రికెట్ జట్టుతో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌కు ఇంగ్లండ్ పేస్ బౌలర్ ఓలీ స్టోన్ దూరం కావడం ఖాయమైంది. గత నెలలో అబుదాబిలో జరిగిన నాటింగ్‌హామ్‌షైర్ ప్రాక్టీస్ సెషన్‌లో స్టోన్ కుడి మోకాలికి గాయమైంది. కుడి మోకాలికి స్కాన్ నిర్వహించగా... శస్త్రచికిత్స తప్పనిసరి అని తేలింది. ఈ వారాంతంలో స్టోన్‌కు శస్త్ర చికిత్స నిర్వహిస్తారు. సర్జరీ తర్వాత స్టోన్ కోలుకోవడానికి కనీసం 14 వారాలు పడుతుంది. ఈ నేపథ్యంలో జూన్ 20 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు భారత జట్టుతో జరిగే టెస్టు సిరీస్‌కు స్టోన్ అందుబాటులో ఉండే అవకాశాలు లేవు. 31 ఏళ్ల స్టోన్ ఇప్పటి వరకు ఇంగ్లండ్ తరఫున ఐదు టెస్టులు ఆడి 17 వికెట్లు పడగొట్టాడు. గాయం కారణంగా భారత్‌తో సిరీస్‌కు దూరం కాబోతున్న రెండో ఇంగ్లండ్ పేసర్ స్టోన్ కావడం గమనార్హం. ఇప్పటికే మరో పేస్ బౌలర్ మార్క్ వుడ్ భారత్‌తో సిరీస్‌లో ఆడటంలేదు.

మే 24న నీరజ్ చోప్రా క్లాసిక్ ఈవెంట్

పంచ్‌కుల వేదికగా ప్రపంచ స్థాయి జావెలిన్ మీట్

న్యూఢిల్లీ: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పేరుతో మనదేశంలో ఓ అంతర్జాతీయ జావెలిన్ ఈవెంట్ ప్రారంభానికి రంగం సిద్ధమైంది. మే 24న హరియాణాలోని పంచ్‌కుల వేదికగా జరగనున్న ఈ టోర్నీకి 'నీరజ్ చోప్రా క్లాసిక్' అని పేరు పెట్టారు. దివంగత మాజీ ఉప ప్రధానమంత్రి దేవీ లాల్ స్టేడియంలో ఈ మీట్‌ను నిర్వహిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యుత్తమ జావెలిన్ త్రోయర్లు పాల్గొనే ఈ ఈవెంట్‌కు అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య 'ఎ' కేటగిరీ హోదాను కేటాయించింది. ప్రస్తుతానికి ఈ ఈవెంట్‌కు ప్రపంచ అథ్లెటిక్స్ క్యాలెండర్‌లో చోటు దక్కకపోయినా... ప్రతి ఏటా దీన్ని నిర్వహించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్‌ఐ), జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ సంయుక్తంగా ఈ ఈవెంట్ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటున్నాయి. నీరజ్ చోప్రా కూడా నిర్వాహక కమిటీలో భాగం పంచుకుంటున్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం నెగ్గి కొత్త చరిత్ర సృష్టించిన నీరజ్... 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకంతో మెరిశాడు. ఈ ఏడాది ఆరంభంలోనే ఈ ఈవెంట్‌కు ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య అధ్యక్షుడు సెబాస్టియన్ కో ఆమోదం తెలిపారు. భారత్‌లో మెగా టోర్నీలు నిర్వహించే సామర్థ్యాన్ని ఇది ప్రపంచానికి చాటుతుందని పేర్కొన్నారు. ఈ ఈవెంట్ దేశ అథ్లెటిక్స్ ప్రతిష్టను పెంపొందిస్తుందని ఏఎఫ్‌ఐ అధ్యక్షుడు బహదూర్ సింగ్ అభిప్రాయపడ్డారు. 'నీరజ్ జావెలిన్ శిక్షణ ప్రారంభించిన ప్రాంతంలోనే ఈ టోర్నీ జరగనుంది. నీరజ్ భాగస్వామ్యంతో దేశంలో ఈ ఈవెంట్ నిర్వహించడం భారత అథ్లెటిక్స్‌కు గొప్ప విషయం' అని బహదూర్ సింగ్ అన్నారు. హరియాణా, పానిపట్ సమీపంలోని ఖంద్రా గ్రామంలో జన్మించిన నీరజ్ చోప్రా... 2012 నుంచి 2015 వరకు పంచ్‌కులలో జావెలిన్ శిక్షణ పొందాడు. అనంతరం అంచెలంచెలుగా ఎదిగిన నీరజ్... ఒలింపిక్స్‌లో అథ్లెటిక్స్‌లో దేశానికి స్వర్ణం అందించిన తొలి అథ్లెట్‌గా రికార్డుల్లోకెక్కాడు. ప్రస్తుతం తన వ్యక్తిగత కోచ్ జాన్ జెలెజ్నీ వద్ద శిక్షణ పొందుతున్న నీరజ్... మే 16న జరిగే దోహా డైమండ్ లీగ్‌తో సీజన్ ప్రారంభించే అవకాశాలున్నాయి.



ఆంధ్రప్రదేశ్ హాకీ జట్టు ఓటమి

ఝాన్సీ: జాతీయ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు శుక్రవారం తెరలేచింది. ముందుగా ఎనిమిది జట్లు పోటీపడుతున్న 'సి' డివిజన్ మ్యాచ్‌లు... అనంతరం పది జట్లు బరిలో ఉన్న 'బి' డివిజన్ మ్యాచ్‌లు మొదలయ్యాయి. 'బి' డివిజన్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ జట్టు తమ తొలి మ్యాచ్‌లో 1–13 గోల్స్ తేడాతో చండీగఢ్ చేతిలో ఓడిపోయింది. 'సి' డివిజన్‌లో రాజస్తాన్, అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ జట్లు శుభారంభం చేశాయి. రాజస్తాన్ 9–1 గోల్స్ తేడాతో త్రిపుర జట్టును ఓడించగా.. అరుణాచల్ ప్రదేశ్ 5–0తో జమ్మూ కశ్మీర్ జట్టుపై, ఛత్తీస్‌గఢ్ 10–0తో గుజరాత్ జట్టుపై, హిమాచల్ ప్రదేశ్ 6–2తో బిహార్‌పై గెలుపొందాయి.

సెల్యూట్ పైలట్ సిద్ధార్థ్!

ఎన్నో ప్రాణాలను కాపాడి అసువులు బాసిన వైనం

- బయల్దేరిన కాసేపటికే జాగ్వార్‌లో సాంకేతిక లోపం
- సురక్షితంగా దూకేసే చాన్సున్నా విమానాన్ని వీడలేదు
- జనావాసాలకు దూరంగా మైదానంలోకి తీసుకెళ్లారు
- నిశ్చితార్థమై పది రోజులే, నవంబర్లో వివాహం
- నాలుగు తరాలుగా సైనిక కుటుంబం



సిద్ధార్థ్ యాదవ్

అంతా బాగున్నప్పుడు కాదు, ప్రమాదపుటంచున ఉన్నప్పుడు ఎలా స్పందిస్తామన్నది మన వ్యక్తిత్వానికి కొలమానంగా నిలుస్తుంది. బుధవారం రాత్రి గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో కూలిపోయిన భారత వైమానిక దళ జాగ్వార్ ఫైటర్ జెట్ పైలట్ సిద్ధార్థ్ యాదవ్ అలాంటి గొప్ప వ్యక్తిత్వమున్న వారి కోవకే వస్తారు. సాంకేతిక లోపాలతో విమానం కుప్పకూలనుందని అర్థమైంది. 28 ఏళ్ల యువకుడు. తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు. పైగా 10 రోజుల కిందే నిశ్చితార్థం కూడా అయింది. కో పైలట్‌తో కలిసి సురక్షితంగా ఎజెక్టయ్యే అవకాశముంది. అయినా సిద్ధార్థ్ తన ప్రాణాల కోసం పాకులాడలేదు. ప్రజల భద్రత గురించే ఆలోచించారు. విమానంజనావాసాల్లో పడకుండా జాగ్రత్తపడ్డారు. సురక్షితంగా మైదానంలో కూలిపోయేలా చూశారు. తద్వారా ఎంతోమంది పౌరుల మరణాలను నివారించారు. ఆ క్రమంలో దురదృష్టవశాత్తూ ప్రాణాలు కోల్పోయినా తన సాటిలేని త్యాగంతో జాతి గుండెల్లో చిరంజీవిగా మిగిలిపోయారు. కో పైలట్ సురక్షితంగా ఎజెక్టయినా గాయాలపాలయ్యారు. ప్రస్తుతం ఆస్పత్రిలో కోలుకుంటున్నారు.

చివరి క్షణాల్లోనూ...

బయల్దేరిన కాసేపటికే విమానంలో సాంకేతిక వైఫల్యం తలెత్తింది. విమానాన్ని నియంత్రించడానికి ప్రయత్నించినా లాభం లేకపోయింది. ప్రమాదం తప్పదని స్పష్టమైంది. దాంతో పైలెట్లిద్దరూ ఎజెక్షన్ ప్రారంభించారు. అంతటి క్లిష్ట సమయంలోనూ ముందు కో పైలట్ సురక్షితంగా బయటపడేలా సిద్ధార్థ్ జాగ్రత్త తీసుకున్నారు. తర్వాత కూడా విమానాన్ని వెంటనే వదిలేయకుండా నివాస ప్రాంతాలకు దూరంగా తీసుకెళ్లారు. ఆ క్రమంలో ప్రాణాలనే పణంగా పెట్టారు.

కుటుంబమంతా దేశ సేవలోనే..

ఫ్లైట్ లెఫ్టినెంట్ సిద్ధార్థ్ స్వస్థలం హరియాణాలోని రేవారీ. వారిది తరతరాలుగా సైనిక కుటుంబమే. ఆయన ముత్తాత బ్రిటిష్ హయాంలో బెంగాల్ ఇంజనీర్స్ విభాగంలో పనిచేశారు. తాత పారామిలటరీ దళాల్లో సేవలందించారు. తండ్రి కూడా వైమానిక దళంలో పనిచేశారు. సిద్ధార్థ్ 2016లో వైమానిక దళంలో చేరారు. రెండేళ్ల సర్వీసు తర్వాత ఫ్లైట్ లెఫ్టినెంట్‌గా పదోన్నతి పొందారు. మార్చి 23నే నిశ్చితార్థం జరనిగింది. నవంబర్ 2న పెళ్లి జరగాల్సి ఉంది. మార్చి 31 దాకా కుటుంబీకులతో గడిపి ఇటీవలే విధుల్లో చేరారు. ఆయన మరణవార్తతో కుటుంబం, స్నేహితులే గాక పట్టణమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. విమానంలో ప్రయాణించాలని, దేశానికి సేవ చేయాలని సిద్ధార్థ్ ఎప్పుడూ కలలు కనేవాడని చెబుతూ తండ్రి సుజీత్ యాదవ్ కన్నీటిపర్యంతమయ్యారు. ''సిద్ధార్థ్ తెలివైన విద్యార్థి. తనను చూసి ఎప్పుడూ గర్వపడేవాళ్లం. ప్రజల ప్రాణాలు కాపాడుతూ తన ప్రాణాలర్పించాడు. నా కొడుకును చూసి చాలా గర్వపడుతున్నా. మాకు ఒక్కగానొక్క కొడుకు తను'' అంటూ గుండెలవిసేలా రోదించారు. సిద్ధార్థ్ పార్థివదేహం శుక్రవారం రేవారీకి చేరింది. పూర్వీకుల గ్రామం భలాకి మజ్రాలో పూర్తి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

వీవీపీ రెండో దశకు మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ సరిహద్దుల వెంట ఉన్న గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రామ్‌ను(వీవీపీ) మరింత విస్తరింపజేసేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో రెండో దశను ప్రారంభించేందుకు పచ్చజెండా ఊపింది. ఈ విషయం ప్రభుత్వ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. వీవీపీ కింద ఎంపిక చేసిన గ్రామాల అభివృద్ధికి పూర్తి నిధులను కేంద్ర ప్రభుత్వమే అందజేస్తుంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ అనే లక్ష్య సాధన కోసం సరిహద్దు గ్రామాల ప్రగతికి కేంద్రం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఉత్తర భారతదేశం సరిహద్దుల్లోని గ్రామాలను ఇప్పటికే వీవీపీ-1 కింద చేర్చారు. ఇతర ప్రాంతాల్లోని సరిహద్దు గ్రామాలను వీవీపీ-2 కింద అభివృద్ధి చేస్తారు. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, బిహార్, గుజరాత్, జమ్మూకశ్మీర్, లద్దాఖ్, మణిపూర్, మేఘాలయా, మిజోరాం, నాగాలాండ్, పంజాబ్, రాజస్తాన్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని సరిహద్దు గ్రామాలను 2028-29 నాటికి అభివృద్ధి చేయాలన్నదే వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రామ్ లక్ష్యం. ఇందుకోసం కేంద్రం రూ.6,839 కోట్లు ఖర్చు చేయనుంది. సరిహద్దు గ్రామాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తారు. అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతారు.

నాలుగు రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు

నాలుగు రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోదం తెలియజేసింది. రూ.18,658 కోట్లతో ఈ ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించాయి. మహారాష్ట్ర, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 15 జిల్లాలో ఈ ప్రాజెక్టులు రానున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో రైల్వే నెట్‌వర్క్ మరో 1,247 కిలోమీటర్లు పెరుగనుంది. అలాగే కొత్తగా 19 రైల్వే స్టేషన్లు నిర్మిస్తారు.

మహిళా కానిస్టేబుల్ డ్రగ్స్ దందా

- తనిఖీల్లో 17.71 గ్రాముల హెరాయిన్ స్వాధీనం
- విధుల నుంచి సస్పెండ్ చేసిన పంజాబ్ ప్రభుత్వం



అమన్‌దీప్ కౌర్

చండీగఢ్: పంజాబ్‌లో ఓ మహిళా కానిస్టేబుల్ మాదక ద్రవ్యాలు అక్రమంగా రవాణా చేస్తూ దొరికిపోయారు. డ్రగ్స్‌ను అరికట్టాల్సిన బాధ్యత కలిగిన ఉద్యోగి తప్పుదారిలో నడవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఆమెను విధుల నుంచి తొలగించింది. భటిండాలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న అమన్‌దీప్ కౌర్ ఈ నెల 2వ తేదీన అరెస్టయ్యారు. ఆమె వద్ద 17.71 గ్రాముల నిషేధిత హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్‌పై యుద్ధం పేరిట నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పంజాబ్ పోలీసులు రాష్ట్రంలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు... అమన్‌దీప్ కౌర్ ప్రయాణిస్తున్న మహీంద్రా థార్ వాహనాన్ని తనిఖీ చేయగా హెరాయిన్ లభించింది. కిందిభాగంలో అమర్చిన ఓ పెట్టెలో ఈ డ్రగ్స్‌ను కనుగొన్నారు. అమన్‌దీప్ కౌర్‌ను వెంటనే అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. తీవ్రమైన నేరానికి పాల్పడిన అమన్‌దీప్ కౌర్‌ను విధుల నుంచి ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ విషయాన్ని పంజాబ్ డీజీపీ సుఖ్‌చైన్ సింగ్ గిల్ ధ్రువీకరించారు. డ్రగ్స్ దందా చేసేవారు ఎంతటివారైనా సరే వదిలిపెట్టొద్దని, కఠినంగా వ్యవహరించాలని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానిస్టేబుల్ అమన్‌దీప్ కౌర్ సోషల్ మీడియాలో చాలా చురుగ్గా ఉంటారు. తన మహీంద్రా థార్ వాహనం వీడియోలను తరచుగా షేర్ చేస్తుంటారు. దానిపై పంజాబ్ పోలీసు అని స్టిక్కర్ అతికించుకున్నారు. తనిఖీల నుంచి తప్పించుకోవడానికే ఇమె ఇలా చేసినట్లు తెలుస్తోంది. డ్రగ్స్ దందా చేస్తూ దొరికిపోయిన అమన్‌దీప్ కౌర్ ఆస్తులను ప్రభుత్వం చట్టప్రకారం జప్తు చేసే అవకాశం ఉంది. ఆమెకు రూ.2 కోట్ల విలువైన ఇల్లుతో పాటు పలు ఖరీదైన వాహనాలు ఉన్నాయి.

టారిఫ్‌లతో పడిపోయిన ట్రంప్ గ్రాఫ్

43 శాతానికి తగ్గిన జనామోదం ● రక్షణ, విదేశీ విధానంపైనా పెదవి విరుపు

వాషింగ్టన్: ప్రపంచ దేశాలపై ఎడాపెడా టారిఫ్‌లు వడ్డించిన అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రాఫ్ బాగా పడిపోయింది. ఆయనను అధ్యక్షుడిగా అంగీకరించే అమెరికన్ల సంఖ్య 43 శాతానికి పడిపోయింది. బుధవారంతో ముగిసిన మూడు రోజుల సర్వేలో ఈ మేరకు వెల్లడైంది. మూడు నెలల కింద అధికారం చేపట్టిన నాటి నుంచి ఆయనకు మద్దతు ఇంత తగ్గడం ఇదే తొలిసారి. జనవరిలో పదవీ బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకు ట్రంప్‌కు 47 శాతం మద్దతు లభించింది. ట్రంప్ సుంకాలు, నిర్వహణపై అమెరికన్లు బాగా అసంతృప్తితో ఉన్నారు. ఆయన విదేశాంగ విధానాన్ని సైతం వ్యతిరేకిస్తున్నారు. వలసదారులను తిప్పి పంపుతున్న అంశంపై మాత్రమే ట్రంప్ విధానాలకు ఆమోదం తెలిపారు.

ట్రంప్ పాపులారిటీ తగ్గడానికి ప్రధాన కారణం ఆర్థిక వ్యవస్థను నిర్వహిస్తున్న తీరే. ఈ విషయంలో ఆయన పనితీరును కేవలం 37 శాతం మంది మాత్రమే ఆమోదించారు. ఆటోమొబైల్స్, ఆటోమోటివ్ విడిభాగాల వంటి వస్తువులపై ట్రంప్ విధించిన భారీ సుంకాలతో చాలామంది అమెరికన్లు ఆందోళన చెందుతున్నారు. కొత్త టారిఫ్‌లు తమకు, తమ కుటుంబాలకు చేటు చేస్తాయని భావిస్తున్నట్లు సర్వేలో దాదాపు సగం మంది పేర్కొన్నారు. ట్రంప్ సుంకాల పెంపు స్టాక్ మార్కెట్లో కూడా అనిశ్చితికి దారితీయడం తెలిసిందే. ఆయన దుందుడుకు విధానాలు దీర్ఘకాలిక దౌత్య నిబంధనలకు విఘాతం కలిగించడమే గాక ప్రపంచంతో అమెరికా వ్యవహరించే విధానంలో మార్పుకు కారణమయ్యాయి. ట్రంప్ సైనిక నిర్వహణ పట్ల కూడా అమెరికన్లు బాగా ఆందోళన చెందుతున్నట్టు సర్వే తేల్చింది. యెమెన్‌లో హౌతీ ఉగ్రవాదులపై సైనిక దాడి ప్రణాళిక సిగ్నల్ యాప్ ద్వారా లీకవడంపై వారు ఆగ్రహంగా ఉన్నారు. ఇది తీవ్ర బాధ్యతారాహిత్యమని ఏకంగా 74 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఇక ట్రంప్ విదేశాంగ విధానానికి జనామోదం కూడా జనవరిలో 34 శాతానికి పడిపోయింది. జనవరిలో ఇది 37 శాతంగా ఉంది. ట్రంప్ వలస విధానాలకు 48 శాతం ఆమోదం లభించింది.

రాజ్యాంగ విరుద్ధంగా ఎన్నికల నిర్వహణ

- దేశంలో పదేళ్లుగా ఎన్నికల ప్రక్రియ లోపభూయిష్టం
- సీపీఎం 24వ జాతీయ సదస్సులో తీర్మానం

మదురై: దేశంలో ఎన్నికల ప్రక్రియ భ్రష్టుపట్టిపోతోందని సీపీఎం ఆందోళన వ్యక్తం చేసింది. గత పదేళ్లుగా ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధంగా, పారదర్శకత లేకుండా లోపభూయిష్టంగా జరుగుతున్నాయని ఆరోపించింది. ఎన్నికల నిర్వాహణలో ఎన్నికల సంఘం(ఈసీ) పూర్తిగా విఫలమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం సీపీఎం 24వ జాతీయ సదస్సులో ఒక తీర్మానం ఆమోదించారు. తమిళనాడులోని మదురైలో జరిగిన ఈ సదస్సుకు పార్టీ అగ్రనేతలు హాజరయ్యారు. తాజా పరిణామాలపై చర్చించారు. దేశ ప్రజల్లో ఎన్నికల సంఘం విశ్వసనీయత కోల్పోయిందని వారు తేల్చిచెప్పారు. గత పదేళ్లుగా ఎన్నికలు జరుగుతున్న తీరును తప్పుపడుతూ తీర్మానం ఆమోదించారు. నియమ నిబంధనలను తుంగలు తొక్కి, ధన బలం ఉన్న రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఎన్నికలు నిర్వహించే పరిస్థితి ఉందని మండిపడ్డారు. ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తిని కోల్పోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. పూర్తి స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఈసీ కొన్ని పార్టీల పట్ల పక్షపాతం చూపుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆక్షేపించారు. 2024 ఏప్రిల్‌లో సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్(సీఎస్‌డీఎస్) నిర్వహించిన సర్వేలో.. దేశ ప్రజల్లో కేవలం 23 శాతం ఎన్నికల సంఘం పట్ల విశ్వసనీయత చూపుతున్నట్లు తేలిందని తీర్మానంలో పేర్కొన్నారు. ఓటర్ల ఫొటో గుర్తింపు కార్డులను వారి ఆధార్ కార్డులతో అనుసంధానించాలన్న నిర్ణయాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకించింది.

యూన్ అభిశంసన సరైనదే

రాజ్యాంగాన్ని, చట్టాలను ఉల్లంఘించారు

- దక్షిణ కొరియా రాజ్యాంగ న్యాయస్థానం
- అధ్యక్ష పదవి నుంచి తొలగింపు
- రెండు నెలల్లో ఎన్నికలకు ఆదేశం



యూన్ సుక్ యోల్

సియోల్: దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అభిశంసన సబబేనని ఆ దేశ రాజ్యాంగ న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆయనను పదవి నుంచి తొలగిస్తూ శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు రెండు నెలల్లో ఎన్నికలకు ఆదేశించింది. 64 ఏళ్ల యూన్ ప్రయోగించిన మార్షల్ లా రాజ్యాంగాన్ని, ఇతర చట్టాలను తీవ్రంగా ఉల్లంఘించినందని కోర్టు తాత్కాలిక చీఫ్ మూన్ హ్యూంగ్ బే ప్రకటించారు. అందుకే ఆయన అభిశంసనను ఎనిమిది మంది సభ్యుల ధర్మాసనం సమర్థించిందని పేర్కొన్నారు. ''యూన్ మార్షల్ లా అమలు ప్రజల ప్రాథమిక రాజకీయ హక్కులను దెబ్బతీసింది. చట్ట పాలనను, ప్రజాస్వామ్య సూత్రాలను ఉల్లంఘించింది. ఆయన తన విధి నిర్వహణలో విఫలమయ్యారు. రక్షించాల్సిన వ్యక్తులకు వ్యతిరేకంగా పనిచేశారు. జాతీయ అత్యవసర అధికారాలను ఉపయోగించడం సమర్థనీయం కాదు'' అని తీర్పు పేర్కొంది. దేశంలో రాజకీయ గందరగోళానికి ఇకనైనా తెర పడుతుందేమో చూడాలి. యూన్‌పై క్రిమినల్ అభియోగాలు కొనసాగనున్నాయి. పదవిలో ఉంటూ అరెస్టయిన, అభియోగాలు ఎదుర్కొన్న తొలి అధ్యక్షుడు ఆయనే!

ప్రజావిజయం: విపక్షం

తీర్పును ప్రజల విజయంగా ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ అభివర్ణించింది. యూన్ వ్యతిరేకులు హర్షధ్వానాలతో హోరెత్తించారు. జెండాలు ఊపుతూ నినాదాలు చేశారు. మైదానాల్లో ఉత్సాహం ఉప్పొంగిపోయింది. ''రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, ప్రజలకు లభించిన విజయమిది. ప్రజా శత్రువును ప్రజాస్వామ్య ఆయుధంతో ఓడించిన ప్రజలకు కృతజ్ఞతలు'' అని అభిశంసన కేసు ప్రాసిక్యూటర్, డెమొక్రటిక్ పార్టీ చట్టసభ్యుడు జంగ్ చుంగ్ రే తెలిపారు. తీర్పుపై యూన్ మద్దతుదారులు కన్నీటిపర్యంతమయ్యారు. తీర్పు రాగానే 'కొరియా కథ ముగిసింది' అంటూ నినాదాలు చేశారు. ఇది పూర్తిగా అప్రజాస్వామిక, అన్యాయమైన తీర్పు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా రాజకీయ తీర్పేనని యూన్ లాయర్లు వాపోయారు. అయితే తీర్పును అంగీకరిస్తున్నామని అధికార పీపుల్ పవర్ పార్టీ తెలిపింది.

ఇదీ నేపథ్యం...

దక్షిణ కొరియాలో ఈ రాజ్యాంగ సంక్షోభం నాలుగు నెలల క్రితం మొదలైంది. గత డిసెంబర్ 3న రాత్రివేళ ఉన్నట్టుండి మార్షల్ లా విధిస్తున్నట్టు అధ్యక్ష హోదాలో యూన్ ప్రకటించారు. విపక్ష డెమొక్రటిక్ పార్టీ తన పార్లమెంటరీ మెజారిటీని దుర్వినియోగం చేస్తోందని, దేశాన్ని నాశనం చేస్తోందని ఆరోపిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ వెంటనే పార్లమెంటును మూసేసేందుకు భద్రతా దళాలు రంగంలోకి దిగాయి. ఆ ప్రయత్నాలను చట్టసభ సభ్యులు ధిక్కరించారు. సైనిక చట్టాన్ని తిరస్కరిస్తూ ఓటేశారు. దాంతో ఆరు గంటలకే మార్షల్ లా డిక్రీని యూన్ ఎత్తేయాల్సి వచ్చింది. కానీ ఆ ఆరు గంటల సైనిక పాలన రాజకీయ సంక్షోభాన్ని మిగిల్చింది. ఆర్థిక మార్కెట్లను కుదిపేసింది. దీనిపై నెలల తరబడి నిరసనలు వెల్లువెత్తాయి. విపక్షాల ఆధిపత్యమున్న జాతీయ అసెంబ్లీ డిసెంబర్ 14న యూన్‌ను అభిశంసించింది. రాజ్యాంగాన్ని, చట్టాలను ఉల్లంఘించారని, నేతల నిర్బంధించడానికి యత్నించారని, శాంతికి భంగం కలిగించారని ఆరోపించింది. వీటిని యూన్ ఖండించారు. జాతీయ అసెంబ్లీని నేరగాళ్లు, ప్రభుత్వ వ్యతిరేక శక్తుల అడ్డాగా అభివర్ణించారు. డెమొక్రటిక్ పార్టీ దుర్మార్గంపై పోరాటానికి ప్రజల మద్దతును కూడగట్టే ప్రయత్నంలో భాగంగానే మార్షల్ లా విధించినట్టు రాజ్యాంగ కోర్టు ముందు చివరి వాంగ్మూలంలో చెప్పుకున్నారు. 2021లో పీపుల్ పవర్ పార్టీలో చేరిన ఆయన రాజీలేని వ్యక్తిత్వంతో ఆకట్టుకున్నారు. 2022లో అధ్యక్షుడయ్యారు. కుంభకోణాల్లో చిక్కుకున్న అధికారులను మార్చడానికి నిరాకరించడం, అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను వీటో చేయడం ద్వారా విమర్శల పాలయ్యారు.

భారీ భద్రత

తీర్పు నేపథ్యంలో యూన్‌కు అనుకూలంగా, వ్యతిరేకంగా ప్రజలు వేలాదిగా కోర్టు ముందు బారులు తీరారు. దాంతో తీర్పు తర్వాత అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా పోలీసులను మోహరించారు. దేశమంతటా ఎమర్జెన్సీ ప్రకటించారు. తీర్పు సందర్భంగా దేశమంతటా జనం టీవీలకు అతుక్కుపోయారు.

విపక్ష నేత లీ ముందంజ

దక్షిణ కొరియాలో జూన్ 3న ముందస్తు ఎన్నికలు జరుగుతాయని భావిస్తున్నారు. 2017లో పార్క్ గ్యున్ హైని అధ్యక్ష పదవి నుంచి తొలగించినప్పుడు కూడా 60 రోజుల తర్వాత ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష రేసులో విపక్ష డెమొక్రటిక్ పార్టీ నేత లీ జే మ్యుంగ్ ముందున్నట్టు సర్వేలు చెబుతున్నాయి. ఎన్నికల దాకా తాత్కాలిక అధ్యక్షునిగా హాన్ డక్ సూ కొనసాగుతారు. ''ప్రజల సంకల్పాన్ని గౌరవిస్తూ ఎన్నికలను రాజ్యాంగానికి, చట్టానికి అనుగుణంగా నిర్వహించడానికి కృషి చేస్తా. అధికార మార్పిడి సజావుగా జరిగేలా చూస్తా'' అని ఆయన ప్రకటించారు.

పార్లమెంటు తలుపు తట్టండి

సోషల్ మీడియా పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: పదమూడేళ్లలోపు చిన్నారులు సామాజిక మాధ్యమాలను వినియోగించకుండా నిషేధించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇది విధానపరమైన అంశమని, ఇందుకు సంబంధించిన చట్టం చేయాలంటూ పార్లమెంట్‌ను కోరాలంది. ఈ విషయంలో సంబంధిత యంత్రాంగాన్ని సంప్రదించే స్వేచ్ఛను పిటిషనర్‌కు ఇచ్చింది. తీవ్ర శారీరక, మానసిక ప్రభావాలను కలుగజేస్తోన్న సోషల్ మీడియాను చిన్నారులు వాడకుండా బయోమెట్రిక్ ధ్రువీకరణ, కంటెంట్ నియంత్రణలు, రియల్ టైం మానిటరింగ్ టూల్స్ వంటి చర్యలను తప్పనిసరి చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మసీహ్‌ల ధర్మాసనం పైవ్యాఖ్యలు చేసింది. జెప్ ఫౌండేషన్ తరఫున లాయర్ మోహినీ ప్రియ వాదనలు వినిపించారు. పరిమితుల్లేని సోషల్ మీడియా వాడకంతో చిన్నారులు కుంగుబాటు, ఆందోళనలకు గురై తమను తాము గాయపర్చుకోవడం, బలవన్మరణాలకు పాల్పడటం వంటి విపరీత చర్యలకు దిగుతున్నారని తెలిపారు. దేశ జనాభాలో 30 శాతం మంది 4-18 ఏళ్ల గ్రూపు వారేనని చెప్పారు. మొత్తం జనాభాలో 32.2 శాతం మంది, 46 కోట్ల మందికిపైగా సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నట్లు వివరించారు. మహారాష్ట్ర జనాభాలోని 17 శాతం మంది 9-17 ఏళ్ల మధ్య వారు కాగా, వీరు రోజులో ఏకంగా ఆరు గంటలపాటు సోషల్ మీడియా లేదా వీడియో గేమ్‌లు ఆడుతూ గడుపుతున్నట్లు సర్వేల్లో తేలిందన్నారు. సోషల్ మీడియాకు బానిసలవుతూ చదువును, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

డూప్లికేట్ ఓటర్ ఐడీలపై టీఎంసీ ర్యాలీ

న్యూఢిల్లీ: డూప్లికేట్ ఓటర్ గుర్తింపు కార్డు(ఈపీఐసీ)ల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఎంపీలు శుక్రవారం ఎన్నికల కమిషన్(ఈసీ)కి వినతి పత్రం అందజేశారు. ఈసీ కార్యాలయం నుంచి ర్యాలీగా విజయ్ చౌక్‌కు, అక్కడి నుంచి పార్లమెంట్ సముదాయం వద్దకు వచ్చి నిరసన తెలిపారు. డూప్లికేట్ ఓటర్ గుర్తింపు కార్డులు ఎన్ని జారీ చేశారో చెప్పాలని ఈసీని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఆధార్ నంబర్‌తో ఓటర్ గుర్తింపు కార్డులను అనుసంధానం చేయరాదని కూడా కోరారు. 'డూప్లికేట్ ఓటర్ గుర్తింపు కార్డుల జారీ వ్యవహారం పెద్ద కుంభకోణం. ఈ కుంభకోణంపై ఈసీ సమూలంగా దర్యాప్తు చేపట్టాలి' అని టీఎంసీ రాజ్యసభ ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ కోరారు. ఓటర్ గుర్తింపు కార్డులపై డూప్లికేట్ అని రాసున్న ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించాలకున్నా, రాజ్యసభలో అధికార పార్టీ సభ్యులు అంతరాయం కలిగించడంతో కుదరలేదని టీఎంసీ ఉప నేత సాగరికా ఘోష్ చెప్పారు. ఎన్నికల కమిషన్ డూప్లికేట్ ఓటర్ గుర్తింపు కార్డుల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్డులకు ఆధార్‌ను అనుసంధానం చేయడమంటే మరిన్ని సమస్యలను సృష్టించడమే అవుతుందని చెప్పారు.

'ఎంపురాన్' నిర్మాత ఇంట్లో ఈడీ సోదాలు

కొచ్చి/న్యూఢిల్లీ: ఇటీవల విడుదలైన వివాదాస్పద సినిమా 'ఎల్2: ఎంపురాన్' నిర్మాతల్లో ఒకరైన గోకులం గోపాలన్‌కు చెందిన చిట్‌ఫండ్ కంపెనీలో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)అధికారులు సోదాలు చేపట్టారు. రూ.వెయ్యి కోట్ల విదేశీ మారక ద్రవ్యం నిబంధనల ఉల్లంఘన కేసులో దర్యాప్తులో భాగంగా కొడంబాక్కంలోని గోపాలన్ నివాసంతోపాటు కంపెనీ కార్యాలయాలున్న కొచ్చి, చెన్నై సహా ఐదు చోట్ల తనిఖీలు జరిపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మలయాళంలోనే అత్యంత భారీ పెట్టుబడితో నిర్మించిన 'ఎంపురాన్'లో గుజరాత్ అల్లర్ల నేపథ్యం ఉండటం వివాదం రేపింది.

బావిలో పడిన ట్రాక్టర్ ట్రాలీ.. ఏడుగురు మహిళా కూలీలు దుర్మరణం

ఛత్రపతి శంభాజీనగర్: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీ అదుపు తప్పి బావిలోకి దూసుకుపోయిన ఘటనలో ఏడుగురు మహిళలు దుర్మరణం చెందారు. శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో స్థానికులు ముగ్గురిని మాత్రం రక్షించగలిగారు. బావిలో నిండుగా ఉన్న నీటిని పంపులతో బయటకు తోడి మృతదేహాలను బయటకు తీశారు. బాధితులంతా హింగోలీ జిల్లా వస్మత్ తహశీల్‌లోని గంజ్ గ్రామానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందజేస్తామని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు అందజేస్తామన్నారు.

రాజకీయ నేతను..

ఉగ్రవాదిని కాను!

సుప్రీంకోర్టుకు తెలిపిన యాసిన్ మాలిక్

న్యూఢిల్లీ: రాజకీయ నాయకుడినే తప్ప, ఉగ్రవాదిని కానని తిహార్ జైలులో ఉన్న జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్(జేకేఎల్ఎఫ్) చీఫ్ యాసిన్ మాలిక్ చెప్పారు. గతంలో ప్రధాని మోదీ సహా ఏడుగురు ప్రధానమంత్రులు తనతో చర్చలు జరిపారన్నారు. శుక్రవారం ఆయన సుప్రీంకోర్టులో జరిగిన విచారణలో వర్చువల్‌గా పాల్గొన్నారు. సాక్షులను వర్చువల్‌గా ప్రశ్నించేందుకు మాలిక్‌కు అనుమతివ్వాలా వద్దా అనే విషయంలో సీబీఐ వేసిన పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. యాసిన్ మాలిక్ కరడుగట్టిన ఉగ్రవాది అనీ, హఫీజ్ సయీద్ వంటి వారితో ఆయన ఉన్న ఫొటోలను చూపించారు. దీనిపై యాసిన్ మాలిక్ స్పందిస్తూ.. 'కేంద్ర ప్రభుత్వం జేకేఎల్ఎఫ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించలేదు. నాకు ఉగ్రవాదులతో ఎటువంటి సంబంధం లేదు. ఉగ్రవాదులెవరికీ ఆశ్రయం ఇవ్వలేదు. 1994లో ఏకపక్ష కాల్పుల విరమణ అనంతరం రాజకీయ సంబంధమైన 32 కేసుల్లో నాకు బెయిలొచ్చింది. ఇవేవీ విచారణకు రానే లేదు. ప్రస్తుత ప్రధాని మోదీ సహా ఏడుగురు ప్రధానులు గతంలో నాతో చర్చలు జరిపారు. నేను రాజకీయ నాయకుడినే తప్ప, ఉగ్రవాదిని కాను' అంటూ వివరణ ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం అకస్మాత్తుగా 35 ఏళ్లనాటి మిలిటెంట్ కేసులను తిరగదోడిందని, కాల్పుల విరమణకు ఇది విరుద్ధమంటూ వాదించారు. అయితే, ఆ కాల్పుల విరమణ ప్రస్తుత పరిస్థితుల్లో అర్థం లేనిదని తుషార్ మెహతా కొట్టిపారేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నందున యాసిన్ మాలిక్‌ను జమ్మూలోని ట్రయల్ కోర్టుకు తీసుకెళ్లవద్దని, తిహార్ జైలు నుంచి వర్చువల్‌గానే సాక్షులను ఆయన క్రాస్ ఎగ్జామిన్ చేయవచ్చని తెలిపింది. 1989లో కేంద్ర మాజీ మంత్రి ముఫ్తి మహ్మద్ కుమార్తె రుబియా కిడ్నాప్ కేసు, 1990 నాటి శ్రీనగర్ కాల్పుల కేసులను జమ్మూ నుంచి ఢిల్లీకి బదిలీ చేయాలంటూ సీబీఐ చేసిన వినతిపై ధర్మాసనం ఈ మేరకు స్పష్టతనిచ్చింది.

కశ్మీర్‌లో బదిలీల రగడ

- అధికార పక్ష ఎమ్మెల్యేల అత్యవసర భేటీ
- ప్రజాతీర్పును గౌరవించాలంటూ తీర్మానం
- హోం మంత్రికి సీఎం ఒమర్ లేఖ
- నా పరిమితులేంటో తెలుసు: ఎల్జీ సిన్హా

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ పరిపాలనా సర్వీస్(జేకేఏఎస్)కు చెందిన 48 మంది అధికారులను లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ)మనోజ్ సిన్హా బదిలీ చేయడం వివాదాస్పదంగా మారింది. పరిపాలనా సంబంధమైన అంశాల్లో ఇప్పటికే రాజ్ భవన్, ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం మధ్య కొనసాగుతున్న విభేదాలకు ఇది ఆజ్యం పోసినట్లయింది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న సీఎం అబ్దుల్లా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఎల్జీ సిన్హా, చీఫ్ సెక్రటరీ అటల్ దుల్లూకు లేఖలు రాశారు. అందులో పలు అంశాలను ప్రస్తావించారు. ఎన్నికైన ప్రభుత్వ అధికారాన్ని కాదని ఎల్జీ జారీ చేసిన ఉత్తర్వులకు ఎలాంటి చట్టబద్ధత లేదని అందులో పేర్కొన్నారు. ట్రాన్సాక్షన్ ఆఫ్ బిజినెస్ రూల్స్‌కు వెంటనే ఖరారు చేయాలని కోరారు. అధికారులను ఏకపక్షంగా బదిలీ చేయడంపై సమీక్ష చేపట్టాలని ఎల్జీకి రాసిన లేఖలో సీఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. సీఎం అనుమతి లేకుండా అఖిల భారత సర్వీసేతర అధికారులను బదిలీ చేయవద్దని చీఫ్ సెక్రటరీని కోరారు. ఈ అంశంపై చర్చించేందుకు శుక్రవారం డిప్యూటీ సీఎం సురీందర్ చౌదరి నివాసంలో జరిగిన అత్యవసర భేటీలో సీఎం ఒమర్‌తోపాటు ఎన్సీ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా పాల్గొన్నారు. హోం మంత్రి అమిత్ షా పర్యటన వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. 'ఇప్పటికే అనేకసార్లు చెప్పాం. ఇదే చిట్టచివరి విజ్ఞప్తి. ఇక మా సహనాన్ని పరీక్షించొద్దు' అని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ)ప్రతినిధి, ఎమ్మెల్యే జడిబల్ తన్వీర్ సాదిఖ్ అనంతరం మీడియా ఎదుట వ్యా ఖ్యానించారు. తమ సహకార వైఖరిని, మా నాన్ని బలహీనతగా భావించరాదని పేర్కొ న్నారు. ఈ సమావేశంలో వక్ఫ్ బిల్లును పార్లమెంట్ ఆమోదించడాన్ని ఖండిస్తూ తీర్మానించిందని, అదేవిధంగా, ప్రజలిచ్చిన తీర్పును గౌరవించాలంటూ ఎల్జీకి హితవు పలుకుతూ మరో తీర్మానం చేసిందని ఆయన తెలిపారు.

పరిధిని అతిక్రమించలేదు: ఎల్జీ

అధికార పార్టీ ఎమ్మెల్యేల అత్యవసర సమావేశం చేసిన తీర్మానంపై ఎల్జీ సిన్హా దీటుగా స్పందించారు. 'జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని 2019లో పార్లమెంట్ ఆమోదించింది. ఈ చట్టం పరిధిని అతిక్రమించి నేను ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విషయాన్ని స్పష్టం చేయదల్చుకున్నా. నా పరిధి, నా పరిమితులు నాకు బాగా తెలుసు. అంతకుమించి ఎన్నడూ ఏమీ చేయలేదు' అని న్యూస్18కిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు.

ఫుడ్ డెలివరీలకే పరిమితమవుతారా?

స్టార్టప్‌లపై కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: చైనాలో స్టార్టప్‌లు ఈవీలు, బ్యాటరీ టెక్, సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ దిశగా ముందుకు దూసుకెళ్తుండగా మన స్టార్టప్‌లు అత్యధికం ఫుడ్ డెలివరీపైనే దృష్టి పెట్టాయని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ తెలిపారు. ఇలా మనం ఫుడ్ డెలివరీ, బెట్టింగ్, ఫాంటసీ స్పోర్ట్స్ యాప్‌ల రూపకల్పన.. ఐస్‌క్రీంలు, చిప్‌ల విక్రయాలకే పరిమితమవుదామా అంటూ ఆయన ప్రశ్నించారు. గురువారం ఇక్కడ జరిగిన స్టార్టప్ మహా కుంభ్ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. సాంకేతికపరమైన పురోగతిని సాధించేందుకు కృషి చేయడం మాని తక్కువ వేతనాలిచ్చే గిగ్ ఉద్యోగాలతోనే సరిపెట్టుకుంటున్నారన్నారు. దేశంలో సుమారు 1.57 లక్షల స్టార్టప్‌లున్నట్లు కేంద్రం చెబుతోంది. ఈ లెక్కన స్టార్టప్‌ల విషయంలో ప్రపంచంలోనే భారత్ మూడో స్థానంలో నిలిచింది.

రష్యా క్షిపణి దాడి... 14 మంది మృతి

కీవ్: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత క్రివీ రిహ్ నగరంపై రష్యా శుక్రవారం బాలిస్టిక్ క్షిపణి దాడికి పాల్పడింది. నివాస ప్రాంతంపై జరిగిన ఈ దాడిలో ఐదుగురు చిన్నారులు సహా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మందికిపైగా క్షతగాత్రులయ్యారు. నివాస సముదాయం దెబ్బతిని మంటలు చెలరేగాయని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందన్నారు. గత వారం కూడా ఈ నగరంపై రష్యా దాడి చేయగా నలుగురు చనిపోయారు. తాజా దాడి, 2022లో రష్యా దురాక్రమణ మొదలుపెట్టిన అనంతరం చేసిన భీకర దాడిగా పేర్కొంటున్నారు. కాగా, యూరప్‌లోనే అత్యంత పొడవైన నగరంగా క్రివీరిహ్‌కు పేరుంది. సుమారు 6 లక్షల జనాభా కలిగిన ఈ నగరం ప్రస్తుతం భీకర యుద్ధం సాగుతున్న ప్రాంతానికి 40 మైళ్ల దూరంలో ఉంది.

మొదటి బౌద్ధ సంగీతి ఎవరి కాలంలో జరిగింది?

అహింసా సిద్ధాంతం బౌద్ధ మతం నుంచి ఆవిర్భవించిందే. తర్వాతి కాలంలో దీన్ని గాంధీ మహాత్ముడు అనుసరించారు. బుద్ధ విగ్రహాలు గాంధార శిల్ప కళారీతిలో ఉంటాయి. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా మానవ విగ్రహాల పూజ బౌద్ధ మతంలోనే ప్రారంభమైంది. స్థానిక భాషలకు ఈ మతం బాగా ప్రోత్సాహాన్ని అందించింది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

ప్రాచీన భారతదేశ చరిత్ర

వేదకాల నాగరికత (క్రీ.పూ. 2000-1500)

ఆర్యులు ఆసియా మైనర్, మెసపటోమియా మీదుగా పర్షియాలోకి ప్రవేశించారు. ఆ తర్వాత బాక్ట్రియా, హిందూకుష్ పర్వత శ్రేణుల మీదుగా భారతదేశంలోకి వచ్చారు. పంజాబ్ ప్రాంతంలోని సప్తసింధు లోయను మొదటి స్థావరంగా చేసుకుని స్థిరపడ్డారు.

తొలివేద కాలం (క్రీ.పూ. 1500-1000)

ఈ కాలంలో ఆర్యులు సప్తసింధు ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యారు. ఈ కాలం గురించి తెలుసుకోవడానికి రుగ్వేదం ఒక్కటే ప్రధాన ఆధారంగా ఉంది.

ఆర్యులు భారతదేశంలో స్థిరపడ్డ తర్వాత రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలు రాశారు. వేదాలన్నింటిలో రుగ్వేదం ప్రాచీనమైంది. ఇందులో పది మండలాలున్నాయి. యజుర్వేదం క్రతువుల నిర్వహణకు ఆధార గ్రంథం. సామవేదం సంగీతానికి మూలం. అధర్వణ వేదం మంత్రతంత్రాలకు సంబంధించింది.

ఈ కాలంలో రాజ్యానికి రాజే అధిపతి. రాజరికం వంశపారంపర్యం. ప్రజల రక్షణ బాధ్యత రాజు చూసేవాడు. దీనికిగాను ప్రజలు రాజుకు గోవులను కానుకగా ఇచ్చేవారు. ఈ విధానాన్ని 'బలి' అని పిలిచేవారు. పాలనా వ్యవహారాల్లో 'సమితి', 'సభ' అనే సంస్థలు రాజుకు సాయపడేవి. సమాజంలో స్త్రీకి గౌరవప్రదమైన స్థానం ఉండేది. 'సమితి', 'సభ' సమావేశాల్లో మహిళలు సైతం పాల్గొనేవారు. వితంతు పునర్వివాహాలు జరిగేవి. సతీసహగమనం, పరదా పద్ధతి వీరికి తెలియదు. రుగ్వేదకాలంనాటి ఆర్యులకు పశుపోషణ, వ్యవసాయం ప్రధాన వృత్తులు. పశువులను.. ముఖ్యంగా ఆవులను ప్రాణప్రదంగా భావించేవారు. వీటిని వర్తకంలో మారకంగా ఉపయోగించేవారు. ఆర్యులు ప్రకృతి శక్తులను పూజించారు. ద్యుస్ (ఆకాశం), ఇంద్ర, వరుణ, వాయు, అగ్ని, సోమ తదితర పురుష దైవాలతో పాటు అతిథి, ఉషస్సు లాంటి స్త్రీ మూర్తులను కూడా ఆరాధించేవారు. ఇంద్రుడు వీరి ప్రధాన దైవం.

మలివేదకాల ఆర్య నాగరికత (క్రీ.పూ.1000-600)

ఈ కాలంలో ఆర్యులు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తర బిహార్ ప్రాంతాలకు విస్తరించారు. వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా స్వీకరించిన జాతులన్నీ స్థిర నివాసం ఏర్పరచుకున్నాయి. క్రమంగా ఆధిపత్యం కోసం తెగల మధ్య యుద్ధాలు ప్రారంభమయ్యాయి. విజయం సాధించిన తెగ నాయకుడు విశాల భూభాగానికి అధినేతగా మారాడు. అతడు సామ్రాట్ తదితర బిరుదులను వహించడం ఆరంభమైంది. అశ్వమేధ, రాజసూయ, బలి కర్మకాండలు ప్రారంభమయ్యాయి. సామ్రాజ్యాల విస్తరణ పెరిగింది. రాజు దైవాంశ సంభూతుడుగా మారాడు.

రుగ్వేదంలోని పురుష సూక్తం ఆధారంగా మలివేద కాలంలో వర్ణవ్యవస్థ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాలుగా సమాజ విభజన జరిగింది. క్రమంగా వృత్తులు వంశపారంపర్యమయ్యాయి. ఈ యుగంలో స్త్రీ అంతకుముందున్న సామాజిక స్థాయిని కోల్పోయింది. సతీ సహగమన పద్ధతి మొదలైంది. వివాహ నిబంధనలు కఠినమయ్యాయి.

కొత్తగా భూములు సాగులోకి రావడంతో వ్యవసాయాభివృద్ధి అధికమైంది. వర్తకం, వాణిజ్యం, పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో పట్టణాలు ఏర్పడ్డాయి. తక్షశిల, హస్తినాపురం, కౌశాంబి, కాంపల్య, వైశాలి, శ్రావస్తి, వారణాసి మొదలైనవి నాటి ప్రసిద్ధ నగరాలు. వస్తుమార్పిడి స్థానంలో 'నిష్క', 'శతమాన', 'కర్షాపణం' అనే నాణేలు ప్రవేశించాయి. బంగారం, వెండి, రాగితో ఈ నాణేలను తయారు చేసేవారు. సృష్టికర్తగా 'ప్రజాపతి' ఈ యుగ ప్రధాన ఆరాధ్య దైవం. అగ్ని, ఇంద్రుడు లాంటి దైవాలకు ప్రాధాన్యం తగ్గి త్రిమూర్తుల (విష్ణు, బ్రహ్మ, శివుడు) ఆరాధన పెరిగింది.

రుగ్వేద సంహిత: ఇందులో 1028 శ్లోకాలున్నాయి. ఇది పురాతనమైంది. అగ్ని, ఇంద్రుడు, వరుణుడు లాంటి అనేక దేవతల స్తోత్ర పాఠాలు ఈ సంహితంలో ఉన్నాయి. ఇందులో ఇంద్రుడి గురించి ఎక్కువ శ్లోకాలు ఉన్నాయి.

సామవేద సంహిత: సోమ యజ్ఞాలు చేసేప్పుడు సంగీత బద్ధంగా శ్లోకాలను ఎలా ఆలపించాలో సామవేద సంహిత తెలుపుతుంది. భారతీయ సంగీత మూలాలు సామవేదంలో కనిపిస్తాయి.

యజుర్వేద సంహిత: ఇందులో యజ్ఞ సమయంలో అనుసరించాల్సిన నియమ నిబంధనలు, పఠించే మంత్రాల గురించి ఉన్నాయి.

అధర్వణ వేద సంహిత: రోగాలు, దుష్టశక్తులను పారదోలడానికి అవసరమైన మంత్రాలు, తంత్రాలు ఇందులో ఉన్నాయి. ఆర్యేతరుల విశ్వాసాల గురించి ఇది కొంతవరకు తెలుపుతుంది.

బ్రాహ్మణాలు: ఇవి వేదాల తర్వాత వచ్చాయి. కర్మకాండల విధానాన్ని వివరిస్తాయి. వీటిలో ప్రధానంగా యజ్ఞాలు, బలులకు సంబంధించిన విధివిధానాలు ఉన్నాయి.

అరణ్యకాలు: ఇవి తాత్విక చింతనకు చెందిన అంశాలతో కూడి ఉన్నాయి.

ఉపనిషత్తులు: ఉపనిషత్తులు తాత్విక గ్రంథాలు. వీటిలో ఆత్మ, అంతరాత్మ, ప్రకృతి రహస్యాల గురించి ఉన్నాయి. ఉపనిషత్తులు కర్మకాండలను నిరసించాయి. ఇవి సరైన జ్ఞానం, సన్మార్గానికి ప్రాముఖ్యం ఇస్తాయి.

సామాజిక మార్పులు (క్రీ.పూ. 600-300)

ఈ కాలంలో అనేక మత ఉద్యమాలు ఆవిర్భవించాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయ మార్పులు అధికంగా జరిగాయి. 16 జనపదాలు, పట్టణాలు ఏర్పడ్డాయి. దీన్ని రెండో పట్టణీకరణ కాలంగా పేర్కొంటారు. ఇనుముతో రూపొందించిన పరికరాల వాడకం వల్ల వ్యవసాయంలో అధిక వృద్ధి సాధ్యమైంది.

ఈ కాలంలో చాతుర్ వర్ణ వ్యవస్థ బలపడింది. ద్విజులుగా పేర్కొనే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులకు.. ద్విజులు కాని శూద్రులకు మధ్య సాంఘిక వ్యత్యాసం ఎక్కువైంది. బ్రాహ్మణాధిపత్యం వైశ్యులకు, క్షత్రియులకు నచ్చలేదు. అస్పృశ్యులను ఒక ప్రత్యేక వర్గంగా చూడటం ఈ కాలంలోనే ప్రారంభమైంది. వ్యవసాయ రంగంలోని మిగులుతో రాజులు సైన్యాన్ని నిర్మించారు. రాజులు పన్ను వసూలు చేసేవారు. న్యాయ వ్యవస్థకు పునాది పడింది. జీవహింసకు వ్యతిరేకమైన బౌద్ధ, జైన మతాలు వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడ్డాయి.

బౌద్ధమతం (క్రీ.పూ. 563-483)

బౌద్ధమత స్థాపకుడు సిద్ధార్థుడు (గౌతముడు). ఈయన క్షత్రియ వంశానికి చెందినవారు.



క్రీ.పూ. 563లో శాక్యరాజ్యాధిపతి శుద్ధోదనుడు, మాయాదేవికి రాజధాని 'కపిలవస్తు' సమీపంలోని 'లుంబినీ వనం'లో జన్మించారు. గౌతముని భార్య పేరు 'యశోధర', కుమారుని పేరు 'రాహులుడు'. కపిలవస్తు నగరంలో కనిపించిన వృద్ధుడు, వ్యాధిగ్రస్తుడు, శవం, సన్యాసి దృశ్యాలు ఆయన్ని కదల్చివేశాయి. దీంతో భవబంధాల నుంచి బయటపడ్డారు. దీన్నే 'మహాభినిష్క్రమణం' అంటారు. గయ సమీపంలో బోధి వృక్షం కింద నలభై రోజుల తపస్సు తర్వాత 'సంబోధి'ని పొంది 'బుద్ధుడై' పరిపూర్ణ జ్ఞానంతో ఉద్దీప్తుడయ్యాడు. మొదటగా సారనాథ్‌లోని 'మృగదావనం'లో అయిదుగురు శిష్యులకు జ్ఞానబోధ చేశాడు. ఈ ప్రబోధాన్ని 'ధర్మచక్ర ప్రవర్తనం' అంటారు. బుద్ధుడు తన 80వ ఏట క్రీ.పూ.483లో మహాపరి నిర్యాణం పొందారు. బుద్ధుడి శిష్యుడు ఆనందుడు.

ఆర్య సత్యాలు

1) ప్రపంచం దుఃఖమయం.
2) దుఃఖాలకు కోర్కెలే కారణం.
3) కోర్కెలను నిరోధిస్తే దుఃఖం అంతమవుతుంది.
4) దుఃఖాన్ని అంతమొందించడానికి మార్గం ఉంది.

అజ్ఞానమే దుఃఖానికి కారణమని పేర్కొని, దీన్ని తొలగించడానికి 'అష్టాంగమార్గం' రూపొందించాడు. అవి.. సరైన వాక్కు, క్రియ, జీవనం, శ్రమ, ఆలోచన, ధ్యానం, నిశ్చయం, దృష్టి. పునర్జన్మ రహితమైన మోక్షమే నిర్యాణం అని చెప్పారు. బౌద్ధమతం హేతుబద్ధమైంది. బుద్ధుడు ఆత్మ, భగవంతుడి ఉనికిని గుర్తించలేదు. వైదిక కర్మకాండలను, వేదాలను నిరసించారు.

మొదటి 'బౌద్ధ సంగీతి' రాజగృహంలో అజాత శత్రువు పాలనా కాలంలో జరిగింది. దీని అధ్యక్షుడు మహాకాశ్యప. ఈ సంగీతిలో 'వినయ', 'సుత్త' అనే పిటికల (నియమావళి గ్రంథాలు)ను సంకలనం చేశారు. రెండో సంగీతి 'వైశాలి'లో జరిగింది. ఈ సంగీతిలో బౌద్ధసంఘం 'థెరవాదులు', 'మహాసాంఘికులు' అనే రెండు వర్గాలుగా చీలిపోయింది. మూడో సంగీతి అశోకుడి కాలంలో పాటలీపుత్రంలో జరిగింది. ఈ సంగీతిలో అభిదమ్మ పిటకాన్ని రచించారు. నాలుగో సంగీతి కనిష్కుడి పాలనా కాలంలో వసుమిత్రుడి అధ్యక్షతన జరిగింది. సాంచి, బార్హుత్, అమరావతి ఈ కాలంనాటి శిల్పకళకు ప్రతీకలైన స్తూపాలు. చైత్య గృహాల నిర్మాణానికి అజంతా, ఎల్లోరా ఉదాహరణలు. బుద్ధుని సందేశాన్ని భిక్షకులు విదేశీయులకు అందించారు. బౌద్ధ మతం ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చెందింది. చైనా, జపాన్, శ్రీలంక, బర్మా మొదలైన తూర్పు, ఆగ్నేయాసియా దేశాల్లో బౌద్ధ మతం విస్తరించింది. కాశ్మీర్‌లో జరిగిన నాలుగో బౌద్ధ సంగీతిలో బౌద్ధమతం మహాయాన, హీనాయాన శాఖలుగా చీలిపోయింది.

మహాయానం: ఈ శాఖకు చెందినవారు బుద్ధ విగ్రహాలను ఆరాధించేవారు. బుద్ధుడు, బోధిసత్వుల ద్వారా మానవులు మోక్షం పొందొచ్చని భావించారు. ఈ శాఖ ఇండియా, చైనా, జపాన్‌లో బాగా ప్రాచుర్యం పొందింది. నాగార్జునుడు మాధ్యమిక చింతనను ప్రవేశపెట్టాడు. ప్రపంచమంతా మిథ్య, భ్రమ అని నాగార్జునుడి వాదన.

హీనాయానం: బర్మా, థాయిలాండ్, కాంబోడియాలో ఈ శాఖ బాగా వ్యాపించింది. బుద్ధుడి ప్రవచనాలను మాత్రమే తీసుకుని ధ్యానం ద్వారా మోక్షం పొందొచ్చని వీరు భావించారు. విగ్రహారాధనకు వీరు వ్యతిరేకం. పాళీ భాషలో సుత్త, వినయ, అభిదమ్మగా పేర్కొనే త్రిపిటకాలను వీరు రచించారు. క్రీ.శ 8వ శతాబ్దంలో వజ్రాయానం అనే కొత్త శాఖ వెలిసింది.

స్తూపాలు: బుద్ధుడు లేదా ఇతర ప్రముఖ సన్యాసుల అవశేషాలను నిక్షిప్తం చేసి నిర్మించారు. వీటినే స్తూపాలు అంటారు.

చైత్యం: ఇందులో ప్రధానంగా ప్రార్థనాలయం ఉంటుంది.

ప్రధాన బౌద్ధ గుహాలయాలు, చైత్యాలయాలు:

1) కార్లే 2) నాసిక్
3) భాజ 4) బార్హుత్
5) సాంచి 6) అమరావతి
7) నాగార్జున కొండ 8) భట్టిప్రోలు

విహారం: బౌద్ధ సన్యాసులు నివసించే ప్రాంతమైన అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ ఆసియాలో అతిపెద్ద బౌద్ధ విహార కేంద్రం.

వేదాలు

1) రుగ్వేదం 2) యజుర్వేదం
3) సామవేదం 4) అధర్వణ వేదం

ఉపవేదాలు

1) ధనుర్వేదం 2) ఆయుర్వేదం
3) శిల్పవేదం 4) గాంధార వేదం

వేదాంగాలు

1) శిక్ష 2) కల్పం 3) జ్యోతిషం
4) వ్యాకరణం 5) నిరుక్తం 6) చంధస్సు

దర్శనాలు - అందులో ప్రసిద్ధులు

1) సంఖ్య - కపిలుడు
2) వైశేషికం - కణాదుడు
3) న్యాయం - గౌతముడు
4) యోగ - పతంజలి
5) మీమాంస - జెమిని
6) ఉత్తర మీమాంస - బాదరాయణుడు

బుద్ధుడికి సంబంధించిన అంశాలు

తండ్రి	శుద్ధోదనుడు
తల్లి	మాయాదేవి
సవతి తల్లి	గౌతమి
బంధువు	దేవదత్త
భార్య	యశోధర
కుమారుడు	రాహుల్
రథ చోదకుడు	చెన్నుడు
గుర్రం	కంధక
గురువు	అలారకలామ
బుద్ధగయలో పరిచర్యలు చేసినది	సుజాత

మహా జనపదాలు - పట్టణాలు

1) మగధ- పాటలీపుత్రం
2) కాశీ-వారణాసి 3) అంగ - చంపా
4) చేది - భుక్తిమతి 5) కోసల-అయోధ్య
6) కురు-ఇంద్రప్రస్థం 7) వత్స-కౌశాంబి
8) పాంచాల-అహిచ్ఛత్రము
9) మత్స్య-విరాటనగరం
10) అస్మక-పూతన్ 11) సూరసేన-మధుర
12) అవంతి-ఉజ్జయిని
13) కాంభోజ-రాజపురం
14) గాంధార-తక్షశిల 15) వజ్జి-విదేహ
16) మల్ల-కుశి

ఫొటోగ్రాఫిక్ ఫ్లాష్ బల్బుల్లో వాడే జడవాయువు?



మాదిరి ప్రశ్నలు

1. వాతావరణ అధ్యయనానికి ఉపయోగించే బెలూన్‌లలో వాడే జడవాయువు ఏది?
1) హీలియం 2) నియాన్
3) ఆక్సిజన్ 4) నైట్రోజన్
2. రేడియోధార్మిక జడవాయువు రేడాన్ రసాయనిక సంకేతం ఏది?
1) Ra 2) Rn 3) Re 4) Rd
3. క్యాన్సర్ చికిత్సకోసం ఉపయోగించే మలాము(ఆయింట్‌మెంట్)లో వాడేది?
1) అయోడిన్ 2) బ్రోమిన్
3) రేడాన్ 4) రేడియం
4. 'సూపర్ ఫ్లూయిడ్' అని దేనికి పేరు?
1) గాజు 2) ద్రవ అమ్మోనియా
3) ద్రవీకృత నైట్రోజన్
4) ద్రవీకృత హీలియం
5. కిందివాటిలో ఉత్కృష్ట వాయువులని దేనికి పేరు?
1) హీలియం 2) నియాన్
3) ఆర్గాన్ 4) అన్నీ
6. ఏక పరమాణుక వాయువు ఏది?
1) హైడ్రోజన్ 2) ఆక్సిజన్
3) నైట్రోజన్ 4) హీలియం
7. కిందివాటిలో సులభంగా సమ్మేళనాలను ఏర్పరచలేని మూలకం ఏది?
1) సల్ఫర్ 2) ఆక్సిజన్
3) నైట్రోజన్ 4) హీలియం
8. హీలియం మూలకం పేరు గ్రహించిన 'హీలియోస్' అనే పదానికి అర్థం?
1) జడత్వం 2) సూర్యుడు
3) ఉత్కృష్టమైన 4) చంద్రుడు
9. గాల్లోని జడవాయువుల్లో గరిష్ఠంగా ఉండేది?
1) హీలియం 2) నియాన్
3) ఆర్గాన్ 4) క్రిప్టాన్
10. ఉత్కృష్ట వాయు మిశ్రమం నుంచి జడ వాయువులను వేరుచేసే పద్ధతి?
1) దీవార్ 2) సోనార్
3) ఫిషర్ 4) రామ్సే
11. కింది వాటిలో వాసన ఉండే వాయువు?
1) ఆర్గాన్ 2) నైట్రోజన్
3) హైడ్రోజన్ 4) క్లోరిన్
12. విద్యుత్ బల్బుల్లో ఉండే వాయువు ఏది?
1) ఆక్సిజన్ 2) కార్బన్ డై ఆక్సైడ్
3) ఆర్గాన్ 4) నైట్రోజన్
13. ద్రవరూపంలో ఉన్నపుడు పాత్ర గోడలపైకి ఎగబాకే వాయువు ఏది?
1) హీలియం 2) నియాన్
3) నైట్రోజన్ 4) హైడ్రోజన్
14. సముద్రపు లోతుల్లోకి వెళ్లే ఈతగాళ్ల శ్వాస క్రియకు సహాయపడేందుకు ఆక్వాలంగ్ పరికరాలను వాడతారు. వీటిలో ఉండే వాయు మిశ్రమం ఏది?
1) 10% ఆక్సిజన్, 90% నైట్రోజన్
2) 20% ఆక్సిజన్, 80% నైట్రోజన్
3) 20% హీలియం, 80% ఆక్సిజన్
4) 20% ఆక్సిజన్, 80% హీలియం
15. సాధారణంగా బెలూన్‌లు, ఎయిర్‌షిప్ లలో వాడే వాయువు ఏది?
1) కార్బన్ డై ఆక్సైడ్ 2) హీలియం
3) హైడ్రోజన్ 4) నైట్రోజన్
16. సూర్యుడు, ఇతర నక్షత్రాల్లో శక్తి ఉత్పన్నమయ్యేందుకు కారణమయ్యే ప్రక్రియ?
1) హైడ్రోజన్ సంలీనం
2) రేడియం సంలీనం
3) హీలియం సంలీనం
4) నైట్రోజన్ సంలీనం
17. సూర్యుడిలో కేంద్రక సంలీనం చర్య జరిగి చివరగా ఏర్పడే మూలకం?
1) హైడ్రోజన్ 2) హీలియం
3) ఆక్సిజన్ 4) నైట్రోజన్
18. ఫొటోగ్రాఫిక్ ఫ్లాష్ బల్బుల్లో వాడే జడ వాయువు?
1) హీలియం 2) నియాన్
3) ఆర్గాన్ 4) క్జినాన్
19. బొగ్గుగని కార్మికుల టోపీలైట్లలో వాడే వాయువు?
1) క్రిప్టాన్ 2) హీలియం
3) నియాన్ 4) ఆక్సిజన్
20. మండే వాయువు(దహనశీలి) ఏది?
1) ఆక్సిజన్ 2) హైడ్రోజన్
3) 1, 2 4) నైట్రోజన్
21. కింది వాటిలో ఏ వాయువు దహన శీలి కాదు, కానీ దహన దోహదకారి?
1) ఆక్సిజన్ 2) హైడ్రోజన్
3) కార్బన్ మోనాక్సైడ్ 4) అన్నీ
22. దహనశీలి కాని వాయువు ఏది?
1) మీథేన్ 2) కార్బన్ మోనాక్సైడ్
3) కార్బన్ డైఆక్సైడ్ 4) హైడ్రోజన్
23. ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్లలో వాడే వాయువు?
1) మీథేన్ 2) ఆక్సిజన్
3) హీలియం 4) నైట్రోజన్
24. వాహనాల టైర్లలో నింపేందుకు ఎక్కువగా వాడుతున్న వాయువు ఏది?
1) ఆక్సిజన్ 2) నైట్రోజన్
3) హీలియం 4) నియాన్
25. జడ వాతావరణం కోసం వాడే వాయువు/లు ఏవి?
1) హీలియం 2) ఆక్సిజన్
3) నైట్రోజన్ 4) 1, 3
26. ఆక్సిజన్ ట్యూబ్‌ల్లో నైట్రోజన్ బదులుగా ఏ వాయువును కలపడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు?
1) హైడ్రోజన్ 2) ఆర్గాన్
3) క్రిప్టాన్ 4) హీలియం
27. వాణిజ్య ప్రకటనలకు వాడే నియాన్ ట్యూబ్‌లో నియాన్‌తోపాటు ఆర్గాన్, మెర్క్యురీ బాష్పాలను వినియోగిస్తే కనిపించే రంగు?
1) లేత నీలిరంగు 2) నారింజ
3) ముదురు ఎరుపు 4) బంగారు ఛాయ
28. బ్రౌన్ రంగు ట్యూబ్‌లో నియాన్, హీలియం వాయువుల మిశ్రమం తీసుకుంటే కనిపించే రంగు ఏది?
1) నీలిరంగు 2) బంగారు ఛాయ
3) తెలుపు 4) ఎరుపు
29. రంగులేని ఎలక్ట్రిక్ బల్బులో నియాన్ వాయువును నింపితే కనిపించే రంగు?
1) నారింజ ఎరుపు 2) నీలం
3) పసుపు 4) ఆకుపచ్చ
30. వాతావరణంలో ఏ వాయువు ఎక్కువ పరిమాణంలో ఉంటే గ్రీన్‌హౌస్ ప్రభావం కనిపిస్తుంది?
1) హీలియం 2) నైట్రోజన్
3) కార్బన్ డైఆక్సైడ్ 4) ఆక్సిజన్
31. ఉత్కృష్ట వాయువుల సంయోజకత?
1) సున్నా 2) ఒకటి
3) రెండు 4) మూడు
32. అతి తక్కువ చర్యాశీలత ఉన్న వాయువు?
1) ఆక్సిజన్ 2) హైడ్రోజన్
3) ఫ్లోరిన్ 4) హీలియం
33. ఫ్లోరైడ్ ఏ భాగాన్ని నష్టపరుస్తుంది?
1) దంతాలు 2) కళ్లు
3) నాలుక 4) చెవులు
34. ద్విపరమాణుక అణువు కానిది ఏది?
1) ఫ్లోరిన్ 2) క్లోరిన్
3) ఆక్సిజన్ 4) హీలియం
35. 'క్రయోజనిక్ ద్రవం' ఏది?
1) ద్రవ ఆక్సిజన్ 2) ద్రవ హైడ్రోజన్
3) నీరు 4) ద్రవ హీలియం
36. వాయు థర్మామీటర్‌లలో ఏ వాయువును ఉపయోగిస్తారు?
1) నియాన్ 2) హైడ్రోజన్
3) హీలియం 4) ఆక్సిజన్
37. హాలోజన్ విద్యుద్దీపాల్లో అయోడిన్ లేదా బ్రోమిన్ సమ్మేళనాలతో కలిపే జడవాయువు ఏది?
1) హీలియం 2) క్రిప్టాన్
3) క్జినాన్ 4) రేడాన్
38. బలమైన ఆమ్లం ఏది?
1) HF 2) HCl 3) HBr 4) HI
39. థైరాయిడ్ సమస్యతో సంబంధం ఉన్నది?
1) ఫ్లోరిన్ 2) అయోడిన్
3) క్లోరిన్ 4) బ్రోమిన్
40. సాధారణంగా మున్సిపాలిటీ సరఫరా చేసే నీరు, స్విమ్మింగ్‌పూల్ నీటిని క్రిమిరహితం చేయడానికి వాడే వాయువు?
1) ఫ్లోరిన్ 2) క్లోరిన్
3) బ్రోమిన్ 4) అయోడిన్
41. కృత్రిమ వర్షాలకోసం 'మేఘబీజనం'(క్లౌడ్ సీడింగ్)లో వాడే సమ్మేళనం?
1) సిల్వర్ క్లోరైడ్ 2) సిల్వర్ అయోడైడ్
3) సిల్వర్ ఫ్లోరైడ్ 4) సిల్వర్ బ్రోమైడ్
42. దంతక్షయాన్ని నివారించడానికి టూత్ పేస్టులలో కలిపే పదార్థం?
1) ఫ్లోరైడ్ 2) క్లోరైడ్
3) సోడియం 4) 2, 3
43. రిఫ్రిజిరేటర్లలో ఉపయోగించే సాధారణ రిఫ్రిజిరెంట్ ఏది? (S.I.2010)
1) నియాన్
2) ఫ్రియాన్ /అమ్మోనియా
3) స్పిరిట్ 4) ఏదీకాదు
44. అణు ఇంధనాన్ని శుద్ధి చేసేందుకు ఉపయోగించే సమ్మేళనం?
1) యురేనియం హెక్సాఫ్లోరైడ్
2) సోడియం ఫ్లోరైడ్
3) సోడియం క్లోరైడ్ 4) కాల్షియం ఫ్లోరైడ్
45. ఫొటోగ్రఫీలో వాడేది?
1) సోడియం బ్రోమైడ్ 2) సిల్వర్ బ్రోమైడ్
3) సోడియం క్లోరైడ్ 4) సిల్వర్ క్లోరైడ్
46. ఏ హాలోజన్ లోపిస్తే గాయిటర్ వ్యాధి వస్తుంది?
1) ఫ్లోరిన్ 2) అయోడిన్
3) బ్రోమిన్ 4) క్లోరిన్
47. జడవాయువులో జతకూడని ఎలక్ట్రాన్ల సంఖ్య?
1) 0 2) 1 3) 2 4) 3
48. హాలోజన్లలో జతకూడని ఎలక్ట్రాన్ల సంఖ్య?
1) 1 2) 0 3) 2 4) 4
49. కిందివాటిలో ఏది నిజం కాదు?
1) రేడియం క్షయం అయ్యే ప్రక్రియలో రేడాన్ లభిస్తుంది
2) జడవాయువుల్లో క్జినాన్ చర్యాశీలత ఎక్కువ
3) వాతావరణంలో పుష్కలంగా లభించే వాయువు హీలియం
4) అత్యంత తేలికైన జడవాయువు హీలియం
50. ఆస్తమా వ్యాధిగ్రస్తుల ప్రాణం నిలపడానికి అందించే వాయు మిశ్రమం?
1) 4 :1 నిష్పత్తిలో ఆక్సిజన్, హీలియం
2) 4 :1 నిష్పత్తిలో హీలియం, ఆక్సిజన్
3) 4 :1 నిష్పత్తిలో నియాన్, ఆక్సిజన్
4) 4 :1 నిష్పత్తిలో ఆక్సిజన్, నియాన్
51. జడవాయువును మొట్టమొదటగా కనుగొన్న శాస్త్రవేత్త ?
1) కావెండిష్ 2) విలియం రామ్‌సే
3) రేలీ 4) ఫ్రాంక్‌లాండ్
52. కింది వాటిలో మంద వాయువు? (S.I.2010)
1) హీలియం 2) హైడ్రోజన్
3) క్లోరిన్ 4) నైట్రోజన్ ఆవర్తన
53. వాతావరణంలో ఉండని జడవాయువు?
1) హీలియం 2) నియాన్
3) ఆర్గాన్ 4) రేడాన్
54. బాహ్యకక్ష్యలో అష్టక ఎలక్ట్రాన్‌లు లేని జడ వాయువు?
1) నియాన్ 2) రేడాన్
3) హీలియం 4) ఆర్గాన్
55. సముద్ర మొక్కల్లో ఉండేది?
1) అయోడిన్ 2) క్లోరిన్
3) క్లోరిన్ 4) సల్ఫర్
56. హైడ్రోఫ్లోరికామ్లం(HF)ను దేనిలో నిల్వ చేయలేం?
1) ఇనుప సీసా 2) ప్లాస్టిక్ సీసా
3) గాజు సీసా 4) తగరపు సీసా
57. యాంటిసెప్టిక్ ధర్మం ఉన్న వాయువు?
1) ఫ్లోరిన్ 2) అయోడిన్
3) క్లోరిన్ 4) బ్రోమిన్

సమాధానాలు

1) 1	2) 2	3) 3	4) 4	5) 4
6) 1	7) 4	8) 2	9) 3	10) 1
11) 4	12) 3	13) 1	14) 4	15) 2
16) 1	17) 2	18) 4	19) 1	20) 2
21) 1	22) 3	23) 3	24) 2	25) 4
26) 4	27) 1	28) 2	29) 1	30) 3
31) 1	32) 4	33) 1	34) 4	35) 4
36) 3	37) 2	38) 4	39) 2	40) 2
41) 2	42) 1	43) 2	44) 1	45) 2
46) 2	47) 1	48) 1	49) 3	50) 2
51) 2	52) 1	53) 4	54) 3	55) 1
56) 3	57) 2			

విద్య, ఉద్యోగ సమాచారం

సీ-డాట్‌లో 29 టెక్నీషియన్ పోస్టులు

సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలీమాటిక్స్(సీ-డాట్)లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 29.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీజీపీఏ/ఓజీపీఏ డిగ్రీలో ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 25.04.2025 నాటికి 25 ఏళ్లు నిండి ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.25,500 నుంచి రూ.81,100.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.04.2025.
- **వెబ్‌సైట్:** https://www.cdot.in

ఐఆర్‌సీటీసీ సౌత్‌జోన్‌లో 25 అప్రెంటిస్‌లు

ఐఆర్‌సీటీసీ సౌత్‌జోన్‌లో వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 25.
- **ఖాళీల వివరాలు:** కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్-05, ఎగ్జిక్యూటివ్ ప్రొక్యూర్‌మెంట్-10, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ అండ్ ఎంప్లాయ్ డేటా మేనేజర్-02, ఎగ్జిక్యూటివ్ హెచ్‌ఆర్-01, సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్-01, మార్కెటింగ్ అసోసియేట్ ట్రెనింగ్-04, ఐటీ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్-02.
- **అర్హత:** 50 శాతం మార్కులతో మెట్రిక్యులేషన్, ఐటీఐ, సీఏ, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వేతనం:** టెక్నీషియన్ అప్రెంటిస్, డిప్లొమా అభ్యర్థులకు నెలకు రూ.8000, అప్రెంటిస్ లేదా డిగ్రీ అభ్యర్థులకు నెలకు రూ.9000.
- **వయసు:**15నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు,సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** అప్రెంటిస్‌షిప్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **పనిచేయాల్సిన ప్రదేశాలు:** తమిళనాడు, కేరళ, కర్ణాటక.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.04.2025
- **వెబ్‌సైట్:** https://www.irctc.com

దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద బౌద్ధస్థూపం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

ఇక్ష్వాకులు

బౌద్ధ శిల్పకళ

ఇక్ష్వాకులు బౌద్ధమతాన్ని విశేషంగా ఆదరించారు. వీరపురుషదత్తుడి పరిపాలనా కాలాన్ని బౌద్ధ మతానికి స్వర్ణయుగంగా పేర్కొనవచ్చు. నాగార్జున కొండ మహాయానానికి కేంద్ర స్థానంగా విలసిల్లింది. ఇక్ష్వాకులు ఈ ప్రాంతంలో 20 స్తూపాలు, విహారాలను నిర్మించారు. నాగార్జునకొండలో అపరశైలి వ్యాప్తి చెందింది.

శైలి		ప్రసిద్ధ కేంద్రం
అపరశైలి	-	నాగార్జునకొండ
పూర్వశైలి	-	అమరావతి
రాజగిరిక	-	గుంటుపల్లి
ఉత్తరశైలి	-	జగ్గయ్యపేట
సిద్ధార్థక శైలి	-	గుడివాడ
బహుశృతి శైలి	-	చేజెర్ల
మహావినయ శైలి	-	భట్టిప్రోలు
మహాశాసక శైలి	-	ఫణిగిరి

శాంతమూలుడి సోదరి శాంతసిరి. ఈమె నాగార్జునకొండలో మహాచైత్యం, పారావత మహా చైత్యాలను నిర్మించింది. వీరపురుషదత్తుడి ఆరో రాజ్యకాలంలో బౌద్ధ ఆచార్యుడైన భవంత ఆనందుడు ఈ చైత్యానికి మరమ్మతులు చేయించాడు. ఈ సమయంలోనే శాంతసిరి ఒక స్తంభాన్ని ప్రతిష్ఠించి 170 దీనారమాషకాలను దానం చేసింది. బోధిశర్మ మేనకోడలైన ఉపాసిక బోధిశ్రీ బౌద్ధమతాభిమాని. ఈమె మహాదమ్మగిరి వద్ద విహారాన్ని, పారావత విహారం ఎదురుగా శిలా మండపాన్ని నిర్మించింది. పూర్వశైలిలో ఒక తటాకాన్ని తవ్వించింది.

హిందూ దేవాలయాలు

దేశంలో తొలిసారిగా ఇక్ష్వాకుల కాలంలోనే దేవాలయాల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. దేవాలయ నిర్మాణాల్లో రాజులే కాకుండా స్త్రీలు కూడా పాల్గొనేవారు. రాతవశ్య అనే మహిళ అంతఃపుర స్త్రీలతో కలిసి నోదగిరిపై నోదగిరేశ్వరాలయాన్ని నిర్మించింది. ఏహబల శాంతమూలుడి కాలంలో అష్టభుజనారాయణ దేవాలయాన్ని నిర్మించారు.



తొలి వైష్ణవాలయంగా దీన్ని పేర్కొనవచ్చు. ఈ దేవాలయాన్ని శకసేనుడు నిర్మించాడు. ఇతడు అభీరవసుసేనుడి సేనాధిపతి.

నెమలిపురి వద్ద పంచవీరుల రాతిఫలకం లభించింది. ఈ ఫలకం మధ్యలో విష్ణువును నరసింహుని రూపంలో చిత్రీకరించారు. ఈ శిల్పాన్ని హైదరాబాద్‌లోని స్టేట్ ఆర్కియాలజీ మ్యూజియంలో భద్రపరిచారు. ఇక్ష్వాకుల కాలంలోనే గజపృష్ఠ ఆకారంలో పుష్పభద్రస్వామి ఆలయాన్ని నిర్మించారు. కుమారస్వామి సర్వదేవాదివాసాన్ని ఎలిసిరి నిర్మించాడు. ఇతడు ఏహబల శాంతమూలుడి సేనాధిపతి.

ఇక్ష్వాకుల కాలంలో మాతృదేవతారాధన ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. వీరు హారతి దేవాలయాన్ని నిర్మించి, సప్తమాతృకలను చెక్కించారు. సంతానం కోసం సప్తమాతృకలను పూజించేవారు. ఇక్ష్వాకులు వాస్తు శాస్త్ర ప్రకారం దేవాలయంలో హంగులు కల్పించినట్లు తెలుస్తోంది. గోపురం, ద్వారం, ధ్వజస్తంభం, ప్రాకారం, గర్భగుడి లాంటి వాటిని క్రమానుసారంగా నిర్మించి దేవాలయానికి పూర్ణ స్వరూపాన్ని కల్పించింది వీరే.

శిల్పకళ

1. ఆకుపచ్చని రాతితో శిల్పాలు చెక్కించడం వీరి ప్రత్యేకత.
2. **హారితీ దేవాలయం:** చిన్నపిల్లల ఆరాధ్యదేవత
3. **సప్తమాతృకా దేవాలయం:** నాగార్జునకొండలో ప్రత్యేకతను పొందింది. సంతానం లేనివారు ఇక్కడ పూజలు చేసేవారు.
4. అద్భుత విగ్రహాలు చెక్కించారు. వీటిలో సింథియన్ అనే గ్రీకు సైనికుడి విగ్రహం ప్రముఖమైంది.

ముఖ్యాంశాలు

స్థాపకుడు: శ్రీశాంతమూలుడు
రాజధాని: విజయపురి, **రాజభాష:** ప్రాకృతం
రాజచిహ్నం: సింహం
రాజలాంఛనం: హారతిపుత్రులు - శ్రీపర్వతీయులు (ఆంధ్రభృత్యులుగా ప్రసిద్ధి)

వంశం, జన్మస్థలం - సిద్ధాంతాలు

రాప్సన్ - బూలర్: అయోధ్యను పాలించిన ఇక్ష్వాకుల వంశానికి చెందిన వారని అభిప్రాయపడ్డారు.
వోగెల్: కర్ణాటక ప్రాంతం నుంచి వలస వచ్చి సైన్యంలో చేరారు.
గోపాలాచారి: ఇక్ష్వాకులు తమిళనాడు ప్రాంతం వారని పేర్కొన్నారు.
కాల్డ్‌వెల్: ఆంధ్ర ప్రాంతం (కృష్ణానది తీరం) వారని తెలిపారు.

మాదిరి ప్రశ్నలు

1. బుద్ధుణ్ని కిరీటం లేని రాజుగా, దేవుడిగా చెక్కిన అద్భుత శిల్పం ఎక్కడుంది?
   1) నాగార్జునకొండ 2) జగ్గయ్యపేట
   3) ఏలేశ్వరం 4) ఫణిగిరి
2. దక్షిణాపథ సామ్రాట్ బిరుదు ఎవరికి ఉంది?
   1) ఏహబల శాంతమూలుడు
   2) శ్రీ శాంతమూలుడు
   3) వీరపురుషదత్తుడు
   4) రుద్ర పురుషదత్తుడు
3. తాము బుద్ధుడి వంశీయులమని, లుంబినీ ప్రాంతానికి చెందినవారమని ఇక్ష్వాకులు ఏ శాసనంలో పేర్కొన్నారు?
   1) నాగార్జునకొండ 2) విశవట్టి శాసనం
   3) ఉప్పుకొండూరు 4) అమరావతి
4. ఒకరాజు శివలింగాన్ని తన కాలితో తోసినట్లు ఉన్న శిల్పం ఎక్కడ ఉంది?
   1) అమరావతి 2) నాగార్జునకొండ
   3) ఫణిగిరి 4) నేలకొండపల్లి
5. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బౌద్ధస్థూపం ఎక్కడ ఉంది?
   1) నేలకొండపల్లి (ఖమ్మం)
   2) ఫణిగిరి (నల్గొండ)
   3) ధూళికట్ట (కరీంనగర్)
   4) ఏలేశ్వరం (నల్గొండ)
6. ఇక్ష్వాకుల స్త్రీలు బౌద్ధమతానికి సేవచేశారు. ఉపాసిక బోధిశ్రీ ఏడు విహారాలను ఏ ప్రాంతంలో నిర్మించారు?
   1) పుష్పగిరి 2) ఫణిగిరి
   3) నేలకొండపల్లి 4) పాపిల
7. దక్షిణ భారతదేశంలోని తొలి దేవాలయం?
   1) హారితీ దేవాలయం
   2) పుష్పభద్రస్వామి దేవాలయం
   3) అష్టభుజస్వామి దేవాలయం
   4) నవగ్రహ దేవాలయం
8. ఆనందుడు ఒక గొప్ప?
   1) తత్వవేత్త 2) సేనాని
   3) సామంతరాజు 4) గొప్పకవి


సమాధానాలు:
1) 2; 2) 2; 3) 1; 4) 2;
5) 1; 6) 4; 7) 3; 8) 2.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. ఇక్ష్వాకుల రాజధాని? (గ్రూప్-2, 2011)
   1) శ్రీకాకుళం 2) విజయపురి
   3) పితుండ 4) అమరావతి
2. ఇక్ష్వాకులు స్వతస్సిద్ధంగా తెలుగువారేనని వాదించినవారు? (గ్రూప్-2, 2011)
   1) కాల్డ్‌వెల్ 2) వి.ఎ.స్మిత్
   3) గోపాలాచారి 4) ఓల్డెన్‌బర్గ్
3. హారితీ వీరి కులదేవత? (గ్రూప్-2, 2012)
   1) శాతవాహనులు 2) ఇక్ష్వాకులు
   3) చాళుక్యులు 3) కాకతీయులు
4. నాగార్జున కొండలో విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేసిన రాజవంశం?
   1) శాతవాహనులు 2) ఇక్ష్వాకులు
   3) తూర్పు చాళుక్యులు 4) పల్లవులు
5. ఇక్ష్వాకుల కాలం నాటి అంశాల్లో అవాస్తవమైంది?
   1) వీరు శిల్పకళకు లేత ఆకుపచ్చ రాయిని ఉపయోగించారు.
   2) సమాజంలో భూస్వామ్య విధానం, దేవదాసి పద్ధతిని ప్రవేశపెట్టారు.
   3) మతంలో 'వీరకల్' సంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు.
   4) వీరికాలం బౌద్ధమతానికి స్వర్ణయుగం
6. ఇక్ష్వాకుల కాలంలో నివసించిన బౌద్ధమత ఆచార్యుడు ఎవరు?
   1) భావ వివేకుడు 2) ఆర్యదేవుడు
   3) కుమారులబట్టు 4) అసంగుడు

సమాధానాలు:
1) 2; 2) 1; 3) 2; 4) 2; 5) 2; 6) 1

The criminal was convicted by the judge.



BANK EXAMS

GENERAL ENGLISH

Choose the correct form of the verb (1-3)

1. My uncle ____ with us for last three years.
   1) stay 2) stayed 3) stays
   4) has been staying
2. He ____ tired because he ____ since morning.
   1) feel; work 2) feels; works
   3) felt; had been working
   4) felt; worked
3. She told me his name after he ____ the room.
   1) leave 2) left 3) leaves
   4) will leave

Fill in the blanks with appropriate preposition (4-6)

4. He aspires ____ the post of a professor.
   1) to 2) at 3) from 4) for
5. He was born ____ a family of clerks.
   1) on 2) in 3) into 4) with
6. You should generally pass ____ the fault of your friends.
   1) at 2) along 3) away 4) by

Fill in the blanks with an appropriate word from the four options given (7-10)

7. This is a ____ opportunity to enjoy the holiday of a lifetime in Goa.
   1) brisk 2) active 3) golden
   4) coarse
8. He doesn't know much about the subject, but he's very _____.
   1) vociferous 2) quiet
   3) enthusiastic 4) dull
9. _____ books I had kept for you were stolen.
   1) few 2) a few
   3) the few 4) an few
10. Officers responsible for an _____ coup were punished.
    1) mature 2) young
    3) successful 4) abortive

Fill in the blanks with suitable articles (11-13)

11. ____ Iron is ____ kind of material.
    1) The; a 2) A; a
    3) A; an 4) No article; a
12. I like using _____ knife and _____ fork while eating.
    1) A; a 2) A; an
    3) A; the 4) A; No article
13. We started late in ____ afternoon.
    1) a 2) an 3) the 4) No article

Choose the synonym of the underlined word in the sentence (14-15)

14. An ambiguous statement means
    1) Uninteresting and too lengthy
    2) Forceful and convincing
    3) Capable of being understood in more than one sense
    4) Based upon good judgment
15. Who would like such an impudent fellow?
    1) Civilized 2) Humble
    3) Respectful 4) Cheeky

Choose the antonym of the underlined word in the sentence (16-17)

16. The criminal was convicted by the judge.
    1) Offended 2) Criminal
    3) Condemned 4) Acquitted
17. His urbane attitude won him many friends.
    1) Indifferent 2) Violent
    3) Rustic 4) Rude
18. To read between the lines means
    1) Suspect 2) Read carefully
    3) Understand the hidden meaning
    4) To do useless things
19. Give a word that collocates with "Fixed"
    1) Court 2) Office
    3) Rate 4) Ward

Choose the meaning of the underlined word in the given context (20-21)

20. Irrigation canals provide arable lands.
    1) Abundant 2) Ploughable
    3) Suitable 4) Desert like
21. My husband bugs me ad infinitum.
    1) At home 2) At will
    3) Forever 4) Occasionally
22. A: Oh, I've just realized, I haven't got any money.
    B's response is __________
    1) Is it? 2) Was it?
    3) How come? 4) Haven't you?
23. A: It will stop raining soon.
    B: Then we'll go out.
    Combine the two sentences
    1) We shall be going out when it stops raining.
    2) We may go out when it stops raining.
    3) We'll go out when it stops raining.
    4) We will be going out as soon it stops raining soon.
24. A said: "Are you in a hurry?"
    B's response is __________
    1) Yes, I got plenty of time.
    2) No, I've got plenty of time
    3) Although I got plenty of time
    4) Nevertheless I may not come
25. The sentence which is incorrect from the following four options is:
    1) I wish you would listen to me
    2) I wish I would have more free time
    3) I wish the weather would change
    4) I wish you wouldn't complain all the time
26. They asked me some difficult questions at the interview. (Change into passive voice)
    1) I was asked some difficult questions at the interview.
    2) I was being asked some difficult questions at the interview.
    3) They were asked some difficult questions at the interview.
    4) I had been asked some difficult questions at the interview.
27. "Stay in the bed for a few days," the doctor said to me. (Write the reported speech)
    1) The doctor tells me to stay in bed for a few days.
    2) The doctor said to me to stay in bed for a few days.
    3) The doctor told me to stay in bed for a few days.
    4) The doctor asked to me to stay in bed for a few days.

Complete the sentence with an appropriate word.

28. ___ my parents are from London.
    1) Both 2) Neither
    3) Either 4) Either of
29. You have just been to a cinema. The film was extremely boring. What do you say to your friend in the above situation?
    1) That's the bore film I had ever seen.
    2) That's the most interesting film I've ever seen.
    3) That's the most boring film I've ever seen.
    4) That's the most boring film that I have seen.
30. A: I lost all my money and I also lost my passport.
    B: I lost all my money and I lost also my passport.
    Which option is correct?
    1) Only A 2) Only B
    3) Both A & B 4) Neither A nor B

Choose the wrongly spelt word from the options given below (31-32)

31. 1) Pronunciation 2) Precision
    3) Submission 4) Parsuasion
32. 1) Jovial 2) Comission
    3) Dictionary 4) Mansion

Identify the parts of speech of the underlined word (33-34)

33. We had our breakfast at a cafe near the rail station.
    1) Noun 2) Adjective
    3) Adverb 4) Verb
34. The weather was very cold.
    1) Noun 2) Adjective
    3) Adverb 4) Verb
35. The odd one out from the following:
    1) An army of ants
    2) A flight of birds
    3) A flock of fish
    4) A flock of sheep
36. Identify the complex sentence from the following options.
    1) Being an English teacher with a penchant for syntactical complexity, I love simple sentences.
    2) Being an English teacher with a penchant for syntactical complexity, I love to read simple sentences upon getting up and before going to bed.
    3) I can name several conjunctive adverbs; consequently, my friends are impressed.
    4) Because people know that I am an English teacher, they make allowances for how I dress and what I say.
37. The statue that is made of marble was bought from Jaipur. (Write the simple sentence)
    1) The marble statue was bought from Jaipur.
    2) The statue is made of marble and had been bought from Jaipur.
    3) The statue which is made in marble was bought from Jaipur.
    4) The statue of marble was being bought from Jaipur.
38. I have no money to lend you. (Convert into a complex sentence)
    1) I have no money in order I can lend you.
    2) I have no money that I can lend you.
    3) I have no money that to I can lend you.
    4) I have no money that I cannot lend you.
39. Very few boys in the class are as tall as John. (Write the comparative degree)
    1) John is taller than other boys in the class.
    2) John is taller than most boys in the class.
    3) John is taller than much other boys in the class.
    4) John is taller than most other boys in the class.
40. All the sentences mean the same except
    1) Madurai is the oldest town in Tamilnadu.
    2) Madurai is older than any other city in Tamilnadu
    3) Many other cities in Tamilnadu are as old as Madurai.
    4) No other city in Tamilnadu is older than Madurai.
41. The following sentence has the sentence structure
    The leaves turn yellow.
    1) S+V+C 2) S+V+O
    3) S+V+IO 4) S+V+DO

Choose the appropriate question tag (42-45)

42. It won't be hard to convince her.
    1) Won't it? 2) Will it?
    3) Is it? 4) Was it?
43. Seetha doesn't like him.
    1) Doesn't she? 2) Does seetha?
    3) Doesn't seetha? 4) Does she?
44. He plays pretty well.
    1) Is he? 2) Did he?
    3) Was he? 4) Doesn't he?
45. She is writing her homework.
    1) Is she? 2) Was she?
    3) Isn't she? 4) Does she?

Key:

1) 4	2) 3	3) 2	4) 4	5) 3
6) 4	7) 3	8) 3	9) 3	10) 4
11) 4	12) 4	13) 3	14) 3	15) 4
16) 4	17) 3	18) 3	19) 3	20) 2
21) 3	22) 4	23) 3	24) 2	25) 2
26) 1	27) 3	28) 1	29) 3	30) 1
31) 4	32) 2	33) 1	34) 2	35) 3
36) 3	37) 1	38) 2	39) 4	40) 3
41) 1	42) 2	43) 4	44) 4	45) 3

విద్య, ఉద్యోగ సమాచారం

హాల్, బెంగళూరులో వివిధ పోస్టులు

బెంగళూరులోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 09.
- » **పోస్టుల వివరాలు:** టెక్నీషియన్(మెకానికల్)-06, సివిల్-01, అకౌంట్స్-01, స్టోర్స్ క్లరికల్/కమర్షియల్ అసిస్టెంట్/అడ్మిన్ అసిస్టెంట్-01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా, బీకాం, బీఏ, బీఎస్సీ/బీబీఏ/బీసీఏ/బీఎస్‌డబ్ల్యూ ఉత్తీర్ణతతో పాటు టైపింగ్ స్కిల్స్ ఉండాలి.
- » **వయసు:** 01.03.2025 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సర్టిఫికేట్ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిప్యూటీ జనరల్ మేనేజర్, హెలీకాప్టర్ డివిజన్, హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, పోస్ట్ బాక్స్ నెం.1790, విమానపుర పోస్ట్, బెంగళూరు చిరునామకు స్పీడ్ పోస్ట్/రిజిస్టర్/కొరియర్ ద్వారా పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 05.04.2025.
- » **వెబ్‌సైట్:** https://hal-india.co.in/

రైట్స్ లిమిటెడ్, గుర్గావ్‌లో గ్రూప్ జనరల్ మేనేజర్ పోస్టులు

గుర్గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్).. వివిధ విభాగాల్లో గ్రూప్ జనరల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
- » **పోస్టుల వివరాలు:** గ్రూప్ జనరల్ మేనేజర్(సివిల్)-02, గ్రూప్ జనరల్ మేనేజర్(మెకానికల్)-01, గ్రూప్ జనరల్ మేనేజర్(ఈఎస్-టీ)-01, గ్రూప్ జనరల్ మేనేజర్(ఫైనాన్స్)-01, డిప్యూటీ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్)-01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** గ్రూప్ జనరల్ మేనేజర్ పోస్టుకు 53 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 41 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.1,00,000 నుంచి రూ.2,60,000.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.04.2025.
- » **వెబ్‌సైట్:** https://www.rites.com

ఎంజీఐఆర్ఐ, మహారాష్ట్రలో ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్ పోస్టులు

వార్ధా(మహారాష్ట్ర)లోని మహాత్మ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రూరల్ ఇండస్ట్రియలైజేషన్(ఎంజీఐఆర్ఐ).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 01
- » **పోస్టుల వివరాలు:** ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్(రూరల్ కెమికల్ ఇండస్ట్రీస్)-01.
- » **అర్హత:** ఎంఎస్సీ కెమిస్ట్రీ(ఆర్గానిక్/ఇన్‌ఆర్గానిక్/బయో కెమిస్ట్రీ/ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ/కాస్మటిక్ సైన్స్/పాలిమర్ సైన్స్) లేదా ఎంఎస్సీ ఇన్విరాన్‌మెంటల్ సైన్సెస్/బయో/లైఫ్ సైన్సెస్ లేదా కెమికల్ ఇంజనీరింగ్/టెక్నాలజీ/పాలిమర్ టెక్నాలజీలో పీజీ ఉత్తీర్ణులవ్వాలి. 10 ఏళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి.
- » **వయసు:** 50 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తును డైరెక్టర్, మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రూరల్ ఇండస్ట్రియలైజేషన్, మగన్‌వాడి, వార్ధా,మహారాష్ట్ర-442001 చిరునామకు పంపించాలి.

- » **దరఖాస్తులకు చివరితేది:** 28.04.2025.
- » **వెబ్‌సైట్:** https://mgiri.org

ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్‌లో 13 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్) ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 13.
- » **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్(మార్కెటింగ్)-05, అసిస్టెంట్ మేనేజర్(ట్రాన్స్‌పోర్టేషన్)-01, అసిస్టెంట్ మేనేజర్(రూల్స్)-01, అసిస్టెంట్ మేనేజర్(ఐటీ)-04, అసిస్టెంట్ మేనేజర్(కార్పొరేట్ అఫైర్స్)-01, అసిస్టెంట్ మేనేజర్(పబ్లిక్ రిలేషన్స్)-01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 45 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **దరఖాస్తులకు చివరితేది:** 15.04.2025.
- » **వెబ్‌సైట్:** www.nhsrcl.in